www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

మధుమేహం, ఊబకాయం ఉంటే.. అమెరికా వీసా కష్టమే!



- ఎంబసీలు, కాన్సులేట్లకు కొత్త మార్గదర్శకాలు
- గుండె జబ్బులు, శ్వాస సమస్యలు ఉన్నవారికీ ఇబ్బందే
- ఎక్కువ వయసున్నా, డిపెండెంట్లకు సమస్యలున్నా ప్రభావం
- వారితో అమెరికా ప్రభుత్వంపై భారం పడే అవకాశం ఉంటుందన్న అమెరికా విదేశాంగ శాఖ 2
- వచ్చే ఏడాది భారత్‌లో పర్యటించే అవకాశం: ట్రంప్

శనివారం | 8-11-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 220 | వరంగల్

శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, కార్తీకమాసం, బహుళపక్షం; తిథి: తదియ ఉ.7.32; చవితి తె.4.25, నక్షత్రం: మృగశిర రా.10.02 తదుపరి ఆర్ద్ర; వర్జ్యం: శేషం ఉ.6.59 వరకు, తె.5.44 మొదలు; దుర్ముహూర్తం: ఉ.6.20-7.50, అమృతఘడియలు: మ.2.09-3.35; రాహుకాలం: ఉ.9.00-10.30; సూర్యోదయం: 6.20, సూర్యాస్తమయం: 5.37

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



కిషన్‌రెడ్డి కేటీఆర్

హైదరాబాద్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి. చిత్రంలో మంత్రులు వాకిటి శ్రీహరి, పొన్నం ప్రభాకర్, అజారుద్దీన్, ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్

బ్యాడ్ బ్రదర్స్

- హైదరాబాద్ అభివృద్ధిని అడ్డుకుంటున్నారు
- నగరాభివృద్ధికి మోదీ, కేసీఆర్ చేసిందేంటి?
- ప్రగతిభవన్, సచివాలయం, కమాండ్ కంట్రోల్ సెంటర్ నిర్మాణంతో ఒక్క ఉద్యోగమైనా వచ్చిందా?
- ఏడాదిన్నరలో 3 లక్షల కోట్ల పెట్టుబడులు తెచ్చాం
- నగర విస్తరణకు రూ.వేలాది కోట్లతో ప్రణాళికలు
- ఏ ఎన్నికనైనా ప్రతిష్ఠాత్మకంగానే తీసుకొంటాను
- టీడీపీ అభిమానులు బీఆర్ఎస్‌కు ఓటువేస్తారనుకోను
- చంద్రబాబును అరెస్టు చేస్తే నిరసనలూ వద్దన్నారు
- బీజేపీకి డిపాజిట్ రాకుంటే హిందువులు ఆ పార్టీతో లేరని బండి సంజయ్ అంగీకరిస్తారా?: సీఎం రేవంత్

హైదరాబాద్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, బీఆర్ఎస్ నేత కేటీఆర్ హైదరాబాద్ పాలిట బ్యాడ్ బ్రదర్స్‌గా వ్యవహరిస్తున్నారని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. మెట్రోరైలు, గోదావరి జలాలు, ఎలివేటెడ్ కారిడార్లు, ఫ్యూచర్ సిటీని ఈ బ్యాడ్ బ్రదర్స్ అడ్డుకుంటున్నారని ఆరోపించారు. హైదరాబాద్ నగర అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం ఏం చేసిందో చెప్పేందుకు బ్యాడ్ బ్రదర్స్‌తో ఎక్కడైనా చర్చించేందుకు తాము సిద్ధంగా ఉన్నామన్నారు. కేంద్రంలో, రాష్ట్రంలో పదేళ్ల అధికారంలో ఉన్న మోదీ, కేసీఆర్ హైదరాబాద్ అభివృద్ధికి చేసిందేంటని ప్రశ్నించారు. పదేళ్ల కేసీఆర్ పాలనలో కొత్తగా కట్టినవి సచివాలయం, ప్రగతిభవన్, కమాండ్ కంట్రోల్ సెంటర్, కాళేశ్వరం మాత్రమేనన్నారు. సచివాలయం, ప్రగతి భవన్, కమాండ్ కంట్రోల్ సెంటర్‌లతో నిరుద్యోగులకు కొత్తగా ఒక్క ఉద్యోగమైనా వచ్చిందా? అని, కాళేశ్వరం ప్రాజెక్టుతో అదనంగా ఒక్క ఎకరాకైనా నీరందించారా? అని ప్రశ్నించారు. శుక్రవారం జూబ్లీహిల్స్‌లోని క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి మీడియా సమావేశంలో మాట్లాడారు. హైదరాబాద్ నగరంలో వేలాది మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు మన్మోహన్‌సింగ్ ప్రభుత్వం ఐటీఐఆర్‌ను మంజూరు చేస్తే.. మోదీ, కేసీఆర్

మిగతా 10వ పేజీలో...

అడిగిన అనుమతులు ఇవ్వనందుకు బ్లాక్‌మెయిల్ చేస్తున్నారా?

- అరోరా రమేశ్ 12 కాలేజీలకు అనుమతి అడిగిండు
- జయ్‌ప్రకాష్.. మహబూబ్‌నగర్‌లోని కాలేజీకి హైదరాబాద్‌లో ఆఫ్ క్యాంపస్ ఇవ్వమన్నడు
- నిబంధనలకు వ్యతిరేకమని ఇవ్వలేదు 10
- ఇక డొనేషన్లు ఎలా వసూలు చేస్తారో చూస్త
- చదువులకు ఆటంకం కలిగితే ఉపేక్షించం
- రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడతల వారీ ఇస్తాం
- రాజకీయ పార్టీల అండ ఉందని రెచ్చిపోతే కుదరదు
- కాలేజీల యాజమాన్యాలకు ముఖ్యమంత్రి హెచ్చరిక

చర్చలు సఫలం.. కాలేజీల సమ్మె విరమణ

- ఫీజు బకాయిల్లో ఇప్పటికే రూ.600 కోట్లు ఇచ్చాం
- మరో రూ. 900 కోట్లు త్వరలోనే: భట్టి 14

వారి వ్యూహం.. ఓట్ల కొనుగోళ్లే

- సీఎం రేవంత్, కేటీఆర్ ఇప్పుడు అదే పనిలో ఉన్నారు
- జూబ్లీహిల్స్ కాస్మోపాలిటన్ నియోజకవర్గం
- అక్కడ 'సెంటిమెంట్' కుదరదు.. బీఆర్ఎస్‌ది పగటి కలే
- రేవంత్‌రెడ్డి చేరే పార్టీల్లో ఇక మజ్లిస్ మాత్రమే మిగిలింది
- జూబ్లీహిల్స్‌లో కాషాయ జెండా ఎగరవేయడం ఖాయం
- 'ఆంధ్రజ్యోతి' ఇంటర్వ్యూలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



హైదరాబాద్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో ఓట్ల కొనుగోళ్లే కాంగ్రెస్, బీఆర్ఎస్‌ల వ్యూహమని కేంద్ర బొగ్గు, గనులశాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి ఆరోపించారు. ఈ ప్రక్రియ అధికార పార్టీలో ముఖ్యమంత్రి స్థాయిలో, ప్రధాన ప్రతిపక్షంలో కేటీఆర్ స్థాయిలో జరుగుతోందన్నారు. 'ఒక్కో ఓటుకు ఎంత ఇవ్వాలి? ఏ పోలింగ్ బూత్‌లో ఎంత ఖర్చు పెట్టాలి? అన్నదే ఆ పార్టీల ప్రధాన వ్యూహం. అందుకే వారు ఓటర్ల వివరాలు సేకరిస్తున్నారు. పోలింగ్ బూత్ స్థాయిలో డబ్బుల పంపిణీ కూడా ప్రారంభమైంది' అని తెలిపారు. దుందుడుకు భాషతోనే కేసీఆర్ అధికారంలోకి వచ్చినట్లుగా గత ఎన్నికల్లో తాను కూడా అలాగే అధికార పీఠం దక్కించుకున్నానని రేవంత్ భావిస్తున్నారని.. ఈ ఉప ఎన్నికలో కూడా ప్రజలను రెచ్చగొట్టేలా అదే భాషను రేవంత్‌రెడ్డి ఉపయోగిస్తున్నారని

మిగతా 13వ పేజీలో...

మాగంటి ఆస్తుల పంపకాల్లో రేవంత్, కేటీఆర్ మధ్య గొడవ!

- మృతి వెనుక మిస్టరీ ఉందని గోపీనాథ్ తల్లే చెబుతున్నారు 14
- విచారణ జరపకపోవడానికి కారణం ఇదే.. గోపీనాథ్ భార్యల్లో ఒకరికి కాంగ్రెస్, మరొకరికి బీఆర్ఎస్ మద్దతు: కేంద్ర మంత్రి బండి సంజయ్



శ్రీచరణికి వీణ బహూకరిస్తున్న చంద్రబాబు

శ్రీచరణికి రూ.2.5 కోట్లు

- వెయ్యి చదరపు గజాల స్థలం
- గ్రూప్-1 ఉద్యోగం 11
- ఏపీ ప్రభుత్వం వరాల జల్లు
- సీఎం చంద్రబాబు, లోకేశ్‌ను కలిసిన క్రికెటర్ శ్రీచరణి

ఆండ్రాయిడ్ ఫోన్లకు హ్యాకింగ్ ముప్పు!

ఓఎస్ 13, 14, 15, 16లను అప్‌డేట్ చేసుకోవాలని సెర్ట్-ఇన్ సూచన 2

ఢిల్లీ ఎయిర్‌పోర్ట్‌లో సాంకేతిక సమస్య.. విమానాల ఆలస్యం

- 'ఏఎంఎస్ఎస్'లో సమస్యవల్లే: నిపుణులు
- పలు ఇతర ఎయిర్‌పోర్టులపైనా ప్రభావం
- శంషాబాద్ విమానాశ్రయంలో 60కి పైగా విమానాల రాకపోకలకు అంతరాయం
- మాల్‌వేర్ దాడి: 'సీఎన్ఎన్-న్యూస్18' 2



శ్రీ నారాయణ త్యాగి

'నిట్' విద్యార్థికి 1.27 కోట్ల ప్యాకేజీ!

- మరో విద్యార్థికి కోటి.. ఎంఎన్‌సీ ఆఫర్లు
- వరంగల్ నిట్ రికార్డు 3
- 2 నెలల్లో 528 మందికి ప్లేస్‌మెంట్స్



మొహమ్మద్ నహిల్

ఓవర్‌లోడ్‌తో వెళితే డ్రైవింగ్ లైసెన్సు రద్దు

- అదే పనిగా ఉల్లంఘనలకు పాల్పడితే వాహనాల పర్మిట్ క్యాన్సిల్
- వాహనాల సీజ్.. యజమానులపై కేసు!
- పరిశీలిస్తున్న రాష్ట్ర రవాణా శాఖ
- భారీ వాహనాల యజమానులకు జిల్లాలవారీగా అవగాహన కార్యక్రమాలు
- 245 వాహనాలపై కేసులు.. 180 వాహనాలను సీజ్ చేసిన అధికారులు



హైదరాబాద్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): వరుస రోడ్డు ప్రమాదాల నేపథ్యంలో నిబంధనలు అతిక్రమించే భారీ వాహనాల డ్రైవర్లు, యాజమాన్యాలపై రవాణా శాఖ అధికారులు చట్టప్రకారం కఠిన చర్యలు చేపట్టేందుకు సిద్ధమయ్యారు. చేవెళ్ల సమీపంలో ఇటీవల సంభవించిన టిప్పర్-ఆర్టీసీ బస్సు ప్రమాద ఘటనకు కంకర లోడ్‌తో వెళుతున్న టిప్పర్‌పై డ్రైవర్ నియంత్రణ కోల్పోవడమే

మిగతా 14వ పేజీలో...



జనసమ్మర్థ ప్రాంతాల్లో వీధి కుక్కలు కనపడొద్దు!

- ఆస్పత్రులు, బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, విద్యాసంస్థలు, క్రీడా ప్రాంగణాల్లో జాడ ఉండొద్దు
- 2 వారాల్లో ఆ ప్రాంతాల్లో ఫెన్సింగ్ వేయండి
- అక్కడి కుక్కల్ని స్టెరిలైజ్ చేసి షెల్టర్లకు తరలించండి
- అమలుపై సీఎస్‌లు 3 వారాల్లో నివేదిక ఇవ్వాలి
- రాష్ట్ర ప్రభుత్వాలకు సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు

న్యూఢిల్లీ, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): వీధి కుక్కల నియంత్రణ వ్యవహారంలో సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు ఇచ్చింది. పౌరుల భద్రత, చిన్నారులు, వృద్ధులు, అనారోగ్యానికి గురైన వారి రక్షణకు అత్యంత ప్రాధాన్యం ఇస్తూ దేశంలోని అన్ని రాష్ట్రాలకు మార్గదర్శకాలు జారీ చేసింది. విద్యాసంస్థలు, బస్‌స్టేషన్లు, రైల్వే స్టేషన్లు, క్రీడా సముదాయాలు, ఇతర బహిరంగ ప్రదేశాల నుంచి వీధి కుక్కలను షెల్టర్లకు తరలించాలని ఆదేశించింది. వీధి కుక్కలను

మిగతా 2వ పేజీలో...

ఓటమి భయంతోనే..

- జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ఫలితం రెఫరెండం కాదని సీఎం రేవంత్‌రెడ్డి అంటున్నడు
- ఆయనకు దమ్ముంటే 24 నెలల పాలనను చూపించి.. అప్పుడు ప్రజల తీర్పు కోరాలి
- హైదరాబాద్ అభివృద్ధికి చంద్రబాబు కృషి
- సంక్షేమానికి వైఎస్ ప్రాధాన్యం ఇచ్చారు
- రోశయ్య, కిరణ్ రాష్ట్రం కోసం పనిచేశారు
- కేసీఆర్ హయాంలో అన్నిరంగాల్లో జోష్
- రేవంత్‌లాంటి సీఎంను ఎప్పుడూ చూడలేదు
- జూబ్లీహిల్స్‌లో రోడ్ షోలో కేటీఆర్

రేవంత్‌రెడ్డి అట్టర్ ఫ్లాప్ సీఎం

- బ్లాక్‌మెయిల్ తప్ప పాలన చేతకాదు
- 'మీట్ ది ప్రెస్'లో హరీశ్‌రావు



వెంగళరావునగర్‌లో నిర్వహించిన రోడ్ షోలో కేటీఆర్

హైదరాబాద్, హైదరాబాద్ సిటీ/పంజాగుట్ట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): పోలింగ్ కంటే ముందే రేవంత్ రెడ్డి జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో ఓటమిని అంగీకరించారని.. అందుకే ఈ ఎన్నిక ఫలితాలు ప్రభుత్వానికి, పరిపాలనకు, తనకు రెఫరెండం కాదని చెప్పారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. రేవంత్‌కు దమ్ముంటే తన 24 నెలల పరిపాలన చూపించి ప్రజల తీర్పు కోరాలని

మిగతా 13వ పేజీలో...

ఓటుకు రూ.3 వేలు!

రూ. 2 వేల చొప్పున ఇస్తామని ఓ పార్టీ హామీ

- రూ.వెయ్యి పెంచి ఇస్తున్న మరో పార్టీ.. ప్రచారం ముగియక ముందే పంపిణీ
- బూత్‌ల వారీగా ఓట్ల కొనుగోలు షురూ.. జూబ్లీహిల్స్‌లో హీటెక్కిన ప్రచారం



హైదరాబాద్ సిటీ, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో ఓట్ల కొనుగోలు మొదలైంది. ప్రచార పర్వం ముగియక ముందే పార్టీలు బూత్‌ల వారీగా ఓటర్లకు డబ్బు పంపిణీ ప్రారంభించాయి. ఓ ప్రధాన పార్టీ ఏకంగా ఓటుకు రూ.3 వేల చొప్పున పంపిణీ చేస్తుండడం గమనార్హం. మొన్నటి వరకు ఓటుకు రూ.2 వేల చొప్పున ఇస్తామంటూ ఓ ప్రధాన పార్టీకి చెందిన బూత్ ఇన్‌చార్జి హామీ ఇచ్చారు. అయితే ఈ విషయం తెలుసుకున్న మరో ప్రధాన పార్టీ బూత్ ఇన్‌చార్జి దానికి రూ.వెయ్యి పెంచి రూ.3 వేల చొప్పున పంచుతున్నారు. సాధారణంగా ఎన్నికల ప్రచారం ముగిసిన తర్వాత.. రాజకీయ పార్టీలు గుట్టుచప్పుడు కాకుండా ఓటర్లను కలిసి డబ్బు, మందు పంపిణీ చేస్తుంటాయి. కానీ, ఈసారి మాత్రం ముందుగానే మొదలుపెట్టేశాయి. ప్రచారం ముగిశాక డబ్బు పంపిణీకి అడ్డంకులు వస్తాయనే ఉద్దేశంతో ముందుగానే అప్రమత్తమైనట్లు

మిగతా 13వ పేజీలో...

'బనకచర్ల'లో భారీ మార్పులు!

- నల్లమలసాగర్ వరకే ప్రాజెక్టు పరిమితం!!
- ఇతర రాష్ట్రాల అభ్యంతరాలతోనే?
- 2 దశల్లో ప్రతిపాదిత ప్రాజెక్టు నిర్మాణం
- అంచనా వ్యయం రూ.49,550 కోట్లు
- పోలవరం కుడి కాలువ ద్వారా దాములూరు దాకా వరద నీరు తరలింపు
- హరిశ్చంద్రపురం వద్ద సాగర్ కాల్వలోకి..
- అక్కడి నుంచి 3 సొరంగాల ద్వారా నల్లమల్ల సాగర్‌కు తరలింపు
- పాత ఆర్ఎఫ్‌సీ రద్దు.. త్వరలో టెండర్లు?

అమరావతి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): పోలవరం-బనకచర్ల అనుసంధాన పథకంపై ఏపీ ప్రభుత్వం పునరాలోచనలో పడింది. రూ.81,900 కోట్ల అంచనాతో మూడు దశల్లో దీనిని చేపట్టాలని నిర్ణయించిన ఏపీ జల వనరుల శాఖ.. ఈ ప్రాజెక్టు డిజైన్‌లో భారీ మార్పుచేర్పులకు సిద్ధమవుతోంది. పోలవరం నుంచి వరద జలాల తరలింపును బనకచర్ల వరకు కాకుండా మధ్యలో నల్లమల సాగర్ వరకే

మిగతా 12వ పేజీలో...

మహిళకు 54 ఏళ్ల జైలు!

బాలుడిపై లైంగిక దాడి కేసులో తిరువారూర్ పోక్సో కోర్టు తీర్పు 2



మధ్యప్రదేశ్ పోలీసు శిక్షణలో భగవద్గీత పఠనం తప్పనిసరి

అదనపు డీజీ ఆదేశాలు 2

వందేమాతరం 'ఆత్మ'ను తొలగించారు



- 1937లో కీలక చరణాలు తీసేశారు
- దేశ విభజనకు అదే బీజం వేసింది
- ఈ గేయం స్వాతంత్ర్య సంగ్రామ గొంతుక
- జాతి నిర్మాణానికి మహామంత్రం: ప్రధాని మోదీ
- బంకిం చంద్ర ఛటర్జీ రాసిన వందేమాతరానికి 150 ఏళ్ల
- ఏడాది పాటు వేడుకలకు ప్రధాని శ్రీకారం 2

జనసమ్మర్ధ ప్రాంతాల్లో వీధి కుక్కలు కనపడొద్దు!

(మొదటి పేజీ తరువాయి)



శుక్రవారం సుప్రీంకోర్టు ఆవరణలో వీధికుక్కలు

పట్టుకుని సంతానోత్పత్తి నియంత్రణ శస్త్రచికిత్స చేసిన తర్వాత కూడా తిరిగి అదే ప్రదేశంలో వదిలి పెట్టరాదని ఆదేశించింది. అలాగే, జాతీయ రహదారులు, ఎక్స్‌ప్రెస్ వేలపై పశువుల విచ్చలవిడి సంచారంపైనా సుప్రీంకోర్టు అసహనం వ్యక్తం చేసింది. ఆలనా పాలనా లేకుండా రోడ్లపై సంచరించే పశువులను తక్షణమే గోశాలలకు తరలించాలని ఆదేశించింది. రాష్ట్ర ప్రభుత్వాలు, జాతీయ రహదారుల శాఖ, స్థానిక సంస్థలు, హైవే గస్తీ బృందాలు పకడ్బందీగా ఈ ఆదేశాలను అమలు చేయాలని స్పష్టం చేసింది. తమ ఆదేశాలను అమలు చేయడంలో విఫలమైతే రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించింది. దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారిన వీధి కుక్కల నియంత్రణకు సంబంధించి జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతా, జస్టిస్ ఎన్‌వీ అంజారియాలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం శుక్రవారం కీలక ఉత్తర్వులు జారీ చేసింది.

ప్రతి మూడు నెలలకు ఒకసారి తనిఖీ చేయండి

దేశవ్యాప్తంగా కుక్కకాటు ఘటనలు ఆందోళనకరంగా మారాయని ధర్మాసనం ఆందోళన వ్యక్తం చేసింది. ప్రజల భద్రతే తమకు ముఖ్యమని తేల్చి చెప్పింది. ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థలు, ఆస్పత్రులు, ప్రజా క్రీడా సముదాయాలు, బస్టాండ్‌లు, డిపోలు, రైల్వేస్టేషన్లను గుర్తించాలని రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించింది. రెండు వారాల్లో ఈ ప్రక్రియను పూర్తి చేసి వీధి కుక్కలు చొరబడకుండా పకడ్బందీగా ఫెన్సింగ్ లేదా ఇతర భద్రతా ఏర్పాట్లు చేయాలని స్పష్టం చేసింది. స్థానిక మున్సిపాలిటీలు, పంచాయతీలు ఆయా ప్రాంగణాల నుంచి వీధి కుక్కలను తక్షణమే పట్టుకోవాలని చెప్పింది. యానిమల్ బర్త్ కంట్రోల్(ఏబీసీ) నిబంధనల ప్రకారం వాటికి వ్యాక్సినేషన్, స్టెరిలైజేషన్ చేయించాలని ఆదేశించింది. స్టెరిలైజేషన్ తర్వాత తిరిగి అదే ప్రాంతంలో వదిలి పెట్టకూడదని స్పష్టం చేసింది. వాటిని తప్పకుండా షెల్టర్ హోంలకు తరలించాల్సిందేనని చెప్పింది. జాతీయ రహదారులు, ఎక్స్‌ప్రెస్‌వేలు, ఇతర ప్రధాన రహదారులపై సంచరించే పశువులను గోశాలలకు లేదా షెల్టర్ హోంలకు తరలించాలని, వాటికి పునరావాసం కల్పించాలని తెలిపింది. దీనికోసం ప్రత్యేకంగా హైవే పెట్రోల్ బృందాలు, ఫిర్యాదుల కోసం హెల్ప్‌లైన్ నంబర్లను ఏర్పాటు చేయాలని ఆదేశించింది. ప్రతి మూడు నెలలకు ఒకసారి అధికారులు నిర్దేశిత జన సమ్మర్ధ ప్రాంతాలను తనిఖీ చేసి, అక్కడ కుక్కలు లేవని నిర్ధారించుకోవాలని తెలిపింది. కుక్కలను తొలగిస్తే కొత్త కుక్కలు ఆ ప్రదేశాన్ని ఆక్రమిస్తాయని, ఇది ఏబీసీ నిబంధనలకు విరుద్ధమంటూ లేవనెత్తిన అభ్యంతరాలను ధర్మాసనం పరిగణనలోకి తీసుకోలేదు. తమ ఆదేశాలు అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులదేనని మరోసారి స్పష్టం చేసింది. ఫెన్సింగ్, తనిఖీలపై మూడు వారాల్లోగా, రోడ్లపై పశువుల తొలగింపుపై ఎనిమిది వారాల్లోగా అన్ని రాష్ట్రాల ప్రభుత్వ కార్యదర్శులు సమగ్ర నివేదికలు దాఖలు చేయాలని ఆదేశించింది.

రోజుకు 10 వేల కుక్కకాట్లు

న్యూఢిల్లీ, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ గణాంకాల ప్రకారం గతేడాది సగటున రోజుకు 10వేల మంది కుక్కకాటు బారినపడ్డారు. దేశవ్యాప్తంగా 2024లో 37,15,713 కుక్కకాటు కేసులు నమోదయ్యాయి. 2025 జనవరి ఒక్క నెలలోనే 4.29 లక్షల మంది వీధి కుక్కల కాటుకు గురయ్యారు. తెలుగు రాష్ట్రాలను పరిశీలిస్తే ఏపీలో 2022లో 1,92,360 కేసులు నమోదైతే 2024 నాటికి ఈ సంఖ్య 2,45,174కు చేరింది. తెలంగాణలో 2022లో 92,924 కేసులు నమోదు కాగా, 2024 నాటికి ఆ సంఖ్య 1,21,997 కి పెరిగింది. 2022-2024 మధ్యకాలంలో అత్యధికంగా కుక్క కాటు కేసులు నమోదైన టాప్-10 రాష్ట్రాల్లో మహారాష్ట్ర(13.5 లక్షలు) మొదటి స్థానంలో ఉంది. తెలంగాణ(3.33 లక్షలు) ఎనిమిదో స్థానంలో ఉన్నాయి. రేబిస్ మరణాల్లో మహారాష్ట్ర (35) మొదటి స్థానంలో ఉండగా తెలంగాణలో ఒక్క రేబిస్ మరణమూ సంభవించలేదు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ గణాంకాల ప్రకారం ఈ ఏడాది జూలై వరకు 87,366 కుక్క కాటు కేసులు నమోదయ్యాయి. దేశ జనాభా 146 కోట్లు ఉండగా, 1.53 కోట్ల వీధి కుక్కలు ఉన్నట్టు ఒక అంచనా.

ఢిల్లీ ఎయిర్‌పోర్ట్‌లో సాంకేతిక సమస్య..
వందల విమానాలు ఆలస్యం

'ఏఎంఎస్ఎస్'లో సమస్యవల్లే: నిపుణులు



శుక్రవారం ఢిల్లీ ఎయిర్‌పోర్టులో ప్రయాణికుల రద్దీ

శంషాబాద్ రూరల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఏ విమానం ఎప్పుడొస్తుందో తెలియదు.. వచ్చిన విమానం ఎప్పుడు బయల్దేరుతుందో తెలియదు.. బోర్డింగ్ పాస్‌లు ఇచ్చే గేట్ల వద్ద వందలాది ప్రయాణికులు.. గంటలకొద్దీ నిరీక్షణ.. నిరీక్షించలేక ప్రయాణికుల్లో అసహనం.. ఇవీ ఢిల్లీలోని ఇందిరా గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో శుక్రవారం కనిపించిన దృశ్యాలు! రోజుకు 1500కు పైగా విమానాల రాకపోకలతో.. దేశంలోనే అత్యంత రద్దీ కలిగిన విమానాశ్రయంగా పేరొందిన ఢిల్లీ ఎయిర్‌పోర్టులో తీవ్ర గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. 'ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ (ఏటీసీ)'లో సాంకేతిక సమస్య కారణంగా వందలాది విమానాలు ఆలస్యమయ్యాయి. దేశీ, అంతర్జాతీయ సర్వీసులన్నీ కలిపి 800కు పైగా విమానాలపై ఈ ప్రభావం పడినట్టు సమాచారం. ఇండిగో, ఎయిరిండియా, ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్, స్పైస్‌జెట్, ఆకాశ ఎయిర్.. ఇలా అన్ని సంస్థలూ తమ విమానాలు ఆలస్యమైనట్టు ప్రకటించాయి. ఈ సమస్య ప్రభావం దేశంలోని ఇతర నగరాల్లోని ఎయిర్‌పోర్టులపైనా తీవ్రంగా పడుతోంది. రాజధాని నుంచి రావాల్సిన విమానాలు ఆలస్యం అవుతుండడంతో.. జైపూర్, లఖ్‌నవూ, ముంబై, వారాణసీ తదితర విమానాశ్రయాల్లోనూ పలు సర్వీసుల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. దీంతో ఆయా విమానాశ్రయాల అధికారులు.. ఈ ఆలస్యం గురించి ప్రయాణాకులకు ముందుగానే సమాచారం అందిస్తున్నారు. శంషాబాద్ విమానాశ్రయంలో 60కిపైగా సర్వీసులపై ఈ ప్రభావం పడింది.

ఇదీ సమస్య...

విమానాల రాకపోకలకు అత్యంత కీలకమైన ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ డేటాకు సంబంధించి 'ఆటోమేటిక్ మెసేజ్ స్విచింగ్ సిస్టమ్ (ఏఎంఎస్ఎస్)'లో సాంకేతిక సమస్య ఏర్పడడమే ఢిల్లీ ఎయిర్‌పోర్టులో ఈ గందరగోళానికి కారణమని విమానాశ్రయాల ప్రాధికార సంస్థ (ఏఏఐ) తెలిపింది. గురువారం సాయంత్రం నుంచీ.. ఈ సమస్య కారణంగా ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్లకు.. విమానాల ప్రణాళికలు ఆటోమేటిగ్గా రావట్లేదు. దీంతో వారు తమకు అందుబాటులో ఉన్న సమాచారం ఆధారంగా ఫ్లైట్ ప్లాన్స్‌ను మాన్యువల్‌గా సిద్ధం చేయాల్సి వస్తోంది. అందుకు ఎక్కువ సమయం పడుతుండడంతో విమానాలు బయల్దేరడం బాగా ఆలస్యమవుతోంది. ప్రముఖ ఫ్లైట్ ట్రాకింగ్ వెబ్‌సైట్ 'ఫ్లైట్‌రేడార్24.కామ్' ప్రకారం.. ఈ సమస్య కారణంగా ఢిల్లీ ఎయిర్‌పోర్టులో 300కు పైగా విమానాలు ఆలస్యమయ్యాయి.

మాల్‌వేరే కారణమా?

ఢిల్లీ ఎయిర్‌పోర్టులో ప్రస్తుత సమస్యకు సాంకేతిక సమస్యలే కారణమని అధికారులు చెబుతున్నప్పటికీ.. ఏటీసీ ఆటోమేషన్ సాఫ్ట్‌వేర్‌లో ఎవరో కావాలనే మాల్‌వేర్‌ను ప్రవేశపెట్టడం వల్లే ఇలా జరిగిందని, ఇది లక్షిత దాడేనని విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ 'సీఎన్ఎన్-న్యూస్ 18' వెబ్‌సైట్ ఒక కథనాన్ని ప్రచురించింది. ఆ మాల్‌వేర్ సిస్టమ్ ఇంటర్‌ఫేస్‌లను,, రేడార్ సింక్రనైజేషన్ మాడ్యూళ్లను లక్ష్యంగా చేసుకుంటున్నట్టుగా ఆ వర్గాలు పేర్కొన్నట్టు అందులో వివరించింది. ఇటీవలికాలంలో సాఫ్ట్‌వేర్‌ను అప్‌డేట్ చేయకపోవడం, రియల్‌టైమ్ బ్యాకప్ లేకపోవడం వల్ల పరిస్థితి ఇంకా దారుణంగా తయారైనట్టు వెల్లడించింది.

లోకం తీరు



'అహ్మదాబాద్' ప్రమాదానికి పైలెట్‌ను నిందించలేం: సుప్రీం

న్యూఢిల్లీ, నవంబరు 7: అహ్మదాబాద్ ఎయిరిండియా విమాన ప్రమాదానికి సంబంధించి.. పైలెట్‌ను నిందించలేమంటూ సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. ఈ ప్రమాదంలో మరణించిన ప్రధాన పైలెట్ సుమిత్ సభర్వాల్ తండ్రి దాఖలు చేసిన పిటిషన్‌పై శుక్రవారం విచారణ చేపట్టిన ధర్మాసనం.. కేంద్రం, డీజీసీఏలకు నోటీసులు జారీ చేసింది. ఈ ఏడాది జూన్ 12న అహ్మదాబాద్ నుంచి లండన్ బయల్దేరిన ఎయిరిండియా విమానం టేకాఫ్ అయిన కొద్ది క్షణాల్లోనే ఓ భవనంపై కూలిపోవడంతో ప్రధాన పైలెట్ సుమిత్ సహా 260 మంది మృతి చెందారు. దీనిపై కోర్టు పర్యవేక్షణలో స్వతంత్ర దర్యాప్తు జరిపి ప్రమాదానికి కారణాలు తేల్చాలంటూ సుమిత్ తండ్రి పుష్కరాజ్ సభర్వాల్, భారత పైలెట్ల సమాఖ్య సుప్రీంకోర్టును ఆశ్రయించాయి. వీటిపై విచారణ చేపట్టిన జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చిల ధర్మాసనం.. 'ఈ ప్రమాదం జరగడం చాలా దురదృష్టకరం. మీ (పుష్కరాజ్) కుమారుడిని నిందిస్తున్న భారాన్ని మీరు మోయకూడదు. అతడిని ఎవరూ నిందించలేరు. విదేశీ మీడియా నివేదికలపై చింతించాల్సిన అవసరం లేదు. పైలెట్ తప్పిదం కారణంగానే ప్రమాదం జరిగిందని దేశంలో ఎవరూ భావించడం లేదు. ప్రాథమిక దర్యాప్తులో ఇద్దరు పైలెట్ల మధ్య జరిగిన సంభాషణ మాత్రమే బయటికొచ్చింది' అని పేర్కొంది. దీనిపై స్పందన తెలియజేయాలంటూ కేంద్రం, డీజీసీఏ, ఇతర అధికారులకు ధర్మాసనం నోటీసులు జారీ చేసింది.

మధ్యప్రదేశ్ పోలీసు శిక్షణలో
భగవద్గీత పఠనం తప్పనిసరి

భోపాల్, నవంబరు 7: పోలీసు సిబ్బంది సరైన మార్గంలో జీవించాలనే ఉద్దేశంతో తమ శిక్షణా కేంద్రాల్లో భగవద్గీత పఠన కార్యక్రమాలను ప్రారంభించాలని మధ్యప్రదేశ్ పోలీసు శిక్షణ విభాగం నిర్ణయించింది. ఈ మేరకు శిక్షణ విభాగం అదనపు డీజీ రాజాబాబుసింగ్ రాష్ట్రంలోని ఎనిమిది శిక్షణా కేంద్రాలకు శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు. ఆయా కేంద్రాల్లో ప్రస్తుతం 4వేల మంది శిక్షణ పొందుతున్నారు. జూలైలో నూతన బ్యాచ్ ప్రారంభ సందర్భంలోనూ శిక్షణార్థులు ప్రతిరోజు తప్పనిసరిగా రామచరితమానస్‌ను పఠించాలని రాజాబాబుసింగ్ సూచించారు. శ్రీరాముని జీవిత విలువలను, ఆయన 14 సంవత్సరాల వనవాసాన్ని వర్ణించే ఆ గ్రంథం వారిలో క్రమశిక్షణను పెంపొందిస్తుందని తెలిపారు. గతంలో గ్వాలియర్ రేంజ్ ఐజీగా ఉన్నప్పుడు కూడా ఆయన ఇలాంటి కార్యక్రమాన్ని చేపట్టి, ఖైదీలకు భగవద్గీత పుస్తకాలను పంపిణీ చేశారు.

ఆండ్రాయిడ్ ఫోన్లకు హ్యాకింగ్ ముప్పు!

న్యూఢిల్లీ, నవంబరు 7: దేశంలో ఆండ్రాయిడ్ స్మార్ట్ ఫోన్లు వినియోగిస్తున్న కోట్లాది మందికి ఇండియన్ కంప్యూటర్ ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్ (సెర్ట్-ఇన్) కీలకమైన భద్రతా హెచ్చరికలు చేసింది. గూగుల్ ఆండ్రాయిడ్ ఆపరేటింగ్ సిస్టమ్ (ఓఎస్)లో పలు లోపాలను గుర్తించినట్లు పేర్కొంది. తద్వారా సైబర్ నేరగాళ్లు ఫోన్లను హ్యాకింగ్ చేసే ప్రమాదం ఉందని, టార్గెట్ చేసుకున్న డివైజ్‌లలో ఆర్బిటరీ కోడ్‌ను ప్రవేశపెట్టే అవకాశం ఉందని హెచ్చరించింది. ఆండ్రాయిడ్ 13, 14, 15, 16 ఓఎస్ యూజర్లు హ్యాకింగ్ రిస్క్‌లో ఉన్నారని పేర్కొంది. ఆయా ఓఎస్ వెర్షన్ల ఆండ్రాయిడ్ ఫోన్లను వినియోగిస్తున్న వారు.. వెంటనే ఓఎస్‌ను అప్‌డేట్ చేసుకోవాలని, గూగుల్ తాజాగా రిలీజ్ చేసిన ఆండ్రాయిడ్ సెక్యూరిటీ ప్యాచ్‌లను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించింది.

బాలుడిపై లైంగిక దాడి.. మహిళకు 54 ఏళ్ల జైలు!

చెన్నై, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): తమిళనాడులోని తిరువారూర్ జిల్లాలో బాలుడిపై లైంగిక దాడికి పాల్పడిన మహిళకు పోక్సో కోర్టు 54 ఏళ్ల జైలుశిక్ష విధిస్తూ, సంచలన తీర్పు వెలువరించింది. తేదియూరుకు చెందిన లలిత (38) విడుగర్‌పాళయం పౌష్టికాహార కేంద్రంలో వంటమనిషిగా పని చేస్తూ అక్కడి పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న ఓ విద్యార్థితో సన్నిహితంగా వుండేది. 2021 అక్టోబరు 26న అతన్ని తీసుకుని పరారైంది. లలిత ఆ బాలుడిని వేరే ప్రాంతానికి తీసుకెళ్లి, అతనిపై లైంగిక వేధింపులకు పాల్పడడంతో పాటు అత్యాచారం చేసినట్టు పోలీసుల దర్యాప్తులో తేలింది. దీంతో పోక్సో కేసు నమోదు చేయగా.. తిరువారూర్ పోక్సో కోర్టు న్యాయాధికారి శరత్‌రాజ్ గురువారం తీర్పు వెలువరించారు. లలితకు 54 ఏళ్ల జైలుశిక్ష, రూ.18 వేల జరిమానా విధించారు.

భారత్‌లోనే సుఖోయ్-57ల తయారీ!

న్యూఢిల్లీ/మాస్కో, నవంబరు 7: 'మేక్ ఇన్ ఇండియా'లో మరో ముందడుగు! రష్యాకు చెందిన సుఖోయ్- 57 స్టెల్త్ యుద్ధ విమానాలను దేశీయపద్ధతిలో పెద్దఎత్తున తయారుచేసేందుకు రక్షణశాఖకు చెందిన సంస్థ హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హాల్) సిద్ధమవుతోంది. దీనిపై త్వరలోనే కీలక ఒప్పందం కుదరవచ్చునన్న సంకేతాలను రష్యా ప్రభుత్వ వర్గాలు అందిస్తున్నాయి. తయారీకి అవసరమైన టెక్నాలజీని, ఇతర సోర్స్ కోడ్‌లను రష్యా బదిలీ చేస్తే, హాల్ వీటిని తయారుచేస్తుంది. రష్యాలోని సుఖోయ్ డిజైన్ బ్యూరో, అక్కడి రక్షణ విభాగాలకు చెందిన నిపుణుల బృందం ఈ ఏడాది సెప్టెంబరులో హాల్‌ను సందర్శించింది. తన పరిశీలనలో భాగంగా బెంగళూరు, నాసిక్, కోరాపుట్‌లోని ఆ సంస్థ ప్రధాన ఉత్పత్తి యూనిట్లకు వెళ్లింది. సుఖోయ్-57లను స్థానికంగా నిర్మించడానికి కావాల్సిన మౌలిక సదుపాయాలు, తయారీ సామర్థ్యం, సాంకేతిక సన్నద్ధత హాల్‌కు ఉన్నాయని, ఆ సత్తాను ఇప్పటికే ఆ సంస్థ 50 శాతం సాధించిందని రష్యా ప్రభుత్వానికి ఈ బృందం నివేదించింది. దీంతో రష్యా ప్రభుత్వం సంతృప్తి చెందినట్టు తెలిసింది. త్వరలోనే ఆ దేశ అధ్యక్షుడు పుతిన్ భారత్ పర్యటనకు వస్తున్నారు. ఈ సందర్భంగా దీనిపై ఒప్పందం ఖరారు కావచ్చునని నిపుణులు చెబుతున్నారు.

రష్యా సైన్యంలో 44 మంది భారతీయులు

న్యూఢిల్లీ, నవంబరు 7: ఉక్రెయిన్‌తో జరుగుతున్న యుద్ధంలో రష్యా సైన్యం తరఫున 44 మంది భారతీయులు కూడా పాల్గొంటున్నారని శుక్రవారం భారత విదేశీ వ్యవహారాల శాఖ వెల్లడించింది. వారిని విడుదల చేయాలని ఆ దేశ అధికారులను కోరినట్టు విదేశీ వ్యవహారాల శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైశ్వాల్ తెలిపారు. వారి పరిస్థితి గురించి ఎప్పటికప్పుడు కుటుంబ సభ్యులకు సమాచారం ఇస్తున్నామని చెప్పారు. వచ్చే నెలలో రష్యా అధ్యక్షుడు పుతిన్ భారత్ పర్యటనకు రానుండడం, తమ వారిని విడిపించాలని కోరుతూ బాధితుల కుటుంబ సభ్యులు జంతర్‌మంతర్ వద్ద ధర్నా చేయడంతో ఈ ప్రకటనకు ప్రాధాన్యం ఏర్పడింది.

వందేమాతరం 'ఆత్మ'ను తొలగించారు

1937లో కీలక చరణాలు తీసేశారు.. దేశ విభజనకు అదే బీజం వేసింది: ప్రధాని



వందేమాతరంపై స్మారక స్టాంపును ఆవిష్కరిస్తున్న ప్రధాని మోదీ

న్యూఢిల్లీ, నవంబరు 7: జాతీయ గేయం 'వందేమాతరం' స్వాతంత్ర్య సంగ్రామానికి గొంతుకగా నిలిచిందని ప్రధాని మోదీ అన్నారు. స్వాతంత్ర్యానంతరం జాతి నిర్మాణానికి మహామంత్రమైందని చెప్పారు. దురదృష్టవశాత్తూ అలాంటి పాట ఆత్మను తొలగించారని.. కీలక చరణాలను తీసివేసి రెండింటినే ఉంచారని కాంగ్రెస్ పార్టీని పరోక్షంగా విమర్శించారు. ఇదే దేశవిభజనకు బీజం వేసిందన్నారు. ఆ విభజన మనస్తత్వం నేటికీ సవాల్ విసురుతోందని తెలిపారు. అక్షయ నవమిని పురస్కరించుకుని 1875 నవంబరు 7న బంకించంద్ర ఛటర్జీ ఈ గేయాన్ని రాశారు (ఆయన నవల 'ఆనందమఠ్'లో ఉన్న ఈ పాట తొలుత 'బంగదర్శన్' పత్రికలో దర్శనమిచ్చింది). ఈ గేయం 150 ఏళ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా కేంద్రప్రభుత్వం శుక్రవారం నుంచి వచ్చే ఏడాది నవంబరు 7 వరకు ఏడాదిపాటు ఉత్సవాలు నిర్వహించనుంది. వాటిని ప్రధాని శుక్రవారం ఢిల్లీలో ప్రారంభించారు. ఈ మహామంత్రానికి ఎందుకు అన్యాయం చేశారో తెలుసుకోవలసిన అవసరం నేటి తరానికి ఉందని ఈ సందర్భంగా ఆయన అన్నారు. 'వందేమాతరం అన్ని కాలాలకూ ఉపయుక్తం. మన శత్రువులు ఉగ్రవాదం ద్వారా భారత భద్రతపై దాడికి సాహసించినప్పుడు.. నవభారతం పది ఆయుధాలు ధరించిన దుర్గగా రూపాంతరం చెందడాన్ని (ఆపరేషన్ సిందూర్) యావత్ ప్రపంచం చూసింది. వందేమాతరం మనకు సరికొత్త స్ఫూర్తిని, నూతనోత్తేజాన్ని ఇస్తుంది. ఇది పదమే కాదు.. మంత్రం.. శక్తి.. ఓ కల.. సంకల్పం' అని తెలిపారు. బ్రిటిష్‌వారు భారత్‌ను వెనుకబాటుదేశంగా, తక్కువ స్థాయి కలిగిన దేశంగా చిత్రించాలని చూశారని.. కానీ వందేమాతరంలోని మొదటి పంక్తే.. ఈ తప్పుడు ప్రచారాన్ని బదాబదలు చేసిందని చెప్పారు. దేశాన్ని కేవలం భౌగోళిక రాజకీయ సంస్థగా చూసేవారికి.. దేశాన్ని తల్లిగా భావించడం విస్మయం కలిగించవచ్చు. కానీ భారత్ భిన్న దేశం. ఇక్కడ తల్లి బిడ్డకు జన్మనిస్తుంది.. పోషిస్తుంది.. తన పిల్లలు ప్రమాదంలో ఉంటే.. దుర్మార్గాన్ని సంహరిస్తుంది. చంద్రుడి దక్షిణ ధ్రువాన్ని చేరిన తొలి దేశంగా భారత్ ఖ్యాతినార్జించినప్పుడు.. నవభారతం అంతరిక్షంలోని మారుమూలలకూ వెళ్లినప్పుడు.. ప్రతి భారతీయుడూ గర్వంతో వందేమాతరం అని నినదించాడు. మన ఆడపిల్లలు అంతరిక్షం నుంచి క్రీడల వరకు అన్ని రంగాల్లో అగ్రస్థానానికి చేరినప్పుడు.. వారు గగనతలంలో యుద్ధవిమానాలను నడుపుతున్నప్పుడు.. మనందరం వందేమాతరం అని సగర్వంగా అంటున్నాం' అని చెప్పారు.

వందేమాతరాన్ని మోసింది కాంగ్రెస్సే

ఆర్ఎస్ఎస్, బీజేపీ ఆ ఊసే ఎత్తలేదు: ఖర్గే

భారత జాతి ఆత్మను మేల్కొలిపిన వందేమాతరం గేయాన్ని సగర్వంగా భుజాన వేసుకుని మోసింది కాంగ్రెస్ పార్టీయేనని ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే అన్నారు. ఆర్ఎస్ఎస్, బీజేపీ మాత్రం దానిని ఆలపించకుండా దూరంగా ఉన్నాయని ఆరోపించారు. జాతీయవాదానికి స్వయంప్రకటిత సంరక్షకులుగా ఇవి తమను తాము ప్రకటించుకుంటాయని.. కానీ ఈ రెండూ ఎప్పుడూ ఆ గేయాన్ని ఆలపించలేదని శుక్రవారం ఓ ప్రకటనలో స్పష్టంచేశారు. 1896లో కలకత్తాలో అప్పటి కాంగ్రెస్ అధ్యక్షుడు రహంతుల్లా సయానీ అధ్యక్షతన జరిగిన పార్టీ మహాసభల్లో.. ఠాగూర్ మొదటిసారి వందేమాతరం పాటను ఆలపించారని ఖర్గే తెలిపారు. 1937లో కాంగ్రెస్ పార్టీనే వందేమాతరాన్ని జాతీయ గేయంగా గుర్తించిందన్నారు. "వందేమాతరాన్ని, 'జనగణ మన'ను ఏనాడూ తమ శాఖల్లో గానీ, కార్యాలయాల్లో గానీ పాడని ఆర్ఎస్ఎస్, బీజేపీ.. జాతీయవాదానికి సంరక్షకులుగా చెప్పుకొంటున్నాయి" అని ఎద్దేవాచేశారు.

మోదీ గొప్ప వ్యక్తి, స్నేహితుడు

- వచ్చే ఏడాది భారత్‌కు వెళ్లొచ్చు : ట్రంప్



వాషింగ్టన్, నవంబరు 7: ప్రధాని మోదీపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రశంసల జల్లు కురిపించారు. "మోదీ గొప్ప వ్యక్తి, స్నేహితుడు. ఆయన నాయకత్వం బాగుంది." అని వ్యాఖ్యానించారు. అధ్యక్ష భవనం వైట్ హౌస్‌లో.. శుక్రవారం జరిగిన కార్యక్రమంలో బరువు తగ్గించే ఔషధాల ధరలు దిగివచ్చేలా ట్రంప్ కొత్త ప్రణాళికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. "వాణిజ్య ఒప్పందంపై ప్రధాని మోదీతో చర్చలు సానుకూలంగా సాగుతున్నాయి. రష్యా నుంచి భారీగా చమురును కొనుగోలు చేసే ప్రక్రియను ఆయన తగ్గించారు. నన్ను అక్కడకు(భారత్) రావాలని మోదీ కోరుతున్నారు. ఈ విషయాన్ని మేం పరిశీలిస్తున్నాం. నేను భారత్‌కు వెళ్తా." అని ట్రంప్ ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. మరోవైపు, తమ వద్ద ఉన్న అణ్వాయుధాలతో ప్రపంచం మొత్తాన్నీ 150 సార్లు పేల్చేయగలమని ట్రంప్ సంచలన వ్యాఖ్యలు చేశారు. చైనా, రష్యాలు అత్యంత రహస్యంగా భూగర్భ అణు పరీక్షలు నిర్వహిస్తున్నాయని ఆరోపించారు. ఈ క్రమంలోనే ఆయన అణు నిరాయుధీకరణకు పిలుపునిచ్చారు. మరుక్షణమే.. తమ వద్ద ఉన్న అణ్వాయుధాలతో ప్రపంచాన్ని 150 సార్లు పేల్చేయగలమని హెచ్చరించారు. "అణు నిరాయుధీకరణపై రష్యా అధ్యక్షుడు పుతిన్, చైనా అధ్యక్షుడు షి జిన్‌పింగ్‌లతో మాట్లాడా. ప్రపంచ వ్యాప్తంగా శాంతి విలసిల్లాలని కోరుకుంటున్నా" అని వ్యాఖ్యానించారు. అయితే.. ఆ మరు నిమిషంలోనే.. తాము తక్షణమే అణు పరీక్షలు చేపడతామంటూ ట్రంప్ కీలక ప్రకటన చేశారు.

చైనా విమాన వాహక యుద్ధనౌక
ఫుజియాన్ ప్రారంభం



బీజింగ్, నవంబరు 7: చైనా మూడో విమాన వాహక యుద్ధనౌక ఫుజియాన్‌ను రహస్యంగా ప్రారంభించింది. ఈ ప్రారంభ కార్యక్రమానికి చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ హాజరయ్యారు. బుధవారం దక్షిణ చైనాలోని హైనన్ ప్రావిన్స్‌లో ఉన్న సాన్యా పోర్టులో జిన్‌పింగ్ జెండా ఊపి అత్యంత అధునాతన యుద్ధనౌకను ప్రారంభించారని ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచే జిన్‌హువా న్యూస్ ఏజెన్సీ పేర్కొంది. అయితే అధికారిక మీడియా మాత్రం ఫుజియాన్‌ను శుక్రవారం ప్రారంభించారని తెలిపింది. ఇంతకు ముందు చైనా 2012లో లియావోనింగ్, 2019లో షాన్‌డాంగ్ విమాన వాహక యుద్ధ నౌకలను ప్రారంభించింది. వీటికన్నా ఫుజియాన్ పెద్దది. దీని బరువు 80 వేల టన్నులు.చైనా మిలిటరీ కమాండర్ సోంగ్ జోంగ్‌పింగ్ మాట్లాడుతూ "ఫ్లాట్ డెక్‌తో ఉన్న చైనా తొలి ఎయిర్‌క్రాఫ్ట్ క్యారియర్ ఇది. ఆధునిక పరిజ్ఞానంతో తయారైంది. ఎలక్ట్రోమ్యాగ్నెటిక్ క్యాటపుల్ట్స్, ఎలక్ట్రోమ్యాగ్నెటిక్ అరెస్టింగ్ గేర్, ఎలక్ట్రిక్ ప్రొపల్షన్ వ్యవస్థ ఉన్నాయి" అని పేర్కొన్నారు. అధునాతన ఫుజియాన్‌లో విద్యుదయస్కాంత విమాన ప్రయోగ వ్యవస్థ (ఈఎంఏఎల్ఎస్)ను అమర్చారు. ఈ వ్యవస్థను అమెరికా విమాన వాహక యుద్ధనౌక యూఎస్ఎస్ గెరాల్డ్ ఆర్ ఫోర్డ్‌లో మాత్రమే వినియోగించారు. చైనా ప్రవేశపెట్టిన మూడు విమాన వాహక యుద్ధనౌకల్లో సంప్రదాయ ఇంధనాన్ని మాత్రమే వినియోగిస్తున్నారు. దక్షిణ చైనా సముద్రంలోనే కాకుండా భారత్‌కు సమీపంలోని హిందూ మహాసముద్రంలోనూ, అరేబియా సముద్రంలోనూ ఫుజియాన్‌ను మోహరించే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు.

పీవోకేలో మళ్లీ 'ఉగ్ర' కదలికలు!

న్యూఢిల్లీ, నవంబరు 7: పాక్ ఆక్రమిత కశ్మీర్(పీవోకే)లో ఉగ్రవాద కార్యకలాపాలు విస్తరించడానికి పాక్ ప్రయత్నాలు మొదలుపెట్టింది. మునీర్ అనే హ్యాండ్లర్ సూచనల మేరకు ఈ ప్రాంతంలో మళ్లీ నెట్‌వర్క్‌ను విస్తరించుకోవడానికి సిద్ధమవుతోంది. ఉగ్ర శిబిరాలను తిరిగి ప్రారంభించడంతో పాటు చొరబాట్లను సులభతరం చేయడంపై గత నెలలో ముజఫరాబాద్, భింబిర్‌లలో సమావేశాలు జరిగాయని, పాక్ ఆర్మీతో పాటు ఐఎస్ఐకి చెందిన సీనియర్ అధికారులు, లష్కరే, జైషే, హిజ్బుల్ ముజాహిదీన్, తెహ్రీక్-ఉల్- ముజాహిదీన్ కమాండర్లు పాల్గొన్నారని నిఘా వర్గాల నివేదికలు తెలిపాయి. ఉగ్ర కార్యకలాపాల్లోకి మహిళల నియామకాలకు సంబంధించి ఉర్దూలో ముద్రించిన ఆహ్వాన పత్రం నిఘా వర్గాలకు లభించింది.

'చికెన్స్ నెక్' భద్రత బలోపేతం

- బంగ్లా సరిహద్దుల్లో మూడు సైనిక స్థావరాలు

న్యూఢిల్లీ, నవంబరు 7: బంగ్లాదేశ్, పాకిస్థాన్ మధ్య కొద్దిరోజులుగా సైనిక సంబంధాలు బలపడుతున్న నేపథ్యంలో భారత్ అప్రమత్తమైంది. దేశ ప్రధాన భూభాగాన్ని ఈశాన్య రాష్ట్రాలతో అనుసంధానించే సిలిగురి కారిడార్ (చికెన్స్ నెక్) వెంబడి భద్రతను బలోపేతం చేస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. దీనిలో భాగంగా బాముని, కిషన్‌గంజ్, చోప్రా ప్రాంతాల్లో కొత్తగా మూడు సైనిక స్థావరాలను ఏర్పాటు చేసింది. ఇవి ఈ ప్రాంతంలో భద్రతకు భరోసా కల్పించడంతో పాటు ఈశాన్య సరిహద్దుల్లో నిఘాను మరింత బలోపేతం చేయనున్నాయి. ఈ ప్రాంతాలన్నీ బంగ్లాదేశ్‌కు అత్యంత సమీపంగా ఉన్నవేనని భద్రతా వర్గాలు తెలిపాయి.

మధుమేహం, ఊబకాయం ఉంటే..
అమెరికా వీసా కష్టమే!

- ఎంబసీలు, కాన్సులేట్లకు కొత్త మార్గదర్శకాలు
- గుండె జబ్బులు, శ్వాస సమస్యలు ఉన్నవారికీ ఇబ్బందే
- 'కేఎఫ్ఎఫ్ హెల్త్ న్యూస్' వెల్లడి



వాషింగ్టన్, నవంబరు 7: మధుమేహం (షుగర్), ఊబకాయం (ఒబేసిటీ) వంటి సమస్యలతో బాధపడుతున్నవారికి ఇకపై అమెరికా వీసా పొందడం కష్టం కానుంది. గుండె జబ్బులు, తీవ్ర శ్వాస సమస్యలు ఉన్నవారికీ వీసా నిరాకరించే అవకాశం పెరగనుంది. ఈ మేరకు విదేశీయులెవరైనా అమెరికా వీసా పొందడం కోసం ఇప్పటికే ఉన్న ఆరోగ్య పరిశీలన నిబంధనల్లో ఆ దేశ విదేశాంగ శాఖ మార్పులు చేసింది. ఇకపై మధుమేహం, ఊబకాయం అంశాలనూ పరిశీలన జాబితాలో చేర్చింది. దీనికి సంబంధించి ప్రపంచ వ్యాప్తంగా అమెరికా ఎంబసీలు, కాన్సులేట్లకు నూతన మార్గదర్శకాలు వెళ్లాయని ఆ దేశానికి చెందిన 'కేఎఫ్ఎఫ్ హెల్త్ న్యూస్' వెబ్‌సైట్ వెల్లడించింది. ఇప్పటికే ప్రపంచ ఒబేసిటీ రాజధానిగా మారిన అమెరికాలోకి ఇలాంటి సమస్యలతో బాధపడుతున్నవారు రాకుండా నియంత్రించడం, అక్కడి ప్రభుత్వానికి భారంగా కాకుండా ఉండటమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిపింది. ఈ మార్గదర్శకాల ప్రకారం.. వృద్ధాప్యంలో ఉన్నవారికి, ఒకవేళ అమెరికాలో ప్రభుత్వ ప్రయోజనాలు పొందాల్సి వచ్చే పరిస్థితిలో ఉన్నవారికి కూడా వీసా రావడం కష్టమేనని ఇమిగ్రేషన్ నిపుణులు చెబుతున్నారు. ఎంబసీలు, కాన్సులేట్ల అధికారులకు జారీ చేసిన కొత్త మార్గదర్శకాల్లో.. "వీసా దరఖాస్తుదారుల ఆరోగ్యాన్ని కచ్చితంగా పరిగణనలోకి తీసుకోవాలి. గుండె జబ్బులు, తీవ్ర శ్వాస సమస్యలు, క్యాన్సర్, మధుమేహం, నాడీ సంబంధిత వ్యాధులు, మానసిక ఆరోగ్య పరిస్థితిని కచ్చితంగా పరిగణనలోకి తీసుకోవాలి. వాటి చికిత్సకు వందలు, వేల డాలర్ల వ్యయం అవుతుంది. వారు అమెరికాలోకి వచ్చాక ప్రభుత్వంపై ఆధారపడాల్సి వస్తే తీవ్ర భారం పడుతుంది. అలాంటి వారికి వీసా నిరాకరించాలి. ఒకవేళ దరఖాస్తుదారులకు తమ వ్యాధుల చికిత్స, ఆరోగ్య సంరక్షణ వ్యయాన్ని పూర్తిగా భరించగల ఆర్థిక స్థోమత ఉంటే పరిగణనలోకి తీసుకోవచ్చు. ఇక వీసా దరఖాస్తుదారుల కుటుంబ సభ్యుల (డిపెండెంట్లు)లో ఎవరికైనా తీవ్ర వ్యాధులు, వైకల్యాలు ఉన్నాయా అన్నదీ పరిశీలించాలి" అని విదేశాంగ శాఖ ఆదేశించింది. అమెరికాలోకి వలసలను నిరుత్సాహపర్చడం కోసమే మార్గదర్శకాలను ఇలా విస్తృతం చేశారన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

స్వాతంత్ర్య ఉద్యమంలో స్ఫూర్తి నింపిన వందేమాతరం

భారతీయులకు సమర నినాదమైందన్న మంత్రులు పొన్నం, జూపల్లి

» మహబూబియా స్కూల్‌లో వందేమాతరం సామూహిక గేయాలాపన

» రాష్ట్ర వ్యాప్తంగా ఘనంగా వందేమాతరం 150 ఏళ్ల స్మారకోత్సవాలు



మహబూబియా స్కూల్‌లో వందేమాతరం గేయాలాపనలో పాల్గొన్న మంత్రులు పొన్నం, జూపల్లి

హైదరాబాద్ సిటీ, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య ఉద్యమ సమయంలో వందేమాతరం భారతీయుల్లో స్ఫూర్తి నింపిందని మంత్రి పొన్నం ప్రభాకర్ చెప్పారు. బంకించంద్ర ఛటర్జీ రాసిన వందేమాతరం 150 ఏళ్ల స్మారకోత్సవాల వేళ గన్‌ఫౌండ్రిలోని మహబూబియా ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో మంత్రి జూపల్లితో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా జూపల్లి మాట్లాడుతూ నాడు కశ్మీరు నుంచి కన్యాకుమారి వరకూ వందేమాతరం సమర నినాదమైందన్నారు. విద్యార్థులతో కలిసి మంత్రులు వందేమాతర గేయాలపన చేశారు. కార్యక్రమంలో తెలంగాణ పాఠశాల విద్యాశాఖ సంచాలకులు నవీన్ నికోలస్, జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి, డీఈఓ రోహిణి, భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ నరసింహ రెడ్డి, ఆర్జెడి విజయలక్ష్మి పాల్గొన్నారు. వందేమాతరం 150 ఏళ్ల స్మారకోత్సవాల సందర్భంగా డీజీపీ కార్యాలయంలో పోలీసు అధికారులు, మినిస్టీరియల్ సిబ్బంది వందేమాతరం గేయాన్ని ఆలపించారు. చార్మినార్ ఇన్‌చార్జీ డీఐజీ ఎల్ఎస్ చౌహన్, శాంతిభద్రతల విభాగం ఏఐజీ రమణకుమార్, పరిపాలనా విభాగం ఏఐజీ నాగరాజు ఇతర అధికారులు, సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. వందేమాతరం గేయం దేశ ప్రజల్లో ఐక్యతను పెంచిందని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ చెప్పారు. సికింద్రాబాద్ రైల్ నిలయంలో 150 సంవత్సరాల 'వందేమాతరం' పేరిట ఏడాది పాటు నిర్వహించనున్న వేడుకల్లో భాగంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో శ్రీవాస్తవ ప్రసంగించారు. కార్యక్రమంలో దక్షిణ మధ్య రైల్వే అదనపు జనరల్ మేనేజర్ సత్య ప్రకాష్‌తో పాటు పలువురు రైల్వే సీనియర్ అధికారులు, ఉద్యోగులు పాల్గొని వందేమాతరం గేయాన్ని ఆలపించారు.

వందేమాతరం ఆలపించిన నూతన వధూవరులు

నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లి శ్రీవెంకటేశ్వర కల్యాణ మండపంలో నూతన వధూవరులు వందేమాతరం గేయాన్ని ఆలపించారు. తమ వివాహ వేళ వందేమాతరం 150 ఏళ్ల స్మారకోత్సవాలు జరుగుతుండటంతో ప్రశాంత్, నిహారిక జంట బంధుమిత్రులతో కలిసి గేయాన్ని ఆలపించారు.

రియాజ్ ఎన్‌కౌంటర్‌పై సీబీఐతో దర్యాప్తు జరిపించాలి

న్యూఢిల్లీ, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): కానిస్టేబుల్ ప్రమోద్ హత్య కేసులో నిందితుడు షేక్ రియాజ్‌ను పోలీసులు బూటకపు ఎన్‌కౌంటర్ చేశారని అతని కుటుంబసభ్యులు ఆరోపించారు. ఈ ఘటనపై సీబీఐతో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. శుక్రవారం, లీగల్ యాక్టివిస్ట్ సయ్యద్ ఫిరాసత్ అలీ, సామాజిక కార్యకర్తలు ఖలీదా పర్వీన్, జలాదుద్దీన్‌తో కలిసి రియాజ్ తల్లి జరీనా బేగం, భార్య సనోబర్ నజ్జీన్ జాతీయ మానవహక్కుల కమిషన్(ఎన్‌హెచ్‌ఆర్సీ), జాతీయ మహిళా కమిషన్ (ఎన్‌సీడబ్ల్యూ), బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ (ఎన్‌సీపీసీఆర్)లకు ఫిర్యాదు చేశారు. రియాజ్‌ది పోలీసుల కస్టోడియల్ డెత్ అని, అతను మరణించిన తర్వాత మృత దేహంలోకి బుల్లెట్లు దించి ఎన్‌కౌంటర్‌గా చిత్రీకరించినట్లు చెప్పారు. అనంతరం, తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. రియాజ్‌పై ఇదివరకు పెట్టీ కేసులు మాత్రమే నమోదయ్యాయని, ప్రమోద్ హత్య తర్వాతే అతనిపై మర్డర్ కేసు నమోదైందన్నారు. ఈ హత్యారోపణల్లో వాస్తవాలు లేవన్నారు. ఇదంతా పోలీసులు అల్లిన కట్టు కథ అని ఆరోపించారు.

బ్యాంకాక్‌లో కొలువని వెళ్తే.. బందీలుగా చేసి 'సైబర్' ఊబిలోకి!

» మయన్మార్ సైబర్ గ్యాంగ్‌ల అరాచకాలు..

» ఢిల్లీకి చేరిన తెలుగు రాష్ట్రాల బాధితులను స్వస్థలాలకు తరలించేందుకు అధికారుల ఏర్పాట్లు

న్యూఢిల్లీ, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): బ్యాంకాక్‌లో కొలువు.. రూ.80 వేలకు పైగా జీతం, ఉచిత వసతి అంటూ తెలుగు రాష్ట్రాలకు చెందిన యువతకు మాయమాటలు చెప్పి మయన్మార్ రప్పించుకున్న కేటుగాళ్లు.. వారిని సైబర్ నేరాల ఊబిలోకి దింపారు. బందీలుగా చేసి రోజువారీ టార్గెట్లు పెట్టి మరీ వేధించే వారు.. టార్గెట్లు పూర్తి చేయకపోతే శిక్షలు కూడా వేసేవారు.. శుక్రవారం ఢిల్లీలో బాధితులను 'ఆంధ్రజ్యోతి' సంప్రదించగా అక్కడి గ్యాంగ్‌ల అరాచకాలు వెలుగులోకి వచ్చాయి. మయన్మార్‌లోని మయవాడీ ప్రాంతంలో కేకే పార్క్ సైబర్ గ్యాంగ్‌లకు చిక్కిన భారత్‌కు చెందిన 270 మంది యువతీయువకులను కేంద్ర విదేశాంగ శాఖ గురువారం ఢిల్లీకి తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. వీరిలో ఏపీకి చెందిన ఇద్దరు యువతులు సహా 11 మంది, తెలంగాణకు చెందిన 11 మంది ఉన్నారు. ఆంగ్ల భాషపై పట్టు, కంప్యూటర్ పరిజ్ఞానముంటే బ్యాంకాక్‌లో ఉద్యోగమంటూ టెలిగ్రామ్ యాప్ ద్వారా ఈ సైబర్ గ్యాంగ్‌లు ఆకర్షిస్తాయని.. వర్చువల్‌గా ఇంటర్వ్యూలు నిర్వహించి మరీ ఎంపిక చేసుకుంటాయని బాధితులు తెలిపారు. ఎంపికైన వారికి విమాన టికెట్లు పంపి చెన్నై నుంచి హాంకాంగ్ చేరుకున్నాక.. సైబర్ గ్యాంగ్‌ల ముఠా సభ్యులు వారిని మయన్మార్-థాయ్‌లాండ్ సరిహద్దులో గల మయవాడీ ప్రాంతానికి తరలించేవారన్నారు. 'అక్కడ డార్మిటరీల్లో బందీలుగా ఉంచుతారు. ఏ సైబర్ గ్యాంగ్‌కు చెందిన వారో తెలిసేలా ఐడీ కార్డు కూడా ఇస్తారు. డేటింగ్ యాప్‌లలో ఫేక్ అకౌంట్లతో అమెరికా, యూరప్ దేశాలకు చెందిన వారిని ఉచ్చులోకి లాగి వీలైనంతగా డబ్బులు దోచుకోవాలంటూ రోజువారీ టార్గెట్లు పెడతారు. అవి పూర్తి చేయకుంటే శిక్షించేవారు.. కిలోమీటర్ల మేర మైదానంలో నీళ్ల క్యాన్లతో పరుగెత్తించేవారు.. భారత్‌తో పాటు ఫిలిప్పీన్స్, ఆఫ్రికా దేశాలకు చెందిన చాలామంది అక్కడ చిక్కుకున్నారు. తెలుగు రాష్ట్రాల వారు ఇంకా కొందరు అక్కడే ఉన్నారు' అని బాధితులు తెలిపారు. గ్రేటర్ నోయిడాలో కేంద్ర విదేశాంగ శాఖ అధికారులు బాధితులను ఆయా రాష్ట్రాల అధికారులకు అప్పగించారు. తెలంగాణ వారిని శుక్రవారం రాత్రి స్వరాష్ట్రానికి తరలించేందుకు అధికారులు ఏర్పాట్లు చేయగా, ఏపీకి చెందిన బాధితులను శనివారం ఉదయం పంపనున్నారు.

'నిట్' విద్యార్థికి రూ.1.27 కోట్ల ప్యాకేజీ!

మరొకరికి రూ.కోటి.. ఎంఎన్‌సీ ఆఫర్లు.. రెండు నెలల్లో 528 మందికి ప్లేస్‌మెంట్స్

హనుమకొండ, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): వరంగల్‌లోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎన్ఐటీ) ప్లేస్‌మెంట్స్‌లో దూసుకుపోతోంది. 2025-26 ప్లేస్‌మెంట్ సీజన్ ప్రారంభ దశలోనే రికార్డు స్థాయిలో అద్భుత ఫలితాలను సాధించింది. ప్లేస్‌మెంట్ సీజన్ ప్రారంభమైన కేవలం రెండు నెలల వ్యవధిలోనే 528 మంది విద్యార్థులు మంచి ప్యాకేజీలతో ప్లేస్‌మెంట్లు పొందారు. వరంగల్ ఎన్ఐటీ చరిత్రలో మొదటిసారిగా కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగానికి చెందిన బీటెక్ విద్యార్థి నారాయణ త్యాగి (నోయిడా, ఉత్తరప్రదేశ్) బహుళజాతి కంపెనీ నుంచి రూ.1.27 కోట్ల సీటీసీ (కాస్ట్ టూ కంపెనీ)తో దేశీయ ఆఫర్‌ను పొందారు. ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ విభాగానికి చెందిన మరో విద్యార్థి మహమ్మద్ నహిల్ నష్వాన్ (ఖమ్మం) రూ.1 కోటి సీటీసీతో దేశీయ ఆఫర్‌ను పొందారు. 2025-26 ప్లేస్‌మెంట్ డ్రైవ్ ప్రారంభమైన 2నెలల వ్యవధిలోనే రూ.70లక్షలకుపైగా సీటీసీతో ఆరుగురు, రూ.50లక్షలకుపైగా సీటీసీతో 34 మంది, రూ.30 లక్షలకుపైగా సీటీసీతో 125మంది, రూ.25 లక్షలకుపై సీటీసీతో 200 మంది విద్యార్థులు ఆఫర్లు పొందారు. గత నెల 15 వరకు సగటు ప్యాకేజీ రూ.26 లక్షలను దాటింది. ప్లేస్‌మెంట్ సీజన్ కొనసాగుతూనే ఉంది. ఎన్ఐటీ డైరెక్టర్ ప్రొ. బిద్యాధర్ సుబుధి ప్లేస్‌మెంట్ పొందిన విద్యార్థులకు అభినందనలు తెలిపారు.

ప్లేస్‌మెంట్ సెల్‌కు రుణపడి ఉంటా

'నా స్వస్థలం ఉత్తరప్రదేశ్‌లోని నోయిడా. ఇంజనీర్ల కుటుంబం నుంచి వచ్చాను. మా అమ్మ సోనియా త్యాగి కెమిస్ట్రీ టీచర్. నాన్న వికాస్ త్యాగి ఇంజనీర్. అమ్మానాన్నల ప్రోత్సాహంతో పాటు చిన్నతనం నుంచి గేమింగ్, సాంకేతికతపై ఉన్న ఆసక్తితో బీటెక్‌లో కంప్యూటర్ సైన్స్ తీసుకున్నాను. మంచి ప్లేస్‌మెంట్ సాధించడంలో సహకరించిన వరంగల్ ఎన్ఐటీ ప్లేస్‌మెంట్ సెల్‌కు రుణపడి ఉంటాను'

\- నారాయణ త్యాగి

తల్లిదండ్రుల త్యాగాలతోనే..

'నా స్వస్థలం ఖమ్మం. మాది మధ్య తరగతి కుటుంబం. మా నాన్న మహ్మద్ నజీర్ అకౌంటెంట్. మా అమ్మ నిఖత్ షహీన్ గృహిణి. మా తల్లిదండ్రులు నా కోసం చేసిన అపూర్వమైన త్యాగాలు నన్ను ఈరోజు ఇలా ఉన్నతి స్థితిలో నిలబెట్టాయి. నిరంతర అధ్యయనంతో కొత్త సవాళ్లను స్వీకరిస్తా. నా దృష్టి పరిధిని విస్తరించుకుంటా'

\- మహమ్మద్ నహిల్ నష్వాన్

డెంటల్ సీట్ల కేటాయింపులో పొరపాటు

» ఓ విద్యార్థినికి మొదట ఒక కాలేజీ.. తర్వాత ఇంకో కాలేజీలో సీటు కేటాయింపు

» కాళోజీ హెల్త్ యూనివర్సిటీ అధికారుల నిర్వాకం

వరంగల్ మెడికల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): కాళోజీ నారాయణరావు హెల్త్ యూనివర్సిటీ అధికారులు మేనేజ్‌మెంట్ కోటాలో సీట్ల కేటాయింపులో చేసిన పొరపాటు వల్ల విద్యార్థులు తీవ్ర మనోవేదనకు గురికావల్సి వస్తోంది. ఓ విద్యార్థినికి మొదట జాబితాలో ఒక కాలేజీలో సీటు కేటాయించి తర్వాతి జాబితా లో ఆ కాలేజీని మార్చి మరో కాలేజీలో సీటు కేటాయించారు. దీంతో ఆ విద్యార్థిని ఆందోళనకు గురికావాల్సి వచ్చింది. నగరంలోని ఓ విద్యార్థినికి మూడో రౌండ్‌లో బీ కేటగిరీలో ఖమ్మంలోని మమత డెంటల్ కాలేజీలో సీటు కేటాయిస్తూ మెసేజ్ పంపారు. వర్సిటీ వెబ్‌సైట్‌లో జాబితా పెట్టారు. దీంతో ఆ విద్యార్థి సీటు కేటాయించిన కాలేజీలో చేరేందుకు సిద్ధమయ్యారు. బుధవారం సెలవు కావడంతో గురువారం కాలేజీకి వెళ్లాలనుకున్నారు. అయితే బుధవారం వర్సిటీ నుంచి విద్యార్థినికి మరో మెసేజ్ వచ్చింది. ఇంతకుముందు కేటాయించిన కళాశాల సీట్ల కేటాయింపులో తప్పులు దొర్లాయని, మరో జాబితా విడుదల చేస్తామని పేర్కొంది. తర్వాత కాలేజీ పేరు మార్చి జాబితా విడుదల చేశారు. ఆ జాబితాలో ఖమ్మం మమత డెంటల్ కాలేజీలో సీటు తొలగించి నిజామాబాద్ మేఘన కాలేజీలో కేటాయించారు. దీంతో ఆమె రిజిస్ట్రార్ వద్దకు వెళ్లి ఆరా తీయగా.. తప్పు జరిగింది వాస్తవమేనని ఒప్పుకున్నారు. ఇలా పలువురు విద్యార్థులకు జరిగినట్టు సమాచారం. ఇప్పుడు విడుదల చేసిన జాబితాపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వర్సిటీ వీసీ స్పందించి స్పష్టత ఇవ్వాల్సి ఉంది.



చెక్కును అందిస్తున్న చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య

రోడ్డు ప్రమాద బాధిత కుటుంబానికి రూ.7 లక్షల పరిహారం అందజేత

చేవెళ్ల, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): చేవెళ్ల బస్సు ప్రమాదంలో చనిపోయిన కర్ణాటకలోని గుల్బర్గా జిల్లా బాన్సూర్‌కు చెందిన నాగమణి కుటుంబానికి చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య రూ.7 లక్షల (రాష్ట్ర ప్రభుత్వం తరఫున రూ. 5 లక్షలు, సీఎంఆర్ఎఫ్, ఆర్టీసీ నుంచి రూ.2 లక్షలు) పరిహారాన్ని అందజేశారు. శుక్రవారం క్యాంపు కార్యాలయంలో ఆర్డీవో, డిప్యూటీ కలెక్టర్ చంద్రకళతో కలిసి మృతురాలి కుమార్తె సాయిశ్రీకి ఈ మేరకు చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రంగారెడ్డి జిల్లాలోని హైదరాబాద్ - బీజాపూర్ జాతీయ రహదారి విస్తరణ పనులు శరవేగంగా జరుగుతున్నాయని తెలిపారు. రోడ్డు విస్తరణ పనులు నిర్ణీత గడువులోగా పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు.

ఏడుగురు మావోయిస్టుల లొంగుబాటు

» ఛత్తీస్‌గఢ్ పోలీసుల ఎదుట సరెండర్

» ఝార్ఖండ్ ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు మృతి



ఆయుధాలతో లొంగిపోవడానికి వస్తున్న మావోయిస్టులు

చర్ల, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం గరియాబంద్ జిల్లాలో శుక్రవారం ఏడుగురు మావోయిస్టులు ఆయుధాలతో లొంగిపోయారు. వీరిలో ఉదంతి ఏరియా కమిటీ కమాండర్ సునీల్, సెక్రటరీ అరీనా ఉన్నారు. వీరిని జిల్లా పోలీసులు శనివారం మీడియా ముందుకు తీసుకురానున్నారు. కొద్ది రోజుల క్రితం ఉదంతి ఏరియా కమిటీ కమాండర్ సునీల్ పేరిట మావోయిస్టు పార్టీ లేఖ విడుదల చేసి.. మల్లోజుల వేణుగోపాల్ బాటలోనే తాము కూడా లొంగి పోతామని పేర్కొంది. ఈ నేపథ్యంలో శుక్రవారం మధ్యాహ్నం ఉదంతి అడవుల నుంచి సునీల్, అరీనా, లుడ్రో, విద్య, నందిని, మల్లేశ్ ఆయన బృందం సభ్యులు గరియాబంద్ పోలీసుల ఎదుట లొంగి పోయారు. ఈ సందర్భంగా ఎల్ఎల్ఆర్, 3 ఇన్‌సాస్, సింగల్‌షాట్, తుపాకులను అప్పగించినట్లు పోలీసులు తెలిపారు. కాగా, బీజాపూర్ జిల్లా కర్రెగుట్టల్లో ఎలుగుబంటి దాడిలో ఎట్టి కన్న అనే జవాన్ గాయపడ్డారు. యాంటీ నక్సల్ ఆపరేషన్‌లో భాగంగా బలగాలు కర్రెగుట్టల్లో కూంబింగ్ చేపట్టాయి. ఈ క్రమంలో చెట్ల పొదల్లో దాక్కున్న ఎలుగుబంటి ఒక్కసారిగా ఎట్టి కన్నపై దాడి చేసింది. ఆయన తేరుకునే లోపే గాయపరచి అక్కడి నుంచి పారిపోయింది. జవాన్ కాలుకు తీవ్ర గాయమవడంతో వెంటనే హెలికాప్టర్‌లో రాయపూర్ వైద్యశాలకు తరలించారు. మరో ఘటనలో ఝార్ఖండ్ రాష్ట్రం పశ్చిమ సింగ్‌భూమి జిల్లా అడవుల్లో శుక్రవారం మావోయిస్టులు, పోలీసుల మధ్య కాల్పులు చోటుచేసుకున్నాయి. ఈ కాల్పుల్లో ఓ మావోయిస్టు మృతి చెందినట్లు ఎస్పీ అమిత్ రేణు తెలిపారు.

పొలంలోనే ఆగిన రైతు గుండె

» వర్షాలతో పంటనష్టం దిగులుతోనే..

» అప్పుల బాధతో పత్తి రైతు బలవన్మరణం

» సిరిసిల్ల, భువనగిరి జిల్లాల్లో ఘటనలు



విజ్జయ్య, ఉపేందర్ రెడ్డి (ఫైల్)

గంభీరావుపేట, చౌటుప్పల్ రూరల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): వర్షాలకు ముంపునకు గురై వరి పాడవడంతో పంట చేతికి రాదనే బెంగతో ఓ రైతు పంట చేనులోనే ఆకస్మికంగా గుండెపోటుతో మృతి చెందాడు. రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం గజసింగవరం గ్రామానికి చెందిన దానవేని విజ్జయ్య (65) ఎకరంలో పొలంలో వరి పంట సాగు చేశాడు. ఇటీవల కురిసిన వర్షాలకు వరి పంట నేల వాలింది. దీంతో పంట చేతికి వస్తుందో లేదో అనే బెంగ విజ్జయ్యను వెంటాడింది. ఈ నేపథ్యంలో శుక్రవారం మిషన్ సహాయంతో వరి కోత మొదలు పెట్టేందుకు విజ్జయ్య తన పొలం వద్దకు భార్య లక్ష్మితో కలిసి వెళ్లాడు. పొలాన్ని చూసి పంట అంతా నేల పాలైందని భార్య లక్ష్మితో ఆవేదనతో చెబుతూనే ఒక్కసారి కుప్పకూలిపోయి చనిపోయాడు. మరో ఘటనలో.. అప్పులు తీర్చలేక ఓ రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం అంకిరెడ్డిగూడెంకు చెందిన ఇటికల ఉపేందర్‌రెడ్డి(43) తొమ్మిది ఎకరాల్లో పత్తి సాగు చేశాడు. ఇందుకోసం భార్య బంగారాన్ని తాకట్టు పెట్టి అప్పు తెచ్చాడు. ఇటీవల కురిసిన వర్షాలకు చేతికొచ్చిన పంట నష్టపోవడంతో కలత చెంది శుక్రవారం ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

'అణు' ఉన్మాదం

అనేక యుద్ధాలు ఆపాను, యుద్ధం అంచులకుపోతున్న దేశాలను హెచ్చరించి మరీ నిలువరించాను, అయినా నాకు నోబెల్‌శాంతి ఇవ్వలేదు, కనీసం నా శాంతియత్నాలను కూడా ప్రపంచం గుర్తించడం లేదు, ఐక్యరాజ్యసమితి సైతం మెచ్చుకోలేదు... అని అదేపనిగా వాపోయిన అమెరికా అధ్యక్షుడు అందుకు ప్రతిగా ప్రపంచంమీద ప్రతీకారం తీర్చుకోవాలని అనుకుంటున్నారేమో! శాంతిదూత ట్రంప్ నోట వారంలోనే పలుమార్లు అణ్వస్త్రాలు, అణుయుద్ధాల ప్రస్తావనలు వినిపించాయి. యావత్ ప్రపంచాన్ని నూటయాభైసార్లు నాశనం చేయగల అణ్వస్త్రాలు తన వద్ద ఉన్నాయని ఆయన సగర్వంగా చెప్పుకున్నారు. ఒకపక్క శాంతిగురించి మాట్లాడుతూనే, అణునిరాయుధీకరణ మహాగొప్పదని అంటూనే, మరోపక్క మానవజాతిని సమూలంగా మట్టుబెట్టడానికి అమెరికాకు అట్టే సమయం పట్టదని పరోక్షంగా హెచ్చరిస్తున్నారు. దేశాలను దారికి తేవాలంటే సుంకాలతో మోదితే చాలని మొన్నటి వరకూ ఉపన్యాసాలు దంచిన ట్రంప్ ఇప్పుడు ట్రేడ్‌వార్ కాక న్యూక్లియర్‌వార్ కోసం అర్రులు చాస్తున్నట్టు కనిపిస్తోంది.

పదిరోజుల క్రితం, దక్షిణకొరియాలో చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో భేటీకి ఒకరోజు ముందు ట్రంప్‌నోట ఈ అణుపాటవపరీక్షల మాట వినబడింది. అందరూ చేస్తున్నదే అంటూ ఆయన చైనా, రష్యా, ఉత్తరకొరియాలను ఉదహరించడంతో పాటు పాకిస్థాన్ పేరు కూడా ప్రస్తావించారు. ఈ దేశాలన్నీ రహస్యంగా ఆ పనిచేస్తున్నాయని, తాను చెప్పి మరీ చేస్తానని అన్నారాయన. ట్రంప్ నోట పాకిస్థాన్ పేరు వినబడగానే దొంగపనులు ఆ దేశానికి అలవాటేనంటూ భారత ప్రభుత్వం విరుచుకుపడింది. అలనాటి పోఖ్రాన్ పరీక్షల శక్తియుక్తులను ప్రజలకు గుర్తుచేస్తూ అణుపరీక్షలకు మనదేశం మళ్ళీ సిద్ధపడుతోందని మీడియా కథనాలను వండివార్చుతోంది. పాక్, చైనాలు అణుబలం పెంచుకుంటూంటే మనం ఎలా ఊరుకుంటామంటూ సామాజిక మాధ్యమాల్లో దేశభక్తులు వీరంగాలు వేస్తున్నారు. ఈమారు ఎన్ని టన్నుల మందుగుండు వాడాలో, ఎంత శక్తిని విడుదలచేయాలో లెక్కలు కడుతున్నారు. అణుపరీక్షలకు సిద్ధంకమ్మని తాను ఇప్పటికే ఆదేశించాననీ, ఏర్పాట్లు మొదలయ్యాయని అమెరికా అధ్యక్షుడి నోటివెంటే రావడంతో రష్యాకు కూడా ఇక మొహమాట పడాల్సిన అవసరం లేకపోయింది. అమెరికా అణుపరీక్షలు జరిపినవెంటనే విస్ఫులింగాలు కురిపించడానికి అదీ సర్వంసిద్ధం చేసుకుంటోంది.

మూడుదశాబ్దాల విరామం తరువాత అమెరికా అణుపరీక్షలకు సిద్ధపడుతూండటం ప్రపంచాన్ని పెనుప్రమాదంలోకి నెట్టేస్తోంది. రష్యా, చైనా బూచి చూపుతూ అణుపాటవాన్ని మరింత పెంచుకుంటానని ట్రంప్ ప్రకటించడంతోపాటు, అత్యంత శక్తిమంతమైన ఖండాంతర బాలిస్టిక్ క్షిపణి మినిట్‌మ్యాన్ ప్రయోగం సైతం రష్యా, చైనాలను హెచ్చరించడానికీ, ఉత్తరకొరియాను గిల్లడానికీ ఉపకరిస్తాయి. ఈ క్షిపణికి న్యూక్లియర్ వార్‌హెడ్ తగిలించకపోవచ్చును కానీ, అంతర్జాతీయంగా ఉద్రిక్తతలు తీవ్రస్థాయిలో ఉన్నస్థితిలో ఈ అధునాతన క్షిపణిని పరీక్షించడం ప్రత్యర్థి దేశాలను హెచ్చరించడానికే. ప్రచ్ఛన్నయుద్ధకాలం నాటి వాతావరణాన్ని సృష్టించడం, అణుపోటీని రగల్చడం ట్రంప్ ఉద్దేశంగా కనిపిస్తోంది. ఎదుటివారివద్ద అణ్వాయుధాలున్నాయన్న ఆరోపణతో శత్రువులను హతమార్చడం, దేశాలను స్వాధీనం చేసుకోవడం అమెరికాకు అలవాటు. అణుపరీక్షలు నిర్వహిస్తున్నాయంటూ ఇప్పుడు ట్రంప్ ఆరోపించిన దేశాలేవీ నిజానికి ఆ పనిచేసిన ఆధారాలేమీ లేవు. ఉత్తరకొరియా విషయంలో పాశ్చాత్యదేశాలన్నీ కట్టగట్టుకొని చేస్తున్న ప్రచారం నమ్మినపక్షంలో దానిని కొంతమేరకు మినహాయించవచ్చును. ఈ అధునాతన సాంకేతిక యుగంలో అణుపరీక్షలను రహస్యంగా జరపడం, దాచడం కష్టం. ఉక్రెయిన్ యుద్ధాన్ని ఆపని మొండిఘటం పుతిన్‌ను లొంగదీయడానికో, వాణిజ్యయుద్ధంలో లొంగిరాని జిన్‌పింగ్‌ను దారికితెచ్చుకోవడానికో తన అణు హెచ్చరికలు ఉపకరిస్తాయని ట్రంప్ అనుకొనివుంటే అది పెద్ద భ్రమ. అమెరికాలోని యాభైరాష్ట్రాల్లో ముప్ఫై రాష్ట్రాలు ట్రంప్‌కు హారతులుపట్టి ఏడాది అయింది. మేక్ అమెరికా గ్రేట్ ఎగైన్ (మాగా) పేరిట ఆయన దేశంలోనూ, విదేశాలతోనూ చేస్తున్న పలురకాల యుద్ధాలు ప్రజలకు అంతగా రుచించ లేదని మొన్నటి ఎన్నికల ఫలితాలు తేల్చేశాయి. న్యూయార్క్ మేయర్‌గా జోహ్రాన్ మమ్దానీ ఎన్నిక కావడం, న్యూజెర్సీ, వర్జీనియా డెమోక్రాట్ల చేతుల్లోకి పోవడం ట్రంప్‌కు ఎదురుదెబ్బ. ట్రేడ్‌వార్‌తో కాక, తన ఆప్తమిత్రుడు బెంజమిన్ నెతన్యాహూ తరహాలో రియల్‌వార్‌తోనే తాను అధికారంలో కొనసాగగలనని ట్రంప్ అనుకుంటున్నట్టు ఉంది.

మారుతున్న ప్రపంచ దృశ్యంలో మోదీ

వర్తమాన ప్రపంచంలో మహా శక్తిమంతమైన నాయకులు అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్, చైనా అధ్యక్షుడు జి జిన్‌పింగ్. ఈ ఇరువురి నిర్ణయాలు అంతర్జాతీయ వ్యవహారాలను ప్రభావితం చేస్తాయి. ఈ కోవకు చెందిన మరో ఇద్దరు నాయకులు: రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహు. ఈ నాయకుల మాటలు, చర్యలు వారి వారి దేశాల సరిహద్దులకు ఆవల ఎల్లెడలా మంచిగానో చెడుగానో పర్యవసిస్తాయి. ఇటువంటి శక్తిమంతమైన నాయకుల సరసన తానూ ఉండాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రగాఢంగా ఆకాంక్షిస్తున్నారు. ప్రపంచ గమనాన్ని నిర్దేశిస్తున్న అపూర్వ రాజనీతిజ్ఞుడు నరేంద్ర మోదీ అని ఆయన పార్టీ ఇప్పటికే ఘంటాపథంగా చెప్పుతోంది. అయితే యథార్థం భిన్నంగా ఉన్నది.



▪ పి. చిదంబరం

'పళని' పలుకు

భారత ఆర్థిక వ్యవస్థ పరిమాణంలో, అమెరికా, చైనా ఆర్థిక వ్యవస్థలతో పోల్చిచే, చిన్నది. తలసరి ఆదాయం విషయంలో రష్యా, ఇజ్రాయెల్‌లతో పోల్చితే భారతీయుల తలసరి ఆదాయం చాలా చాలా తక్కువ. గణాంకాలను చూడండి (తొలి అంకె స్థూల దేశీయోత్పత్తి పరిమాణం; రెండో అంకె తలసరి ఆదాయం. అన్ని అంకెలు అమెరికా డాలర్లలో): అమెరికా: 30.51 ట్రిలియన్, 89,000; చైనా: 19.23 ట్రిలియన్, 13,800; రష్యా: 2.54 ట్రిలియన్, 17,500; ఇజ్రాయెల్: 0.6 ట్రిలియన్, 54,000; ఇండియా: 4.19 ట్రిలియన్, 2,900.

భారత్ ఆర్థిక వ్యవస్థ కంటే అమెరికా ఆర్థిక వ్యవస్థ 7 రెట్లు, చైనా ఆర్థిక వ్యవస్థ 4.5 రెట్లు పెద్దవి. భారత్ అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థే కావచ్చు కానీ మన ప్రస్తుత స్థూల దేశీయోత్పత్తి రెట్టింపు కావడానికి పది సంవత్సరాల సమయం పడుతుంది. అప్పటికి అమెరికా, చైనా ఆర్థిక వ్యవస్థల పరిమాణం మరింతగా పెరుగుతుంది. చెప్పవచ్చిన దేమిటంటే స్థూల దేశీయోత్పత్తిలో భారత్, అమెరికాల మధ్య అంతరం, అలాగే భారత్ చైనాల మధ్య అంతరం మరింతగా పెరుగుతుందేగానీ తగ్గే అవకాశం ఎంతమాత్రం లేదు. రష్యా, ఇజ్రాయెల్‌ల స్థూల దేశీయోత్పత్తి పరిమాణాలు చిన్నవేకానీ భారత్ తలసరి ఆదాయంతో పోలిస్తే రష్యా తలసరి ఆదాయం 6 రెట్లు, ఇజ్రాయెల్ తలసరి ఆదాయం 18 రెట్లు అధికంగా ఉన్నది. ఈ గణాంకాలు అన్నీ భారత్ ప్రస్తుత పాలకులకు మినహా ప్రపంచ నాయకులు అందరికీ తెలుసు సుమా!

ప్రపంచ దేశాలు భారత్‌ను గౌరవిస్తున్నాయి, సందేహం లేదు. మనకు లభిస్తున్న గౌరవాదరాలకు కారణాలు ఏమిటి? మన ప్రజాస్వామ్యం, సముజ్వల చరిత్ర, పురాతన సంస్కృతి, ప్రపంచ శాంతి పరిరక్షణలో నిర్వహిస్తున్న పాత్ర, భారతీయ మార్కెట్ పరిమాణం, శక్తి సామర్థ్యాలు, అన్నిటికీ మించి అత్యధిక జనాభా ఉన్న సమాజం. అంతేగానీ ఒక అగ్రరాజ్యమనే భావనతో భారత్‌కు ఈ గౌరవాదరాలు లభించడం లేదు. ఇదొక నిష్ఠుర సత్యం. ఏ దేశమైనా ఇతర దేశాలతో సంబంధాల విషయంలో వాణిజ్యానికి అధిక ప్రాధాన్యమిస్తుంది. ప్రాంతీయంగా సుస్థిర శాంతిని కోరుకుంటుంది. 'మీరు మాకు మిత్ర దేశమైతే, పాకిస్థాన్ పట్ల తప్పకుండా విరోధ భావం చూపాలి' అన్న వైఖరితో భారత్ వ్యవహరిస్తున్నప్పటికీ తమ తమ వాణిజ్య ప్రయోజనాలకు అనుగుణంగా మాత్రమే అన్ని దేశాలు భారత్, పాకిస్థాన్‌లతో సంబంధాలు నెరపుతాయి. ఇది మనం విస్మరించకూడని వాస్తవం.

వర్తమాన ప్రపంచంలో పెను మార్పులు అనూహ్య వేగంతో సంభవిస్తున్నాయి. 2023లో జీ–20 కూటమి దేశాల శిఖరాగ్ర సదస్సును భారత్ నిర్వహించింది. ఈ శిఖరాగ్ర సదస్సు ఒక వార్షిక కార్యక్రమం. ప్రతి సభ్య దేశమూ వరుసగా ఈ శిఖరాగ్రాన్ని నిర్వహిస్తుంది. మరుసటి సంవత్సరం ఈ సదస్సుకు ఏ సభ్య దేశం ఆతిథేయిగా ఉండాలో ముందటి సంవత్సరం శిఖరాగ్ర సమావేశంలోనే నిర్ణయిస్తారు. 2024లో జీ–20 శిఖరాగ్ర సదస్సును బ్రెజిల్ నిర్వహించింది. నవంబర్ 2025లో దక్షిణాఫ్రికాలో జీ–20 శిఖరాగ్ర సదస్సు జరగనున్నది. 2026 జీ–20 కూటమి దేశాల శిఖరాగ్ర సదస్సు అమెరికాలో జరగనున్నది. ఇంతకూ జీ–20 శిఖరాగ్ర సదస్సును నిర్వహించడమనేది పెద్ద విషయం కాదు. అయితే మన దేశం మాదిరిగా ఏ సభ్య దేశమూ ఆ సదస్సు నిర్వహణ గురించి ఘనంగా ప్రచారం చేసుకోలేదు.

జీ–20 కంటే జీ–8, జీ–7 కూటములు చాలా ముఖ్యమైనవి. ఇప్పుడు కొత్తగా జీ–2 ప్రభవించింది. జిన్‌పింగ్‌తో సమావేశానికి ముందు, తరువాత కూడా చైనా అధినేతకు తనతో సమస్థాయి హోదా సమకూరుస్తూ సమాదరంతో మాట్లాడారు. ట్రంప్ మాటలు డాంబికంగా ఉన్నాయి. జిన్‌పింగ్ మనసులో ఏమున్నదో ఎవరికీ తెలియదు.

> ట్రంప్, జిన్‌పింగ్‌ల మధ్య వెల్లివిరిసిన కొత్త స్నేహ సరసత భారత్‌కు సమస్యాత్మకంగా పరిణమిస్తోంది. మనకు ఇప్పుడు దక్షిణాసియాలో ఒక్క మిత్ర దేశమూ లేదు. పశ్చిమాసియా దేశాలు సమష్టిగా కొత్త సర్దుబాట్లు చేసుకుంటూ ఇజ్రాయెల్‌తో స్నేహ వారధులు నిర్మించుకుంటున్నాయి. ప్రస్తుతం అనుసరిస్తున్న విదేశాంగ విధానంపై మోదీ సర్కార్ తప్పక పునరాలోచన చేయాలి.



అంతుచిక్కని స్పందనలు ఆయనవి. బహుళధ్రువ ప్రపంచం గురించి భారత్ ఏమి చెప్పినప్పటికీ ప్రపంచంలో రెండే రెండు అగ్రరాజ్యాలు ఉన్నాయి. రష్యా వాటికి కొంచెం వెనుకగా ఉన్నది. నిన్నటిదాకా 'అమెరికా భద్రతకు పొంచి ఉన్న ముప్పు' ఒక్కసారిగా అంతర్ధానమయిపోయింది. అమెరికా, చైనాల మధ్య కొత్త 'స్నేహపూరిత' సంబంధాలతో క్వాడ్ ప్రాధాన్యం కోల్పోనున్నది.

వాస్తవాలను మరింత నిశితంగా చూద్దాం: అరుదైన భూ ఖనిజాలు, సోయాబీన్ ఎగుమతులు, దిగుమతుల విషయంలో అమెరికా, చైనాల మధ్య ఒక మినీ వాణిజ్య ఒప్పందం కుదిరింది. టిక్–టాక్ వివాదాన్ని కూడా ఆ రెండు దేశాలు పరిష్కరించుకునే అవకాశమున్నది; అమెరికా–భారత్ వాణిజ్య ఒప్పందం ఇంకా సంప్రతింపుల దశలోనే ఉన్నది. నెలల తరబడి జరుగుతున్న చర్చలు ఇప్పటికీ ఒక కొలిక్కి రాలేదు; అమెరికా, చైనాల మధ్య సుంకాల సమరం జరిగింది (పరస్పరం ప్రతీకార సుంకాలు కూడా విధించుకున్నాయి). అయితే బుసాన్‌లో ట్రంప్, జిన్‌పింగ్‌ల సమావేశమనంతరం సాంకేతికతల బదిలీ, ఎగుమతులపై నియంత్రణలు, ఓడరేవుల చార్జీలతో వివిధ అంశాలపై రెండు దేశాలూ ఒక అంగీకారానికి వచ్చినట్టు కనిపిస్తోంది. పరస్పరం సుంకాలు తగ్గించేందుకు చైనా, అమెరికాలు అంగీకరించాయి. భారత్‌పై విధించిన శిక్షాత్మక సుంకాలను సడలించేందుకు అమెరికా ఇంకా సుముఖంగా లేదు; చైనా కంపెనీలపై అమెరికా ఆంక్షలు యథావిధిగా ఉంటాయి. భారతీయ కంపెనీలు రష్యా చమురును కొనుగోలుచేస్తే వాటిపై కూడా ఆంక్షలు కొనసాగుతాయి; అమెరికా ప్రస్తుతం చైనా సరుకులకు ఇస్తున్న ప్రథమ గణ్య ప్రాధాన్యతను తగ్గిస్తుంది; అలాగే భారత్‌కు 2019లో రద్దు చేసిన జనరలైజ్డ్ సిస్టమ్ ఆఫ్ ప్రిఫరెన్సెస్ (అభివృద్ధి చెందిన దేశాలు తమ ఆర్థిక వ్యవస్థలను పెంచుకోవడానికి అభివృద్ధి చెందుతున్న దేశాల నుంచి చేసుకునే దిగుమతులపై సుంకాలు తగ్గించడం లేదా తొలగించే విధానం)ను పునరుద్ధరించే అవకాశాలు లేవు అనేది స్పష్టం.

ట్రంప్‌తో మోదీ చివరిసారి ఫిబ్రవరి 14, 2025న సమావేశమయ్యారు. దరిమిలా మూడు సందర్భాలలో ట్రంప్–మోదీ సమావేశం జరగవలసి ఉన్నది. తొలుత కెనడాలో జీ–7 శిఖరాగ్ర సదస్సు తరువాత. స్వదేశానికి తిరిగి వెళ్లుతూ 'వాషింగ్టన్‌కు రావాలని మోదీని ట్రంప్ ఆహ్వానించారు. ఈ ఆహ్వానాన్ని మోదీ తిరస్కరించారు. ఇది సరైన నిర్ణయమే. పిదప ఈజిప్ట్‌లో గాజా శాంతి ఒప్పందంపై సంతకాలు చేసే కార్యక్రమం. ఈ సమావేశానికి మోదీ వెళ్లలేదు. ఆ తరువాత గత నెల కౌలాలంపూర్‌లో ఆసియాన్ శిఖరాగ్ర సదస్సు. ఈ సదస్సునుద్దేశించి మోదీ వర్చ్యువల్‌గా ప్రసంగించారు. ఆసియాన్ సదస్సుకు మోదీ స్వయంగా వెళ్లకపోవడం సరికాదని నేను భావిస్తున్నాను. ట్రంప్‌తో ద్వైపాక్షికంగా సమావేశమయ్యేందుకు, అసలు ఆయనతో సంభాషించేందుకు కూడా మోదీ ఆసక్తిచూపడంలేదని, ఉద్దేశపూర్వకంగానే తప్పించుకుంటున్నారని దౌత్యవర్గాలు భావిస్తున్నాయి.

ఆపరేషన్ సిందూర్ వ్యవహారంపై ట్రంప్ తన పాత మాటను మరొకసారి పునరుద్ఘాటించాడు. తీవ్రమవుతున్న సైనిక సంఘర్షణలకు స్వస్తి చెప్పేలా భారత్, పాకిస్తాన్‌లను బలవంతం చేయడానికై 'వాణిజ్య ఒప్పందం కుదుర్చుకోను' అని ఆ రెండు దేశాలను బెదిరించానని, యుద్ధం నాలుగో రోజున నిలిచి పోయిందని ట్రంప్ వెల్లడించాడు. ఆయన ఇలా ప్రకటించడం ఇది ఎన్నోసారో మీకు గుర్తుందా? ట్రంప్ మాటను బహిరంగంగా గానీ, పార్లమెంటులో గానీ నరేంద్ర మోదీ నిరాకరించనే లేదు. చైనా సైనిక దళాలు భారత భూభాగాలలోకి చొచ్చుకువచ్చి తిష్ఠ వేశాయని, ఇది దురాక్రమణ మినహా మరేమీ కాదని చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌కు ఆయన మొహాన మోదీ చెప్పనే లేదు కదా.

ట్రంప్, జిన్‌పింగ్‌ల మధ్య వెల్లివిరిసిన కొత్త స్నేహ సరసత జపాన్, ఆస్ట్రేలియా, తైవాన్‌తో పాటు భారత్‌కూ సమస్యలు సృష్టిస్తోంది. భారత్‌కు ఇప్పుడు దక్షిణాసియాలో ఒక్క మిత్ర దేశమూ లేదు. పశ్చిమాసియా దేశాలు సమష్టిగా కొత్త సర్దుబాట్లు చేసుకుంటున్నాయి. అంతేకాదు, భారత్‌ను పట్టించుకోకుండా ఇజ్రాయెల్‌తో కొత్త స్నేహ వారధులు నిర్మించుకుంటున్నాయి. రాజనీతిలో మన పురాతన ఆచార్యుడు ఇటువంటి క్లిష్ట పరిస్థితులను ఎలా ఎదుర్కోవాలని చెప్పాడు? చుట్టుముట్టిన ఇబ్బందులను నమ్రతతో ఆకళింపు చేసుకుని విజ్ఞతాయుతమైన నిర్ణయాలు తీసుకోవాలని కాదూ? నరేంద్ర మోదీగారూ, ప్రస్తుతం మీరు అనుసరిస్తున్న విదేశాంగ విధానంపై తప్పక పునరాలోచన చేయాలి. మౌలిక మార్పులతో కొత్త వైదేశిక నీతికి రూపకల్పన చేయాలి.

(వ్యాసకర్త కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు)

'సాంస్కృతిక విధానం' మాటేమైంది?

తెలంగాణ ఏర్పడిన పుష్కర కాలానికి పర్యాటక శాఖ విధానాన్ని ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. కానీ కళాకారులకు సంబంధించిన 'సమగ్ర సాంస్కృతిక విధానం'ను నేటికీ పాలకులు రూపొందించలేదు. దీనికోసం గతంలో 20 మందితో సాంస్కృతిక శాఖ సలహామండలిని ప్రభుత్వం ప్రకటించింది. సంబంధిత అధికారులు మూడుసార్లు సమావేశమయ్యారు. కళాకారులకు కనీసం గుర్తింపు కార్డులు కూడా నేటికీ ప్రభుత్వం ఇవ్వలేకపోయింది. ఈ పాలసీని కోరుతూ రెండుసార్లు రవీంద్రభారతిని కళాకారులు ముట్టడించారు. ఆరు గంటల సేపు దీక్షలు చేపట్టారు. అయినా ఫలితం లేదు. ఈ విధాన రూపకల్పనలో గత ప్రభుత్వం లాగే ప్రస్తుత ప్రభుత్వమూ ఉదాసీనత ప్రదర్శిస్తోంది. 'పాలకులంతా ఒక తాను ముక్కలే' అన్నట్టుగా ఉంది పరిస్థితి.

నిజానికి కల్చరల్ పాలసీ ఆలోచన నేటిది కాదు. మన దేశ మొదటి ప్రధాని నెహ్రూ దీనికి బీజం వేశారు. 'ఏ దేశానికైనా, ఏ భాషకైనా, ఏ కళలకైనా, ఒక స్పష్టమైన సాంస్కృతిక ప్రణాళిక ఉండాలి' అని చెబుతూ 'మెహతా కమిటీ' వేశారు. జానపద సాహిత్యం, సంస్కృతి, నాటకం, సినిమా తదితర రంగాలకు సంబంధించిన ప్రణాళికలు రూపొందించాలని ఆ కమిటీకి నెహ్రూ నిర్దేశించారు.



తెలంగాణ సంస్కృతి విలక్షణమైనది. ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో కవులు, కళాకారులు పోషించిన పాత్ర అనితరసాధ్యమైనది. కానీ రాష్ట్రంలో 'సాంస్కృతిక విధానం' లేకపోవడంతో కళలకు, కళాకారులకు ప్రాధాన్యం లేకుండా పోతోంది. రాష్ట్రంలో కళాకారుల సంక్షేమం కోసం ఒక్క పథకం కూడా లేదంటే అతిశయోక్తి కాదు. దీంతో కళాకారుల్లో భాగమైన జానపదులు ఎంతగానో నష్టపోతున్నారు.

ఇప్పటికే తెలంగాణలో 36 జానపద కళారూపాలు వాటి ఉనికిని కోల్పోయాయి. ఇంకా 65కు పైగా కళారూపాలు కొన ఊపిరితో ఉన్నాయి. పాలకుల నిర్లక్ష్యమే దీనికి ప్రధాన కారణం. తెలంగాణలో మనుషులకే కాదు... ప్రతి పల్లెకు, చెరువుకు, నదికి, కొండకు, కోటకు, కోనకు ఒక చరిత్ర ఉంది. ఆ చరిత్రను తెలుపమని జానపదులను కదిపితే ఎన్నో ఆసక్తికర విషయాలను చెబుతారు. ఇది వారికి వారసత్వంగా వస్తున్న కళ. సర్దార్ పాపన్న, పండుగ సాయన్న, మీరాసాయబ్, సమ్మక్క–సారలమ్మ తదితరుల వీరగాథలన్నీ వీరి కంఠంలో ప్రతిధ్వనిస్తాయి. జానపద కళాకారులు తరాల సంస్కృతీ ప్రదాతలు. శ్రమైక జీవన సౌందర్య దృష్టికి ప్రతిరూపాలు.

నేడు రాష్ట్రంలో జానపదుల పరిస్థితి దయనీయంగా ఉంది. పాలకులు పట్టించుకోకపోవడంతో వారి పరిస్థితి మరింతగా దిగజారుతోంది. వారిని కదిలిస్తే కన్నీటి గాథలే. 'మా కులాలకు, మా కళలకు ఆదరణ లేదయ్యా. తరతరాలుగా కుల పురాణాలను ఆట పాటలతోనూ, మా వాద్య పరికరాలతోనూ గానం చేస్తూ అలరించాం. ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు కోసం కళాకారుల ప్రదర్శనల్లో, నినాదాల్లో మా గొంతులనూ జతకలిపాం. కానీ నేడు పాలకులు పట్టించుకోకపోవడంతో చావలేక బతుకీడుస్తున్నాం' అంటూ గోడు వెళ్లబోసుకుంటున్నారు. వీళ్లంతా పాలకులు విస్మరించిన జనం. ఓటు బ్యాంకు లేని సంచార, మైనార్టీ కులం. ఇలా సామాజిక వివక్షకు, అణచివేతకు, పాలకుల నిర్లక్ష్యానికి గురైన అట్టడుగు జాతుల వారిని ఉద్దేశిస్తూ.. ఇహెచ్ కార్ అనే చరిత్రకారుడు 'what is history? History from below' అంటాడు. అట్టడుగు వర్గాల నుంచే చరిత్ర వచ్చిందంటూ వివరించాడు. కేరళ, కర్ణాటక వంటి రాష్ట్రాలు 'జానపద అకాడమీ'లను ఏర్పాటు చేసుకుని కళల్ని, జానపద కళాకారుల్ని సంరక్షించుకుంటున్నాయి. తెలంగాణలో ఈ కృషి ఎందుకు జరగడం లేదో పాలకులు, సాంస్కృతిక సలహామండలి ఆలోచించాలి. జానపద కళల, ఇతర కళాకారుల అభివృద్ధికి ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలి. 'సమగ్ర సాంస్కృతిక విధానం' రూపకల్పనకు నడుం బిగించాలి.

• భూపతి వెంకటేశ్వర్లు

చెంచు యక్షగానం ప్రదర్శన

బొమ్మలాటల్లో అనేక రకాలు ఉన్నాయి. ప్రసిద్ధి పొందిన తోలుబొమ్మలాట ఉంది. 56 చేర్యాల బొమ్మలు చూపిస్తూ మందహెచ్చులు అనే యాదవుల ఉపకులం వారు చెప్పే కాటమరాజు కథ ప్రదర్శన ఉంది. వీటిలాగే 'చెక్కబొమ్మలాట' కూడా అత్యంత ప్రాచీన కళారూపం. సుమారు మూడున్నర అడుగుల పొడవున్న చెక్కబొమ్మలను ఆడిస్తూ, పాడుతూ చక్కని ప్రదర్శన నిర్వహించే కళారూపాలు ఒక్కొక్కటే అంతరించిపోతున్నాయి. తరాలుగా కళాకారులు తమ కళలను పరిరక్షించుకుంటూ రావడం ప్రశంసనీయం. నలభయ్యేళ్ల కిందట జానపదసంస్థ వారు ఈ కళారూపాల్ని వెలుగులోకి తీసుకొచ్చారు. విలక్షణ కళా ప్రదర్శనలు, అట్టడుగు వర్గాల కథా గానాలను, రూపాలను పరిరక్షించే ప్రత్యేక పథకాలు మాత్రం పాలకులు రూపొందించడంలేదు. చేయూతనివ్వడం సంగతి పక్కన పెడితే, కనీసం ఆయా కళారూపాలను గుర్తించే స్థితిలోనూ ప్రభుత్వం లేకపోవడం బాధాకరం. నిజానికి ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటుతోనైనా ఈ కళారూపాలకు మరింత ప్రోత్సాహం, గుర్తింపు రావలసి ఉండగా, అందుకు భిన్నంగా నేడు అవి క్షీణించి పోయే పరిస్థితి నెలకొన్నది. ఆదరణ తగ్గడంతో జానపద, ఆదివాసీ కళాకారులు తమ కళారూపాలను ప్రదర్శించుకునే అవకాశాలు తగ్గిపోయాయి. ఈ 50 రకాల కళారూపాల ప్రదర్శనకు సరైన వేదిక లేకపోవడం కూడా కళాకారులకు ప్రధాన సమస్యగా మారింది.

అందుకే కళలకు ప్రోత్సాహకరంగా 'ఆద్య కళా మ్యూజియం, దక్కన్ టీవీ' సంస్థలు కలిసి సదస్సుకు ఏర్పాటు చేస్తున్నాయి. జనగామ జిల్లా కేంద్రంలోని 'సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాల'లో నేటి (శనివారం) మధ్యాహ్నం 12 గంటల నుంచి ఈ కార్యక్రమం జరగనుంది. అమ్మాపురం గ్రామానికి చెందిన కళాకారులతో చెక్క బొమ్మల ప్రదర్శన, చెంచు కథ– యక్షగాన ప్రదర్శన ఉంటుంది.

○ ఆచార్య గూడూరు మనోజ
మోతే కనకయ్య

'సలాం జనగాం' పుస్తకావిష్కరణ

ఆఫ్రికన్ రచయిత చినువా అచెబే అన్నట్టు.. 'సింహాలు తమ చరిత్రను తాము చెప్పుకోనంత కాలం, వేటగాళ్లు చెప్పిందే చరిత్ర అవుతుంది.' అందుకే ప్రజల చరిత్రను ప్రజలే చెప్పాలి. ఆ పనిని చరిత్రాత్మకంగా చేశారు రచయిత సాంబరాజు యాదగిరి. 'సలాం జనగాం' పుస్తకంలో జనగాం గురించి ఆయన రాసిన అనేక కొత్త విషయాలు పాఠకులను అబ్బురపరుస్తాయి. ఆ పేరు ఎలా వచ్చిందో మొదలుపెట్టి, జిల్లాగా రూపాంతరం చెందడం వరకూ జరిగిన ఘటనలను ఆధారాలతో సహా నిరూపించారు రచయిత. పదుల సంఖ్యలో పుస్తకాలను అధ్యయనం చేసి, తొంభైమందిని ఇంటర్వ్యూలు చేసి సేకరించిన సమాచారంతో ఈ పుస్తకాన్ని రచించారు యాదగిరి. మొఘలులు, అసఫ్‌జాహీలు, దొరలు, జాగీర్దార్లు, స్వాతంత్ర్యానంతర పాలకులు జనగామను ఎట్లా ఏలారో వివరించారాయన. జనగాంలో తొలి సినిమా థియేటర్, తొలి దినపత్రిక వంటి అనేక విషయాలను ప్రస్తావించారు. 'సలాం జనగాం' పుస్తకావిష్కరణ ఈ నెల 8న జనగాం జిల్లా కేంద్రంలో సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి చేతులమీదుగా జరుగనుంది. సభలో కె.ఆనందాచారి, రిజ్వాన్ బాషా షేక్ ఐఏఎస్, డా.ప్రసాదరావు, జయధీర్ తిరుమలరావు, లింగంపల్లి రాంచంద్రం, జి.రాములు, ఎం.డి. అబ్బాస్ తదితరులు పాల్గొంటారు.

– డా. పసునూరి రవీందర్

గమనిక: కేంద్రం తీపికబురులో పెన్షనర్లకు దాగున్న చేదు' శీర్షికతో నవంబరు 5వ తేదీ సంచికలో ప్రచురితమైన వ్యాసం రచయిత అర్విణి రాజేంద్రబాబు (తెలంగాణ పెన్షనర్ల సంఘం అధ్యక్షులు) అని గమనించగలరు.

గెలిచే లీడరు... ఓడే ఓటరు

భారత జాతీయ రాజకీయాల్లోనే పెను భూకంపం సృష్టించగలవని భావిస్తున్న బిహార్ ఎన్నికలు... తొలిదశ పోలింగ్ ద్వారా ఆ మేరకు ఇప్పటికే స్పష్టమైన సంకేతాలు ఇచ్చాయి. 243 సీట్ల అసెంబ్లీలో 121 సీట్లకు జరిగిన పోలింగ్ సందర్భంగా ఓటర్లు పోటెత్తిన తీరు అధికార, విపక్ష కూటములు రెండింటి గుండెల్లోనూ గుబులు రేపుతోంది. పైకి ఎవరెంత గాంభీర్యం ప్రదర్శిస్తున్నా... 11న రెండో దశ పోలింగ్ పూర్తయి, 14న ఫలితాలు వెలువడే దాకా నరాలు తెగే ఉత్కంఠే!

ఒక రాష్ట్రంలో జరిగే ఏ ఎన్నిక ప్రభావమైనా సాధారణంగా ఆ రాష్ట్రానికే పరిమితం. కానీ, బిహార్ అసెంబ్లీ ఎన్నికల సంగతి అలా కాదు. లోక్‌సభలో పూర్తి మెజారిటీ లేక– తెలుగుదేశంతో పాటు జేడీ(యు) పైన అధికంగా ఆధారపడుతున్న బీజేపీ ఒకవైపు; ఎడాపెడా ఉచిత హామీలు, కుల–మత సమీకరణాలు, ఓటు చోరీ ఆరోపణలే తమను గట్టెక్కిస్తాయన్న ఆశాభావంతో కాంగ్రెస్–ఆర్జేడీ కూటమి మరో వైపు. నితీశ్‌కుమార్, తేజస్వీ యాదవ్ మధ్య ప్రత్యక్ష పోరాటమే అనిపిస్తున్నప్పటికీ, వాస్తవంలో మోదీ, రాహుల్ మధ్య ప్రచ్ఛన్న యుద్ధమిది.

బిహార్ ప్రస్తావన రాగానే ముందుగా గుర్తుకు వచ్చే పేర్లు.. లాలూ ప్రసాద్ యాదవ్, నితీశ్‌కుమార్. మంచో–చెడో ఆ రాష్ట్ర రాజకీయాలపై వారు వేసిన ముద్ర అంత బలమైనది. ప్రస్తుతం 77 ఏళ్ల వయసులో వయోభారం, అనారోగ్యం, స్కాముల తాలూకు కోర్టు కేసుల చికాకుల వల్ల బిహార్ ఎన్నికల రంగస్థలంపై లాలూ క్రియాశీలక పాత్ర పోషించడం లేదు. కానీ, 1990లలో రాష్ట్ర రాజకీయాల సమీకరణాలనే సాంతం మార్చేసి, కొత్త మలుపు తిప్పిన ఘనత కచ్చితంగా ఆయనదే. మందిర్, మండల్ ఉద్యమాలు రెండింటినీ తనకు అనుకూలంగా మలుచుకొని– బలమైన ఎం.వై (ముస్లిం–యాదవ్) ఫార్ములా ద్వారా దిగ్విజయయాత్ర సాగించిన రాజకీయ చతురుడు లాలూ. 1990 ఆగస్టులో, అప్పటి వీపీ సింగ్ ప్రభుత్వం మండల్ కమిషన్ సిఫారసులను అమలుపరచడంతో అగ్రకులాలకు చెందిన వారి నిరసనోద్యమం కారణంగా దేశం అట్టుడికిపోయింది. ఆనాడు బిహార్ ముఖ్యమంత్రిగా ఉన్న లాలూ, ఆ రాష్ట్రంలోని 52 శాతానికి పైగా వెనుకబడిన తరగతుల వారి పక్షాన నిలబడి, తిరుగులేని నాయకుడిగా ఆవిర్భవించారు. ఆ తరువాత ఎన్నో ఏళ్ల పాటు వారిపై తన పట్టును, ప్రభావాన్ని కొనసాగించగలిగారు. బిహార్ ఎన్నికల ఫలితాలను తేల్చే కీలక అంశంగా కుల రాజకీయాలు మారింది ఆనాటి నుంచే. ఆ రాష్ట్ర అసెంబ్లీలోని 113 సీట్లలో 2010, 2015, 2020 ఎన్నికల్లోనూ అదే సామాజిక వర్గానికి చెందిన అభ్యర్థులు, అంతే సంఖ్యలో పదే పదే ఎన్నిక కావడం... కుల సమీకరణ రాజకీయ ప్రాధాన్యానికి నిదర్శనం.

అయోధ్య రామాలయం కోసం బీజేపీ అగ్రనేత ఎల్‌కే ఆడ్వాణీ అప్పట్లో చేపట్టిన రథయాత్ర నుంచి సైతం అత్యధిక ప్రయోజనం నొల్లుకున్నది లాలూనే. 1989 సార్వత్రిక ఎన్నికల్లో 85 లోక్‌సభ సీట్లు సాధించిన బీజేపీ–ఆనాడు వీపీ సింగ్ సారథ్యంలోని యునైటెడ్ ఫ్రంట్ సర్కారులో కీలక భాగస్వామి. ఆడ్వాణీ రథయాత్ర పెను సవాలుగా మారినప్పటికీ, సర్కారు మనుగడ దృష్ట్యా దాన్ని ఆపే సాహసం సింగ్ చేయలేకపోయారు. ఆ పని లాలూకు అప్పగించారు. 1990 అక్టోబరు 23న సమస్తిపూర్‌లో ఆడ్వాణీని అరెస్టు చేసి, బిహార్–పశ్చిమబెంగాల్ సరిహద్దులోని మసన్‌జోర్ ప్రభుత్వ అతిథి గృహానికి తరలించింది– బిహార్‌లోని అప్పటి లాలూ ప్రభుత్వం. ఆ చర్యతో ఒక్కసారిగా ముస్లింలు, వామపక్ష లిబరల్‌వాదులకు ఆత్మబంధువుగా మారిపోయారు లాలూ. తన కులవర్గమైన యాదవులతో పాటు ముస్లింలనూ గట్టి ఓటు బ్యాంకుగా మలచుకోగలిగారు. ఈనాటికీ ఆయన పార్టీ (ఆర్జేడీ)కి ఎంవై సమీకరణే అండా–దండా! ప్రస్తుత ఎన్నికల్లోనూ ఈ వర్గమే తమను విజయతీరాలకు చేర్చగలదని లాలూ–తేజస్వి నమ్ముతున్నారు. మరోవైపు, ముఖ్యంగా లాలు హయాంలో అవినీతి, అక్రమాలు, గూండాగిరీ, అరాచకత్వం, మావోయిస్టు హింసాకాండ, సామాజిక అశాంతి కారణంగా బిహార్ 'జంగిల్ రాజ్'గా మారిందన్న ప్రచారం జనంలోకి చొచ్చుకెళ్లింది. ఆయన కుమారుడు మహాగఠ్‌బంధన్ ముఖ్యమంత్రి అభ్యర్థి తేజస్వీ యాదవ్‌ను సైతం ఆ నీడ నేటికీ వెంటాడుతోంది.



బిహార్ రాజకీయాల చదరంగంలో గ్రాండ్ మాస్టర్ అనదగ్గ మరో నేత, ప్రస్తుత ముఖ్యమంత్రి నితీశ్‌కుమార్. పరిస్థితులు, అవసరాలు, అవకాశాల్ని బట్టి ఎన్నికలకు ముందో, తరువాతో ఉన్నట్టుండి కూటమి ఫిరాయించడం, తను మాత్రమే చక్రం తిప్పగలగడం ఆయనకు అలవాటైన విద్య. 'పల్టూరామ్' అంటూ ప్రత్యర్థులు ఆడిపోసుకుంటారు కానీ, ఎవ్వరి ఊహకూ అందని రీతిలో ఎప్పటికప్పుడు కొత్త కొత్త రాజకీయ ఎత్తుగడలు వేయడంలో ఆయన దిట్ట. 74 ఏళ్ల నితీశ్, ఇప్పుడు ఏకంగా పదోసారి బిహార్ సీఎం పదవికి పోటీపడుతున్నారంటేనే ఆయన రాజకీయ జిత్తుల మారితనాన్ని అర్థం చేసుకోవచ్చు. అభివృద్ధి, సుస్థిరత, శాంతిభద్రతలతో కూడుకొన్న సుపరిపాలనే తన లక్ష్యం, ధ్యేయంగా ప్రజల్లో బలమైన భావన ఏర్పరచగలిగిన నితీశ్– పార్టీల జయాపజయాలు, కూటముల కొట్లాటలు, కోలాటాలతో సంబంధం లేకుండా ఏకంగా 20 ఏళ్లుగా అధికారంలో కొనసాగగలగడం చిన్న విషయం కాదు. పరిపాలన సంస్కరణలు, ప్రజా సంక్షేమం వంటివి తన పక్షానికి మరో విజయం కట్టబెడతాయని ఆయన బలంగా విశ్వసిస్తున్నారు. నితీశ్ శారీరక, మానసిక ఆరోగ్య పరిస్థితి సవ్యంగా లేదంటూ రాజకీయ వర్గాల్లో కొద్దికాలంగా ప్రచారం జరుగుతోంది. దీర్ఘకాలిక పాలన కారణంగా ప్రభుత్వ వ్యతిరేకత మేట వేసిందన్న అంచనాలూ ఉన్నాయి. అయినప్పటికీ ఎన్నికల్లో నెగ్గుకురావాలంటే– 'మోదీ అప్పీల్'తో పాటు నితీశ్ 'కరిష్మా'పైనా చాలావరకు ఆధారపడక తప్పని పరిస్థితి ఎన్డీయేది. కుర్మీ–కొయిరీ కులవర్గాలు (7 శాతం), బాగా వెనుకబడిన హిందూ వర్గాలు (ఈబీసీ) (26 శాతం), మహా దళితులు, మహిళలతో కూడుకొన్న ఓటు బ్యాంకుపైనే నితీశ్ కూటమి ఆశలన్నీ!

ఆర్థికంగా దివాళా తీసినందున బిహార్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్ (బీఐఎంఏఆర్‌యూ)లను కలిపి 1980ల నుంచి 'బీమారు' రాష్ట్రాలుగా పిలుస్తున్నారు. 'బీమారు' అంటే– జబ్బుపడిన అని అర్థం. ఈ రాష్ట్రాల్లో యూపీతో పాటు మధ్యప్రదేశ్, రాజస్థాన్ సైతం చాలా వరకు కోలుకోగలిగినప్పటికీ, బిహార్ నేటికీ దారిద్ర్యం ఊబిలో నుంచి బయటపడలేకపోతోంది. పనీ లేక– 'మనీ' రాక ఉపాధి అవకాశాలు వెతుక్కుంటూ పెద్దయెత్తున ఇతర రాష్ట్రాలకు వలసపోక తప్పని పరిస్థితి బిహారీలది. ఏటా 25 లక్షల బిహారీలు పని కోసం వేరే రాష్ట్రాలకు వలసపోతుంటారు. 35 శాతం దాకా యువత నిరుద్యోగులే. కార్మికుల్లో 80 శాతానికి పైగా అసంఘటిత రంగంలోనే ఉన్నారు. 'జంగిల్ రాజ్' అన్న ముద్ర చాలా వరకు చెరిగిపోయినప్పటికీ, అవినీతిమయ రాష్ట్రాల్లో నేటికీ తొలి అయిదారు స్థానాల్లో కొనసాగుతోంది. అందుబాటులో ఆస్పత్రులు, వైద్యులు– అన్నదీ పదాలిక్కడ. 42 శాతం బాలలు పోషకాహార లోపంతో బాధపడుతున్నారు. ఎన్నో ఎన్నికలు... మరెన్నో హామీలు. అన్నీ అరచేతిలో స్వర్గాలే. దశాబ్దాలు దొర్లిపోతున్నా... బిహార్ పరిస్థితి ఎక్కడ వేసిన గొంగడి అక్కడే! అప్పటి ఎన్నికలైనా, ఇప్పటి ఎన్నికలైనా– మార్పు రాదేమో! అంతిమంగా... గెలిచేది లీడర్లు.. ఓడేది ఓటర్లే!

▪ పి. దత్తారాం ఖత్రీ
సీనియర్ జర్నలిస్టు

పత్తి రైతుపై సీసీఐ కత్తి!

నిబంధనల పేరుతో తీవ్రమైన ఆంక్షలు



- చుక్కలు చూపిస్తున్న కపాస్ యాప్
- తేమ శాతం పేరుతో మద్దతు ధరలో కోత
- 7క్వింటాళ్ల కొనుగోళ్ల నిబంధనతో పరేషాన్
- అంతర్ జిల్లా పత్తి అమ్మకాలపై ఆంక్షలు
- జిన్నింగ్ మిల్లుల కేటాయింపుల్లో గందరగోళం
- ఒకే ధర ఉన్నా.. 3 రకాలుగా మిల్లుల వర్గీకరణ
- సీసీఐ నిబంధనలతో ఆవేదన చెందుతున్న రైతు



■ ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్

పత్తి రైతుకు సీసీఐ నిబంధనలు కంటికి కునుకులేకుండా చేస్తున్నాయి. ప్రకృతి విపత్తులను ఎదుర్కొని కాపాడుకున్న పంటను మార్కెట్‌లో స్వేచ్ఛగా అమ్ముకునే అవకాశం లేకుండా పోయింది. తేమ నిబంధనతో మద్దతు ధరను కోల్పోతున్న రైతులు.. కపాస్ యాప్‌తో మరిన్ని కష్టాలను ఎదుర్కొంటున్నారు. పత్తి సాగు వివరాల నమోదుతో పాటు సీసీఐ కొత్తగా ఏడు క్వింటాల్ నిబంధనను తెరపైకి తెచ్చింది. రైతులు పండించిన పత్తిని ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోని సీసీఐ కేంద్రాల్లోనే విక్రయించుకోవాలని షరతు పెట్టింది. దీంతో సరిహద్దు జిల్లాల్లోని రైతులకు సమస్యగా మారింది. అన్ని జిన్నింగ్ మిల్లులకు బేల్‌కు ఒకే ధర చెల్లిస్తూ.. ఎల్-1, ఎల్-2, ఎల్-3 విధానాన్ని ప్రవేశ పెట్టడంపై జిన్నింగ్ మిల్లర్లు సీసీఐపై మండిపడుతున్నారు. పత్తి కొనుగోళ్లు నిలిపివేస్తామని హెచ్చరికలకు దిగుతున్నారు. సీసీఐ నింబంధనల తీరు రైతుల పంట విక్రయాలపై తీవ్ర ప్రభావం పడుతోంది. అరుగాలం శ్రమించిన పంటను మార్కెట్‌లో స్వేచ్ఛగా అమ్ముకునే హక్కు కూడా లేదా? అని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

విపత్తులో సీసీఐ నిబంధనలు

ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఈ సీజన్‌లో 5,14,904 ఎకరాల్లో పత్తి పంట సాగు చేయగా, 4,11,923 మెట్రిక్ టన్నుల పత్తి ఉత్పత్తి అవుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. అయితే అష్టకష్టాలు పడి పత్తిని కాపాడుకున్న రైతులపై అక్టోబరు చివరలో వచ్చిన తుఫాన్ తీవ్ర నష్టాన్ని మిగిల్చింది. పత్తి తీసేందుకు రైతులు సన్నద్ధమవుతున్న క్రమంలో వచ్చిన తుఫాన్ రైతులకు కన్నీళ్లను మిగిల్చింది. ఈ ప్రకృతి విపత్తును సైతం కొందరు రైతులు నిలదొక్కుకుని మిగిలిన పత్తిని అమ్ముకుందామంటే మార్కెట్‌లో సవాలక్ష సమస్యలు ఎదురవుతున్నాయి. ప్రధానంగా సీసీఐ పూటకో నిబంధనను తీసుకువచ్చి రైతులను ఇబ్బందులకు గురి చేస్తోంది. 8 నుంచి 12శాతం కంటే తేమ మించితే మద్దతు ధర ఇవ్వటం లేదు. ప్రస్తుతం తుఫాన్‌తో (మిగతా 7లో..)

ఎకరాకు ఏడు క్వింటాళ్లేనట..

కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన కపాస్ యాప్ కూడా రైతులకు చుక్కలు చూపిస్తోంది. వ్యవసాయ అధికారులు ముందస్తుగా రైతులకు ఈ యాప్‌పై అవగాహన కల్పించలేదు. దీంతో నేరుగా స్మార్ట్ ఫోన్‌లలో డౌన్‌లోడ్ చేసుకుని, పంట వివరాలను నమోదు చేయడం ఇబ్బందికరంగా మారింది. ఈ సమస్య నుంచి బయటపడే లోపే మొన్నటివరకు ఎకరాకు 12 క్వింటాళ్ల కొనుగోలు చేసే నిబంధనకు సీసీఐ అంక్షలు విధించింది. ప్రభుత్వం నుంచి వచ్చిన నివేదిక ఆధారంగా దిగుబడి తగ్గిందనే సాకుతో ఎకరాకు ఏడు క్వింటాళ్ల పత్తిని మాత్రమే రైతులు విక్రయించుకునే విధంగా కపాస్ యాప్‌లో నిబంధనలను ఏర్పాటు చేశారు. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ప్రధానంగా కౌలు రైతులు, పట్టాబుక్‌లు లేని రైతులు సీసీఐకి పత్తిని అమ్ముకోవటంలో సమస్యలు ఎదురవుతున్నాయి.

అంతర్ జిల్లా పత్తి విక్రయాలపై ఆంక్షలు

రైతులపై సీసీఐ మరో నిబంధన బాంబు పేల్చింది. గతంలో రైతులు తమ పంటలను విక్రయించుకునేవారు. అయితే సీసీఐ కొత్త నిబంధన ప్రకారం రైతులు తమ ఉమ్మడి జిల్లా పరిధిలోనే పత్తి పంటను విక్రయించుకోవాల్సి వస్తోంది. ఆ విధంగా కపాస్ యాప్‌లో నిబంధనలు ఏర్పాటు చేశారు. ఉమ్మడి వరంగల్ జిల్లా రైతులు పక్కనే ఉన్న కరీంనగర్, ఖమ్మం తదితర జిల్లాల్లో పత్తిని అమ్ముకునే అవకాశం లేకుండా పోయింది. దీంతో సరిహద్దులో ఉన్న మండలాల రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉదాహరణకు భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండల రైతులు ఏటా పత్తిని 25కిలో మీటర్ల దూరంలో ఉన్న కరీంనగర్ జిల్లా జమ్మికుంట వ్యవసాయ మార్కెట్‌కు తీసుకెళ్లి విక్రయిస్తారు. సీసీఐ కొత్త నిబంధనతో ఈసారి జమ్మికుంటలో మొగుళ్లపల్లి రైతులు పత్తిని విక్రయించే అవకాశం లేకుండా పోతోంది. వరంగల్ వ్యవసాయ మార్కెట్‌కు ఉమ్మడి వరంగల్ జిల్లాతో పాటు ఉమ్మడి కరీంనగర్, నల్లగొండ, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల నుంచి కూడా పత్తి అమ్మకానికి వస్తుంది. కొత్త నిబంధన రైతులకు శాపంగా మారిందనే విమర్శలున్నాయి. అలాగే సీసీఐ చర్యలతో పత్తి కొనుగోళ్లపై కూడా తీవ్ర ప్రభావం చూపుతోంది. ఖమ్మం జిల్లాలో 7లక్షల బేల్ సామర్థ్యం ఉన్న 8జిన్నింగ్ మిల్లులే ఉన్నాయి. వరంగల్‌లో 10లక్షల బేల్ సామర్థ్యం ఉన్న 56 జిన్నింగ్ మిల్లులు ఉన్నాయి. ఖమ్మంలో జిన్నింగ్ మిల్లులు ఫుల్ అయితే సీసీఐ కొనుగోళ్లపై ప్రభావం పడే అవకాశం ఉంది. దీంతో కొనుగోళ్లు నిలిచిపోతే రైతులు నష్టపోయే ప్రమాదం ఉందని జిన్నింగ్ మిల్లర్లు పేర్కొంటున్నారు. అంతర్ జిల్లాల్లో పత్తి అమ్మకాలపై సీసీఐ ఆంక్షల పెట్టడంపై రైతులు తీవ్ర నిరసన వ్యక్తం చేస్తున్నారు. రెక్కలు ముక్కలు చేసుకుని.. అరుగాలం శ్రమించి సాగు చేసిన పత్తిని తమకు నచ్చిన చోట అమ్ముకునే స్వేచ్ఛ లేకుండా పోతోందని అన్నదాతలు వాపోతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సీసీఐ నిబంధనలపై దృష్టి పెట్టి రైతులపై భారం పడకుండా స్వేచ్ఛగా తమ పంటను అమ్ముకునేలా చూడాలని అన్నదాతలు విజ్ఞప్తి చేస్తున్నారు.



సూరి గ్యాంగ్ వివరాలు వెల్లడిస్తున్న ఈస్ట్‌జోన్ డీసీపీ అంకిత్‌కుమార్

చిక్కిన రౌడీషీటర్ సూరి

- అతడితోపాటు ఏడుగురు గన్‌గ్యాంగ్ సభ్యుల అరెస్టు
- కొత్తగట్టు క్రాస్ వద్ద పోలీసులకు పట్టుబడ్డ నిందితులు
- రెండు పిస్టళ్లు, కత్తి, బుల్లెట్ స్వాధీనం
- శాయంపేట పీఎస్‌లో రెండు కేసులు నమోదు
- ఈస్ట్‌జోన్ డీసీపీ అంకిత్‌కుమార్ వెల్లడి

7

వర్ధన్నపేట ప్రభుత్వాస్పత్రిని తనిఖీ చేసిన కలెక్టర్

- వైద్యుల గైర్హాజరు, సమయ పాలనపై ఆగ్రహం
- విచారణ చేయాలని అధికారులకు ఆదేశం

వర్ధన్నపేట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిని శుక్రవారం జిల్లా కలెక్టర్ సత్య శారద ఆకస్మికంగా తనిఖీ చేశారు. వైద్యులు, సిబ్బంది హాజరు నమోదు పరిశీలించారు. విధులకు గైర్హాజరు, సమయ పాలన పాటించని పలువురు డాక్టర్లపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలోని పలు విభాగాలను పరిశీలించి వైద్యులకు తగు సూచనలు చేశారు. సుమారు గంటకు పైగా ఆస్పత్రిని సందర్శించి రోగులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మెరుగైన సేవలు అందించేందుకు వీలుగా సూపరింటెండెంట్‌కు పలు సూచనలు చేశారు. రోగులకు సంబంధించి అవసరాల నిమిత్తం ఏమైనా ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. విధులకు గైర్హాజరు, సమయ పాలన పాటించని పలువురు డాక్టర్లపై విచారణ చేసి నివేదిక అందించాలని తహసీల్దార్ విజయ్ సాగర్, మునిసిపల్ ఇన్‌చార్జి కమిషనర్ సమ్మయ్యలను ఆదేశించారు. నివేదిక ఆధారంగా చర్యలు ఉంటాయని వైద్యులను హెచ్చరించారు. అనంతరం వర్ధన్నపేట మండల కేంద్రంలో ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతిన్న పంటలను జిల్లా కలెక్టర్ ప్రత్యక్షంగా పరిశీలించారు.



వైద్యులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న వరంగల్ కలెక్టర్ సత్యశారద

వర్షాలకు దెబ్బతిన్న పంటల నష్టాన్ని పూర్తిగా పారదర్శకంగా నమోదు చేయాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ సాంబశివరావు, సూపరింటెండెంట్ డాక్టర్ నరసింహస్వామి, డీసీహెచ్‌వో డాక్టర్ రాంమూర్తి, తహసీల్దార్ విజయ్ సాగర్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బిల్లులు వెంటనే చెల్లించండి..

- జీడబ్ల్యూఎంసీ సివిల్ కాంట్రాక్టర్ల డిమాండ్
- కమిషనర్ బాజ్‌పాయ్‌కు వినతి పత్రం అందజేత



కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న మునిసిపల్ సివిల్ కాంట్రాక్టర్లు

వరంగల్ కార్పొరేషన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ పరిధిలో చేసిన అభివృద్ధి పనులకు బిల్లులు చెల్లించాలని జీడబ్ల్యూఎంసీ సివిల్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం కుడా కార్యాలయంలో జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్‌ని వరంగల్, హనుమకొండ జిల్లాల కాంట్రాక్టర్లు సంయుక్తంగా కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రేటర్ పరిధిలో సుమారు 400 మంది చిన్న, పెద్ద కాంట్రాక్టర్లు ఉన్నామన్నారు. సొంతఖర్చులతో పనులు పూర్తి చేసి 8 మాసాలు అవుతున్నా.. బిల్లులు రావడం లేదని విన్నవించారు. ప్రతీ కాంట్రాక్టర్ వద్ద పని చేసే లేబర్ కూలీ డబ్బులు చెల్లించకపోవడంతో ఇండ్ల మీదకు వస్తున్నారని అన్నారు. ట్రెజరీకి వెళ్లిన బిల్లులు హైదరాబాద్‌లో పెండింగ్‌లో ఉంటున్నాయని, అధికారులు తమ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. బిల్లులు చెల్లించకపోవడం వల్ల డివిజన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులు మధ్యలోనే నిలిపివేశామని వారు పేర్కొన్నారు. ప్రధానంగా జనరల్ బిల్స్, గ్రాంట్ బిల్స్, పాస్ ఆర్డర్ చేయాలని అన్నారు. కమిషనర్ స్పందించి వెంటనే బిల్లులు చెల్లించాలని కోరారు. లేకుంటే 15వ తేదీన మునిసిపల్ ప్రధాన కార్యాలయం ఎదుట నిరవధిక సమ్మెకు సిద్ధమవుతామని కాంట్రాక్టర్‌లు హెచ్చరించారు. కమిషనర్‌ను కలిసిన వారిలో వరంగల్, హనుమకొండ జిల్లాలకు చెందిన సుమారు వంద మంది నాయకులు, కాంట్రాక్టర్లు ఉన్నారు.

బయోగ్యాస్ సామర్థ్యాన్ని పెంచండి..

- మేయర్ సుధారాణి ● కమిషనర్‌తో కలిసి ప్లాంట్ పరిశీలన



బయోగ్యాస్ ప్లాంట్‌ను పరిశీలిస్తున్న మేయర్, కమిషనర్

వరంగల్ కార్పొరేషన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మునిసిపల్ కార్పొరేషన్ సమీపంలో ఉన్న బయోగ్యాస్ ప్లాంట్ సామర్థ్యాన్ని పెంచాలని మేయర్ గుండు సుధారాణి సూచించారు. శుక్రవారం వరంగల్ నగరంలో ఉన్న బయో గ్యాస్ ప్లాంట్‌ను కమిషనర్ చహత్ బాజ్‌పాయ్‌తో కలిసి పరిశీలించారు. ప్లాంట్ నిర్వహణ తీరుపై అక్కడి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. ఇక్కడి ప్లాంట్ సామర్థ్యం 2టన్నులని, ప్రస్తుతం 1.5టన్నుల సామర్థ్యంలో నిర్వహిస్తున్నామన్నారు. బల్దియా కార్యాలయం మొదటి అంతస్తుకు ఈ ప్లాంట్ నుంచే విద్యుత్ సరఫరా అందుతుందని అన్నారు. వెంటనే రెండు టన్నులకు పెంచాలని మేయర్ అధికారులను ఆదేశించారు. ఈకార్యక్రమంలో సీఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డితో పాటు శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణం వేగంగా పూర్తి చేయాలి

హనుమకొండ కలెక్టర్ స్నేహ శబరీష్

హనుమకొండ కలెక్టరేట్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పనులు మరింత వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టరేట్‌లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పురోగతిపై గృహ నిర్మాణ, డీఆర్‌డీవో, మెప్మా, ఎంపీడీవోలతో శుక్రవారం కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని మండలాలు, మున్సిపల్ పరిధిలో లబ్ధిదారులకు మంజూరుచేసిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పురోగతి, ఇంకా ఇళ్ల నిర్మాణం మొదలు పెట్టని లబ్ధిదారుల సంఖ్య, తదితర అంశాలను జిల్లా కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు.. వారం రోజుల్లోగా ప్రారంభించే విధంగా చర్యలు చేపట్టాలని అన్నారు. 295 స్లాబ్ లెవల్ వచ్చిన ఇళ్లు పదిరోజుల్లో లబ్ధిదారులు పూర్తి చేసుకునే విధంగా అధికారులు కృషి చేయాలని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలైన ఎంజీఎన్ఆర్ఈజీఎస్, ఎస్‌బీఎం కింద ఇందిరమ్మ లబ్ధిదారులను ఆ పథకాలను అనుసంధానం చేయాలని అన్నారు. ఇంకా లబ్ధిదారులు ఎవరైనా మిగిలి ఉన్నట్లయితే వారిని త్వరగా గుర్తించి ఇళ్లు మంజూరు చేయాలని గుర్తించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీవో మేన శ్రీను, గృహ నిర్మాణ శాఖ పీడీ హరికృష్ణ, మెప్మా పీడీ జోనా, గ్రేటర్ కాజీపేట డివిజన్ డిప్యూటీ కమిషనర్ రవీందర్, పరకాల మున్సిపల్ కమిషనర్ సుష్మా, హౌసింగ్ డీఈలు రవీందర్, సిద్ధార్థ నాయక్‌తోపాటు ఎంపీడీవోలు, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ స్నేహ శబరీష్

వందేమాతరం ర్యాలీ

- బీజేపీ ఆధ్వర్యంలో పూర్తి గీతాలాపన



హనుమకొండలో ర్యాలీగా వస్తున్న బీజేపీ శ్రేణులు

రాంనగర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): వందేమాతరం రచించి 150 ఏళ్లు అవుతున్న సందర్భంగా బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు కొలను సంతోష్‌రెడ్డి ఆధ్వర్యంలో కాళోజీ జంక్షన్ నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు జాతీయ జెండాల చేతబూని ర్యాలీగా వచ్చారు. అనంతరం అంబేద్కర్ కూడలిలో వందేమాతరం పూర్తి గీతాన్ని కళాశాల విద్యార్థులతో కలిసి ఆలపించారు. ఈ సందర్భంగా మాజీ మేయర్ రాజేశ్వర్‌రావు మాట్లాడుతూ.. మైనారిటీలను ప్రసన్నం చేసుకునేందుకు కాంగ్రెస్ పార్టీ వందేమాతరం గీతంలో ఉన్న దేవి దుర్గమ్మ, భారత్ మాత అంశాలను తొలగించిందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు కృష్ణారెడ్డి, భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు నిషిధర్‌రెడ్డి, జనగామ జిల్లా అధ్యక్షుడు సౌడ రమేశ్, ములుగు జిల్లా అధ్యక్షుడు బలరాంనాయక్, వందేమాతరం రాష్ట్ర సహ సంయోజకులు రాజమౌళిగౌడ్, మాజీ ఎమ్మెల్యే వన్నాల శ్రీరాములు, మాజీ జిల్లా అధ్యక్షుడు దొంతి దేవేందర్‌రెడ్డి, రాజయ్యాయాదవ్, కార్పొరేటర్ చాడ స్వాతిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి జయంత్‌లాల్, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు సంద్ర మధు, భరత్‌గౌడ్ పాల్గొన్నారు.

మన హైవే భద్రమేనా..?!

ప్రమాదాలకు నిలయంగా నేషనల్ హైవే 563

- నిత్యం హెవీ లోడుతో వెళ్తున్న గ్రానైట్ లారీలు
- డస్ట్ లారీలతో వాహనదారులకు ఇబ్బందులు
- ఇష్టానుసారంగా రోడ్ల పక్కన భారీ వాహనాల పార్కింగ్
- చేవెళ్ల ఘటనతోనైనా యంత్రాంగం నిద్రలేవదా..?

వర్ధన్నపేట రూరల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : వరంగల్-ఖమ్మం జాతీయ రహదారి (ఎన్‌హెచ్-563) ప్రమాదాల రాదారిగా మారుతోంది. ఇటీవల చేవెళ్ల బస్సు ప్రమాద ఘటన రాష్ట్రాన్ని కుదిపేసినప్పటికీ అధికారుల్లో మాత్రం ఎలాంటి చలనం కలగడం లేదు. ఈ రహదారిపై రోజూ ప్రాణాంతక ప్రమాదాలు పెరుగుతున్నాయి. భారీ లారీలు, డస్ట్ వాహనాలు, గ్రానైట్ ట్రక్కులు రాత్రింబవళ్లు దూసుకుపోతున్నాయి. దీనికి తోడు అడుగుకో గుంత వాహనాదారులను భయభ్రాంతలకు గురి చేస్తున్నాయి.

దూసుకుపోతున్న వాహనాలు

నేషనల్ హైవే 563 కరీంనగర్ జిల్లా జగిత్యాల నుంచి ప్రారంభమై హనుమకొండ, వరంగల్, మహబూబాబాద్ జిల్లాల మీదుగా ఖమ్మం వరకు దాదాపు 248 కిలోమీటర్ల పొడవుతో ఉంది. ముఖ్యంగా వరంగల్ నుంచి ఖమ్మం మీదుగా వెళ్తున్న డస్ట్ లారీలు, బొగ్గు, ఇసుక, గ్రానైట్ రవాణా వాహనాలు డివైడర్ లేకుండా రెండు దిశల్లో దూసుకుపోతుంటాయి. దుమ్ముతో నిండిన రహదారిపై కేవలం కొన్ని అడుగుల దూరం కూడా కనబడకపోవడం, రోడ్డు ఛిద్రంగా మారి, గుంతలు ఏర్పడటంలో తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. అంతేకాకుండా హైవేపై పలు చోట్ల లారీ డ్రైవర్లు ఇష్టానుసారంగా వాహనాలు నిలిపివేస్తున్నారు. వర్ధన్నపేట, మామూనూరు, తొర్రూరు, మరిపెడలాంటి ప్రాంతాల్లో ఇవే ప్రమాదాలకు (మిగతా 6లో..)



వర్ధన్నపేట మండలంలోని ఇల్లంద గ్రామంలో కల్వర్టు సమీపంలో రోడ్డు పక్కన ఆపిన డీసీఎం

33 మంది మృతి, 60 మందికి గాయాలు



ఆకేరు వాగు బ్రిడ్జి సమీపంలో ఛిద్రమైన జాతీయ రహదారి

2025 జనవరి నుంచి ఇప్పటివరకు జరిగిన ప్రధాన ప్రమాదాల్లో సుమారు 33మంది మృతిచెందగా, 60 మందికి పైగా గాయపడినట్లు పోలీసు వర్గాలు చెబుతున్నాయి. వరంగల్ - ఖమ్మం జాతీయ రహదారిపై జరిగిన ఘటనల్లో ముఖ్యంగా రాయపర్తి మండలంలోని మైలారం గ్రామంలో ఆర్టీసీ బస్సును, లారీ ఢీకొట్టడంతో 20మందికి పైగా క్షతగాత్రులయ్యారు. మామూనూరులో ఇనుప స్తంభాల లారీ ఆటో ఢీకొట్టడంతో నలుగురు మృతి చెందగా, పలువురికి గాయాలయ్యాయి. మరిపెడలో రెండు లారీలు ఢీకొని అగ్ని ప్రమాదం ఏర్పడి ముగ్గురు మృతి చెందారు. ఇలా జగిత్యాల నుంచి ఖమ్మం వరకు ప్రతీ నెలా ఎక్కడో ఓ చోట మృత్యువాత పడుతూనే ఉన్నారు.

11న జాబ్ మేళా

వరంగల్ ఎడ్యుకేషన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఎంప్లాయిమెంట్ అండ్ ట్రైనింగ్ విభాగం ఆధ్వర్యంలో ఈ నెల 11న ములుగురోడ్‌లోని ఎంప్లాయిమెంట్ కార్యాలయంలో జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ ఎం.మల్లయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ ప్రైవేటు కంపెనీల్లో ఉన్న 30 పోస్టుల కోసం ఈ జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. 18 నుంచి 32 ఏళ్లు కలిగి ఉండి టెన్త్ నుంచి పీజీ పాసైన అభ్యర్థులు జాబ్ మేళాలో పాల్గొనవచ్చునని ఆయన సూచించారు. అర్హత, ఆసక్తి గల అభ్యర్థులు 11న ఉదయం ములుగురోడ్‌లోని ఎంప్లాయిమెంట్ ఆఫీస్‌లో ఉదయం 10.30 గంటలకు సంబంధిత జిరాక్స్‌తో హాజరు కావాలని ఆయన కోరారు. పూర్తి వివరాలకు 7893394393 ఫోన్ నెంబర్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు.

భద్రకాళి దేవాలయంలో కార్తీక దీపోత్సవం

సాంస్కృతిక కార్యక్రమాలు

వరంగల్ కల్చరల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం పర్వదినం సందర్భంగా శుక్రవారం భద్రకాళి అమ్మవారి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం 500 మందికి భోజన ప్రసాదం ఏర్పాటు చేశారు. సాయంత్రం కార్తీక దీపోత్సవం నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో దీపాలు వెలిగించారు. అనంతరం కళాకారులు సాంస్కృతిక కార్యక్రమాలు నృత్యప్రదర్శనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈవో రామల సునీత, సూపరింటెండెంట్ క్రాంతికుమార్, లక్ష్మీశ్రీనివాస సేవా ట్రస్టు సభ్యు లు, సేవా సమితి బాధ్యులు తదితరులు పాల్గొన్నారు.

నేడు సంకష్టహర చతుర్థి

కార్తీక మాసం సందర్భంగా సంకష్టహర చతుర్థి వేడుకలు శనివారం నగరంలోని అన్ని ఆలయాల్లో సాయంత్రం నిర్వహించనున్నారు. చారిత్రక భద్రకాళి దేవాలయంలోని గణపతి స్వామి, రామలింగేశ్వరాలయం, వాసవీ మాత దేవాలయం, శృంగేరి శంకర మఠం, దయానంద్ కాలనీలోని రత్నగర్భ గణపతి దేవాలయంతో పాటు ములుగు రోడ్‌లోని శ్రీగణపతి సచ్చిదానంద వరద దత్తక్షేత్రంలో గల సంకటహర గణపతి స్వామికి ప్రత్యేక పూజ కార్యక్రమాలు గణపతి హోమం, క్షీరాభిషేకం, అలంకరణ, మహా మంగళహారతులు నిర్వహిస్తారు. అనంతరం దీపాలు వెలిగిస్తారు.



భద్రకాళి ఆలయంలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న లక్ష్మీ సేవా సమితి బాధ్యులు



కూచిపూడి నృత్యం చేస్తున్న కళాకారిణులు

9న రెజొనెన్స్‌లో ఎంట్రెన్స్ ఎగ్జామ్

ప్రతిభ కనబర్చిన విద్యార్థిని, విద్యార్థులకు ఉచిత విద్య

హనుమకొండ టౌన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): దేశంలోనే అగ్రగామి విద్యా సంస్థ అయిన రాజస్థాన్ కోట రెజొనెన్స్‌లో ఈ నెల9న మధ్యాహ్నం 2 గంటలకు ఎంట్రెన్స్ టెస్టు ఎగ్జామ్ నిర్వహిస్తున్నట్లు కళాశాల చైర్మన్ లెక్కల రాజిరెడ్డి తెలిపారు. శుక్రవారం రాజిరెడ్డి మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా రెజొనెన్స్ ఐఐటీ ,జేఈఈ, నీట్ కళాశాలలో టాలెంట్ టెస్టు నిర్వహిస్తున్నట్లు ఈ యేడు పదో తరగతి చదువుతున్న విద్యార్థులు ఈ టాలెంట్ టెస్టుకు అర్హులని తెలిపారు. ఈ టాలెంట్ టెస్టులో అత్యుత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులకు 10 శాతం నుంచి 100 శాతం రాయితీ ఇవ్వనున్నట్లు తెలిపారు. పదో తరగతి చదువుతున్న స్టేట్ అండ్ సీబీఎస్ఈ విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. టాలెంట్ టెస్టు రిజిస్ట్రేషన్ కోసం సెల్ నంబర్లు : 9553526677 / 9553516677 లకు, రెజొనెన్స్ కళాశాలలో సంప్రదించాలని పేర్కొన్నారు. పరీక్ష కేంద్రాలు బాలురకు అడ్వొకేట్స్‌కాలనీలోని రెజొనెన్స్ జూనియర్ కళాశాల రోడ్ నెంబర్ 1 బాలసముద్రం, బాలికలకు సెవెన్ హిల్స్ హాస్పిటల్ రోడ్డు ఎదురుగా ఎస్‌బీఐ నయీంనగర్ వద్ద పరీక్ష కేంద్రాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

నేడు వెలమ సంఘం

కార్తీక మాస వన భోజనాలు

న్యూశాయంపేట, నవంబరు7(ఆంధ్రజ్యోతి): వెలమ సంక్షేమ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా ఆధ్వర్యంలో శనివారం పున్నేల్ క్రాస్ రోడ్ ఎదురుగా ఉన్న మామిడి తోటలో కార్తీకమాస వనభోజనాలు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వెలమ సంక్షేమ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు నడిపెల్లి వెంకటేశ్వర్‌రావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మహిళలకు హెల్త్ చెకప్ క్యాంప్ ఏర్పాటు చేసి ఉచిత మెడిసిన్ అందిస్తామని, అలాగే సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు, భజనలు, కార్తీక పురాణ ప్రవచనం, కోలాటాలు, డ్యాన్స్‌లు, ఆర్కెస్ట్రా, ఆటల పోటీలు నిర్వహించి ప్రైజ్‌లు అందజేస్తామన్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న వెలమలు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని వెంకటేశ్వర్‌రావు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

హోరాహోరీగా సాగుతున్న జోనల్ క్రీడలు

రాయపర్తి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : రాయపర్తి మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో నిర్వహిస్తున్న 11వ జోనల్ స్థాయి క్రీడలు హోరాహోరీగా సాగుతున్నాయి. శుక్రవారం రెండో రోజు క్రీడల్లో విద్యార్థులు పాల్గొన్నారు. మల్టీ జోనల్ అధికారి అలివేలు, ప్రిన్సిపాల్ సరిత పర్యవేక్షణలో సాగుతున్న పోటీల్లో ఆయా విభాగాల్లో క్రీడాకారులు విజయాలు సాధించారు. అథ్లెట్స్‌లో భాగంగా అండర్ 17 విభాగంలో 1500 మీటర్ల రన్నింగ్‌లో రాయపర్తి పాఠశాలకు చెందిన మాన్విత మొదటి స్థానంలో నిలువగా, పరకాల పాఠశాల విద్యార్థి సుస్మిత ద్వితీయ స్థానం, ధర్మసాగర్ పాఠశాలకు చెందిన ధరణి తృతీయ స్థానంలో నిలిచింది. అండర్ 19 విభాగంలో మడికొండకు చెందిన సీహెచ్.చరిష్మా మొదటి, మహబూబాబాద్‌కు చెందిన కీర్తి జోష్నా ద్వితీయ, రాయపర్తికి చెందిన వర్షినితేజ తృతీయ స్థానాల్లో నిలిచారు. 200 మీటర్ల అండర్ 14 విభాగంలో ఆత్మకూర్ నుంచి కీర్తన మొదటి, పర్వతగిరికి చెందిన జ్ఞానేశ్వరి రెండోస్థానం, హసన్‌పర్తికి చెందిన శ్రీహర్ష తృతీయ స్థానంలో నిలిచారు. అండర్ 17 విభాగంలో మడికొండకు చెందిన చందనశ్రీ మొదటి, రాయపర్తికి చెందిన అనిత రెండో స్థానం, ధర్మసాగర్‌కు చెందిన నిక్షిత మూడో స్థానంలో నిలిచారు. వాలీబాల్, హ్యాండ్ బాల్, కోకో, కబడ్డీ, లాంగ్ జంప్, మొదలైన క్రీడలు పీడీ, పీఈటీల ఆధ్వర్యంలో హోరాహోరీగా సాగాయి.



రాయపర్తిలో జోనల్ స్థాయి క్రీడల్లో పాల్గొన్న క్రీడాకారులు

ఆశ్రమ పాఠశాలలో కలెక్టర్ తనిఖీలు

● స్టోర్ రూమ్‌లో కాలంలో చెల్లిన వస్తువులు ● వార్డెన్‌కు షోకాజ్ నోటీసులు ● సమస్యలుంటే ఫిర్యాదు చేయాలని వెల్లడి

వర్ధన్నపేట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): వర్ధన్నపేట పట్టణ కేంద్రంలోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలను శుక్రవారం అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ సత్యశారద తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు, తరగతి గదులను, వంటశాలలను తనిఖీ చేశారు. స్టోర్ రూంలో కాలం చెల్లిన రవ్వ ఉండడంతో వార్డెన్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తూ షోకాజ్ నోటిసులు జారీ చేయాలని డీటీడీవోను ఆదేశించారు. తాజా సరుకులను అందించాలని, హాస్టల్ పరిసరాల శుభ్రతను పాటించాలని సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించడంపై ఆరా తీశారు. విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల అభ్యాస సామర్థ్యాలను పరిశీలించారు, విద్యా ప్రమాణాలు, మౌలిక సదుపాయాల గురించి విద్యార్థులతో కలెక్టర్ సత్యశారద మాట్లాడారు. ఏమైనా సమస్యలు ఉంటే ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఫిర్యాదుల పెట్టెలో రాసి వేయాలని కలెక్టర్ విద్యార్థులకు సూచించారు. అనంతరం ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు నిర్వహిస్తున్న ఆరోగ్య శిబిరాన్ని కలెక్టర్ సత్యశారద పరిశీలించి వైద్య సిబ్బందితో. విద్యార్థులతో మాట్లాడి అందిస్తున్న సేవలపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గిరిజన సంక్షేమ అధికారి సౌజన్య, జిల్లా వ్యవసాయ అధికారి అనురాధ, డీఎంహెచ్‌వో డాక్టర్ సాంబశివరావు, ప్రధానోపాధ్యాయులు రామ్‌దాస్, వార్డెన్ యాకుబ్, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ సత్య శారద

పీడీఎస్‌యూ రాష్ట్ర మహాసభల గోడపత్రిక ఆవిష్కరణ

కేయూ క్యాంపస్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): వరంగల్‌లో డిసెంబరు 10, 11, 12 తేదీల్లో నిర్వహించే పీడీఎస్‌యూ రాష్ట్ర మహాసభల గోడపత్రికను శుక్రవారం కేయూలో ప్రొఫెసర్ కాత్యాయని విద్మహే ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కాత్యాయని విద్మహే, పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి నాగరాజు మాట్లాడారు. పీడీఎస్‌యూ 50 ఏళ్ల ప్రస్థానంలో శాస్త్రీయ, సమాన విద్యకు పోరాడిందన్నారు. దేశంలో హిందుత్వ ఫాసిజం పెరిగిపోతుందన్నారు. సిలబస్‌లో సైన్స్‌ను తొలగిస్తున్నారని అన్నారు. విద్యను వ్యాపారం చేస్తున్నారన్నారు. విద్య రక్షణకు బలమైన ఉద్యమాలు చేయాలన్నారు. వరంగల్‌లో మూడు రోజుల పాటు రాష్ట్ర మహాసభలను నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి మర్రి మహేశ్, బండి కోటేశ్వర్, ఎలకంటి రాజేందర్, రాచర్ల బాలరాజు, ఎమ్మీ.ప్రహాన్, రమణ, సన్నీ, రాజేశ్, రాంబాబు, వెంకటేశ్ పాల్గొన్నారు.



గోడపత్రికను ఆవిష్కరిస్తున్న కాత్యాయని విద్మహే తదితరులు

గ్రేటర్‌లో ఇద్దరు సీనియర్ అసిస్టెంట్ల బదిలీ

వరంగల్ కార్పొరేషన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ పరిధిలో పనిచేస్తున్న ఇబ్బంది సిబ్బందిని బదిలీ చేస్తూ జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. కాజీపేట సర్కిల్ కార్యాలయంలో పని చేస్తున్న సీనియర్ అసిస్టెంట్ డి.దేవరాజ్‌ను జీడబ్ల్యూఎంసీ హెడ్ ఆఫీస్ జీ-3 సెక్షన్‌కు, అక్కడ పనిచేస్తున్న సీహెచ్ అనిల్‌కుమార్‌ను కాజీపేట సర్కిల్ కార్యాలయానికి బదిలీ చేశారు.

శుద్ధమైన నీటిని ప్రజలకు అందించాలి

● జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్ ● వడ్డెపల్లి ఫిల్టర్ బెడ్ ఆకస్మిక తనిఖ

వరంగల్ కార్పొరేషన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): వరంగల్ నగర ప్రజలకు శుద్ధి చేసిన నీటిని అందించాలని జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్ అధికారులకు సూచించారు. శుక్రవారం వడ్డెపల్లి ఫిల్టర్ బెడ్‌ను అక్కడి అధికారులతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడారు. ఫిల్టర్‌బెడ్‌లలో పని చేసే సిబ్బంది సమర్థవంతంగా పని చేసి పరిశుభ్రమైన నీటిని సరఫరా చేయాలన్నారు. శుద్ధమైన నీటిని అందించడంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈఈ రవికుమార్, డీఈ రాజ్‌కుమార్‌తో పాటు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



వడ్డెపల్లి ఫిల్టర్‌బెడ్‌ను పరిశీలిస్తున్న కమిషనర్

రేపటి నుంచి దూరవిద్య పీజీ తరగతులు

కేయూ క్యాంపస్ నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ దూరవిద్య కేంద్రం అందిస్తున్న పీజీ కోర్సుల రెండో సెమిస్టర్ కాంట్రాక్టు తరగతులు నవంబరు 9 ఆదివారం నుంచి జరుగుతాయని ఎస్డీఎల్‌సీఈ డైరెక్టర్ ప్రొఫెసర్ బి.సురేశ్‌లాల్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నవంబరు 9, 11, 23, 30 తేదీల్లో డిశంబరు 7, 13, 14, 21, 28 తేదీల్లో ఉదయం 10 గంటల నుంచి కేయూ దూరవిద్యం కేంద్రంతో పాటు ఎంపిక చేసిన అధ్యయన కేంద్రాల్లో జరుగుతాయని వెల్లడించారు. ఎంఏ తెలుగు, ఇంగ్లీష్, హిందీ, సంస్కృతం, రాజనీతిశాస్త్రం, అర్థశాస్త్రం, హిస్టరీ, హెచ్‌ఆర్ఎం, సోషియాలజీ, ఎంకామ్ తరగతులు జరుగుతాయని వెల్లడించారు. మంచిర్యాల, నిర్మల, మణుగూరు, భద్రాచలం, ఖమ్మం, కౌటల, నర్సాపూర్‌లలో అధ్యయన కేంద్రాల్లో ఎంపిక చేసిన సబ్జెక్టుల్లో కాంట్రాక్టు తరగతులు జరుగుతాయని వెల్లడించారు. ఇతర వివరాలకు 0870-2461480, 490 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

జాతీయ స్థాయి కళోత్సవ్‌కు ఎంపిక



జాతీయ స్థాయి కళోత్సవ్ పోటీలకు ఎంపికైన కూచన మైత్రి తేజల్

వరంగల్ ఎడ్యుకేషన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో 6, 7 తేదీల్లో నిర్వహించిన రాష్ట్రస్థాయి కళోత్సవ్ పోటీల్లో జిల్లాకు చెందిన విద్యార్థిని కూచన మైత్రీ తేజల్ డ్యాన్స్ విభాగంలో ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. శుక్రవారం నిర్వహించిన పోటీల్లో కూచిపూడి నాట్యప్రదర్శనలో ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయికి ఎంపికైంది. జేడీ రాజీవ్ చేతుల మీదుగా మైత్రీ తేజల్ జ్ఞాపికతో పాటు ప్రశంసా పత్రాన్ని అందుకుంది. ఈ సందర్భంగా జిల్లా డీఈవో, అడిషనల్ కలెక్టర్ ఎ.వెంకట్‌రెడ్డి, ఏఎంవో డాక్టర్ మన్మోహన్, ఇతర అధికారులు మైత్రీకి అభినందనలు తెలిపారు.

త్రినగరి స్కూల్స్ విద్యార్థులకు క్విజ్ పోటీలు

కేయూ క్యాంపస్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): భారత్ వికాస్ పరిషత్ ఓరుగల్లు శాఖ నేతృత్వంలో శుక్రవారం త్రినగర విద్యార్థులకు హనుమకొండ హౌసింగ్ బోర్డుకాలనీలోని ఆక్స్‌ఫర్డ్ హైస్కూల్‌లో క్విజ్ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా నిట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ కె.ఉదయ్‌కుమార్ హాజరై క్విజ్ పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు అందచేశారు. బీవీపీ అధ్యక్షుడు డాక్టర్ సుధీర్‌కుమార్, బీవీపీ సౌత్ రీజినల్ సంస్కార్ కన్వీనర్ ఎన్.ప్రభాకర్‌రెడ్డిలు హాజరై క్విజ్‌పోటీల ప్రాధాన్యతను వివరించారు. ఒక్కో పాఠశాల నుంచి 4గురు చొప్పున 11 పాఠశాల విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారని కార్యదర్శి కె.సత్యనారాయణ తెలిపారు. క్విజ్ మాస్టర్లుగా అసిస్టెంట్ ప్రొఫెసర్ నాగరాజు, డాక్టర్ స్నిగ్ధలు వ్యవహరించారు. కన్వీనర్ వివేకనంద ప్రసాద్, బి. వెంకట్‌రెడ్డి, వీసీ రామారావు, పాఠశాల డైరెక్టర్ పి.వెంకటరమణలు పాల్గొన్నారు. శారద స్కూల్ మొదటి, ఆక్స్‌ఫర్డ్ హైస్కూల్ రెండో, డెఫడైల్స్ హైస్కూల్ స్టూడెంట్స్ మూడో బహుమతులను సీనియర్స్ విభాగంలో సాధించగా జూనియర్ విభాగంలో శారదహై స్కూల్, స్టాండర్డ్ హైస్కూల్, రిషీ హైస్కూల్స్ విద్యార్థులు వరుసగా మూడు స్థానాల్లో నిలిచారు.

అజరామర గీతం.. వందేమాతర గీతం..

● బియ్యపు గింజపై వందేమాతరం గీతం
● మైక్రోఆర్టిస్ట్ రామోజు జయకుమార్ ప్రతిభ

నర్సంపేట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : అజరామర గీతం.. వందేమాతర గీతం, మాతృభూమి దాస్యశృంఖలాలను తెంచేందుకు స్వాతంత్రోద్యమ స్ఫూర్తిని రగిలించిన గీతం వందేమాతర గీతం అని నర్సంపేట పట్టణానికి చెందిన మైక్రోఆర్టిస్ట్ శ్రీరామోజు జయకుమార్ అన్నారు. బకించంద్ర చటర్జీ రాసిన ఈ గీతం నేటికి 150 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా శ్రీరామోజు జయకుమార్ బియ్యపు గింజపై 191 ఆంగ్ల అక్షరాలతో వందేమాతరం గీతాన్ని లిఖించారు. ప్రజలు దేశభక్తిని కొనసాగిస్తూ దేశ ఉన్నతిలో భాగస్వాములు కావాలని ఆయన కోరారు.



మైక్రోఆర్టిస్ట్ బియ్యపు గింజపై ఆంగ్లఅక్షరాలతో రాసిన వందేమాతర గీతం

గంజాయి అమ్ముతున్న వ్యక్తుల అరెస్ట్

145 గ్రాముల ఎండు గంజాయి స్వాధీనం

గీసుగొండ, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : గంజాయి అమ్ముతున్న నలుగురు ముఠా సభ్యులను గీసుగొండ పోలీసులు చాకచక్యంగా పట్టుకొని అరెస్ట్ చేశారు. సీఐ విశ్వేశ్వర్ తెలిపిన వివరాల ప్రకారం.. భూపాలపల్లిజిల్లా నేరేడుపల్లి గ్రామానికి చెందిన బోగి నవీన్, రేగొండ మండలం జూబ్లీనగర్‌కు చెందిన కటకం కళ్యాణ్ (పాల్‌దినాకర్), ఖిలా వరంగల్ మండలం స్తంభంపల్లికి చెందిన బెంబిరి అరవింద్, బెంబిరి మహేష్‌లు ఒక ముఠాగా ఏర్పడి గంజాయిని అమ్ముతున్నారు. జల్సాలకు అలవాటు పడిన వీరు గత కొద్ది నెలలుగా హైదరాబాద్ దూల్‌పేట ప్రాంతంలో గుర్తు తెలియని వ్యక్తి వద్ద గంజాయిని తక్కువ ధరకు కొనుగోలు చేసి వేర్వేరు చోట్ల ఎక్కువ ధరకు అమ్ముతున్నారు. కాగా, శుక్రవారం ధర్మారం ఊర చెరువు సమీపంలో గంజాయిని అమ్మే ప్రయత్నం చేస్తుండగా అటుగా పెట్రోలింగ్‌కు వెళుతున్న పోలీసులు అనుమానించి పట్టుకొని విచారించగా వారి వద్ద 145 గ్రాములు ఎండు గంజాయి లభించింది. దీంతో వారిని అరెస్ట్‌చేసి కోర్టులో హాజరు పరిచినట్లు సీఐ విశ్వేశ్వర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయి, మత్తు కలిగించే పదార్థాలను అమ్మిన, కొనుగోలు చేసిన, రవాణా చేసిన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మాదక ద్రవ్యాల అమ్మకాలకు సంబంధించి ఎటువంటి సమాచారం ఉన్నా వెంటనే పోలీస్‌లకు తెలుపాలని కోరారు.



గంజాయి నిందితుల అరెస్ట్ చూపుతున్న పోలీసులు

చెత్త తరలింపు వాహనాల సమాచారం ఇవ్వాలి

● వరంగల్ మునిసిపల్ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్ ● బల్దియా వెహికిల్ షెడ్డు ఆకస్మిక తనిఖీ

వరంగల్ కార్పొరేషన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): వరంగల్ నగరం పాలక సంస్థ పరిధిలో చెత్త తరలింపు వాహనాల సమాచారం యాప్‌లో చేయాలని జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్ అధికారులను ఆదేశించారు. హనుమకొండ బాలసముద్రంలో నిర్వహింస్తున్న వెహికిల్ షెడ్డులో శుక్రవారం కమిషనర్ ఆకస్మికంగా తనిఖీ చేసి షెడ్డుడతో పాటు సెకండ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్ వాహనాల మరమ్మత్తుల సమాచారాన్ని అధికారులను అడిగి తెలుసుకున్నారు. అక్కడ సమర్థవంతంగా పనులు నిర్వర్తించాలని తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. చెత్త తరలింపు వాహనాల తరలింపు వాహనాలతో పాటు సెకండ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌లో బ్రేక్‌డౌన్ అయిన వాహనాలను వెంటనే మరమ్మత్తులు చేయాలన్నారు. చెత్త తరలింపు వాహనాలు మధ్యాహ్నం వెహికిల్ షెడ్డులో ఉండేలా చూడాలన్నారు. వాహనాల మరమ్మత్తుకు మరో ఆరుగురు సిబ్బందిని నియమించాలన్నారు. ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌లో ఉన్న స్క్రాప్‌ను వెంటనే టెండరు పిలిచి విక్రయించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డి, ఈఈలు రవికుమార్, మాధవిలత, డీఈ రాజ్‌కుమార్, శానిటరి సూపర్‌వైజర్ నరేందర్, ఏఈ సంతోష్‌కుమార్, ఐసీసీ ఇన్‌చార్జి తేజస్వి పాల్గొన్నారు.



వెహికిల్ షెడ్డును తనిఖీ చేస్తున్న కమిషనర్

మన హైవే భద్రమేనా..?!

(5వ పేజీ తరువాయి)



డీసీ తండా శివారులో ప్రమాదకరంగా గుంత ఏర్పడడంతో పక్క నుంచి వెళ్తున్న వాహనాలు

ఎక్కువగా కారణమవుతున్నాయి. అధికారుల నిర్లక్ష్యం, రాత్రి పూట పహారా లేకపోవడం పరిస్థితిని మరింత దారుణంగా మారుస్తోంది.

యంత్రాంగం నిద్రలేవదా..!

చేవేళ్ల ఘటనతోనైనా యంత్రాంగం నిద్రలేవదా..? అంటూ వాహనదారులు విమర్శిస్తున్నారు. నేషనల్ హైవే అథారిటీ అధికారులు కంటి తుడుపు చర్యలు చేసి చేతులు దులుపుకుంటున్నారే తప్ప శాశ్వత పరిష్కారం చూపడం లేదంటున్నారు. ఇటీవల కొన్ని చోట్ల గుంతలను పూడ్చినప్పటికీ, ఆ పనుల్లో కూడా నాణ్యత లోపించింది. రహదారి భద్రతకు సంబంధించి హైవే అథారిటీ, ట్రాన్స్‌పోర్టు శాఖ, పోలీస్ విభాగాలు తక్షణ చర్యలు తీసుకోవడం లేదు. సీసీ టీవీ పర్యవేక్షణ, లైట్ సదుపాయాలు, పార్కింగ్ నియంత్రణ, వేగ పరిమితులను అమలు చేయడంలో విఫలమవుతున్నారు. రహదారిపై సైన్ బోర్డులు లేకపోవడం, డివైడర్ లేకపోవడం వల్ల ఫ్రంట్ కొలిజన్లు ఎక్కువగా జరుగుతున్నాయి. స్పీడ్ లిమిట్ అమలుచేయకపోవడం, రాడార్ స్పీడ్ చెకింగ్, ప్రత్యేక లారీ లేన్‌లు, రాత్రి పహారా లాంటి కనిపించడం లేదు. దీంతో ఎన్‌హెచ్-563 పేరు ప్రమాదాల హైవేగా మిగిలిపోతోందని విమర్శలు వస్తున్నాయి.

పదోన్నతిపై సీనియర్ సివిల్ జడ్జిలు బదిలీ

వరంగల్ లీగల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా సీనియర్ సివిల్ జడ్జిలుగా పనిచేస్తున్న ముగ్గురు జడ్జిలకు పదోన్నతి కల్పిస్తూ హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు శుక్రవారం ప్రకటన విడుదల చేసింది. జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కమ్ సీనియర్ సివిల్ జడ్జిగా పనిచేస్తున్న క్షమాదేశ్ పాండేను వరంగల్ అవినీతి నిరోధక ప్రత్యేక కోర్టు(ఏసీబీ) జడ్జిగా పదోన్నతి కల్పిస్తూ ఆదేశాలు జారీ చేశారు. అదే విధంగా నర్సంపేట సీనియర్ సివిల్ జడ్జిగా పనిచేస్తున్న వరూధినికి అదనపు జిల్లా జడ్జిగా పదోన్నతి కల్పిస్తూ నిజామాబాద్ నాలుగో అదనపు జిల్లా సెషన్స్ జడ్జిగా నియమించింది. జనగామ సీనియర్ సివిల్ జడ్జి కమ్ న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న విక్రమ్‌ను కూకట్‌పల్లి ఫ్యామిలీ కోర్టు జడ్జిగా పదోన్నతి కల్పిస్తూ హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది.

ఎక్సైజ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఎన్నిక



ఏకగ్రీవంగా ఎన్నికైన నూతన కార్యవర్గం

వరంగల్ క్రైం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్స్ అసోసియేషన్ వరంగల్ డివిజన్ నూతన కార్యవర్గాన్ని శుక్రవారం వరంగల్ అర్బన్ ఎక్సైజ్ కార్యాలయంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎలక్షన్ అబ్జర్వర్ ఎక్సైజ్ సీఐ బి.ప్రభావతి తెలిపారు. అధ్యక్షుడిగా ఖిలావరంగల్ సీఐ కె.రాజు, అసోసియేట్ అధ్యక్షుడిగా హనుమకొండ ఎస్సై సీహెచ్.వెంకన్న, వైస్ ప్రెసిడెంట్‌గా భూపాలపల్లి డీటీఎఫ్ సీఐ రాజసమ్మయ్య, జనరల్ సెక్రటరీగా పరకాల ఎస్సై వై.జ్యోతి, ఆర్గనైజింగ్ సెక్రటరీగా జనగామ సూపరింటెండెంట్ జనార్దన్, జాయింట్ సెక్రటరీగా జనగామ సీఐ బి.ప్రభావతి, కోశాధికారిగా వరంగల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ కె.నాగయ్య, ఈసీ మెంబర్స్‌గా నర్సంపేట సీఐ నరేశ్‌రెడ్డి, వరంగల్ అర్బన్ ఎస్సై ఎస్.పద్మ, వర్ధన్నపేట ఎస్సై వి.గంగాధర్, తొర్రూర్ ఎస్సై ఎం.రవళి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు కె.రాజు మాట్లాడుతూ.. అధికారుల సర్వీసుకు సంబంధించి శక్తివంచన లేకుండా పని చేస్తానన్నారు. తన నియామకానికి కృషి చేసిన అధికారులకు ధన్యవాదాలు తెలిపారు.

పోలీసుల అదుపులో ప్రధాన నిందితుడు

- నెల రోజులుగా కుటుంబ సభ్యులతో పరారీ

శాయంపేట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోనే సంచలనం సృష్టించిన ధాన్యం కొనుగోలు కేంద్రాలలో అక్రమాలకు పాల్పడిన ప్రధాన నిందితుడు బెజ్జంకి శ్రీనివాస్ ఎట్టకేలకు పోలీసులకు చిక్కాడు. హనుమకొండ జిల్లా శాయంపేట మండలం శాయంపేట, కాట్రపల్లి గ్రామాలలో ఐకేపీ ఆధ్వర్యంలో గత రబీ సీజన్‌లో నిర్వహించిన ధాన్యం కొనుగోలు కేంద్రాలలో రూ.1.87 కోట్లు అక్రమాలు జరిగినట్టు అధికారుల విచారణలో వెల్లడైంది. దీనిపై అక్టోబరు 11న శాయంపేట పీఎస్‌లో 21 మందిపై కేసు నమోదైన విషయం విదితమే. ఈ కేసులో ప్రధాన నిందితుడు మిల్లర్ బెజ్జంకి శ్రీనివాస్ తన కుటుంబ సభ్యులతో సహా గత నెల రోజులుగా పరారీలో ఉన్నాడు. ముందస్తు బెయిల్ కోసం దరఖాస్తులు చేసుకుంటున్నా లభించలేదు. దీంతో పోలీసులకు దొరకకుండా తప్పించుకుని తిరుగుతున్నాడు. ఈనేపథ్యంలో పక్క రాష్ట్రంలోని గుంటూరులో ఉన్నాడని సమాచారం తెలుసుకున్న పోలీసులు 8 మంది కుటుంబ సభ్యులతో సహా శ్రీనివాస్‌ను అదుపులోకి తీసుకున్నారు. ప్రస్తుతం టాస్క్‌ఫోర్స్ పోలీసుల అదుపులో నిందితులను విచారిస్తున్నట్లు సమాచారం.

గురుకులాల పదోన్నతుల్లో జాప్యం

- పెండింగ్‌లో 1,650 మంది ఉద్యోగుల ప్రమోషన్లు
- వివిధ స్థాయిల్లో పలు పోస్టులు ఖాళీ
- 140 గురుకులాలకు ఇన్‌చార్జి ప్రిన్సిపాళ్లే దిక్కు
- గాడితప్పుతున్న గురుకుల విద్యా వ్యవస్థ
- నష్టపోనున్న దళిత, బలహీన వర్గాల విద్యార్థులు



సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల

హనుమకొండ, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాసంస్థల్లో అన్ని స్థాయిల్లో పదోన్నతులు లేక ఉద్యోగులు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు. పదోన్నతుల్లో జాప్యం వల్ల వారు సర్వీస్ పరంగా, ఆర్థికంగానూ నష్టపోతున్నారు. అనేక ఏళ్లుగా పదోన్నతులు లేక గురుకులాల్లో విద్య గాడి తప్పుతోంది. గురుకులాల్లో 1,650 పదోన్నతులు పెండింగ్‌లో ఉన్నాయి. ఉమ్మడి జిల్లాలో 250 నుంచి 300 మంది ఉద్యోగులకు పదోన్నతులు రావలసి ఉంది. కింది స్థాయిలో పదోన్నతులను పట్టించుకోవడం లేదు కానీ, పైస్థాయిలో మాత్రం ఉన్నతాధికారులు పదోన్నతుల మీద పదోన్నతులు అక్రమంగా పొందుతున్నారని ఉద్యోగ సంఘాలు ఆరోపిస్తున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా 250కి పైగా సాంఘిక సంక్షేమ గురుకుల విద్యా సంస్థలు ఉన్నాయి.

సీనియారిటీ లిస్టు ప్రకటించినా..

ఇటీవల ప్రభుత్వ ఆదేశాల మేరకు రెగ్యులర్ ఉద్యోగుల ఫైనల్ సీనియారిటీ లిస్టును అన్ని కేడర్లలో ప్రకటించారు. జూనియర్ అసిస్టెంట్ స్థాయి నుంచి జోనల్ ఆఫీసర్, జాయింట్ సెక్రెటరీ స్థాయి వరకు చెక్ స్లిప్స్ కూడా తీసుకున్నారు. దీనితో పదోన్నతుల ప్రక్రియ ఇక పూర్తవుతుందని ఉద్యోగులు ఆశపడ్డారు. ఇంతలో సాంఘిక సంక్షేమ గురుకులాల కార్యదర్శి అలుగు వర్షిని కేంద్ర ప్రభుత్వ సర్వీస్‌కు బదిలీ కావడంతో ఈ ప్రక్రియ అటకెక్కింది. ప్రస్తుతం క్రిష్ణ ఆదిత్య ఎఫ్ఏసీ సెక్రెటరీగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. కానీ పదోన్నతుల ప్రక్రియలో కదలిక లేదు.

ఇన్‌చార్జి ప్రిన్సిపాళ్లు

సాంఘిక సంక్షేమ గురుకులాల్లో చాలా వాటికి పూర్తి స్థాయి ప్రిన్సిపాళ్లు కూడా లేరు. సుమారు 140 గురుకులాలు ఇన్‌చార్జి ప్రిన్సిపాళ్ల ఆధ్వర్యంలో నడుస్తున్నాయి. సీనియారిటీని పరిగణలోకి తీసుకోకుండా అనుభవంలేని వారిని ఇన్‌చార్జిలుగా నియమించడంతో గురుకులాల నిర్వహణ గాడితప్పుతోంది. అవినీతి, అక్రమాలు చోటుచేసుకుంటున్నాయి. ఇన్‌చార్జి ప్రిన్సిపాళ్లలో చాలామంది పలుకుబడి, పైరవీలతో వచ్చినవారే. దీనితో గురుకులాల్లో పాలన ఇష్టారాజ్యంగా నడుస్తోంది.

పైస్థాయిలో అక్రమ పదోన్నతులు

జోనల్ ఆఫీసర్స్, జాయింట్ సెక్రెటరీ, డిప్యూటీ సెక్రెటరీ స్థాయిల్లో కూడా ఉద్యోగ విరమణలు, కొందరు వీఆర్ఎస్ తీసుకోవడం వల్ల దాదాపు 10 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ప్రధాన కార్యాలయంలో పనిచేస్తున్న అసిస్టెంట్ సెక్రెటరీలకు డిప్యూటీ సెక్రెటరీగా ఒక పోస్టుకు మాత్రమే అర్హత ఉన్నప్పటికీ సంక్షేమ గురుకుల నిబంధనలకు విరుద్ధంగా 5 పోస్టుల్లో డిప్యూటీ సెక్రెటరీలుగా పదోన్నతులు పొందినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇలా అక్రమంగా ప్రమోషన్లు పొందిన వారిని వెంటనే రివర్టు చేసి ఆ పోస్టుల్లో సీనియర్ ప్రిన్సిపాల్స్‌కు జోనల్ అధికారి, డిప్యూటీ సెక్రెటరీ, జాయింట్ సెక్రెటరీలుగా పదోన్నతులు కల్పించాలని ఉద్యోగ సంఘాలు కోరుతున్నాయి. ప్రస్తుతం ఒక జోనల్ అధికారి మూడు జోన్ల బాధ్యతలు నిర్వహిస్తున్నారు. వారికి పనిభారం ఎక్కువ కావడం వల్ల పర్యవేక్షణ లోపించి గురుకులాల పరిపాలన అస్తవ్యస్తంగా మారుతోంది.

తక్షణం పదోన్నతులు కల్పించాలి

అలగోని నరసింహులు గౌడ్, రాష్ట్ర అధ్యక్షుడు, తెలంగాణ గవర్నమెంట్ ఆల్ రెసిడెన్షియల్ ఎంప్లాయీస్ అసోసియేషన్



తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాసంస్థల్లో అన్ని స్థాయిల్లో పదోన్నతులు లేక ఉద్యోగులు తీవ్రంగా నష్టపోతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా గురుకులాల్లో 1650 మంది ఉద్యోగులకు సంబంధించిన పదోన్నతులు పెండింగ్‌లో ఉన్నాయి. ఉమ్మడి వరంగల్ జిల్లాలో సుమారు 250మంది నుంచి 300 మందికి ప్రమోషన్లు రావలసి ఉన్నది. పదోన్నతులు ఇవ్వడంలో ఉన్నతాధికారులు అలసత్వం ప్రదర్శిస్తున్నారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే బలహీన వర్గాలు, ఎస్సీ దళిత విద్యార్థులు చదువుతున్న సంక్షేమ గురుకులాల్లో విద్యాప్రమాణాలు దెబ్బతింటున్నాయని, పర్యవేక్షణ లోపం వల్ల గురుకుల వ్యవస్థ ప్రతిష్ఠకు భంగం కలుగుతుంది. సాంఘిక సంక్షేమ శాఖ మంత్రితో పాటు సాంఘిక సంక్షేమ శాఖ ఉన్నతాధికారులు చొరవ తీసుకొని సీనియారిటీ ప్రకారం అర్హులైన సంక్షేమ గురుకుల ఉద్యోగులు, జూనియర్ అసిస్టెంట్ స్థాయి నుంచి ప్రిన్సిపల్ జోనల్ ఆఫీసర్, డిప్యూటీ సెక్రటరీ, జాయింట్ సెక్రెటరీ స్థాయిల్లో పదోన్నతులు కల్పించాలి.

గంగదేవిపల్లిని సందర్శించిన నేపాల్ దేశస్థులు

- జాతీయ గీతాన్ని ఆలపించిన విదేశీ బృందం



గ్రామస్థులు, విద్యార్థులతో జాతీయ గీతాన్ని ఆలపిస్తున్న నేపాల్ బృందం

గీసుగొండ, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జాతీయ ఆదర్శ గ్రామమైన గంగదేవిపల్లిని నేపాల్ దేశానికి చెందిన 15 స్వచ్ఛంద సంస్థల 17 మంది ప్రతినిధి బృందం బాలవికాస సేవా సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం సందర్శించింది. ఈ సందర్భంగా వందేమాతరం గీతం ఏర్పాటై 150 ఏళ్లు పూర్తయిన సందర్భంగా గ్రామంలోని విద్యార్థులు, గ్రామస్థులతో పాటు వందేమాతరం గీతాన్ని వారు ఆలపించారు. అనంతరం గ్రామంలోని పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. గ్రామం అభివృద్ధి చెందిన తీరు, జాతీయస్థాయికి ఎదిగిన విధానం, సాధించిన పలు జాతీయ, అంతర్జాతీయ అవార్డులు గురించి విదేశీ బృందానికి జిల్లా ట్రెయినింగ్ మేనేజర్ కూసం రాజమౌళి వివరించారు. గ్రామాభివృద్ధిని, ప్రజల స్వచ్ఛంద భాగస్వామ్యాన్ని ప్రతినిధి బృందం అభినందించారు. ఈ కార్యక్రమంలో బాలవికాస సంస్థ ప్రోగ్రాం డైరెక్టర్ సింగారెడ్డి సునీత, కొట్టె రమాదేవి, విదేశీ బృందం ప్రతినిధులు త్రిబేనికుమార్ యాదవ్, జనక్‌కర్కి, రుక్మణికర్కి, అర్చన చౌదరి, గుణేష్ బహదూర్ ఠాకూర్, విష్ణుప్రసాద్ కున్వర్, ఉమేష్‌న్యూపానె, బినోద్ కుమార్ బిషంకే, హరినారాయణ్‌ప్రసాద్, సంజయ్‌కష్యాపాషాహీ, శత్రుఘ్నసింగ్, దివాకర్‌ఝా, రౌనక్‌రాజ్, చాందనీషా, శ్యామ్‌సుందర్ సింగ్, స్థిరానాబస్నెట్, శ్యామ్‌కుమారీసాహ్, గ్రామ కార్యదర్శి రమ్య కుమారీ, నిమ్మల శేఖర్, గోనె నాగరాజు, హెచ్‌ఎం రజాక్, విద్యార్థులు పాల్గొన్నారు.

జాగృతి జనం బాటను
జయప్రదం చేయాలి

- వరంగల్, హనుమకొండ జిల్లాల్లో కవిత పర్యటన
- తెలంగాణ జాగృతి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రూప్‌సింగ్

వడ్డేపల్లి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): వరంగల్, హనుమకొండ జిల్లాల్లో శనివారం, ఆదివారం నిర్వహించే తెలంగాణ జాగృతి జనం బాటలో ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని తెలంగాణ జాగృతి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ లకావత్ రూప్‌సింగ్, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు మారేపల్లి మాధవి కోరారు. శుక్రవారం హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారితో పాటు జాగృతి రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ నలమాస శ్రీకాంత్‌గౌడ్ మాట్లాడారు. రాష్ట్రంలో తెలంగాణ జాగృతి ప్రధాన ప్రతిపక్ష పాత్ర పోషిస్తున్నదని అన్నారు. తుఫాన్ ప్రభావం వల్ల రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో రైతులు పండించిన ధాన్యం తడిచిపోవడంతోపాటు వరి చేళ్లు నేలబారి రైతాంగం తీవ్రంగా నష్టపోయారని పేర్కొన్నారు. అధికార కాంగ్రెస్ పార్టీతో పాటు బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు రైతుల సమస్యలను గాలికి వదిలి జూబ్లీహిల్స్ ఎన్నికల ప్రచారంలో మునిగారని దుయ్యబట్టారు. మహిళా సాధికారత కేవలం తెలంగాణ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితకే సాధ్యమవుతుందని చెప్పారు. వరంగల్, హనుమకొండ జిల్లాలలో ఈ నెల 8, 9 తేదీల్లో నిర్వహించే తెలంగాణ జాగృతి జనం బాటలో సంస్థ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పాల్గొంటారని పేర్కొన్నారు. రెండు రోజుల పాటు కొనసాగే జాగృతి జనం బాటలో భాగంగా మేధావులు, న్యాయవాదులు, ప్రొఫెసర్లు, జర్నలిస్టులు, విద్యార్థులతో ముమేకమవుతారని అన్నారు. కాజీపేట మండలం టేకులగూడెం గ్రామంలో దెబ్బతిన్న వరిచేళ్లను పరిశీలిస్తారని చెప్పారు. ఉనికిచర్ల ఎక్స్ రోడ్డు దగ్గర జాగృతి జిల్లా శ్రేణులు కవితకు స్వాగతం పలికి బైక్ ర్యాలీని ప్రారంభిస్తారని పేర్కొన్నారు. అనంతరం హనుమకొండలో తుఫాన్ తాకిడితో దెబ్బతిన్న సమ్మయ్య నగర్, వివేక్‌నగర్, అమరావతి నగర్ ప్రాంతాలను సందర్శించి బాధితులను పరామర్శిస్తారని తెలిపారు. ఎంజీఎం, సీకేఎం ఆస్పత్రులు, ఎస్ఆర్ నగర్ వంటి ప్రాంతాలను సందర్శిస్తారని జాగృతి శ్రేణులు తెలిపారు. ఈ సమావేశంలో తెలంగాణ జాగృతి హనుమకొండ జిల్లా అధ్యక్షుడు పర్లపెల్లి శ్రీశైలం, వరంగల్ జిల్లా మహిళా అధ్యక్షురాలు మేకల రాణి, నేతలు మంజుల, వంశీకృష్ణ, సొల్తి కిశోర్, జన్ను సంతోష్, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న లకావత్ రూప్‌సింగ్, మారేపల్లి మాధవి

కొత్త ఓటర్ల నమోదు ప్రక్రియ

- స్థానిక సంస్థల ఎన్నికల వాయిదా నేపథ్యంలో..
- తిరిగి నిర్వహించే సమయానికి నవీకరణ
- ఓటర్ల నమోదుకు అవగాహన కార్యక్రమాలు



హనుమకొండ, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు ప్రస్తుతం వాయిదా పడడంతో తిరిగి ఎన్నికలు జరిగే నాటికి కొత్త ఓటర్లను నమోదు చేసే ప్రక్రియను చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వం స్థానిక ఎన్నికల నిర్వహణకు ముందుకు వెళితే అప్పటికప్పుడు కొత్త జాబితా రూపొందించడం కష్టంగా మారుతుందని ఇలా ముందస్తు ఓటర్ల జాబితా నవీకరణ నిర్వహిస్తున్నారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ఈ దిశగా నవీకరణ ప్రక్రియను చేపట్టింది. ఈ విషయంలో ఇప్పటికే అధికారులు ఈ విషయమై క్షేత్ర స్థాయి సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఎన్నికల ప్రకటన వచ్చే సరికే తాజా ఓటరు జాబితా సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. అందుకు ఆయా పంచాయతీల్లో వార్డుల వారీగా కొత్త ఓటర్లు ఎంత మంది ఉన్నారో చూస్తున్నారు.

మరోమారు నవీకరణ

స్థానిక సంస్థల ఎన్నికల ఓటరు జాబితాను మరోమారు నవీకరించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం కలెక్టర్లకు ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. గత ఏడాది నవంబరు నుంచి ఇప్పటి వరకు స్థానిక సంస్థల ఎన్నికల ఓటరు జాబితాను రెండు మార్లు సవరించారు. ఇప్పుడు ఎన్నికలు వాయిదా పడడంతో తాజాగా మరోమారు నవీకరిస్తున్నారు. ఈనెల 15 వరకు నమోదయ్యే వారి వివరాలను జాబితాలో చేర్చనున్నారు. ఉమ్మడి జిల్లాలో మొత్తం 22,45,553 మంది ఓటర్లు ఉన్నారు. హనుమకొండ జిల్లాలో 3,72,646, వరంగల్ జిల్లాలో 3,85,163, జనగామ జిల్లాలో 4,01,115, మహబూబాబాద్ జిల్లాలో 5,51,999, ములుగు జిల్లాలో 2,31,052 , జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 3,03,556 మంది ఓటర్లు ఉన్నారు.

అవగాహన కార్యక్రమాలు

కొత్త ఓటర్ల నమోదుకు అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. విద్యాసంస్థల్లో 19 ఏళ్లు నిండిన యువతీ యువకులు దరఖాస్తు చేసుకునే విధంగా కొన్ని అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. దీనితో ఎక్కువ మంది ఓటర్లు నమోదు అయ్యే అవకాశం ఉంది. జిల్లాలో విద్యాసంస్థల నుంచి ఏటా 10వేలకు పైగా 18 సంవత్సరాలు దాటే వయోజనులు పై తరగతులకు వెళ్తున్నారు. ఈ నేపథ్యంలో అవగాహన కార్యక్రమాల ద్వారా కొత్త దరఖాస్తులు చేయిస్తే అటు కేంద్ర ఎన్నికల సంఘం జాబితాలో ఇటు స్థానిక సంస్థల ఎన్నికల జాబితాలో వారికి చోటు లభిస్తుంది.

ఆన్‌లైన్ ద్వారా సైతం..

జనవరి 1, ఏప్రిల్ 1, జూలై 1, ఓటర్ల జాబితా సవరణ సంవత్సరం అక్టోబరు 1 నాటికి 18 ఏళ్లు నిండిన భారతీయ పౌరులకు ఆన్‌లైన్ ద్వారా ఓటరుగా నమోదు చేసుకునే అవకాశం కూడా భారత ఎన్నికల కమిషన్ కల్పించింది. నేషనల్ ఓటర్స్ సర్వీస్ పోర్టల్‌లో ఆన్‌లైన్‌లో ఫారం-6 నింపడం ద్వారా ఓటరుగా నమోదు కావచ్చు. నమోదైన ఓటర్లు తమ నమోదు స్థితిని కూడా తనిఖీ చేసుకోవచ్చు. సాధారణ ఓటర్లు ఫారం-6(ఆన్‌లైన్ ఫారం లింక్) నింపాలి. ఇది కొత్త ఓటర్ల నమోదు కోసం మాత్రమే. ఎన్ఆర్ఐ ఓటరు ఫారం-6ఏ నింపాలి. (ఆన్‌లైన్ ఫారం లింకు).

పత్తి రైతుపై సీసీఐ కత్తి!

(5వ పేజీ తరువాయి)

పత్తి పంట మొత్తం నీట మునిగింది. ఇళ్లలో ఆరబెట్టినప్పటికీ పత్తికి కూడా వరుస వర్షాలతో నిమ్ము చేరింది. పత్తిని ఎండలో ఆరబెడతామంటే మబ్బులు కమ్ముకుంటున్నాయి. ఈ క్రమంలో సీసీఐ 8 నుంచి 12 శాతం తేమ నిబంధన రైతులకు శాపంగా మారింది. వాతావరణంలోనే తేమ పెరిగి ఉందని, అలాంటప్పుడు 12శాతం లోపు తేమతో పత్తిని మార్కెట్‌కు తీసుకరావటం ఎలా సాధ్యమని రైతులు ప్రశ్నిస్తున్నారు. తేమ పేరుతో సీసీఐ అధికారులు మద్దతు ధరలో కోత పెడుతుండటంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో తేమ శాతాన్ని 18 నుంచి 30 శాతానికి పెంచాలని రైతులు చేస్తున్న విజ్ఞప్తిని సీసీఐ పట్టించుకోవటం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇదే అదనుగా భావించిన ప్రైవేటు వ్యాపారులు రైతుల నుంచి క్వింటాల్‌కు రూ.5వేల నుంచి రూ.7వేల వరకే తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారు.

జిన్నింగ్ మిల్లర్లతో కొర్రీలు

పత్తి విక్రయానికి వచ్చినప్పటి నుంచి కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) తీసుకువస్తున్న నిబంధనలు రైతుకు గుదిబండగా మారుతున్నాయి. పత్తి కొనుగోలు ప్రక్రియకు ముందే జిన్నింగ్ మిల్లులతో సీసీఐ పంచాయితీకి దిగింది. పాత నిబంధనలను మార్చటంతో మిల్లులను సీసీఐకి అద్దెకు ఇచ్చేందుకు జిన్నింగ్ మిల్లుల యాజయాన్యాలు నిరాకరించాయి. రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ప్రత్యేక చొరవతో జిన్నింగ్ మిల్లుల పంచాయితీ ఓ కొలిక్కివచ్చినట్టే వచ్చినా.. మళ్లీ సీసీఐ కొర్రీలతో మొదటికి వస్తోంది. తెలంగాణలోమొత్తం 322 జిన్నింగ్ మిల్లులు ఉండగా, ఉమ్మడి వరంగల్ జిల్లాలో 56 మిల్లులను గుర్తించారు. ఒక పత్తి బేల్‌కు రూ.1,440లు చెల్లించేందుకు మిల్లు యాజమానులతో సీసీఐ ఒప్పందం చేసుకుంది. అక్టోబరు చివరివారంలో సీసీఐ ద్వారా కొనుగోళ్లను ప్రారంభించింది. అయితే జిన్నింగ్ మిల్లులను సీసీఐ ఎల్-1, ఎల్-2, ఎల్-3 పేరిట వర్గీకరించింది. కపాస్ యాప్‌లో తొలుత ఎల్-1 మిల్లుల జాబితానే సీసీఐ ప్రదర్శిస్తోంది. ఆ మిల్లుల్లో సామర్థ్యం పూర్తయితే ఎల్-2కు, ఆ తరువాత ఎల్-3 మిల్లులకు అవకాశం ఇస్తోంది. ఈ విధానంపై జిన్నింగ్ మిల్లర్లు అభ్యంతరం చెప్పుతున్నారు. రైతులు తమ ప్రాంతంలో ఉన్న సీసీఐ కేంద్రాల్లో పత్తిని విక్రయించుకునే అవకాశాన్ని చేజార్చుకుంటున్నారని మిల్లర్లు పేర్కొంటున్నారు. గతంలో మాదిరిగా మిల్లుల సామర్థ్యాన్ని బట్టి జాబ్ వర్క్ టెండర్లు ఇవ్వలేదని, అన్ని మిల్లుల్లో బేల్‌కు ఒకటే ధర చెల్లిస్తున్నారని, అలాంటప్పుడు మిల్లుల వర్గీకరణ ఎందుకని, అన్ని మిల్లుల్లో కొనుగోళ్లు ఒకేసారి చేపట్టాలని జిన్నింగ్ అండ్ కాటన్ ఇండస్ట్రీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్‌రెడ్డి డిమాండ్ చేశారు.

చిక్కిన రౌడీషీటర్ సూరి

- అతడితోపాటు ఏడుగురు గన్‌గ్యాంగ్ సభ్యుల అరెస్టు
- కొత్తగట్టు క్రాస్ వద్ద పోలీసులకు పట్టుబడిన నిందితులు
- ఈస్ట్‌జోన్ డీసీపీ అంకిత్‌కుమార్ వెల్లడి



స్వాధీనం చేసుకున్న పిస్తోళ్లు, కత్తి, బుల్లెట్‌ను పరిశీలిస్తున్న డీసీపీ

వరంగల్ క్రైం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): రౌడీషీటర్ దాసరి సురేందర్ అలియాస్ సూరి పోలీసులకు పట్టుబడ్డాడు. ఆయనతో పాటు గన్‌గ్యాంగ్ సభ్యులైన ఏడుగురిని పట్టుకున్నారు. గత నెల 18న హనుమకొండ జిల్లా శాయంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని మాందారిపేట క్రాస్‌రోడ్డు వద్ద లారీ డ్రైవర్‌తో పాటు పెట్రోల్ పంపు నిర్వాహకులను పిస్తోల్‌తో బెదిరించిన సంఘటనలో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరిపై పలు సెక్షన్ల కింద రెండు కేసులు నమోదు చేసినట్లు ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్‌కుమార్ తెలిపారు. రెండు పిస్తోళ్లు, ఒక కత్తి, ఒక బుల్లెట్‌ను స్వాధీనం చేసుకున్నామన్నారు. శుక్రవారం వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీసీపీ వివరాలు వెల్లడించారు.

వరంగల్ జిల్లా నెక్కొండ పోలీస్‌స్టేషన్ పరిధిలోని నాగారం గ్రామానికి చెందిన దాసరి సురేందర్ అలియాస్ సూరి హైదరాబాద్‌లో స్థిరపడ్డాడు. ఈయనపై రాచకొండ పోలీస్ కమిషనరేట్‌లో రౌడీషీట్‌తోపాటు 3సార్లు పీడీ యాక్టు నమోదు, 2 పోక్సో కేసులు, భార్య హత్య కేసు, దాదాపు 44 కేసులు నమోదయ్యాయి. దీంతో సూరిని అక్కడి పోలీసులు గత ఏప్రిల్‌లో నగర బహిష్కరణ చేయగా, తన మకాంను హనుమకొండలోని భీమారానికి మార్చారు. ఈ క్రమంలో స్థానిక యువకులను చేరదీసి గ్యాంగ్ నిర్వహిస్తూ గంజాయి సేవించేవాడు. ఈ క్రమంలో సురేందర్ అనుచరుడైన భూపాలపల్లికి చెందిన బాసిత్‌ను ఇటీవల కొందరు యువకులు గ్యాంగ్‌వార్‌లో భాగంగా హత్య చేశారు. బాసిత్‌ను హత్య చేసిన సోనూ, బబ్లూను చంపేందుకు బాసిత్ బావ ఖారుఖ్‌ఖాన్ సూరితో ఒప్పందం కుదుర్చుకున్నాడు. దీనిలో భాగంగా గత అక్టోబరు 18న సూరి మరో ఏడుగురు వ్యక్తులను రెండు ద్విచక్ర వాహనాలపై ఎక్కించుకొని శాయంపేట పీఎస్ పరిధిలోని మాందారిపేట గుట్టలకు చేరుకొని అక్కడ మద్యం సేవించారు. అనంతరం మాందారిపేట క్రాస్ వద్ద లారీ డ్రైవర్‌ను ఆపి పిస్తోల్‌తో కొట్టి బెదిరించారు. అక్కడి నుంచి సమీపంలోని భారత్ పెట్రోల్‌పంపులోకి వెళ్లి పెట్రోల్ పోయించుకొని డబ్బులు ఇవ్వకుండా నిర్వాహకులను పిస్తోల్‌తో బెదిరించి పారిపోయారు. సిరిసిల్లకు చెందిన లారీడ్రైవర్ కొమిరె రజినీకాంత్ ఫిర్యాదు మేరకు శాయంపేట ఎస్సై పరమేశ్వర్ కేసు నమోదు చేశారు. శుక్రవారం కొత్తగట్టు క్రాస్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా సురేందర్‌తో పాటు అతడి అనుచరులు ఏడుగురు, రెండు పిస్తోల్స్, ఒక బుల్లెట్, కత్తితో పట్టుబడ్డారని డీసీపీ వివరించారు.

బిహార్ నుంచి పిస్తోల్స్ కొనుగోలు

రౌడీషీటర్ సురేందర్ జైలులో ఉన్నప్పుడు హైదరాబాద్ నానక్‌రామ్‌గూడకు చెందిన ఆదిత్యకుమార్ ఠాకూర్ పరిచయమయ్యాడు. 4 నెలల కిందట బిహార్‌లోని భగల్పూర్ జిల్లా నగోచియ మండలంలోని నగర గ్రామంలో కుందన అనే వ్యక్తి నుంచి ఆదిత్యఠాకూర్ రూ.50వేలకు పిస్తోల్, ఒక్క బుల్లెట్‌కు రూ.500 చొప్పున 9 బుల్లెట్‌లు కొనుగోలు చేశాడు. నెల తర్వాత సురేందర్ గ్యాంగ్‌లో సభ్యుడైన ములుగు జిల్లాకు చెందిన సామ్రాజ్ చక్రికి ఆదిత్యఠాకూర్ రూ.50వేలకు పిస్తోల్‌తో పాటు 6 రౌండ్స్‌లు కొనుగోలు చేసి ఇచ్చాడు. కాగా, ఇవే పిస్తోల్స్‌తో శుక్రవారం శాయంపేట పోలీసులకు సురేందర్‌తో పాటు ములుగుకు చెందిన సామ్రాజ్ చక్రి, భీమారానికి చెందిన చంచు రాహుల్, కోమటిపల్లికి చెందిన నమిండ్ల శివ, భీమారానికి చెందిన డాగ్ ట్రాన్స్‌పోర్టర్ రౌతు శివ వైభవ్, ములుగుకు చెందిన సామ్రాజ్ క్రాంతి, ఎనుగుల నితిన్, నానక్‌రామ్‌గూడకు చెందిన ఆదిత్యఠాకూర్ పట్టుబడ్డట్టు డీసీపీ వెల్లడించారు. కాగా, రాచకొండలో సురేందర్‌పై 44 కేసులు నమోదు కాగా, వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లోని శాయంపేటలో తాజాగా రెండు కేసులు నమోదయ్యాయన్నారు.

ఈ సందర్భంగా గ్యాంగ్ సభ్యులను పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన అధికారులు, సిబ్బందికి డీసీపీ రివార్డులను అందజేశారు. ఈ సమావేశంలో టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్, మామునూరు ఏసీపీ వెంకటేశ్, శాయంపేట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రంజిత్‌రావు, టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ బాబులాల్, ఎస్సై పరమేశ్వర్, అశోక్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రారంభమైన
సర్జన్స్ సదస్సు

వరంగల్ మెడికల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ అసోసియేషన్ ఆఫ్ సర్జన్స్ ఆఫ్ ఇండియా, తెలంగాణ రాష్ట్ర విభాగం 11వ వార్షికోత్సవం శుక్రవారం వరంగల్‌లోని కాకతీయ మెడికల్ కాలేజీ ప్రాంగణంలో గల ఎన్ఆర్ఐ ఆడిటోరియంలో లాంచనంగా ప్రారంభమైంది. మూడు రోజులపాటు జరగనున్న ఈ కాన్ఫరెన్స్‌ను తెలంగాణ అసోసియేషన్ ఆఫ్ సర్జన్స్ ఆఫ్ ఇండియా, కాకతీయ మెడికల్ కాలేజీ సర్జరీ విభాగాలు సంయుక్తగా నిర్వహిస్తున్నాయి. ప్రెసిడెంట్ డాక్టర్ మోహన్‌దాస్, ప్రెసిడెంట్ ఎలెక్ట్ డాక్టర్ జీవన్‌రావు, ఆర్గనైజింగ్ చైర్మన్ డాక్టర్ శ్రీనివాస్‌గౌడ్‌లు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. మొదటి రోజు పోస్టు గ్రాడ్యుయేట్ విద్యార్థులకు, యువ సర్జన్లకు శిక్షణ తరగతులు, పీజీ క్లినిక్స్, చేతిపని శిక్షణ వంటి విద్యా కార్యక్రమాలను నిర్వహించారు. అసోసియేషన్ ఆఫ్ సర్జన్స్ ఆఫ్ ఇండియా సంస్థ 1938లో స్థాపించబడిందని, దీని ముఖ్య ఉద్దేశం రాష్ట్రంలోని సర్జన్లందరు ఒకేచోట కలుసుకొని వృత్తిపరమైన అనుభవాలు పంచుకోవడానికి అని ఆర్గనైజింగ్ సెక్రటరీ ప్రొఫెసర్ కూరపాటి రమేశ్ తెలిపారు. చరిత్రాత్మకమైన వరంగల్ నగరంలో టీఎస్ ఏఎస్ఐ 11వ వార్షికోత్సవం జరగడం శస్త్రచికిత్సలో కొత్త సాంకేతిక పరిజ్ఞానం సమకూరుతుందని ఆయన తెలిపారు. ఈ సదస్సులో డాక్టర్ అప్పాల సుధాకర్, డాక్టర్ బి.ఆర్.సిద్ధార్థ, డాక్టర్ నాగేంద్ర, వివిధ మెడికల్ కళాశాలలకు చెందిన ఫ్యాకల్టీ ప్రొఫెసర్లు తదితరులు పాల్గొన్నారు.



సదస్సును ప్రారంభిస్తున్న అతిథులు



ఆయుష్మాన్ కార్డులను పంపిణీ చేస్తున్న డాక్టర్ హైదర్, కృష్ణారెడ్డి

ఆయుష్మాన్ భారత్ కార్డుల పంపిణీ

వడ్డెపల్లి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండ 57వ డివిజన్ అశోక కాలనీలో అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మండల కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలో ఆయుష్మాన్ భారత్ హెల్త్ కార్డులపై ప్రజలకు శుక్రవారం అవగాహన కల్పించారు. సమ్మయ్య నగర్ పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ హైదర్, మండల కృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి బూర రాంచందర్, ఉపాధ్యక్షులు బొద్దిరెడ్డి భగవాన్‌రెడ్డి, మల్లేషం, దేవాలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు చింత శ్రీనివాస్, సరోత్తంరెడ్డి, కనకరాజు తదితరులు ఆయుష్మాన్ భారత్ హెల్త్ కార్డులను పంపిణీ చేశారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో ఐదుగురికి జైలుశిక్ష

వరంగల్ క్రైం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడ్డ 25 మందిని శుక్రవారం కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి ఎ.వేణుగోపాల్ ఐదుగురికి జైలు శిక్ష విధించినట్లు హనుమకొండ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ జి. సీతారెడ్డి తెలిపారు. మిగతా 20 మందికి రూ.21,800 జరిమానా విధించారన్నారు. అదే విధంగా డ్రైవింగ్ లైసెన్స్ లేని 12 మందిని కోర్టులో హాజరుపరచగా రూ.8,600 జరిమానా విధించడం జరిగిందన్నారు.

గ్యాస్ సిలిండర్ల చోరీ కలకలం

హసన్‌పర్తి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : 1వ డివిజన్ పరిధి నారాయణనగర్ కాలనీలో గ్యాస్ సిలిండర్ చోరీకి గురైంది. పొన్నోజు శివప్రసాద్ ఇంటికి శుక్రవారం ఓ గుర్తు తెలియని వ్యక్తి వచ్చాడు. నేరుగా వచ్చి గ్యాస్ బండి వచ్చిందంటూ ఇంటి యజమాని భార్య పనిలో ఉండగానే ఇంట్లోకి చొరబడి గ్యాస్ మొద్దును తస్కరించడం స్థానికులను ఆశ్చర్యానికి గురిచేసింది. ఇంటి యజమాని భార్య గ్యాస్ బాయ్ తిరిగి గ్యాస్ మొద్దు ఇంట్లోకి తీసుకురాకపోవడంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది.

సీజేపై జరిగిన దాడిపై విచారణ చేపట్టాలి



ప్రాక్టీసింగ్ పాఠశాలలో నిరసన వ్యక్తం చేస్తున్న ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం నేతలు

వరంగల్ ఎడ్యుకేషన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి గవాయ్‌పై జరిగిన దాడిపై సమగ్ర విచారణ చేపట్టాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం ఉమ్మడి వరంగల్ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ చాగంటి ప్రభాకర్ డిమాండ్ చేశారు. శుక్రవారం భోజన విరామ సమయంలో సంఘంఆధ్వర్యంలో హనుమకొండలోని ప్రభుత్వ ప్రాక్టీసింగ్ పాఠశాలలో నిరసన ప్రదర్శన చేశారు. ఈసందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ.. సీజేపై జరిగిన దాడి ప్రజాస్వామ్య విరుద్ధమన్నారు. దాడిపై సమగ్ర విచారణ చేపట్టి నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు నర్సయ్య, మంజుల, ప్రభాకర్, విద్యాసాగర్, శ్రీనివాస్, వాణి, యాదగిరి, భీమానాయక్, శ్రీనివాస్, కిషన్ పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్లకు ప్రధాని సహకరించాలి

కేయూ క్యాంపస్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు ప్రధాని మోదీ జోక్యం చేసుకుని సహకరించాలని బీసీ జాక్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ తిరుణహరి శేషు అన్నారు. శుక్రవారం ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో బీసీ సంఘాల సమావేశం జరిగింది. అక్టోబరు 27న ప్రధాని మోదీ కార్యాలయానికి రిజర్వేషన్లపై లేఖ రాయగా అవసరమైన చర్యలు చేపడుతామని సమాధానం వచ్చిందని పేర్కొన్నారు. బలహీనవర్గాల సంక్షేమ శాఖను పంపుతామని పేర్కొన్నారని వివరించారు. గతంలో మహిళా రిజర్వేషన్, ఎస్సీ వర్గీకరణ, ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ల బిల్లుకు పరిష్కారం లభించినట్లే బీసీ రిజర్వేషన్ల విషయంలోనూ చొరవతీసుకోవాలని కోరారు. సమావేశంలో బీసీ జాక్ రాష్ట్ర కన్వీనర్ దారబోయిన సతీశ్, సోమిడి అంజన్‌రావు, ఎదునూరి రాజమౌళి, బుట్టి శ్యాంయాదవ్, డాక్టర్ ఎర్రబోజు రమేశ్, ధర్మపురి రామారావు, ఐతం నగేశ్, చిన్నాల యశ్వంత్, కందికొండ కృష్ణారావు పాల్గొన్నారు.

ఎస్సార్‌యూలో మోడల్ యునైటెడ్ నేషన్స్-2025



మాట్లాడుతున్న ఐపీఎస్ అధికారి శుభం కుమార్

హసన్‌పర్తి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అనంతసాగర్ ఎస్సార్ విశ్వవిద్యాలయంలో ఎస్సార్ మోడల్ యునైటెడ్ నేషన్స్-2025 కార్యక్రమం శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. కంప్యూటర్ సైన్స్ అండ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ విభాగాధిపతి డాక్టర్ శశికళ, అసోసియేట్ డీన్ స్టూడెంట్ వెల్ఫేర్ డాక్టర్ దీపా అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఐపీఎస్ అధికారి శుభం కుమార్, కాజీపేట ఏసీపీ పింగిళి ప్రశాంత్‌రెడ్డి, హసన్‌పర్తి ఇన్‌స్పెక్టర్ చేరాలు పాల్గొని విద్యార్థులనుద్దేశించి ప్రసంగించారు. విద్యార్థుల్లో ప్రపంచ అవగాహన, నాయకత్వ నైపుణ్యాలు, సమస్య పరిష్కార సామర్థ్యాలు పెంపొందించడమే మోడల్ యునైటెడ్ నేషన్స్-2025 ముఖ్య ఉద్దేశమన్నారు. విద్యార్థులు చదువుతో పాటు సంస్కారం అలవర్చుకుంటేనే జీవితంలో గొప్పగా రాణించగలుగుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఫ్యాకల్టీ కోఆర్డినేటర్లు ఎల్.గుణాకర్‌రావు, ఎస్.మహేందర్, డాక్టర్ రమేష్, సెక్రటరి జనరల్ మాస్టర్ శాంతన్ శ్రీవాస్తవ పాల్గొన్నారు.

డైట్‌లో ఆకట్టుకున్న గణిత షోడశావధానం

హనుమకొండ, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండలోని డిస్ట్రిక్ట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్ (డైట్)లో ప్రముఖ గణితావధాని అడ్లూరు నర్సింహమూర్తి గణిత షోడశావధానం విశేషంగా ఆకట్టుకున్నది. ఈ కార్యక్రమానికి డైట్ ప్రిన్సిపాల్ డాక్టర్ మహ్మద్ అబ్దుల్‌హై అధ్యక్షత వహించారు. రిటైర్డ్ డీఈవో నన్నపురాజు రమేశ్వర్ రాజు అనుసంధానకులుగా వ్యవహరించారు. పదహారు మందిని పృచ్ఛకులుగా ఎంపిక చేసి వారు సంధించిన గణిత సమస్యలకు సమాధానాలను బోర్డు, చాక్‌పీస్ ఉపయోగించకుండా మనసులోనే గణించి డాక్టర్ అడ్లూరు జవాబులు చెప్పి అందరినీ ఆశ్చర్యానికి గురి చేశారు. ఈ కార్యక్రమంలో గణిత అధ్యాపకులు మారోజు సోమయ్య, ఎస్.భాస్కరాచారి, కె.శ్రీధర్, నజీమా, జోహ్రా, విజయ, శిల్ప, నిహారిక, బుచ్చిబాబు, మహిత పాల్గొన్నారు. అనంతరం నర్సింహమూర్తి గణిత పథం-భవిత రథం పుస్తకాలను బహూకరించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

రాంనగర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా నేడు నగరంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. బాలసముద్రం, పెద్దమ్మగడ్డ, ఆర్ఈసీ, కడిపికొండ సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు, మడికొండ, టెక్స్‌టైల్, టేకులగూడెం సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 9.30 నుంచి 11.30 గంటల వరకు, గోపాల్‌పూర్ సబ్‌స్టేషన్ పరిధిలోని జవహర్‌కాలనీ సర్కిల్, ఎస్‌వీఎస్ హోమ్స్, కొండామురళి గెస్ట్‌హౌస్ రోడ్డు, ఉషోదయ కాలనీ ఏరియా, కేయూసీ సబ్‌స్టేషన్ పరిధిలోని ఈద్గా, పోచమ్మకుంట, శ్రీనగర్ కాలనీ, తేజస్వీ స్కూల్ ఏరియా, కిషన్‌పుర, నయీంనగర్, శంకర్‌నగర్, కేయూజంక్షన్ ఏరియా, నక్కలగుట్ట సబ్‌స్టేషన్ పరిధిలోని వాటర్ ట్యాంక్ బ్యాక్ సైడ్, నక్కలగుట్ట, వినాయకనగర్, కాళోజీ స్ట్రీట్ ఏరియా, డీసీసీబీ బ్యాంకు, కోర్టు బ్యాక్ సైడ్ ఏరియా, హరిత కాకతీయ హోటల్ ఎదురుగా ఉన్న ఏరియాలో ఉదయం 10 నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా జరగదని డీఈ తెలిపారు.

నేడు వరద బాధితుల ధర్నా

వడ్డెపల్లి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : తుఫాన్ ప్రభావం వల్ల గోపాల్‌పూర్ ఊర చెరువు వరద నీటితో హనుమకొండలోని 56, 57 డివిజన్లలో నష్టపోయిన వరద బాధితులు శనివారం ఉదయం 10 గంటలకు తులసీ బార్ చౌరస్తాలో కుటుంబ సభ్యులతో మహాధర్నా చేయనున్నట్లు వివేక్‌నగర్ కాలనీ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మర్రి ప్రభాకర్ తెలిపారు. శుక్రవారం హనుమకొండ 56వ డివిజన్ వివేక్ నగర్ కాలనీలో ప్రధాన కార్యదర్శి మీసాల రమేష్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు.

ఉత్సాహంగా వందేమాతరం గీతాలాపన



కలెక్టరేట్‌లో వందేమాతరం గీతాలాపన చేస్తున్న కలెక్టర్ స్నేహ శబరీష్, ఇతర అధికారులు

హనుమకొండ కలెక్టరేట్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : వందేమాతరం గీతం రచించి 150 ఏళ్లు పూర్తయిన సందర్భంగా కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో శుక్రవారం జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్, ఇతర శాఖల అధికారులు వందేమాతరం గీతాలాపన చేశారు. ఈసందర్భంగా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ.. దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో దేశవాసులందరికీ స్ఫూర్తిని నింపిన వందేమాతరం గీతం శుక్రవారంతో 150 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆలపించినట్లు తెలిపారు. కలెక్టర్ స్నేహ శబరీష్‌తో పాటు జిల్లా రెవెన్యూ అధికారి వై.వి. గణేష్, ట్రెయినీ డిప్యూటీ కలెక్టర్ రోహిత్ నేత, డీఆర్‌డీఓ మేన శ్రీను, సీపీఓ సత్యనారాయణరెడ్డి, జిల్లా మైనారిటీ వెల్ఫేర్ అధికారి మహ్మద్ గౌస్ హైదర్‌తో పాటు ఇతర జిల్లా శాఖల అధికారులు వందేమాతరం ఆలపించారు.

- హనుమకొండ టౌన్: వందేమాతరం జాతీయ గేయం 150వ వార్షికోత్సవం సందర్భంగా కుడా మాజీ చైర్మన్, ఓబీసీ చైర్మన్ సుందర్‌రాజ్ యాదవ్ ఆధ్వర్యంలో కల్నల్ రవీంద్రకుమార్, కమాండింగ్ ఆఫీసర్ రవి, మాస్టర్‌జీ ఎన్‌సీసీ-8 (టీ) గర్ల్స్ బెటాలియన్స్ ఆధ్వర్యంలో కవాతు నిర్వహించారు. హనుమకొండ అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి వందేమాతరం నినాదం చేశారు. భారీ ఎత్తున హాజరైన ఎన్‌సీసీ కేడెట్స్, మాస్టర్‌జీ పీజీ అండ్ డిగ్రీ విద్యార్థులు వందేమాతరం గీతం ఆలపించారు. అనంతరం జాతీయ జెండాలు చేతబూని అంబేద్కర్ సెంటర్ నుంచి అమరవీరుల స్థూపం వరకు కవాతు ప్రదర్శన నిర్వహించారు.

- వరంగల్ ఎడ్యుకేషన్: వరంగల్, హనుమకొండ జిల్లాల్లోని అన్ని యాజమాన్యాల పాఠశాలు, కళాశాలల్లో విద్యార్థులు సామూహికంగా వందేమాతర గీతాన్ని ఆలపించారు. వందేమాతర గీతం రచించి 150 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భాన్ని, బంకించంద్ర ఛటర్జీ జన్మదినాన్ని పురస్కరించుకొని విద్యార్థులు వందేమాతర గీతాన్ని శుక్రవారం నాడు ఆలపించారు. వరంగల్, హనుమకొండ డీఈవో, డీఐఈవో కార్యాలయాలతో పాటు స్కూల్ ఎడ్యుకేషన్, ఇంటర్మీడియెట్ ఎడ్యుకేషన్ ఆర్జేడీ కార్యాలయాల్లో అధికారులు సిబ్బంది సామూహిక వందేమాతర గీతాలాపన కార్యక్రమంలో పాల్గొన్నారు.

- వరంగల్ కార్పొరేషన్: వరంగల్ మునిసిపల్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో వందేమాతరం 150 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా శుక్రవారం సామూహిక వందేమాతరం గీతాన్ని ఆలపించారు. ఈ కార్యక్రమంలో మేయర్ సుధారాణి, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్, అదనపు కమిషనర్ చంద్రశేఖర్, సీఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డి, డిప్యూటి కమిషనర్ సమ్మయ్య, ఈఈ రవికుమార్, జేఏవో చిలివేరు సరిత, సూపరింటెండెంట్ ఆనంద్‌తో పాటు డీఈలు, మునిసిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



ర్యాలీలో వందేమాతరం నినాదాలు చేస్తున్న సుందర్‌రాజ్ యాదవ్, ఎన్‌సీసీ కేడెట్లు



కార్పొరేషన్‌లో గీతాలాపన చేస్తున్న మేయర్, కమిషనర్, అధికారులు

- కేయూ క్యాంపస్: సామూహిక వందేమాతరం గీతాలాపన కార్యక్రమం శుక్రవారం కేయూ పరిపాలన భవనం ఎదుట ఘనంగా నిర్వహించారు. కేయూ వీసీ ప్రొఫెసర్ కె.ప్రతాప్‌రెడ్డి, పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ కట్ల రాజేందర్, డీన్ ప్రొఫెసర్ మామిడాల ఇస్తారి, ఈసీ మెంబర్ డాక్టర్ చిర్రా రాజులు పాల్గొన్నారు. ఎన్‌సీసీ క్యాడెట్లు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు విద్యార్థులతో కలిసి అధికారులు వందేమాతరం గీతాన్ని ఆలపించారు. ప్లకార్డులు, బ్యానర్లు ప్రదర్శిస్తూ దేశభక్తిని ప్రసారం చేశారు. ఈ కార్యక్రమంలో విభాగాధితులు, ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొన్నారు.

- మడికొండ: కాజీపేట మండలం కడిపికొండలోని ప్రాథమిక పాఠశాలలో బంకించంద్ర చటర్జీ రాసిన వందేమాతరం గీతాన్ని శుక్రవారం ఆలపించారు. తొలుత వందేమాతర గీతాన్ని ఆలాపిస్తూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం చుంచుకాల లింగారావు, ఉపాధ్యాయులు జమీలా బేగం, వైద్య సిబ్బంది కోమల, రమ, మధ్యాహ్న భోజన కార్మికులు రాణి, నయీమాతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

- వడ్డెపల్లి: వందేమాతర గీతానికి 150 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా హనుమకొండలోని వివిధ ప్రాంతాల్లో వందేమాతర గీతాన్ని సామూహికంగా ఆలపించారు. శుక్రవారం హనుమకొండ ఎక్సైజ్ కాలనీలోని రాజీవ్ పార్కులో అలయన్స్ క్లబ్ ఆఫ్ నేతాజీ ఆధ్వర్యంలో వాకర్స్ వందేమాతర గీతాన్ని పఠించారు. కార్యక్రమంలో వాకర్స్ ప్రతినిధులు మాదిరెడ్డి మల్లారెడ్డి, తమటం మనోహర స్వామి, అజయ్‌తోపాటు పలువురు వాకర్స్ పాల్గొన్నారు.

గ్రంథాలయ భవనం కూల్చివేత

- గుర్తుతెలియని వ్యక్తుల దుశ్చర్య

వడ్డెపెల్లి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : వడ్డెపల్లి - కేయూ 100 ఫీట్ల రోడ్డుకు ఆనుకొని ఉన్న స్థలంలోని గ్రంథాలయాన్ని గురువారం రాత్రి కొందరు గుర్తు తెలియని వ్యక్తులు కూల్చివేశారు. దీంతో గ్రంథాలయంలోని పుస్తకాలు, ఫర్నీచర్ పూర్తిగా ధ్వంసమైంది. టీఎన్‌జీవోస్ కాలనీ ప్రెసిడెంట్ కొక్కిరాల రవీందర్‌రావు కేయూ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



గుర్తు తెలియని వ్యక్తులు కూల్చివేసిన గ్రంథాలయ భవనం

క్యాంపస్‌లో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

కేయూ క్యాంపస్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): కేయూ దూరవిద్య కేంద్రం, పరీక్షల విభాగంలో అదనపు భవన నిర్మాణ పనులను శుక్రవారం కేయూ వీసీ ప్రొఫెసర్ కె.ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రంలు ప్రారంభించారు. ఎస్డీఎల్‌సీఈలో మొదటి అంతస్తులో రూ.2కోట్ల నిధులతో అదనపు భవనం, పరీక్షల విభాగంలో రూ.1.67 కోట్ల నిధులతో స్టోర్ భవనాన్ని నిర్మించనున్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ బి.సురేశ్‌లాల్, పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ కట్ల రాజేందర్, పాలక మండలి సభ్యులు నిమ్మ సుదర్శన్, రమ, చిర్రా రాజు, మల్లం నవీన్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



ఎస్డీఎల్‌సీఈలో భవన పనులను ప్రారంభిస్తున్న వీసీ, రిజిస్ట్రార్

వర్క్‌షాప్ గోడపత్రిక ఆవిష్కరణ

ఈ నెల 16 నుంచి 30 వరకు 'ఇంటర్నేషనల్ ఇంటెన్సివ్ థీసిస్ రైటింగ్' అనే అంశంపై నిర్వహించే వర్క్‌షాప్ గోడ పత్రికను శుక్రవారం కేయూ వీసీ ప్రొఫెసర్ కె.ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం ఆవిష్కరించారు. నర్సంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల, రాజమండ్రి ఎస్‌కేవీటీ కళాశాలలు సంయుక్తంగా వర్క్‌షాప్‌ను నిర్వహించనున్నాయి.

పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించిన డీఎంహెచ్‌వో

వరంగల్ మెడికల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : శాయంపేట పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని హనుమకొండ డీఎంహెచ్‌వో డాక్టర్ అప్పయ్య శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా భవనం పైకప్పు నుంచి నీటి లీకేజీ, పెచ్చులు ఊడటం, డ్రెయినేజీ, ఇతర సమస్యలను పరిశీలించారు. మరమ్మతుల కోసం జిల్లా కలెక్టర్ రూ.10 లక్షలు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. టీజీ ఎంఐడీసీ ద్వారా చేస్తున్న పనులను పరిశీలించి సంబంధిత కాంట్రాక్టర్‌కు పలు సూచనలు చేశారు. అనంతరం పీహెచ్‌సీలో అందుతున్న సేవలపై అడిగి తెలుసుకున్నారు. పట్టణంలోని ప్రకాశ్‌రెడ్డిపేటలో తరుచుగా సందర్శన చేయని ప్రాంతంలో ఉన్న ఎలైట్ ఆస్పత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రిలోని ఓపీ, ఐపీ, ల్యాబ్, స్కానింగ్ తదితర విభాగాలను డీఎంహెచ్‌వో పరిశీలించారు. పలు రికార్డులను పరిశీలించి సరిగ్గా నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారి మౌనిక, జిల్లా మాస్ మీడి యా అధికారి వి.అశోక్‌రెడ్డి పాల్గొన్నారు.



ఆరోగ్య కేంద్రం భవనాన్ని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో అప్పయ్య

అరాచక పాలన సాగిస్తున్న సీఎం

హనుమకొండ టౌన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో అరాచక పాలన సాగిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెప్పాలని బీఆర్ఎస్ నేతలు పోలపెల్లి రాంమూర్తి, జోరిక రమేష్‌లు వేర్వేరు ప్రకటనలో శుక్రవారం పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన ఇంటర్నల్ సర్వేలు, ఇంటెలిజెన్స్ రిపోర్ట్‌లు జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ ఓడిపోతుందని స్పష్టం కావడంతో ఓటమిని గ్రహించిన సీఎం రేవంత్.. జూబ్లీహిల్స్‌లోని బీఆర్ఎస్ నాయకులు ఎమ్మెల్సీ తక్కళ్లపెల్లి రవీందర్‌రావు నివాసం, మర్రి జనార్దన్‌రెడ్డి నివాసంలో వందలాది మంది పోలీసులు ఆకస్మికంగా దాడులు, సోదాలు చేయడం ప్రజాస్వామ్యాన్ని అణగదొక్కే ప్రయత్నమని ఖండించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో పోలీసు చర్యలు చట్టవిరుద్ధమని పేర్కొన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునిత గెలుపు ఖాయమైందని, కాంగ్రెస్ ఎన్ని కుట్రలు, అక్రమ చర్యలకు పాల్పడినా ప్రజలు బీఆర్ఎస్ పక్షానే ఉన్నారని ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నట్లు వారు పేర్కొన్నారు.

ఆర్మీ రిక్రూట్‌మెంట్ బందోబస్తు పరిశీలన



ఆర్మీ అధికారులతో మాట్లాడుతున్న సీఐ శివకుమార్

వరంగల్ క్రైం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 10 నుంచి హనుమకొండ జేఎన్ఎస్ స్టేడియంలో జరిగే ఆర్మీ రిక్రూట్‌మెంట్‌కు సంబంధించిన బందోబస్తు ఏర్పాట్లను ఆర్మీ అధికారులతో హనుమకొండ సీఐ మచ్చ శివకుమార్ పరిశీలించారు. సీఐ వెంట ఆర్మీ అధికారులు మేజర్ పీసీ రాయ్, సుబేదార్ గురుదాల్ సింగ్, తెలంగాణ రిక్రూటింగ్ డైరెక్టర్ సునిల్ యాదవ్ ఉన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీల్లో విద్యార్థి ప్రతిభ

హసన్‌పర్తి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): భీమారం ఉన్నత పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థి రాహుల్ చంద్ రాష్ట్ర స్థాయి కళోత్సవ పోటీలలో ప్రత్యేక బహుమతి సాధించినట్లు ఇన్‌చార్జి ఎంఈఓ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎ.శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. టీజీ ఐఆర్‌డీ రాజేంద్రనగర్ హైదరాబాద్‌లో జరిగిన త్రీడీ విజువల్ ఆర్ట్స్‌లో రాష్ట్ర స్థాయి కళోత్సవ్ పోటీలలో రాహుల్ చంద్ అత్యంత ప్రతిభకనబర్చి రాష్ట్ర సమగ్ర శిక్ష జాయింట్ డైరెక్టర్ పి.రాజీవ్, రాష్ట్ర అకడమిక్ మానిటరింగ్ అధికారి శ్రీనాథ్ చేతుల మీదుగా మెడల్, ప్రశంసాపత్రాన్ని అందుకోవడం పట్ల ఇంచార్జి ఎంఈఓ ఎ.శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యాయులు శ్రీదేవి, రమాదేవి, ఉషారాణి, చేరాలు, తిరుపతిలు అభినందించి హర్షం వ్యక్తం చేశారు.

మహిళలు స్వశక్తితో ఉపాధి పొందాలి

బాలసముద్రం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మహిళలు స్వశక్తితో ఉపాధి కల్పించుకొని ఆర్థికంగా ఎదగాలని సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ కార్యదర్శి డాక్టర్ పల్లెపాడు దామోదర్ అన్నారు. శుక్రవారం హనుమకొండ రాంనగర్‌లోని సంస్థ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సామాజిక బాధ్యతలో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లోని నిరుపేద మహిళలకు టైలరింగ్‌లో వృత్తి నైపుణ్య శిక్షణ ఇచ్చి ఆర్థికంగా ఎదగడానికి సంస్థ కృషి చేస్తున్నట్లు ఆయన తెలిపారు. 30 ఏళ్ల నుంచి సర్వోదయ సంస్థ మహిళా సాధికారత కోసం సుమారు 20 వేల మంది మహిళలకు వృత్తి నైపుణ్యత శిక్షణ ఇచ్చి శిక్షణతో పాటు ఉచిత కుట్టు మిషన్లను అందించినట్లు దామోదర్ తెలిపారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని వివిధ గ్రామాలకు చెందిన 15 మంది నక్సల్స్ బాధిత కుటుంబాలకు ఆయన శుక్రవారం కుట్టు మిషన్లను పంపిణీ చేశారు. ఆత్మహత్యలకు పాల్పడిన రైతుల కుటుంబాల మహిళలకు వడ్డీ లేని రుణాలను అందిస్తున్నట్లు తెలిపారు. అంతేగాక గృహహింస, వివిధ రకాల సమస్యలు ఎదుర్కొంటున్న సుమారు 30 వేల మంది బాధిత మహిళల సమస్యలను పరిష్కరించినట్లు దామోదర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్వోదయ సంస్థ ప్రాజెక్టు మేనేజర్ కవిరాజ్, ఇందిరా, సఖీ లీగల్ కౌన్సిలర్ శ్రీదేవి, వనిత, జ్యోత్స్న మహిళలు పాల్గొన్నారు.



కుట్టు మిషన్లను పంపిణీ చేస్తున్న దామోదర్

కార్తీక వనభోజనాల పోస్టర్ ఆవిష్కరణ

రెడ్డికాలనీ, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 9వ తేదీన పద్మశాలి కుల బాంధవులు కార్తీక మాసం సామూహిక వనభోజన మహోత్సవాన్ని నిర్వహించనున్నట్లు భక్త మార్కండేయ పద్మశాలి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు బత్తుల రమేశ్‌బాబు తెలిపారు. శుక్రవారం 4వ డివిజన్‌లోని సంఘం కార్యాలయంలో వనభోజనాలకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బత్తుల రమేశ్‌బాబు మాట్లాడుతూ.. ఆదివారం హసన్‌పర్తి ఎర్రగట్టు వెంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పూజా కార్యక్రమాలు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు సైతం నిర్వహిస్తామన్నారు. పద్మశాలి కుల బాంధవులు కుటుంబ సమేతంగా హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ఈ కార్యక్రమంలో గూడురు రాజేంద్ర కుమార్, తుమ్మ రమేశ్‌బాబు, మాచర్ల అరుణ, అయిలయ్య, దేవేందర్, నాగరాజు, దుంపేటి నరేందర్‌బాబు, బేతి రమేశ్, కూచన రమేశ్, గంజి రాజేందర్, సత్తయ్య, బత్తుల మహేందర్, కూరపాటి శ్రీనివాస్, కొంగ సారంగపాణి, దుంపేటి నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కార్తీక వనభోజనాలను విజయవంతం చేయాలి

వడ్డెపలి(ఆంధ్రజ్యోతి): వరంగల్ రంగశాయిపేట పరిసరాల్లోని దూపకుంట రోడ్డులో షైమాస్టర్ పాఠశాల వెనుక ఉన్న మామిడి తోటలో ఈ నెల 16న ఉదయం 11 గంటలకు ఉమ్మడి వరంగల్ జిల్లా విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ జాతీయుల కార్తీక వన భోజనాలకు కుల సంఘీయులంతా తరలివచ్చి విజయవంతం చేయాలని విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ మాతృ సంఘం హనుమకొండ జిల్లా అధ్యక్షుడు అలుగోజు కృష్ణమూర్తి కోరారు. శుక్రవారం హనుమకొండ ఎన్జీవోస్ కాలనీ రోడ్డులోని ప్రైవేటు సమావేశ మందిరంలో కార్తీక వన భోజనాల కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ పెండోట సురేష్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

తెలంగాణ రాష్ట్ర విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ మాతృసంఘం రాష్ట్ర కమిటీ ప్రధాన కార్యదర్శి చొల్లేటి కృష్ణమాచారి ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో వరంగల్ ఉమ్మడి జిల్లాలోని విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ సంఘాల జాతీయులు కుల సంఘాలతో కలిసి వచ్చి కార్యక్రమంలో పాల్గొనాలని పిలుపు నిచ్చారు. సమావేశంలో విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ జిల్లా నాయకులు వీణవంక సదానందం, తూముగంటి హరినాథ్, బండ్లోజు నర్సింహచారి, శ్రీరామోజు నాగరాజు, డాక్టర్ పొడిశెట్టి విష్ణువర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

కేడీసీలో ఘనంగా కార్తీక వనమహోత్సవం

వరంగల్ ఎడ్యుకేషన్(ఆంధ్రజ్యోతి) : హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల(కేడీసీ)లో కార్తీక వనమహోత్సవం ఘనంగా నిర్వహించారు. శుక్రవారం కళాశాలలో ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ గుర్రపు శ్రీనివాస్ వనమహోత్సవాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కార్తీక మాసం పుణ్యమాసమే కాకుండా ప్రకృతితో మన సంబంధా న్ని బలపరిచే పవిత్ర కాలమన్నారు. ప్రతీ విద్యార్థి మొక్క నాటి సంరక్షించాలన్నారు.

ఈ కార్యక్రమంలో అధ్యాపకులు కోమల తదితర అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
నవ్య
కుటుంబ కదంబం
శనివారం • 8 నవంబరు 2025

వంటిల్లు



చాలామంది డ్రాగన్ ఫ్రూట్‌ను ఇష్టంగా తింటూ ఉంటారు. ఈ పండు కమ్మగా కొద్దిపాటి తియ్యదనంతో ఉంటుంది. దీంతో సలాడ్స్, మిల్క్‌షేక్‌లు, జామ్‌లు, స్మూతీలు తయారుచేస్తూ ఉంటారు. ఎన్నో ఔషధ గుణాలతో నిండిన డ్రాగన్ ఫ్రూట్‌ను విభిన్నంగా ఆస్వాదించాలనుకునేవారి కోసమే ఈ రుచులు...

డ్రాగన్ ఫ్రూట్‌తో కొత్తగా...

డ్రాగన్ ఫ్రూట్ కేక్

కావాల్సిన పదార్థాలు

డ్రాగన్ ఫ్రూట్- ఒకటి, కోడిగుడ్లు- మూడు, పాలు- అర కప్పు, నూనె- అర కప్పు, మైదా- ఒక కప్పు, బేకింగ్ పౌడర్- ఒక చెంచా, పంచదార పొడి- అర కప్పు, మిల్క్ చాక్లెట్- పెద్దది ఒకటి, ఫ్రెష్ క్రీమ్- రెండు చెంచాలు, చాకో చిప్స్- కొన్ని

తయారీ విధానం



- బ్లెండర్‌లో కోడిగుడ్ల సొనలు, డ్రాగన్ ఫ్రూట్ ముక్కలు వేసి మెత్తగా బ్లెండ్ చేయాలి. ఈ మిశ్రమాన్ని వెడల్పాటి గిన్నెలోకి తీసుకోవాలి. అందులో పాలు, నూనె వేసి బాగా కలపాలి. తరువాత మైదా, బేకింగ్ పౌడర్, పంచదార పొడి వేసి ఉండలు రాకుండా కలపాలి. కేక్ మౌల్డ్ లోపల కొద్దిగా నూనె రాయాలి. అందులో డ్రాగన్ ఫ్రూట్ మిశ్రమాన్ని వేయాలి. తరువాత ఈ మౌల్డ్‌ను స్టీమర్‌లో ఉంచి నలభై నిమిషాలపాటు ఆవిరి మీద ఉడికించాలి. ఆపైన కేక్‌ను పళ్లెంలోకి తీసి చల్లార్చాలి.
- ఒక గిన్నెలో మిల్క్ చాక్లెట్ ముక్కలు, ఫ్రెష్ క్రీమ్ వేసి వేడి నీళ్ల గిన్నెలో పావుగంట సేపు ఉంచాలి. చాక్లెట్ పూర్తిగా కరిగిన తరువాత ఆ మిశ్రమాన్ని బాగా కలపాలి. తెల్లగా మెరిసే ఈ చాక్లెట్ మిశ్రమాన్ని కేక్ మీద పరచాలి. పైన చాకో చిప్స్ చల్లాలి. అంతే డ్రాగన్ ఫ్రూట్ కేక్ రెడీ! ఈ కేక్‌ను గంటసేపు ఫ్రిజ్‌లో ఉంచి సర్వ్ చేసుకోవాలి.

డ్రాగన్ ఫ్రూట్ ఫ్రైడ్ రైస్

కావాల్సిన పదార్థాలు

డ్రాగన్ ఫ్రూట్- ఒకటి, అన్నం- రెండు కప్పులు, ఉల్లిపాయలు- రెండు, బీన్స్- నాలుగు, పచ్చి బఠాణీలు- కొన్ని, వెల్లుల్లి రెబ్బలు- నాలుగు, ఉల్లికాడలు- రెండు, పచ్చిమిర్చి- నాలుగు, దాల్చిన చెక్క- చిన్న ముక్క, లవంగాలు- రెండు, మిరియాల పొడి- చిటికెడు, నూనె- రెండు చెంచాలు, ఉప్పు- తగినంత

తయారీ విధానం



స్టవ్ మీద వెడల్పాటి గిన్నె పెట్టి నూనె వేసి వేడిచేయాలి. తరువాత అందులో దాల్చిన చెక్క, లవంగాలు, కచ్చాపచ్చాగా దంచిన వెల్లులి రెబ్బలు, పచ్చి బఠాణీలు, పచ్చి మిర్చి ముక్కలు, ఉల్లిపాయ ముక్కలు, బీన్స్ ముక్కలు, ఉల్లికాడల ముక్కలు వేసి దోరగా వేయించాలి. ఆపైన అన్నం, ఉప్పు, మిరియాల పొడి వేసి బాగా కలపాలి. చివరగా డ్రాగన్‌ఫ్రూట్ ముక్కలు వేసి కలిపి దించాలి. ఇలా తయారుచేసిన డ్రాగన్ ఫ్రూట్ ఫ్రైడ్ రైస్‌ని వేడి వేడిగా తింటే రుచిగా ఉంటుంది.

డ్రాగన్‌ఫ్రూట్ సార్బెట్



కావాల్సిన పదార్థాలు

పండిన డ్రాగన్ ఫ్రూట్- ఒకటి, స్ట్రాబెర్రీలు- నాలుగు, తేనె- నాలుగు చెంచాలు, నిమ్మరసం- రెండు చెంచాలు

తయారీ విధానం

ముందుగా డ్రాగన్ ఫ్రూట్ ముక్కలను జిప్‌లాక్ కవర్లో వేసి రాత్రంతా ఫ్రీజర్లో ఉంచాలి. ఉదయాన్నే బ్లెండర్‌లో డ్రాగన్‌ఫ్రూట్ ముక్కలు, స్ట్రాబెర్రీ ముక్కలు, తేనె, నిమ్మరసం వేసి మెత్తగా బ్లెండ్ చేయాలి. ఈ మిశ్రమాన్ని ఒక మౌల్డ్‌లో పరిచి ఒక పూటంతా ఫ్రీజర్లో ఉంచాలి. తరువాత ఈ డ్రాగన్‌ఫ్రూట్ సార్బెట్‌ను అందమైన బౌల్స్‌లోకి తీసి సర్వ్ చేసుకోవాలి.

డ్రాగన్ ఫ్రూట్ సల్సా

కావాల్సిన పదార్థాలు

డ్రాగన్ ఫ్రూట్- ఒకటి, ఉల్లిపాయ- ఒకటి, పచ్చిమిర్చి- రెండు, నిమ్మకాయ- ఒకటి, కొత్తిమీర తరుగు- కొద్దిగా, ఉప్పు- చిటికెడు, మిరియాల పొడి- చిటికెడు

తయారీ విధానం



డ్రాగన్ ఫ్రూట్ పైన ఉన్న తొక్క తీసి చిన్న ముక్కలుగా కోయాలి. ఉల్లిపాయ, పచ్చిమిర్చిలను కూడా వీలైనంత చిన్న ముక్కలుగా కోసి పెట్టుకోవాలి. కొత్తిమీరను శుభ్రం చేసి సన్నగా తరగాలి. వెడల్పాటి గిన్నెను తీసుకుని అందులో డ్రాగన్ ఫ్రూట్ ముక్కలు, ఉల్లిపాయ ముక్కలు, పచ్చి మిర్చి ముక్కలు, కొత్తిమీర తరుగు, ఉప్పు, మిరియాల పొడి, నిమ్మరసం వేసి చెంచాతో బాగా కలపాలి. ఇష్టమైతే అందులో దానిమ్మ గింజలు, పండిన బొప్పాయి ముక్కలు, పైనాపిల్ ముక్కలు కూడా కలుపుకోవచ్చు. ఈ డ్రాగన్ ఫ్రూట్ సల్సాను చిప్స్, క్రాకర్స్, గ్రిల్డ్ ఫిష్ లేదా చికెన్‌తో సర్వ్ చేసుకోవాలి.

భోజన కుతూహలం

కొమ్ముపొట్లను ఆదరించండి!

కొమ్ముపొట్లకాయలు ఆకుపచ్చగా, తెల్లచారలతో మెరుస్తూ దొండకాయలా అనిపిస్తాయి. 'పేరులో 'పొట్ల' ఉన్నా ఇది పొట్లకాయ కుటుంబానికి చెందినది కాదు; ఆకారం దొండలా ఉన్నా ఇది దొండకాయ కుటుంబానికి చెందినదీ కాదు. గుమ్మడి కుటుంబానికి చెందిన మొక్క. పైన తొక్క గట్టిగా ఉంటుంది. తొక్కను తీసి, దొండకాయల మాదిరిగా తరిగి వండుతారు. రెండు అంచులా మొనదేలిన రూపం వలన దీనిని ఆంగ్లంలో 'పాయింటెడ్ గోర్డ్' అని పిలుస్తారు. ఇది దక్షిణాదిలో తక్కువగా, ఉత్తరాదిలో ఎక్కువగా పండుతుంది. ఉత్తరాదిన దీన్ని 'పర్వల్' అని పిలుస్తారు. మన ఆయుర్వేద గ్రంథాల్లో దీని విశిష్టతలను వివరించారు.

- పర్వల్ మన జీర్ణవ్యవస్థను బలపరిచి పైత్యాన్ని తగ్గిస్తుంది. రక్తాన్ని శుభ్రపరుస్తుంది. చరకుడు దీనిని 'శాంతకారిణి ఔషధ కూరగాయ'గా పేర్కొన్నాడు. 'చరక సంహిత' ప్రకారం ఇది తృప్తిఘ్న (కొంచెం తినగానే కడుపునిండిపోయేలా ఉండటాన్ని తగ్గిస్తుంది), తృష్ణానియంత్రక (దప్పికను తగ్గిస్తుంది) గుణాలు కలిగి ఉంటుంది. వేడి వల్ల కలిగే చర్మమంటలు, చేతుల కాలిన భావనలకు ఉపశమనం ఇస్తుంది.
- 'భోజనకుతూహలం' గ్రంథంలో పర్వల్ వల్ల కలిగే ప్రయోజనాలను పేర్కొన్నారు. వాటి ప్రకారం- ఇది జ్వరాలను తగ్గిస్తుంది. బలం, పుష్టి, సంతృప్తి, ఆనందం అన్నింటినీ కలిగిస్తుంది.
- పర్వల్‌లో విటమిన్ ఏ, ఇ, ఇనుము, మెగ్నీషియం, పొటాషియం లాంటివి సమృద్ధిగా ఉంటాయి. దీనిలో తక్కువ కేలరీలు ఉంటాయి. ఇది మధుమేహం, స్థూలకాయం ఉన్నవారికి మేలు చేస్తుంది.
- పర్వల్‌ను దొండకాయల మాదిరిగా వండుకోవచ్చు. ఇది ప్రధానంగా జీర్ణకోశ అవయవాల బలవృద్ధికి సహాయపడుతుంది. బలహీన జీర్ణక్రియ, లివర్, పాంక్రియాజ్ సమస్యలున్నవారికి ఇది ఉపకరిస్తుంది.



- పర్వల్ పండ్లను గుజ్జుగా చేసి చర్మమంటలపై రాస్తే చల్లదనం కలుగుతుంది. ఆకుల రసం చర్మవ్యాధులకు, వేరుతో కషాయం ఉదర వ్యాధులకు, పండ్ల కషాయం జ్వర నివారణకు ఉపయోగిస్తారు.
- పర్వల్‌ను క్రమం తప్పకుండా తింటే చర్మం నున్నగా అవుతుంది. మెరుపు వస్తుంది.

• గంగరాజు అరుణాదేవి

అందం- ఇలా సొంతం

సౌందర్య సాధనాలను ఎంచుకోవడంతో పాటు, వాటిని ఉపయోగించే విధానం పట్ల కూడా అవగాహన కలిగి ఉండడం అవసరం. అందుకు తోడ్పడే చిట్కాలు ఇవే!

లిప్‌స్టిక్: పెదవులు పొడిబారకుండా ఉండడం కోసం, గీతలు పడకుండా ఉండడం కోసం మాయిశ్చరైజింగ్ లిప్‌స్టిక్ ఎంచుకోవాలి. లిప్‌లైనర్‌తో ఔట్‌లైన్ గీసుకోవడం అందరికీ తెలిసిందే! అయితే అందు కోసం ఉపయోగించే లైనర్, లిప్‌స్టిక్ కంటే ముదురు రంగులో ఉండేలా చూసుకోవాలి.

ఐ బ్రో పెన్సిల్: కనుబొమలకు నలుపు రంగు ఐ బ్రో పెన్సిల్‌కు బదులుగా డార్క్ బ్రౌన్, డల్ బ్లాక్ పెన్సిల్ వాడాలి. అప్పుడు కనుబొమలు సహజంగా కనిపిస్తాయి.

ఐ లైనర్: కనురెప్పల మీద వేసుకునే ఐలైనర్ వాటర్‌ప్రూఫ్ అయి ఉండాలి. ఐలైనర్ వేసుకునే పద్ధతిని ప్రాక్టీస్ చేసుకుంటే, తక్కువ సమయంలోనే కళ్లను తీర్చిదిద్దుకోవచ్చు.

గ్లిట్టర్: నైట్ మేకప్‌లో గ్లిట్టర్ ప్రత్యేక ఆకర్షణను తెచ్చిపెడుతుంది. అయితే అందుకోసం గ్లిట్టర్‌ను పరిమితంగా వాడుకోవాలి. కనురెప్పలు, చెంపలకు తగుమాత్రంగా అద్దుకోవాలి.

టోనర్: చర్మం నునుపుగా, బిగుతుగా మేకప్‌కు అనువుగా మారడం కోసం టోనర్ వాడడం తప్పనిసరి. అలాగే మొటిమలు, మచ్చలు ఉన్న చోట టోనర్‌ను అప్లై చేసుకుని, వాటిని కనిపించకుండా దాచేయవచ్చు.

మాయిశ్చరైజర్: మేకప్ సమంగా పరుచుకోవడం కోసం మేకప్‌కు ముందు మాయిశ్చరైజర్ వాడుకోవాలి. మాయిశ్చరైజర్ వాడడం వల్ల చర్మం మీద మేకప్ పగుళ్లు ఏర్పడకుండా ఉంటాయి. చర్మం పొడిబారిపోకుండా ఉంటుంది.

ప్రైమర్: చర్మానికీ, మేకప్‌కూ మధ్య ప్రైమర్ అడ్డుగా ఉండి, చర్మం మీది రంధ్రాలు కనిపించకుండా చేస్తుంది. దీంతో చర్మ రంధ్రాలు పూడుకుపోకుండా ఉంటాయి.

ఫౌండేషన్: స్కిన్ టోన్‌ను సమం చేసి, మేకప్‌కు బేస్‌గా మారుతుంది. కాబట్టి, ఫౌండేషన్‌ను ముఖం మీద సమంగా పరుచుకోవాలి.

కన్‌సీలర్: చర్మపు రంగుకు ఒకటి లేదా రెండు టోన్ల తేలిక రంగు కన్‌సీలర్ ఎంచుకోవాలి. దీంతో మచ్చలను దాచేసి, ముఖంలో కనురెప్పలు, ముక్కు, చుబుకం, చెక్కిళ్లను హైలైట్ చేసుకోవచ్చు.

కాంటూర్: దీంతో ముఖానికి ఆకారాన్ని తీసుకురావచ్చు. ముక్కు, చుబుకం, చెక్కిళ్లను ఆకర్షణీయంగా మలుచుకోవచ్చు.

బ్లష్: చెక్కిళ్లను హైలైట్ చేయడం కోసం దీన్ని వాడుకోవాలి.

మేకప్



అభిరుచి



ఆటలోనే కాదు

ముంబయి డీవై పాటిల్ స్టేడియం... భారత్- దక్షిణాఫ్రికా మధ్య మహిళల ప్రపంచ కప్ అంతిమ సమరం... ఇన్నింగ్స్ 46వ ఓవర్. దీప్తి శర్మ వేసిన ఫుల్‌టాస్ బంతిని గాల్లోకి లేపింది నడైన్ డిక్లెర్క్. కవర్స్‌లో ఉన్న కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ మెరుపు వేగంతో వెనక్కి పరుగెడుతూ బంతిని అందుకుంది. ఒక్కసారిగా మైదానంలో జయ జయ ధ్వానాలు మిన్నంటాయి. భారత క్రీడాకారుల ముఖాలు భావోద్వేగాలతో నిండిపోయాయి. ఆలింగనాలు... ఆనందబాష్పాలు... కేరింతలు... నృత్యాలు... ఎన్నో ఏళ్ల వారి దీక్షకు, పట్టుదలకు, అలుపెరుగని పరిశ్రమకు దక్కిన ఫలితం. ఇది కేవలం ఒక విజయం మాత్రమే కాదు... కలలను ఛేదించడం... వాటిని నెరవేర్చుకోవడం. భారతదేశం తొలిసారిగా మహిళల ప్రపంచ కప్‌ను సాధించిన నేపథ్యంలో... కోట్లాదిమంది గుండెలు గర్వంతో ఉప్పొంగిన క్షణం.

ఈ గెలుపులో ఎవరికి వారే ప్రత్యేకం. సమష్టి కృషితో... అచంచలమైన ఆత్మవిశ్వాసంతో హర్మన్‌ప్రీత్ జట్టును నడిపించిన తీరు అత్యద్భుతం. వీరిని చూస్తుంటే 'లగాన్' చిత్రంలో ఆమిర్‌ఖాన్ జట్టు గుర్తుకువస్తుందనేది క్రికెట్ పండితుల మాట. భిన్న నేపథ్యాలు... ఒకరికీ ఒకరికీ సంబంధంలేని పరిస్థితులు. కానీ అందరిదీ ఒకటే కల... ఒకటే శ్వాస... క్రికెట్. ఆటలో దేశానికి ప్రాతినిధ్యం వహించడం... దశాబ్దాలుగా ఊరిస్తున్న ప్రపంచ కప్‌ను సాధించడం. షఫాలీవర్మ ఉత్సాహం... స్మృతి మంధాన ప్రశాంత చిత్తం... జమీమా రోడ్రిగ్స్ పోరాడే తత్వం... దీప్తిశర్మ శ్రమ... శ్రీచరణి ఆత్మస్థైర్యం... క్లిష్ట పరిస్థితుల్లో ముందుండి నడిపించగల హర్మన్‌ప్రీత్ సామర్థ్యం... ఇవే నేడు భారత్‌ను జగజ్జేతగా నిలబెట్టాయి. క్రికెట్ సరే... మరి మన స్టార్లు మైదానం విడిచాక ఏంచేస్తారు? తెలుసుకోవాలని ఉందా..! అయితే రండి... ఆటను ఆస్వాదిస్తూనే తమ అభిరుచులకు పట్టం కడుతున్నవారిపై ఓ లుక్కేద్దాం.

హర్మన్ ప్రీత్ కౌర్



భారత మహిళల జట్టుకు సారథ్యం వహిస్తున్న హర్మన్‌ప్రీత్... ఎన్నో అవరోధాలు, కట్టుబాట్లను దాటి క్రికెట్ బ్యాట్ పట్టింది. ఆరంభంలో ఆమె తల్లి కూడా వంట నేర్చుకొని ఇంట్లో కూర్చోమని సలహా ఇచ్చారు. ఆ మాటలు హర్మన్‌లో మరింత పట్టుదలను పెంచాయి. "అప్పుడు నేను చాలా చిన్నపిల్లను. ఇంటి దగ్గర అబ్బాయిలతో కలిసి ఆడుతుండేదాన్ని. అది చూసి ఒక రోజు అమ్మ... 'నువ్వు ఎప్పుడూ మగపిల్లలతోనే ఆడుతున్నావు. కెరీర్ గురించి నీకు ఏ మాత్రం ఆలోచన లేదు' అంది. అందరి ఆడపిల్లల్లాగా సల్వార్ కమీజ్ వేసుకొని, వంట నేర్చుకోమని సలహా ఇచ్చింది. 'నా జీవితం క్రికెట్‌తోనే' అని తేల్చిచెప్పాను. ఆనాటి నుంచి అమ్మ నన్ను మళ్లీ ఎప్పుడూ నన్ను ప్రశ్నించలేదు" అంటూ ఓ సందర్భంలో గుర్తు చేసుకున్న హర్మన్... 2017 ప్రపంచ కప్‌లో ఆస్ట్రేలియాపై చేసిన 171 పరుగుల ఇన్నింగ్స్ భారత మహిళ క్రికెట్‌కు కొత్త ఉత్సాహాన్ని ఇచ్చింది. క్రికెటర్లు కావాలనుకొనే ఎంతోమంది అమ్మాయిలకు ప్రేరణనిచ్చింది. కలల కప్‌ను ముద్దాడాక, ఆ ఆనందాన్ని, ఆ గర్వించే క్షణాన్నీ జీవితాంతం గుర్తుండిపోయేలా తాజాగా తన చేతిపై ప్రపంచ కప్ టాటూ వేసుకుంది హర్మన్. ఆ ఫొటోలను తన ఇన్‌స్టాలో పోస్ట్ చేసింది. గతంలో భారతీయ రైల్వేలో ఆఫీస్ సూపరింటెండెంట్‌గా, పంజాబ్ పోలీసు శాఖలో డీఎస్పీగా గతంలో ఆమె బాధ్యతలు నిర్వర్తించింది. అయితే విద్యార్హతల విషయం వివాదాస్పదం కావడంతో డీఎస్పీగా ఆమె నియామకాన్ని పంజాబ్ పోలీస్ వెనక్కు తీసుకుంది. వివాదం సమసిపోయాక తిరిగి ఉద్యోగం ఇచ్చింది. ఎన్నో బడా బ్రాండ్లకు ప్రచారకర్తగా ఉన్న హర్మన్‌కు సంగీతం అంటే ప్రాణం.

స్మృతి మంధాన



క్రికెట్ తరువాత స్మృతికి అత్యంత ఇష్టమైనది బీజీఎంఐ (బాటిల్ గ్రౌండ్స్ మొబైల్ ఇండియా) ఆడటం. ఇది తనకు ఒత్తిడి నుంచి ఉపశమనం ఇచ్చే సాధనమని పలు సందర్భాల్లో చెప్పింది. గేమర్‌గా కూడా మంచి ఆదరణ సంపాదించుకున్న ఈ ఎడమచేతి వాటం బ్యాట్స్‌వుమన్ ఆన్‌లైన్ గేమింగ్ ప్లాట్‌ఫామ్ ఏ23కు ప్రచారకర్తగా వ్యవహరిస్తోంది. స్మృతి మైదానంలో కనిపించలేదంటే... స్నేహితులతో కలిసి బీజీఎంఐలో మునిగిపోయిందని అర్థం. అంతలా ఆ గేమ్‌ను ప్రేమిస్తుంది. ఇక రకరకాల వంటలు ప్రయత్నించడం తన మరో అభిరుచి. పంజాబీ వంటకాలు నేర్చుకోవడానికి తరగతులకు కూడా వెళ్లింది. స్పైసీ పనీర్ టిక్కా, మసాలా ఆమెకు నచ్చిన, బాగా వండే వంటకం. 'వంట చేయడం అంటే నాకు మైదానంలో అద్భుతమైన కవర్‌డ్రైవ్ కొట్టినంత ఆనందాన్ని ఇస్తుంది' అంటుంది స్మృతి. అంతేకాదు... ఆమెకు పర్యటనలన్నా చాలా ఇష్టం. స్విట్జర్లాండ్‌లోని ఆహ్లాదకరమైన ప్రకృతి దృశ్యాలు, ఆస్ట్రేలియాలోని సుందర ప్రాంతాలు... ఎప్పుడూ కొత్త కొత్త పర్యాటక ప్రాంతాల్లో సేద తీరాలని కోరుకొంటుంది. బాలీవుడ్, హాలీవుడ్ చిత్రాలు విపరీతంగా చూస్తుంది.

జమీమా రోడ్రిగ్స్



క్రికెట్ గ్రౌండ్‌లో కొట్టే కళాత్మక స్ట్రోక్స్‌తోనే కాదు... గిటార్‌ను శృతి చేస్తూ... కమ్మని రాగంతోనూ కోట్ల మంది అభిమానులను సంపాదించుకుంది జమీమా. ఇన్‌స్టాలో తరచూ రీల్స్ పోస్ట్ చేస్తూ అలరిస్తుంది. భారత క్రికెట్ జట్టు డ్రెస్సింగ్ రూమ్‌లో... మెరుపు ఫీల్డింగ్‌తో మైదానంలో... తను ఎక్కడుంటే అక్కడ వాతావరణం ఉల్లాసంగా మారిపోతుంది. సమయం చిక్కినప్పుడల్లా స్టెప్పులేసి... జట్టు సభ్యుల్లోనే కాదు... స్టాండ్స్‌లో కూర్చున్న ప్రేక్షకులలోనూ ఉత్సాహం నింపుతుంది. తండ్రి మార్గదర్శకత్వంలో ఏడేళ్ల వయసులో క్రికెట్ బ్యాట్ పట్టిన జమీమా ముంబయిలోని బాంద్రాలో పుట్టి పెరిగింది. తమ మత విశ్వాసాలను అనుసరించే జమీమా సామాజిక మాధ్యమాల్లో ద్వేషాన్ని ఎదుర్కొంది. అయినా ఆట నుంచి మనస్సును పక్కకు పోనివ్వలేదు. కెరీర్‌లో ఎన్నో ఒడుదొడుకులు. ఎన్నో పునరాగమనాల తరువాత ప్రపంచ కప్ జట్టులో చోటు దక్కించుకుంది. ఆస్ట్రేలియాతో సెమీఫైనల్ మ్యాచ్‌లో అజేయ సెంచరీ చేసి... రికార్డు స్కోరును ఛేదించడంలో కీలకమైంది. భారత్‌ను ఫైనల్స్‌కు చేర్చింది. ఫైనల్ మ్యాచ్ అనంతరం ఉద్వేగానికి లోనైన జమీమా కన్నీటి పర్యంతమైంది. ఇన్‌స్టాలో ఈ స్టార్ బ్యాటర్‌కు దాదాపు మూడున్నర లక్షలమంది ఫాలోవర్స్ ఉన్నారు. అక్కడ తరచూ తన అభిరుచుల చిత్రాలు, రీల్స్‌ను పోస్ట్ చేస్తుంటుంది.

దీప్తి శర్మ



ప్రపంచకప్‌లో ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్‌గా నిలిచిన దీప్తి... ఆల్‌రౌండ్ ప్రతిభతో జట్టు గెలుపులో అత్యంత కీలక పాత్ర పోషించింది. అన్నయ్య సుమిత్ ఆటను చూస్తూ పెరిగిన ఆమె జీవితాన్ని మలుపు తిప్పింది ఒక త్రో. అన్నయ్య శిక్షణ తీసుకొంటుండగా... తనవద్ద పడివున్న ఓ బంతిని నేరుగా కోచ్ చేతుల్లోకి విసిరింది దీప్తి. అది భారత మాజీ బ్యాటర్ హేమలత కాలా దృష్టిని ఆకర్షించింది. ఆ రోజు నుంచి సుమిత్ చెల్లి కోసం తన ఆటను, ఉద్యోగాన్ని త్యాగం చేశాడు. 'దీప్తి ఆడుతుంటే దేశం తరుపున నేనూ ఆడినట్టే' అంటూ ఓసారి అతను చెప్పాడు. అన్నయ్య నేతృత్వంలో, తల్లి ప్రోత్సాహంతో దీప్తి అంచెలంచెలుగా ఎదిగింది.

ఆగ్రాకు నుంచి వచ్చిన ఈ ఆల్‌రౌండర్ ప్రస్తుతం డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (డీఎస్పీ)గానూ బాధ్యతలు నిర్వర్తిస్తోంది. సంగీతం వినడం, పుస్తకాలు చదవడం ఆమెకు బాగా నచ్చిన అంశాలు. బెంగాల్‌కు ఆడుతున్న సమయంలో తన సహచరుల ద్వారా బంగ్లా మాట్లాడటం నేర్చుకుంది. గార్డెనింగ్‌తో పాటు ఇంటిని అందంగా అలంకరించడం ఆమె మరికొన్ని అభిరుచులు.

ప్రతీక రావల్



ఢిల్లీలో పుట్టి పెరిగిన ప్రతీక... క్రికెట్‌లోనే కాదు, చదువులోనూ టాపే. ఆమె తండ్రి ప్రవీణ్ రావల్ బీసీసీఐ అంపైర్. ఆమె తల్లి గృహిణి. చదువుతో పాటు క్రీడల్లోనూ ప్రతీకను తల్లితండ్రులు ప్రోత్సహించారు. బడి రోజుల్లో ఆమె బాస్కెట్‌బాల్ ఆడేది. 2019 జాతీయ స్కూల్ గేమ్స్‌లో ఢిల్లీ తరుపున స్వర్ణ పతకం కూడా సాధించింది. తరువాత క్రికెట్ వైపు మళ్లింది. పన్నెండో తరగతిలో 92.5 శాతం మార్కులు సంపాదించిన ఆమె, సైకాలజీలో డిగ్రీ పూర్తి చేసింది. "ఆటను అవగాహన చేసుకోవడానికి, మానసికంగా ధృఢంగా ఉండటానికి, విశ్లేషణాత్మకంగా ఆలోచించడానికి నేను చదివిన మనస్తత్వ శాస్త్రం అవకాశం కల్పించింది" అని ఓ ఇంటర్వ్యూలో చెప్పిన ప్రతీక... ఆట లేనప్పుడు కుటుంబంతో కలిసి సమయాన్ని గడుపుతుంది.

హర్లీన్ దేవల్



క్రికెట్‌లోకి రాకముందు హర్లీన్ రకరకాల క్రీడా పోటీల్లో పాల్గొంది. చిన్నప్పుడు హాకీ, ఫుట్‌బాల్, బ్యాడ్మింటన్ తదితర గేమ్స్ ఆడింది. డ్యాన్సింగ్, ట్రావెలింగ్, షాపింగ్‌తో పాటు సినిమాలు చూడటం ఆమె అభిరుచులు. విభిన్న సంస్కృతులతో మమేకం కావడం ఎంతో ఇష్టం. అలాగే ఖాళీ సమయాల్లో ఫుట్‌బాల్ ఆడుతుంది. ఒకవేళ క్రికెటర్‌ను కాకపోయివుంటే పైలెట్‌గా స్థిరపడాలని కోరుకున్నట్టు హర్లీన్ ఓ సందర్భంలో వెల్లడించింది.

రాధా యాదవ్/ శ్రీచరణి



ఇరుకైన ముంబయి వీధుల్లో అబ్బాయిలతో కలిసి క్రికెట్ ఆడిన రాధా యాదవ్‌కు ఆట తప్ప మరో ధ్యాస లేదు. తన జీవితాన్ని మలుపు తిప్పిన క్రికెట్టే ఆమెకు జీవితం. ఇక తెలుగు అమ్మాయి శ్రీచరణికి కూడా హర్లీన్‌లానే క్రికెట్‌తో పాటు ఇతర క్రీడల్లో కూడా ప్రవేశం ఉంది. చిన్నప్పటి నుంచి బ్యాడ్మింటన్, ఖోఖో ఆడింది. అయితే చివరకు క్రికెట్‌ను తన కెరీర్‌గా ఎంచుకుంది.

అడిగిన అనుమతులు ఇవ్వనందుకు

బ్లాక్‌మెయిల్ చేస్తున్నారా?

అరోరా రమేష్ 12 కాలేజీలకు అనుమతి అడిగిండు

- జయ్‌ప్రకాష్.. మహబూబ్‌నగర్‌లో కాలేజీకి హైదరాబాద్‌లో ఆఫ్ క్యాంపస్ ఇవ్వమన్నడు
- నిబంధనలకు వ్యతిరేకమని ఇవ్వలేదు
- ఇక డొనేషన్లు ఎలా వసూలు చేస్తారో చూస్త: సీఎం రేవంత్



హైదరాబాద్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): డబ్బుల కోసం పిల్లల చదువులతో చెలగాట మాడితే కఠినంగా వ్యవహరిస్తామంటూ ప్రయివేటు కళాశాలల యాజమాన్యాలను సీఎం రేవంత్‌రెడ్డి హెచ్చరించారు. అడిగిన అనుమతులు ఇవ్వనందుకు ప్రభుత్వాన్నే బ్లాక్‌మెయిల్ చేస్తారా?అంటూ నిలదీశారు. ఫీజు రీయింబర్స్‌మెంటు బకాయిలు చెల్లించాలంటూ కాలేజీ యాజమాన్యాలు చేపట్టిన బంద్‌పై ఆయన స్పందించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయి గత ప్రభుత్వం పెట్టిన సమస్య అని చెప్పారు. 2014 నుంచి ఇప్పటి దాకా ఈ పథకం కింద చదువుకున్న విద్యార్థులు ఎవరు? ఎవరెవరికి బకాయి ఉందన్న దానిపైన సిట్‌ను ఏర్పాటు చేసి విచారణ చేద్దామని ముఖ్యమంత్రి ప్రతిపాదించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ పైన 2014-15 సంవత్సరంలో కేసీఆర్ ఆదేశాల మేరకు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విచారణ చేసి నివేదిక ఇచ్చిందని, ఆ నివేదికపైనా చర్యలు తీసుకుందామని ప్రతిపాదించారు. కాలేజీల యాజమాన్యాలు వ్యాపారం చేస్తున్నారే కానీ సేవ చేయట్లేదని చెప్పారు. వారు రాజకీయ ప్రేరేపిత ప్రకటనలు చేస్తేనో అధికారులను తిడితేనో ఫీజు రీయింబర్స్‌మెంట్ రాదని అన్నారు. ప్రస్తుత ఆర్థిక పరిస్థితుల్లో పదవీ విరమణ ప్రయోజనాలను కూడా విడతల వారీగా ఇస్తున్నామని గుర్తు చేశారు. కాలేజీలను బంద్ పెడితే విద్యార్థులకు చదువు దూరమవుతుందని, వారి జీవితాలతో చెలగాటం ఆడవద్దని హెచ్చరించారు. విడతల వారీగా ఫీజులు చెల్లించే బాధ్యత తాను తీసుకుంటానని చెప్పారు. మొదట తాము అధికారంలోకి వచ్చిన తర్వాత ఏర్పడ్డ బకాయిలు ఇస్తామని తెలిపారు. కేసీఆర్ పెట్టిన బకాయిలు అడగొద్దని స్పష్టం చేశారు. "మీరు కాలేజీలు బంద్ పెడితే పిల్లలను కాలేజీల వైపుకు తిప్పడం మాకూ తెలుసు. వారిని వెనక్కు తిప్పితే ఏమైతదో తెలుసు. ప్రభుత్వం నడుపుతున్నాము కాబట్టి ఆ ప్రయత్నం చేయట్లేదు" అన్నారు. పిల్లల చదువులకు ఆటంకం కలిగితే కాలేజీ యాజమాన్యాలపైన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కాలేజీల పరిశీలనకే రానివ్వబోమంటే యాజమాన్యాలు ఏ రకమైన వ్యవహార శైలితో ఉన్నట్లని అడిగారు. బంద్ పెడతామంటే ఇంక చర్చించడానికి ఏముంటుందని అన్నారు. ఎవరెవరు క్యాంపస్‌లు అడిగారో తన దగ్గర జాబితా ఉందని, అవి ఇవ్వనందుకు ప్రభుత్వాన్నే బ్లాక్ మెయిల్ చేస్తారా అని ప్రశ్నించారు. ప్రతినెలా ప్రభుత్వానికి వస్తున్న రూ. 18,500 కోట్ల ఆదాయంలో వేతనాలు, అప్పులకు.. వాయిదాలు పోను రూ.5,500 కోట్లు మాత్రమే మిగులుతున్నాయని, ఇందులోనే రిటైర్‌మెంట్ బెనిఫిట్లు, ఆరోగ్యశ్రీ, రైతు భరోసా, కళ్యాణలక్ష్మీ వగైరా సంక్షేమ పథకాలూ అమలు చేయాల్సి ఉంటుందని చెప్పారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే చెల్లించడానికి ఏ సంక్షేమ పథకం ఆపాలో కాలేజీ యాజమాన్యాలే చెప్పాలన్నారు. "కాలేజీ యాజమాన్యాలు వచ్చే ఏడాది ఎట్ల డొనేషన్లు వసూలు చేస్తయో నేనూ చూస్త. ప్రభుత్వం చట్టాన్ని పకడ్బందీగా చేస్తుంది. విద్య.. వ్యాపారం కాదు.. సేవ! వ్యాపార తెలివితేటలు ఇందులో పెడతామంటే కుదరదు. వెనుక రాజకీయ పార్టీలు ఉన్నాయని ఏది పడితే అది మాట్లాడతారా? అడిగిన అనుమతులు ఇవ్వకుంటే ప్రభుత్వాన్నే బ్లాక్ మెయిల్ చేస్తారా?" అంటూ నిలదీశారు. అరోరా విద్యాసంస్థల యాజమాని రమేష్ 12 కాలేజీలకు అనుమతులు అడిగాడని, మహబూబ్‌నగర్‌లో ఉన్న కాలేజీకి హైదరాబాద్‌లో ఆఫ్ క్యాంపస్ కోసం జయప్రకాష్ అనుమతి కోరాడని వెల్లడించారు. నిబంధనలకు వ్యతిరేకం కావడంతో అనుమతులు ఇవ్వలేదన్నారు. దీని వెనుక ఉన్న బీజేపీ నేతలు ఏమేమి అడిగారో కూడా తనకు తెలుసునన్నారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య అమాయకంగా వీరి ఉచ్చులో పడుతున్నాడన్నారు. ఆర్.కృష్ణయ్య, మంద కృష్ణలకు రాబోయే మూడు నెలలు ఫైనాన్స్‌ను అప్పజెపుతానని, వచ్చే 18,500 కోట్లతో ప్రభుత్వం ఎట్ల నడపాలో వారే చెప్పాలని అడిగారు.

కిషన్‌రెడ్డి, కేటీఆర్ బ్యాడ్ బ్రదర్స్

(మొదటిపేజీ తరువాయి)

దానిని రద్దు చేసి ఉపాధి, ఉద్యోగ అవకాశాలు పోగొట్టారని ఆరోపించారు. హైదరాబాద్‌కు గ్రోత్ ఇంజన్లలా పని చేస్తూ.. ప్రస్తుతం ప్రభుత్వానికి రూ.లక్షల కోట్ల ఆదాయం రావడానికి కారణమైన ప్రాజెక్టులు, సంస్థలన్నీ గత కాంగ్రెస్ ప్రభుత్వాలు తీసుకువచ్చినవేనన్నారు. నగర అభివృద్ధి కోసం 2004 నుంచి 2014 వరకు కేంద్ర, రాష్ట్రాల్లోని కాంగ్రెస్ ప్రభుత్వాలు తీసుకున్న నిర్ణయాలు, 2014 నుంచి 2023 వరకు కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని కేసీఆర్ ప్రభుత్వాలు తీసుకున్న నిర్ణయాలను పోల్చి చూసుకుని జూబ్లీహిల్స్ ఓటర్లు ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు.



8 లక్షల కోట్ల అప్పులు చేశారు..

రూ.69 వేల కోట్ల అప్పులు, రూ.16 వేల కోట్ల మిగులు బడ్జెట్‌తో తెలంగాణను కేసీఆర్‌కు అప్పగిస్తే.. పదేళ్ల పాలనలో రూ.8.11 లక్షల కోట్ల అప్పులు చేసి తమకు అప్పగించారని సీఎం రేవంత్ తెలిపారు. హైదరాబాద్ నగరానికి అంతర్జాతీయంగా గుర్తింపు తీసుకువచ్చిన విమానాశ్రయం, మెట్రోరైలు, నాలెడ్జ్ సెంటర్, హైటెక్ సిటీ, ట్రిపుల్ ఐటీ వంటి గొప్ప గొప్ప ప్రాజెక్టులు, సంస్థలన్నీ కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలో వచ్చినవేనన్నారు. మోదీ, కేసీఆర్, కిషన్‌రెడ్డి, కేటీఆర్ చేసిందేంటని ప్రశ్నించారు. వరదల్లో హైదరాబాద్ మునిగిపోతే కేంద్రం నుంచి కిషన్‌రెడ్డి చిల్లిగవ్వ కూడా తేలేదని విమర్శించారు. సచివాలయంలో దేవాలయాన్ని, మసీదును కేసీఆర్ ప్రభుత్వం కూలగొడితే.. స్థానిక ఎంపీ అయి ఉండీ కిషన్‌రెడ్డి ఎందుకు ప్రశ్నించలేదని నిలదీశారు. ప్రగతి భవన్ కేసీఆర్ సేదదీరేందుకు ఉపయోగపడిందని, కొడుకు సీఎం కావడం కోసం వాస్తును సరిదిద్దేందుకు సచివాలయాన్ని కూల్చి కొత్తది కట్టారని తెలిపారు. ఫోన్ ట్యాపింగ్.. సీసీ కెమెరాలతో ప్రతిపక్ష నేతలపై నిఘా పెట్టేందుకు కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను ఏర్పాటు చేసుకున్నారని ఆరోపించారు. ప్రాణభయంతో తనను తాను కాపాడుకునేందుకు ప్రగతి భవన్‌లో కేసీఆర్ బుల్లెట్ ప్రూఫ్ బాత్రూమ్‌లు కట్టుకున్నారన్నారని, ప్రస్తుతం అందులో నివాసముంటున్న డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క ఈ విషయాన్ని ధ్రువీకరించారని చెప్పారు. బుల్లెట్ ప్రూఫ్‌ను తొలగిస్తే ఎక్కువ ఖర్చవుతుందని అలాగే ఉంచామన్నారు. ఇక ఢిల్లీలోని సీఎం నివాసాన్నీ బుల్లెట్ ప్రూఫ్ చేశారని, ఢిల్లీ వెళ్లినప్పుడు అందులోనే ఉంటున్న తానే దానికి సాక్ష్యమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఔటర్ రింగ్ రోడ్డును నిర్మిస్తే.. బీఆర్ఎస్ ప్రభుత్వం పల్లీ బఠానీలకు అమ్మేసుకుందని ధ్వజమెత్తారు. పదేళ్లలో రూ.20 లక్షల కోట్ల బడ్జెట్‌ను ఏం చేశారో కేసీఆర్ చెప్పాలన్నారు.

వేలాది కోట్లతో ప్రణాళికలు..

కాంగ్రెస్ ప్రభుత్వం వరంగల్, ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టుల నిర్మాణానికి అనుమతులు తెచ్చిందని సీఎం రేవంత్ తెలిపారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఒక్క రైల్వే ప్రాజెక్టును, డొమెస్టిక్ ఎయిర్‌పోర్టునైనా తెచ్చిందా? అని ప్రశ్నించారు. డ్రైపోర్టు ఏర్పాటు కోసం గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణానికి అనుమతులు తెచ్చుకున్నామని, ఎలీ లిల్లీ లాంటి కంపెనీ బిలియన్ డాలర్ల ఫార్మాలో పెట్టుబడులు పెడుతోందని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక మొదటి ఆరు నెలలు పార్లమెంటు ఎన్నికల కోడ్‌తోనే గడిచిందని, మిగిలిన ఏడాదిన్నరలో రూ.3 లక్షల కోట్ల పెట్టుబడులు తెచ్చామని అన్నారు. నగర విస్తరణకు రూ.వేలాది కోట్లతో ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. హైదరాబాద్ నగరాన్ని కేటీఆర్ డ్రగ్స్‌కు, గంజాయికి అడ్డాగా మార్చారని ఆరోపించారు. " కేటీఆర్ సన్నిహితుడు కేదార్.. అధిక మోతాదులో డ్రగ్స్ తీసుకుని చనిపోలేదా? కేటీఆర్ బావమరిది ఇంట్లో జరిగిన పార్టీలో కొకైన్ తీసుకున్న వారు దొరికింది నిజం కాదా?" అని రేవంత్ ప్రశ్నించారు. నగరాన్ని అభివృద్ధి చేయాలంటే ప్రజాప్రతినిధుల సహకారం అవసరమన్నారు. ఎంఐఎం ఎమ్మెల్యేల సహకారంతో మెట్రో, అండర్ డ్రైనేజీ పనులు జరుగుతున్నాయని తెలిపారు. కంటోన్మెంట్ అభివృద్ధికి రూ.6 వేల కోట్లు ఖర్చు చేశామన్నారు. కేటీఆర్‌కు లొంగిపోయి కిషన్‌రెడ్డి మూసీ ప్రక్షాళననూ అడ్డుకుంటున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో నగరంలోని 695 చెరువుల్లో 44 చెరువులను బీఆర్ఎస్ నేతలు కబ్జా చేశారని, మరో 127 చెరువులను పాక్షికంగా ఆక్రమించారని సీఎం తెలిపారు. చెరువులను ఆక్రమణల నుంచి విడిపించి పునరుద్ధరిస్తున్నందునే హైడ్రాపై విషం చిమ్ముతున్నారని మండిపడ్డారు. బతుకమ్మ కుంటను ఆక్రమించుకున్నది బీఆర్ఎస్ నేత ఎడ్ల సుధాకర్‌రెడ్డి కాదా? అని ప్రశ్నించారు. గతంలో చిన్న వర్షానికే హైదరాబాద్ మునిగిపోయేదని, హైడ్రాతో ఆక్రమణలను తొలగించినందునే ఇటీవల పడ్డ పెద్ద వర్షాలకు నగరం జలమయం కాలేదని అన్నారు.

హైడ్రాను బంద్ చేయాలని చూస్తున్న కేటీఆర్..

హైడ్రాను, డ్రగ్స్ కట్టడికి ఏర్పాటు చేసిన ఈగల్ ఫోర్స్‌లను బంద్ పెట్టించాలని కేటీఆర్ కంకణం కట్టుకున్నారని సీఎం రేవంత్ ఆరోపించారు. నగరంలో సుమారు రూ.60 వేల కోట్ల విలువైన భూములను హైడ్రా కాపాడిందని తెలిపారు. హైడ్రా, ఈగల్ ఫోర్స్‌లపై చర్చించేందుకు ప్రత్యేకంగా అసెంబ్లీ సమావేశం నిర్వహించేందుకూ తాము సిద్ధంగా ఉన్నామని, హైడ్రాలో ఏమైనా లోపాలున్నట్లు చూపిస్తే సరిదిద్దుకుంటామన్నారు. పీఎస్‌యూలను అమ్ముకునే అలవాటున్న బీజేపీ.. తాము ఎల్‌అండ్‌టీ నుంచి మెట్రోను వాల్చుకుంటామని ఊహించి ఉండదన్నారు. దాదాపు రూ.30 వేల కోట్ల విలువైన మెట్రో ఆస్తులను రూ.15 వేల కోట్లకు సాధించి పెట్టామని తెలిపారు. ఎల్ అండ్ టీ కంపెనీని బ్లాక్ మెయిల్ చేసి.. మెట్రో దివాళా తీయడానికి కారకులు కేసీఆర్ కాదా? అని ప్రశ్నించారు. సినీ కార్మికుల సంక్షేమం గురించి కేటీఆర్ ఎప్పుడైనా ఆలోచించారా? అని నిలదీశారు. సినీ పరిశ్రమను హైదరాబాద్‌కు తీసుకువచ్చిందే కాంగ్రెస్ ప్రభుత్వాలని, భవిష్యత్తులో ఇక్కడ హాలీవుడ్ షూటింగ్‌లూ జరిగే స్థాయికి నగరాన్ని తీర్చిదిద్దుతామని చెప్పారు.

ముస్లిం టోపీని మోదీ ఎందుకు పెట్టుకున్నారు?

ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రధాని మోదీ.. తలపైన ముస్లింలు ధరించే టోపీ ఎందుకు పెట్టుకున్నారో కేంద్ర మంత్రి బండి సంజయ్ చెప్పాలని సీఎం రేవంత్ అన్నారు. తాను ఆచరించేది హిందూమతమని, ఇతర మతాలనూ తాను గౌరవిస్తానని తెలిపారు. ఒక సీఎంగా అన్ని మతాలను సమానంగా చూడడం తన బాధ్యత అని చెప్పారు. వివిధ కార్యక్రమాల్లో ముస్లిం టోపీలు ధరించిన బీజేపీ నేతల టోపీలను బండి సంజయ్‌కి పంపుతానని, ఎందుకు పెట్టుకున్నారో వారిని అడగాలని హితవు పలికారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో బీజేపీకి డిపాజిట్లు రాకుంటే.. దానిని రిఫరెండంగా తీసుకుని హిందువులు బీజేపీతో లేరని బండి సంజయ్ భావిస్తారా? అని ప్రశ్నించారు. ప్రచార సభలకు అనుమతి ఇచ్చేది ఎన్నికల కమిషన్ అని, ఈ విషయంలో బండి సంజయ్‌కి సమస్య ఉంటే వారితో మాట్లాడుకోవాలని సూచించారు. మాగంటి గోపీనాథ్ మృతిపై బండి సంజయ్‌కి అనుమానాలుంటే డీజీపీకి గానీ, పోలీసులకు గానీ ఫిర్యాదు చేయాలని, చట్టం తన పని తాను చేసుకుపోతుందని అన్నారు. గోపీనాథ్ తల్లి కూడా కేటీఆర్‌పై తీవ్రమైన ఆరోపణలు చేశారని గుర్తు చేశారు. అయితే గోపీనాథ్ మరణంపై మాట్లాడి తాను వివాదం చేయదల్చుకోలేదన్నారు. తాను సచివాలయానికి రావడంలేదని హరీశ్‌రావు అంటున్నారని, ఆయన మాట్లాడేటప్పుడు అద్దంలో చూసుకుంటే మంచిదని ఎద్దేవా చేశారు. కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను తన క్యాంపు కార్యాలయంగా వాడుకుంటున్నానని, సచివాలయంలోనూ చేయాల్సినవి చేస్తున్నామని తెలిపారు.

నేను కాంగ్రెస్ కార్యకర్తను

ముఖ్యమంత్రి కన్నా ముందు తాను కాంగ్రెస్ కార్యకర్తనని, ఏ ఎన్నికనైనా ప్రతిష్ఠాత్మకంగానే తీసుకుంటానని సీఎం రేవంత్ అన్నారు. అందులో భాగంగానే జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ప్రచారంలో పాల్గొన్నానని చెప్పారు. ఉప ఎన్నికలో కనీసం ఓటు వేయాలని అడగకుండా ఫామ్‌హౌస్‌లో పడుకున్న కేసీఆర్.. బాధ్యతారహితంగా ఉన్నారని ఎద్దేవా చేశారు. సర్వేల గురించి పట్టించుకోవాల్సిన అవసరం లేదని, డబ్బులిచ్చినవారు ఏ పాట పాడమంటే అవి ఆ పాట పాడతాయని వ్యాఖ్యానించారు. కేసీఆరే బయటికి రానప్పుడు ఇక తమకు పోటీ ఎక్కడిదన్నారు. చంద్రబాబును అరెస్టు చేసినప్పుడు హైదరాబాద్‌లో నిరసనలు తెలిపే అవకాశం కూడా ఇవ్వని, ఎన్టీఆర్ ఘాట్‌ను లేకుండా చేయాలని చూసిన బీఆర్ఎస్‌కు ఇక్కడి టీడీపీ అభిమానులు ఓటు వేస్తారని తాను అనుకోవట్లేదన్నారు.

కవితను బయటకి పంపేలా చేసిందే హరీశ్‌రావు

జగ్గారెడ్డి మొదలుకుని ఈటల రాజేందర్ వరకు కేసీఆర్‌కు నమ్మకమైన వారందరినీ హరీశ్‌రావు బయటికి పంపేశాడని సీఎం రేవంత్ ఆరోపించారు. చివరికి ఇంట్లోని కవితనూ బయటికి పంపేలా చేశారన్నారు. ఇక మిగిలి ఉన్న వారిలో కేసీఆర్‌కు ఆరోగ్యం బాగా లేదని, కేటీఆర్ ఒక సోంబేరి అని అన్నారు. పార్టీని ఆక్రమించడానికి హరీశ్‌రావుకు ఇక మిగిలి ఉంది ఒక్క అడుగేనన్నారు. వీరు తెలంగాణ రాష్ట్రాన్ని కాపాడుతారా? అని వ్యాఖ్యానించారు. విజ్ఞత కలిగిన జూబ్లీహిల్స్ ప్రజలు ఆలోచనతో ఓటు వేసి ఒక్కసారి కాంగ్రెస్‌కు అవకాశం ఇవ్వాలన్నారు. గంజాయి, డ్రగ్స్ కనిపిస్తే తొక్కి నార తీస్తామన్నారు. డ్రంకెన్ డ్రైవ్ కేసుల్లో మూడు నెలల వరకూ శిక్షలు పడుతుంటే.. డ్రగ్స్ సేవించి దొరికినవారు మాత్రం స్టేషన్ బెయిల్‌తో బయటికి వచ్చేలా చట్టాలు ఉన్నాయన్నారు. కాళేశ్వరం కేసును సీబీఐకి అప్పగిస్తే 48 గంటల్లో అవినీతికి పాల్పడిన వారిని లాకప్‌లో వేస్తామని కిషన్‌రెడ్డి అన్నారని, కానీ.. సెప్టెంబరు 15న అప్పగించినా కేసీఆర్, హరీశ్‌రావుపై ఇంతవరకు విచారణ ఎందుకు చేపట్టలేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ రౌడీ అని మాట్లాడుతున్నారని, పేదోళ్లకు అండగా నిలబడేవాడు రౌడీ అవుతాడా? అని ప్రశ్నించారు. అజారుద్దీన్‌కు మంత్రి పదవి ఇస్తే కిషన్‌రెడ్డికి కడుపు మంట ఎందుకన్నారు.

చిత్రజ్యోతి


★ SINCE 1965 ★



భావోద్వేగానికి గురవుతున్నారు

'ది గర్ల్‌ఫ్రెండ్' సినిమా చూసిన మహిళలంతా భావోద్వేగానికి గురవుతున్నారు. ఇలాంటి మంచి సినిమాను నిర్మించినందుకు సంతృప్తిగా ఉంది. మీడియా కూడా ఈ చిత్రానికి మంచి రేటింగ్స్ ఇచ్చి ప్రోత్సహించింది. మార్నింగ్ షో, మ్యాట్నీ షోలకు మంచి టాక్ రావడంతో క్రమంగా వసూళ్లు పెరుగుతున్నాయి. మా ప్రయత్నానికి మంచి ఫలితం దక్కింది అనిపించింది' అని నిర్మాత అల్లు అరవింద్ అన్నారు. రష్మిక మందన్న లీడ్‌రోల్‌లో రాహుల్ రవీంద్రన్ తెరకెక్కించిన చిత్రమిది. అల్లు అరవింద్ సమర్పణలో ధీరజ్ మొగిలినేని, విద్య కొప్పినీడి నిర్మించారు. శుక్రవారం విడుదలైన ఈ చిత్రం మంచి టాక్‌తో కొనసాగుతోంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో అల్లు అరవింద్ మాట్లాడుతూ 'ప్రేమికులైనా, భార్యా భర్తలైనా ఒకరిపట్ల మరొకరు ఎలా ఉండాలో, ఎలా ఉండకూడదో ఈ సినిమాలో చెప్పారు' అని అన్నారు.

అదిరే స్టెప్పులు... చికిరి చికిరి




రామ్‌చరణ్ కథానాయకుడిగా బుచ్చిబాబు సానా తెరకెక్కిస్తోన్న 'పెద్ది' చిత్రం నుంచి తొలి గీతం వచ్చేసింది. 'చికిరి చికిరి..' అంటూ సాగే ఈ పాటకు రామ్‌చరణ్ అదిరిపోయే స్టెప్పులు వేశారు. ఈ పాటను బాలాజీ రాయగా, ఏఆర్ రెహమాన్ స్వరాలు సమకూర్చారు. మోహిత్ చౌహాన్ అద్భుతంగా ఆలపించారు. ఈ సినిమాలో జాన్వీ కపూర్ అచ్చియమ్మ పాత్రలో కనిపించనున్నారు. కన్నడ నటుడు శివరాజ్ కుమార్, జగపతిబాబు, దివ్యేందు శర్మ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పణలో వృద్ధి సినిమాస్ బేనర్‌పై వెంకట సతీష్ కిలారు నిర్మిస్తున్నారు.

మరోసారి యాక్షన్ ఫిల్మ్




తన పుట్టినరోజు సందర్భంగా విలక్షణ నటుడు కమల్‌హాసన్ కొత్త సినిమాను ప్రకటించారు. 'విక్రమ్' చిత్రంలో తనతో అద్భుతమైన ఫైట్లు చేయించి చిత్ర విజయానికి కారణమైన స్టంట్ కొరియోగ్రాఫర్లు అన్బు మణి, అరివు మణి లను దర్శకులుగా ఈ చిత్రంతో పరిచయం చేస్తున్నారు కమల్. రాజ్‌కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్ పతాకంపై ఆర్.మహేంద్రన్‌తో కలసి ఈ సినిమా నిర్మించనున్నారు కమల్. 'హంట్ మోడ్ ఆన్ అనే ట్యాగ్‌లైన్‌తో చిత్రాన్ని ప్రకటించారు. భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా సినిమా ఉంటుందని అన్బు మణి, అరివు మణి చెప్పారు.

అఖండ తాండవం!



నందమూరి బాలకృష్ణ, దర్శకుడు బోయపాటి శ్రీను కాంబినేషన్‌లో రూపుదిద్దుకుంటున్న భారీ చిత్రం 'అఖండ 2.. తాండవం'. రామ్ ఆచంట, గోపీచంద్ ఆచంట నిర్మిస్తున్న ఈ చిత్రం ప్రమోషన్స్ ఊపందుకున్నాయి. విడుదల తేదీ దగ్గర పడుతుండడంతో సినిమాలోని ఆసక్తికరమైన అంశాలు ఒక్కొక్కటీగా జనంలోకి వదులుతున్నారు. తాజాగా ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్న తాండవం సాంగ్ ప్రోమోని విడుదల చేశారు. సంగీత దర్శకుడు తమన్ స్వరాలు అందించి అద్భుతంగా పాటను రూపొందించారు. ఒక చేతిలో త్రిశూలం, మరో చేతితో ఢమరుకంతో బాలకృష్ణ చేసిన అఖండ తాండవం ఆకట్టుకుంటోంది. పూర్తి పాటను ఈ నెల 14న విడుదల చేయనున్నారు. సంయుక్త కథానాయికగా నటిస్తున్న ఈ సినిమాలో ఆది పినిశెట్టి ఓ పవర్‌ఫుల్ పాత్ర పోషిస్తున్నారు. డిసెంబర్ 5న 'అఖండ 2.. తాండవం' చిత్రం విడుదల కానుంది. నందమూరి తేజస్విని ఈ చిత్రానికి సమర్పకురాలు.

సినీ, టెలివిజన్ రంగాల అభివృద్ధికి చర్యలు




సినీ, టెలివిజన్ రంగాల అభివృద్ధిపై తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఇందులో భాగంగా మూడు కీలక నిర్ణయాలు తీసుకుంది. రాష్ట్రంలో సృజనాత్మక రంగానికి ఊతమివ్వడంతోపాటు యువ ప్రతిభకు వేదికలు కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందడుగు వేస్తోంది.

హైదరాబాద్‌లో షార్ట్ ఫిల్మ్ ఫెస్టివల్: డిసెంబరు 19 నుంచి 21 వరకు తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా హైదరాబాద్‌లో ఇంటర్నేషనల్ షార్ట్ ఫిల్మ్ ఫెస్టివల్ నిర్వహణకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఈ ఫెస్టివల్‌ను దాదాసాహెబ్ ఫాల్కే స్కూల్ ఆఫ్ ఫిల్మ్ స్టడీస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తారు.

టెలివిజన్ అవార్డులపై కమిటీ: 'తెలంగాణ టెలివిజన్ అవార్డులు 2024' నిర్వహణకు సంబంధించిన నియమాలు, విధానాలు, లోగో డిజైన్ వంటి అంశాలను రూపొందించేందుకు ప్రభుత్వం ఓ కమిటీని ఏర్పాటు చేసింది. టెలివిజన్ రంగానికి చెందిన ప్రముఖులు, సీనియర్ ప్రొఫెషనల్స్ ఈ కమిటీలో సభ్యులుగా ఉంటారు.

యంగ్ ఫిల్మ్ మేకర్స్ అవార్డ్స్: యంగ్ ఫిల్మ్ మేకర్స్ అవార్డులను ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ కార్యక్రమ నిర్వహణ కోసం రూ.30 లక్షల బడ్జెట్‌ను కేటాయించింది. దర్శకుడు హరీశ్ శంకర్, గాయకుడు రాహుల్ సిప్లిగంజ్, సినిమాటోగ్రాఫర్ పి.జి. విందా, దర్శకుడు బలగం వేణులతో అవార్డుల ఎంపిక కమిటీని ఏర్పాటు చేసింది. ఈ సందర్భంగా రాష్ట్ర సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ 'సీఎం రేవంత్ రెడ్డి ఆలోచనల మేరకు రాష్ట్ర ప్రభుత్వం, సినీ, టెలివిజన్ రంగాల అభివృద్ధికి కట్టుబడి ఉంది. తెలంగాణలోని యువ ప్రతిభకు అవకాశాలు కల్పించడం, సృజనాత్మకతను ప్రోత్సహించడం, చిత్ర పరిశ్రమకు అవసరమైన మౌలిక సౌకర్యాలను కల్పించడం మా లక్ష్యం' అని అన్నారు.

పండంటి బాబుకు జన్మనిచ్చిన కత్రీనా



బాలీవుడ్ దంపతులు కత్రీనా కైఫ్, విక్కీ కౌశల్ తల్లిదండ్రులయ్యారు. శుక్రవారం పండంటి బాబుకు కత్రీనా జన్మనిచ్చినట్లు విక్కీ కౌశల్ సోషల్ మీడియా వేదికగా తెలిపారు. 'ఎంతో ఆనందంగా ఉంది. మా ప్రేమకు ప్రతిరూపంగా బాబు జన్మించాడు. మీ అందరి ఆశీర్వాదాలు కావాలి' అని పోస్టు పెట్టారు. ప్రముఖులు, నెటిజన్లు విక్కీ కౌశల్, కత్రీనా కైఫ్ జంటకు శుభాకాంక్షలు తెలిపారు. కొన్నేళ్ల ప్రేమ ప్రయాణం అనంతరం 2021లో విక్కీ, కత్రీనా వివాహ బంధంతో ఒక్కటయ్యారు.

ఇక కుంభాతో తలపడే సమయం వచ్చింది



మహేశ్‌బాబు కథానాయకుడిగా రాజమౌళి దర్శకత్వం వహిస్తున్న చిత్రం (ఎస్ఎస్ఎంబీ 29) నుంచి మేజర్ అప్డేట్ వచ్చింది. ఈ చిత్రంలో ప్రతినాయకుడి పాత్ర పోషిస్తున్న పృథ్వీరాజ్ సుకుమారన్ ఫస్ట్‌లుక్‌ను రాజమౌళి 'కుంభ' అనే పేరుతో శుక్రవారం సోషల్ మీడియాలో విడుదల చేశారు. రోబోటిక్ వీల్ చైర్‌లో కూర్చుని, తీవ్రమైన హావభావాలతో పృథ్వీరాజ్ కనిపించారు. అతను అచేతనుడై ఉన్నా, వీల్‌చైర్ నుంచి బయటకు వచ్చిన రోబోటిక్ చేతులు అతని శక్తికి, సాంకేతికతకు ఆధారమని తెలుస్తోంది. 'దుష్టుడు, క్రూరుడు, శక్తిమంతమైన విరోధి'గా ఈ పాత్రను రాజమౌళి అభివర్ణించారు. ఇలాంటి పాత్రకు ప్రాణం పోయడం సృజనాత్మకంగా చాలా సంతృప్తిని ఇచ్చింది, ఆ కుర్చీలో ఒదిగిపోయినందుకు పృథ్వీకి ధన్యవాదాలు' అని పేర్కొన్నారు. 'ఒక వైపు నిలబడ్డాను... ఇక కుంభాతో తలపడే సమయం వచ్చింది' అని మహేశ్‌బాబు స్పందించారు. 'మేము టేకాఫ్ అవుతున్నాం... కుంభాను కలవండి' అని కథానాయిక ప్రియాంక చోప్రా పోస్ట్ చేశారు. ఈ చిత్రానికి ఎంఎం కీరవాణి సంగీతం అందిస్తున్నారు. ఈ నెల 15న హైదరాబాద్‌లో నిర్వహించనున్న ఈవెంట్‌లో సినిమా టైటిల్‌ను ప్రకటించి టీజర్‌ను విడుదల చేయనున్నారు. ఈ చిత్రాన్ని కేఎల్ నారాయణ భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు.

బాలీవుడ్ నటి, గాయని సులక్షణ పండిట్ ఇక లేరు!



తన నటనతో, పాటతో ప్రేక్షకులను అలరించిన బాలీవుడ్ అలనాటి నటి సులక్షణ పండిట్ (71) గురువారం రాత్రి గుండెపోటుతో ముంబైలో కన్ను మూశారు. ఆవిడ సోదరుడు లలిత్ పండిట్ ఈ విషయాన్ని వెల్లడించారు. హరియాణా రాష్ట్రంలోని హిసార్‌లో ఓ సంగీత కుటుంబంలో సులక్షణ జన్మించారు. నటనపై ఆసక్తితో బాలీవుడ్‌లో అడుగుపెట్టిన సులక్షణకు 'ఉల్‌జాన్' (1975)లో తొలి అవకాశం లభించింది. అందులో సంజీవ్‌కుమార్ హీరో. తొలి చిత్రంతోనే గుర్తింపు తెచ్చుకున్న సులక్షణ బాలీవుడ్‌లోని టాప్ స్టార్స్ రాజేశ్‌ఖన్నా, శశికపూర్, వినోద్ ఖన్నా వంటి వారి సరసన నటించారు. 1970-80 దశకంలో గ్లామర్ కథానాయికగా ఓ వెలుగు వెలిగారు. నటిగానే కాకుండా మంచి గాయనిగా కూడా సులక్షణకు పేరుంది. హిందీ, బెంగాలీ, మరాఠీ, ఒరియా, గుజరాతీ భాషల్లో ఆవిడ పాడారు.



శ్రీచరణికి రూ. 2.5 కోట్లు

- వెయ్యి చదరపు గజాల స్థలం
- గ్రూప్-1 ఉద్యోగం కూడా..
- రాష్ట్ర ప్రభుత్వ నజరానా

అమరావతి (ఆంధ్రజ్యోతి): మహిళల వన్డే ప్రపంచకప్‌లో సత్తా చాటి.. భారత్‌ను విశ్వవిజేతగా నిలబెట్టడంలో కీలకపాత్ర పోషించిన తెలుగుతేజం శ్రీచరణిని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఘనంగా సత్కరించింది. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆమెకు రూ.2.5 కోట్ల భారీ నజరానా ప్రకటించారు. దీంతోపాటు ఇల్లు నిర్మించుకునేందుకు కడపలో 1000 చదరపు గజాల స్థలం కేటాయిస్తున్నట్టు పేర్కొన్నారు. అలాగే ఆమెకు గ్రూప్-1 ఉద్యోగం కూడా కల్పిస్తామని సీఎం స్పష్టం చేశారు. శుక్రవారం సీఎం క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్‌ను శ్రీచరణి మర్యాదపూర్వకంగా కలిసింది. మహిళల వన్డే ప్రపంచకప్ గెలుచుకున్న ఆనంద క్షణాలను వారితో పంచుకుంది. తనకు మద్దతుగా నిలిచినందుకు కృతజ్ఞతలు తెలిపింది. ఈ సందర్భంగా శ్రీచరణి భారత క్రికెటర్లు సంతకాలు చేసిన టీషర్ట్‌ను సీఎంకు అందించింది. ఆమెతో పాటు మహిళా క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ మిథాలీరాజ్ కూడా సీఎంతో భేటీ అయింది. అంతకు ముందు గన్నవరం విమానాశ్రయంలో శ్రీచరణికి మంత్రులు అనిత, సవిత, సంధ్యారాణి, ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ) అధ్యక్షుడు కేశినేని చిన్ని, కార్యదర్శి సానా సతీశ్, శాప్ చైర్మన్ రవినాయుడు స్వాగతం పలికారు. సీఎం క్యాంపు కార్యాలయం వద్ద మంత్రి లోకేశ్ శ్రీచరణికి స్వాగతం పలికారు.

కడపలో అపూర్వ స్వాగతం

మహిళా ప్రపంచ కప్ గెలుపొందడంలో కీలక భూమిక పోషించిన నల్లపురెడ్డి శ్రీచరణికి సొంతగడ్డ కడపలో జనం అపూర్వ స్వాగతం పలికారు. హెడ్ పోస్టాఫీస్ సర్కిల్ నుంచి వైఎస్సార్ క్రికెట్ స్టేడియం వరకు ర్యాలీ నిర్వహించారు. తొలుత శ్రీచరణి, ఆమె తల్లిదండ్రులు రేణుక, చంద్రశేఖర్‌రెడ్డి, మామ కిశోర్‌రెడ్డిలను గుర్రపు బండిపై ఊరేగించారు. అక్కడి నుంచి కారులో స్టేడియం వద్దకు చేరుకున్నారు. బాణసంచా పేల్చుతూ, పూలవర్షం కురిపిస్తూ ప్రజలు ర్యాలీలో పాల్గొన్నారు.



స్వస్థలం కడపలో శ్రీచరణికి ఘన స్వాగతం

గాబాలోనూ మురిపిస్తారా?



కెప్టెన్లు మార్ష్, సూర్య

సిరీస్‌కు విజయం దూరంలో భారత్

మధ్యాహ్నం 1.45 నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో

సమం చేసేందుకు ఆసీస్ ఆరాటం

నేడు ఇరు జట్ల మధ్య ఐదో టీ20

బ్రిస్బేన్: ఆస్ట్రేలియాతో జరుగుతున్న ఐదు టీ20ల సిరీస్ దక్కించుకునేందుకు టీమిండియా మరో విజయం దూరంలోనే ఉంది. శనివారం ఇరు జట్ల మధ్య జరిగే ఆఖరి మ్యాచ్‌కు ప్రఖ్యాత గాబా మైదానం వేదిక కానుంది. ఇప్పటికే సూర్య సేన 2-1తో ఆధిక్యంలో ఉన్న విషయం తెలిసిందే. అయితే విదేశీ గడ్డపై మరో సిరీస్ సాధించాలనుకుంటున్న భారత్ ముందుగా తమ బ్యాటింగ్ పటిష్టతపై దృష్టి సారించాల్సి ఉంది. అటు ప్రత్యర్థి ఆస్ట్రేలియా జట్టు భారత స్పిన్నర్లను ఎదుర్కోలేక వరుసగా రెండు మ్యాచ్‌లను ఓడాల్సి వచ్చింది. నేటి కీలక పోరులో ఈ బలహీనతను అధిగమించకుంటే కంగారూలు హ్యాట్రిక్ ఓటమితో సిరీస్ కోల్పోక తప్పదు. టీ20 వరల్డ్‌కప్‌నకు ముందు ఇరు జట్ల మధ్య ఇదే చివరి మ్యాచ్. మరోవైపు గాబాలో ఆసీస్‌కు అద్భుత రికార్డే ఉంది. ఇక్కడ ఆడిన ఎనిమిది టీ20ల్లో ఆ జట్టు ఒక్కసారే ఓడడం గమనార్హం.

మిడిలార్డర్ కుదురుకుంటే..: భారత జట్టు బ్యాటింగ్ లైనప్ కాగితంపై పటిష్టంగానే కనిపిస్తోంది. కానీ ఇప్పటిదాకా సిరీస్‌లో సమష్టిగా రాణించిన సందర్భం లేదు. గోల్డ్‌కోస్ట్ మ్యాచ్‌లో గిల్ తొలిసారిగా ఆకట్టుకున్నాడు. అయితే 121/2తో మెరుగ్గా కనిపించిన జట్టు 15 పరుగుల తేడాతో చివరి నాలుగు వికెట్లు కోల్పోవడం ఆందోళనకరం. అభిషేక్ ఒక్కడే అంచనాలను అందుకుంటున్నాడు. సూర్యకుమార్ బ్యాట్ ఝుళిపించాల్సిన అవసరం ఉంది. మిడిలార్డర్‌లో తిలక్ 0, 29, 5 స్కోర్లతో నిరాశపరిచాడు. కీపర్ జితేశ్ రెండు మ్యాచ్‌లాడినా ప్రభావం చూపలేకపోయాడు. దూబే బ్యాటింగ్‌లో నిలకడ లోపించింది. లోయరార్డర్‌లో ఆల్‌రౌండర్లు అక్షర్, సుందర్ పరుగులు రాబడుతున్నారు. అయితే బౌలర్లు జట్టుకు అండగా నిలుస్తుండడం సానుకూలాంశం కానుంది. పేసర్ అర్ష్‌దీప్ టీమ్ మేనేజ్‌మెంట్ సంతృప్తి చెందేలా రాణిస్తున్నాడు. గత రెండు మ్యాచ్‌ల్లో స్పిన్నర్లు వరుణ్, అక్షర్, సుందర్ జట్టుకు కొండంత అండగా ఉన్నారు. కానీ గాబా పిచ్‌పై వీరు ఏమేరకు రాణించగలరో చూడాల్సిందే. అటు దూబే కీలక సమయాల్లో వికెట్లు తీయగలుగుతున్నాడు. సిరీస్ ఆఖరి మ్యాచ్‌లో తమ లోపాలను సరిదిద్దుకుని భారత జట్టు విజయంతో ఈ టూర్‌ను ముగించాలనుకుంటోంది.

స్పిన్‌తో సవాల్: ఆతిథ్య ఆసీస్ జట్టు తమకు అలవాటైన పిచ్‌లపై సమర్థంగా ఆడలేకపోతోంది. నాలుగో టీ20లో భారత స్పిన్నర్లను ఎదుర్కోలేక మ్యాచ్‌ను కోల్పోవాల్సి వచ్చింది. అందుకే భారత స్పిన్ త్రయానికి ఆసీస్ ఆరు వికెట్లు సమర్పించుకుంది. బ్యాటింగ్‌లో కెప్టెన్ మార్ష్, స్టొయినిస్, డేవిడ్‌లపైనే ఆధారపడి ఉంది. మ్యాక్స్‌వెల్ ఫామ్ లేమి గత మ్యాచ్‌లోనూ కొనసాగింది. ఓపెనర్ హెడ్ అందుబాటులో లేకపోవడం వీరిని దెబ్బతీసింది. శనివారం మ్యాచ్‌లో మ్యాక్సీతో పాటు ఇన్‌గ్లి‌స్ సత్తా చూపితేనే ఫలితం ఉంటుంది. స్టార్ పేసర్ హాజెల్‌వుడ్ లేకపోవడంతో బౌలింగ్ బలహీనంగా మారింది. పేసర్ ఎలిస్, స్పిన్నర్ జంపా కీలకంగా మారారు. పేసర్ డ్వార్షుస్ స్థానంలో మహ్లి బియర్డ్‌మన్ అరంగేట్రం చేసే అవకాశం ఉంది.

తుది జట్లు (అంచనా)

భారత్: అభిషేక్, గిల్, సూర్యకుమార్ (కెప్టెన్), తిలక్, దూబే, అక్షర్, సుందర్, జితేశ్, అర్ష్‌దీప్, వరుణ్, బుమ్రా.

ఆస్ట్రేలియా: మార్ష్ (కెప్టెన్), షార్ట్, ఇన్‌గ్లిస్, మ్యాక్స్‌వెల్, డేవిడ్, స్టొయినిస్, ఓవెన్/ఫిలిప్, ఎలిస్, బార్ట్‌లెట్, జంపా, బియర్డ్‌మన్.

పిచ్, వాతావరణం

గాబా పిచ్ సహజంగా పేస్, బౌన్స్‌తో పేసర్లకు అనుకూలంగా ఉంటుంది. మరోవైపు బ్యాటర్లకు కూడా సహకరించనుంది. బిగ్‌బాష్ లీగ్‌లో ఇక్కడ భారీ స్కోర్లు నమోదయ్యాయి. అయితే ఈ మ్యాచ్‌కు వరుణుడు ఆటంకం కలిగించే అవకాశం ఉంది.

ఆధిక్యంలో భారత్ 'ఏ'

దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్ 221

బెంగళూరు: దక్షిణాఫ్రికా 'ఏ'తో జరుగుతున్న రెండో అనధికార టెస్టులో భారత్ 112 పరుగుల ఆధిక్యంలో కొనసాగుతోంది. శుక్రవారం రెండో రోజు పేసర్లు చెలరేగడంతో దక్షిణాఫ్రికా 'ఏ' తొలి ఇన్నింగ్స్‌లో 221 పరుగులకు ఆలౌటైంది. కెప్టెన్ ఏకర్మన్ (134) శతకం సాధించినా.. ప్రసిద్ధ్ (3/35), ఆకాశ్ (2/28), సిరాజ్ (2/61)ల ధాటికి 8 మంది బ్యాటర్లు సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యారు. ఆ తర్వాత 34 పరుగుల ఆధిక్యంతో రెండో ఇన్నింగ్స్ ఆరంభించిన భారత్ 'ఏ' ఆట ముగిసే సరికి 78/3 స్కోరుతో నిలిచింది. క్రీజులో రాహుల్ (26), కుల్దీప్ ఉన్నారు. అంతకుముందు భారత్ 'ఏ' తొలి ఇన్నింగ్స్‌లో 255 పరుగులు చేసింది.

ధోనీ ఐపీఎల్ ఆడతాడు : సీఎస్‌కే

న్యూఢిల్లీ: ప్రతి ఐపీఎల్ ముగింపులో..మరో సీజన్ ప్రారంభంలో బాగా చర్చ జరిగేది ఒక అంశంలోనే. అది చెన్నయ్ సూపర్ కింగ్స్ స్టార్ ధోనీ మరోసారి లీగ్‌లో ఆడతాడా? అని. సీజన్ చివర్లో మొదలయ్యే చర్చ..మరో ఐపీఎల్ ప్రారంభమయ్యే వరకూ జరుగుతూనే ఉంటుంది. అయితే 44 ఏళ్ల మహీ రాబోయే సీజన్‌లో ఆడతాడని సీఎస్‌కే సీఈవో కాశీ విశ్వనాథన్ తెలిపారు.

వచ్చేసారి పది జట్లు

2029 మహిళల వన్డే వరల్డ్ కప్

దుబాయ్: వచ్చేసారి..అంటే 2029లో జరిగే మహిళల వన్డే ప్రపంచ కప్‌లో జట్లను ప్రస్తుతమున్న 8 నుంచి 10 కి పెంచాలనీ ఐసీసీ నిర్ణయించింది. ఈమేరకు ఇక్కడ జరిగిన ఐసీసీ బోర్డు ఈ నిర్ణయాన్ని ఆమోదించింది. ఐసీసీ అనుబంధ సభ్య దేశాల బోర్డులకు 2026 సంవత్సరంలో 10 శాతం మేర అదనంగా నిధులు అందజేయాలని తీర్మానించింది. 2027లో జరిగే ఆఫ్రికన్, పాన్ అమెరికన్ క్రీడల జాబితాలో క్రికెట్‌ను చేర్చాలని కూడా నిర్ణయించింది.

అర్జున్, హరికృష్ణ గెలుపు

పనాజీ: ఇరిగేసి అర్జున్, పెంటేల హరికృష్ణ చెస్ ప్రపంచకప్ మూడో రౌండ్ తొలి గేమ్‌లో విజయాలు నమోదు చేశారు. శుక్రవారం జరిగిన పోటీల్లో భారత అత్యధిక ఎలో రేటింగ్ గల అర్జున్ తెల్లపావులతో బరిలోకి దిగి 30 ఎత్తుల్లో వోఖిడోవ్ (ఉజ్బెకిస్థాన్)పై, హరికృష్ణ 25 ఎత్తుల్లో డానియెల్ (బెల్జియం)పై నెగ్గారు. గుకేశ్, ప్రజ్ఞానంద, విదిత్ డ్రాతో సరిపెట్టుకున్నారు.

ఆసియాకప్ అప్పగింతపై కమిటీ

ఆసియాకప్‌ను భారత్‌కు అప్పగించే అంశాన్ని బీసీసీఐ ప్రతినిధులు శుక్రవారంనాటి ఐసీసీ సమావేశంలో లేవనెత్తినట్టు సమాచారం. పాక్‌కు చెందిన మొహిసిన్ నక్వీ కార్యాలయంలో ఉన్న ఆసియాకప్ ట్రోఫీని వీలైనంత త్వరగా భారత్‌కు అందించే అంశంపై ఓ కమిటీని సైతం ఏర్పాటు చేశారు. అయితే నక్వీ ఈ సమావేశానికి డుమ్మా కొడతారని భావించగా, అనూహ్యంగా ఆయన హాజరయ్యారు.

మహిళల క్రికెట్ కమిటీలో మిథాలీ

ఐసీసీ మహిళల క్రికెట్ కమిటీకి భారత జట్టు మాజీ కెప్టెన్ మిథాలీరాజ్‌ను ఎంపిక చేస్తూ ఐసీసీ మరో నిర్ణయం తీసుకుంది. మిథాలీతోపాటు ఆష్లే డిసిల్వా, అమోల్ మజుందార్, బెన్ సాయెర్, చార్లెట్ ఎడ్వర్డ్స్, సాలా స్టెల్లాను కమిటీలోకి తీసుకుంది.

హాకీ ఇండియా సెంచరీ

సంస్థ వందేళ్ల సంబరాలు

ఒలింపియన్లు గురుబక్ష్, అస్లమ్‌కు సన్మానం

న్యూఢిల్లీ: భారత హాకీ సమాఖ్య..ప్రస్తుత హాకీ ఇండియా (హెచ్ఐ) శుక్రవారం శత వసంతాలను పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా స్థానిక ధ్యాన్‌చంద్ స్టేడియంలో వందేళ్ల వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించింది. హాకీ లెజెండ్స్, అలనాటి ఒలింపియన్లు గురుబక్ష్ సింగ్, అస్లమ్ షేర్‌ఖాన్ ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా గురుబక్ష్, అస్లామ్‌తోపాటు దేశ హాకీ క్రీడకు అంతర్జాతీయంగా వన్నె తెచ్చిన ఆటగాళ్లు అజిత్‌పాల్ సింగ్, అశోక్ కుమార్, బీపీ గోవింద, జాఫర్ ఇక్బాల్, బ్రిగేడియర్ హరిచరణ్ సింగ్, వినీత్ కుమార్, మీర్ రంజన్ నేగి, రోమియో జేమ్స్ అసుంత లక్రా, సుభద్ర ప్రధాన్‌లను సత్కరించారు. కార్యక్రమంలో పాల్గొన్న కేంద్ర క్రీడల మంత్రి మన్‌సుఖ్ మాండవ్య, కేంద్ర మంత్రి కిరణ్ రిజుజు, తమిళనాడు డిప్యూటీ సీఎం ఉదయనిధి స్టాలిన్ మాట్లాడుతూ..వందేళ్ల హాకీ క్రీడ విశిష్ట పయనాన్ని గుర్తు చేశారు. మాండవ్య సారథ్యంలోని స్పోర్ట్స్ మినిస్టర్ లెవెన్, హాకీ ఇండియా అధ్యక్షుడు దిలీప్ టిర్కే సారథ్యంలోని హాకీ ఇండియా లెవెన్ మధ్య స్నేహపూర్వక మ్యాచ్‌తో వందేళ్ల వేడుకలు మొదలయ్యాయి. అలాగే దేశవ్యాప్తంగా నిర్వహించిన వివిధ ఎగ్జిబిషన్ మ్యాచ్‌ల్లో 36 వేలమందికిపైగా పాల్గొన్నారు. ఇంకా..వందేళ్ల హాకీ ఇండియా ప్రస్థానంపై పుస్తకాన్ని ఆవిష్కరించారు.



బిజినెస్



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,22,020 ▲	1,11,850 ▲	1,65,000 ▲
విజయవాడ	1,24,000 ▼	1,18,000 ▲	1,53,000 ▲
విశాఖపట్నం	1,24,050 ▼	1,11,750 ▲	1,65,000 ▲
రాజమండ్రి	1,22,020 ▲	1,11,850 ▲	1,49,000 ▲
ప్రొద్దుటూరు	1,21,600 ▲	1,11,870 ▲	1,52,500 ▲
ముంబై	1,20,100 ▼	1,10,012 ▼	1,48,275 ▲

దివీస్ లాభం రూ.689 కోట్లు

దివీస్ లేబొరేటరీస్.. సెప్టెంబరుతో ముగిసిన త్రైమాసికంలో కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన రూ.689 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఏడాది ఇదే కాలం (రూ.510 కోట్లు)తో పోల్చితే లాభం 35 శాతం వృద్ధి చెందింది. సమీక్షా త్రైమాసికంలో కంపెనీ మొత్తం ఆదాయం కూడా రూ.2,338 కోట్ల నుంచి రూ.2,715 కోట్లకు పెరిగింది. ఈ కాలంలో మొత్తం వ్యయాలు రూ.1,722 కోట్ల నుంచి రూ.1,948 కోట్లకు పెరిగినట్లు దివీస్ పేర్కొంది. కాగా సెప్టెంబరు త్రైమాసికంలో ఫారెక్స్ లాభాలు రూ.29 కోట్ల నుంచి రూ.63 కోట్లకు పెరిగినట్లు తెలిపింది.

తగ్గిన కిమ్స్ హాస్పిటల్స్ లాభం

కృష్ణా ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (కిమ్స్ హాస్పిటల్స్) సెప్టెంబరుతో ముగిసిన రెండో త్రైమాసికంలో రూ.965 కోట్ల కన్సాలిడేటెడ్ ఆదాయంపై రూ.72 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. గత ఏడాది ఇదే కాలంతో పోల్చితే ఆదాయం 23.3 శాతం వృద్ధి చెందగా లాభం మాత్రం 42 శాతం తగ్గింది. సమీక్షా త్రైమాసికంలో అన్ని హాస్పిటల్స్ ప్రోత్సాహకర పనితీరును కనబరిచాయని, మహారాష్ట్రలోని థానేలో కొత్తగా ఏర్పాటు చేసిన హాస్పిటల్‌కు అద్భుతమైన స్పందన లభించిందని కిమ్స్ హాస్పిటల్స్ సీఎండీ భాస్కర్ రావు అన్నారు.

నవ లిమిటెడ్ 300% డివిడెండ్

నవ లిమిటెడ్ సెప్టెంబరుతో ముగిసిన త్రైమాసికంలో కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన రూ.989.70 కోట్ల ఆదాయంపై రూ.177.50 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఏడాది ఇదే కాలంతో పోల్చితే ఆదాయం 5 శాతం వృద్ధి చెందగా లాభం మాత్రం 46 శాతం తగ్గింది. స్టాండ్‌ఎలోన్ ప్రాతిపదికన కంపెనీ రూ.555.5 కోట్ల ఆదాయంపై రూ.156.50 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంతో పోల్చితే ఆదాయం 28.9 శాతం పెరగగా లాభం 7.5 శాతం వృద్ధి చెందింది. కాగా రూ.1 ముఖ విలువ కలిగిన ప్రతి షేరుకు రూ.3 (300%) మధ్యంతర డివిడెండ్‌ను బోర్డు ప్రకటించింది. డివిడెండ్ చెల్లింపునకు రికార్డు తేదీని ఈ నెల 14గా ఖరారు చేసింది.

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్)

సంస్క'రన్'తోనే సాధ్యం!

- 30 లక్షల కోట్ల డాలర్ల ఎకానమీగా ఎదగాలంటే ఆర్థిక సేవల రంగంలో మరిన్ని సంస్కరణలు అవసరం
- ప్రైవేట్ రంగంలో మూలధన సమీకరణకు ఊతమివ్వాలి..
- భారత్‌కు ప్రపంచ బ్యాంక్ సూచన



న్యూఢిల్లీ: వచ్చే 2047 నాటికి 30 లక్షల కోట్ల డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదగాలంటే ఆర్థిక సేవల రంగంలో మరిన్ని సంస్కరణలు చేపట్టడంతోపాటు ప్రైవేట్ రంగంలో మూలధన నిధుల సమీకరణకు ఊతమివ్వాలని ప్రపంచ బ్యాంక్ తాజా నివేదిక భారత్‌కు సూచించింది. భారత్ ప్రపంచ స్థాయి డిజిటల్ ప్రజా మౌలిక వసతులను కలిగి ఉందని, ప్రభుత్వ కార్యక్రమాలు దేశంలోని పురుషులు, మహిళలకు విస్తృతమైన ఆర్థిక సేవలను అందుబాటులోకి తెచ్చాయని వరల్డ్ బ్యాంక్ 'ఫైనాన్షియల్ సెక్టార్ అసెస్‌మెంట్ (ఎఫ్ఎస్ఏ)' రిపోర్టు పేర్కొంది. ఖాతాల వినియోగాన్ని, ముఖ్యంగా మహిళల్లో మరింత పెంచాల్సిన అవసరం ఉందని.. వ్యక్తులు, ఎంఎస్ఎంఈలకు ఆర్థిక సాధనాలను విస్తృతంగా అందుబాటులోకి తేవాలని నివేదిక సూచించింది. మరిన్ని విషయాలు..

- బ్యాంకులు, నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీల (ఎన్‌బీఎఫ్‌సీ) నియంత్రణ, పర్యవేక్షణపైనా రిపోర్టులో ప్రస్తావించింది. సహకార బ్యాంకులపై నియంత్రణాధికారాల విస్తరణ, కీలక నిబంధనలను కఠినతరం చేయడంతో పాటు నియంత్రణ, పర్యవేక్షణ శాఖ పునర్ వ్యవస్థీకరణ ఆర్థిక సేవల రంగ దక్షతను మరింత పెంచనుంది. అలాగే, ఎన్‌బీఎఫ్‌సీలకు స్కేల్ బేస్డ్ నియమావళిని సైతం ప్రపంచ బ్యాంక్ స్వాగతించింది. బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలపై మరింత మెరుగైన పర్యవేక్షణ కోసం క్రెడిట్ రిస్క్ మేనేజ్‌మెంట్ నియమావళిని మరింత బలోపేతం చేయాలని సూచించింది.
- గడిచిన ఐదేళ్లలో భారత క్యాపిటల్ మార్కెట్ (ఈక్విటీ, ప్రభుత్వ, కార్పొరేట్ బాండ్లు) జీడీపీలో 144 శాతం నుంచి 175 శాతానికి పెరిగింది. క్యాపిటల్ మార్కెట్లో విస్తృత మౌలిక వసతులు, భారీగా పెరిగిన మదుపరులు వంటి అంశాలు ఇందుకు దోహదపడ్డాయి. మూలధన సమీకరణకు మరింత దోహదపడేలా రుణ విస్తరణ వ్యవస్థ అభివృద్ధి, రిస్క్ షేరింగ్ ఫెసిలిటీస్, సెక్యూరిటైజేషన్ వేదికను అభివృద్ధి చేయాలని వరల్డ్ బ్యాంక్ నివేదిక సూచించింది.

ఎయిర్‌టెల్‌లో 0.8% వాటాల విక్రయం

సింగ్‌టెల్

న్యూఢిల్లీ: భారతి ఎయిర్‌టెల్‌లో 0.8% వాటాలను రూ.10,353 కోట్లకు విక్రయించినట్టు సింగపూర్‌కు చెందిన టెలికాం కంపెనీ సింగ్‌టెల్ ప్రకటించింది. ఆస్తుల పునర్ వ్యవస్థీకరణలో భాగంగా కంపెనీ ఈ చర్య తీసుకుంది. ఈ విక్రయం అనంతరం ఎయిర్‌టెల్‌లో సింగ్‌టెల్ వాటా 27.5 శాతానికి తగ్గుతుంది. ఈ వాటా అంచనా విలువ రూ.3.46 లక్షల కోట్లుగా ఉంది. సంస్థాగత ఇన్వెస్టర్లకు ప్రైవేటుగా షేర్ల కేటాయింపు విధానంలో ఈ లావాదేవీ జరిగింది. ఎయిర్‌టెల్‌పై మార్కెట్లో విశ్వాసానికి, బలమైన డిమాండ్‌కు ఇది దర్పణమని పేర్కొంది. ఈ లావాదేవీ ద్వారా వచ్చిన లాభం 110 కోట్ల సింగపూర్ డాలర్లుంటుందని సింగ్‌టెల్ తెలిపింది. ఈ నేపథ్యంలో బీఎస్ఈలో ఎయిర్‌టెల్ షేరు 4.46% క్షీణించి రూ.2001.10 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈలో ఈ షేరు 4.47% క్షీణించి రూ.2001.20 వద్ద క్లోజైంది.

- సెప్టెంబరుతో ముగిసిన త్రైమాసికంలో పిట్టీ ఇంజనీరింగ్ రూ.499 కోట్ల మొత్తం ఆదాయంపై రూ.40 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. గత ఏడాది ఇదే కాలంతో పోల్చితే లాభం 5%, ఆదాయం 10% వృద్ధి చెందాయి. డిమాండ్‌కు తగ్గట్టుగా రూ.150 కోట్ల పెట్టుబడితో సామర్థ్య విస్తరణను చేపడుతోంది.
- వెబ్3 ఇన్‌ఫ్రా, గేమింగ్ కంపెనీ స్టింగ్ మెటావర్స్ లిమిటెడ్ సెప్టెంబరు త్రైమాసికంలో రూ.233.27 కోట్ల కన్సాలిడేటెడ్ ఆదాయంపై రూ.21.64 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఏడాది ఇదే కాలంతో పోల్చితే లాభం 220 శాతం పెరిగిందని పేర్కొంది. నిర్వహణా సామర్థ్యాలు మెరుగుపరుచుకోవటంతో పాటు కార్యకలాపాలు విస్తరించటం కలిసివచ్చిందని పేర్కొంది.
- రియల్ ఎస్టేట్ డెవలపర్ ఒమాక్సే లిమిటెడ్.. తన బ్రాండ్ అంబాసిడర్‌గా భారత మహిళల క్రికెట్ టీమ్ సారథి హర్మన్‌ప్రీత్ కౌర్‌ను నియమించుకుంది. మహిళలను అథ్లెటిక్స్, ఇతర క్రీడల్లో ప్రోత్సహించేందుకు హర్మన్‌ప్రీత్ భాగస్వామ్యం ఎంతగానో తోడ్పడుతుందని ఒమాక్సే ఎండీ మోహిత్ గోయల్ అన్నారు. ఒమాక్సేకు ప్రచారం చేయటం తనకు ఎంతో సంతోషాన్నిస్తోందని, మున్ముందు యువతరానికి మరింత సాధికారిత కల్పించేందుకు కంపెనీ తోడ్పాటునందిస్తుందని విశ్వసిస్తున్నట్లు హర్మన్‌ప్రీత్ ఈ సందర్భంగా అన్నారు.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



8వ తేదీ			
హైదరాబాద్	585	విజయవాడ	600
వరంగల్	587	గోదావరి	600
చిత్తూరు	613	విశాఖపట్నం	585
		డజను గుడ్లు రూ.	78

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	100	విజయవాడ	106
వరంగల్	100	గుంటూరు	108
కరీంనగర్	100	ఒంగోలు	108
మహబూబ్‌నగర్	100	చిత్తూరు	100
కర్నూలు	100	నెల్లూరు	105
విశాఖపట్నం	108	అనంతపురం	105
గోదావరి	106		

25,500 దిగువకు నిఫ్టీ

ఇంట్రాడేలో 83,000 కిందికి సెన్సెక్స్

వరుసగా మూడో రోజూ నష్టాల్లోనే..

ముంబై: అంతర్జాతీయ మార్కెట్లో బలహీన ట్రేడింగ్ ట్రెండ్, విదేశీ సంస్థాగత పెట్టుబడుల నిరవధిక ఉపసంహరణ కారణంగా భారత ఈక్విటీ సూచీలు శుక్రవారం మరింత నష్టపోయాయి. ప్రారంభ ట్రేడింగ్‌లో సెన్సెక్స్ 640 పాయింట్లు క్షీణించి 82,670.95 వద్ద ఇంట్రాడే కనిష్ఠాన్ని నమోదు చేసింది. మధ్యాహ్నం నుంచి మళ్లీ కోలుకున్న సూచీ చివరికి 94.73 పాయింట్ల నష్టంతో 83,216.28 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 17.40 పాయింట్లు తగ్గి 25,492.30 వద్ద క్లోజైంది. సూచీలు నష్టపోవడం వరుసగా ఇది మూడో రోజు. గడిచిన మూడు సెషన్లలో సెన్సెక్స్ 1,300 పాయింట్లకు పైగా, నిఫ్టీ 440 పాయింట్లకు పైగా పతనమయ్యాయి. కాగా గత నెల 31తో ముగిసిన వారంలో విదేశీ మారక (ఫారెక్స్) నిల్వలు 562 కోట్ల డాలర్ల మేర తగ్గి 68,973 కోట్ల డాలర్లకు పరిమితమైనట్లు ఆర్‌బీఐ వెల్లడించింది.

షార్ట్ సెల్లింగ్‌ను సమీక్షిస్తాం..

త్వరలోనే వర్కింగ్ గ్రూప్ ఏర్పాటు .. సెబీ చైర్మన్ తుహిన్ కాంత పాండే



నూఢిల్లీ: ప్రస్తుతం ఉన్న షార్ట్ సెల్లింగ్, సెక్యూరిటీస్ లెండింగ్ అండ్ బారోయింగ్ (ఎస్ఎల్‌బీ) విధి విధానాలను సమగ్రంగా సమీక్షించాలని క్యాపిటల్ మార్కెట్ నియంత్రణ మండలి సెబీ భావిస్తోంది. ఇందుకోసం త్వరలోనే ఒక వర్కింగ్ గ్రూప్‌ను ఏర్పాటు చేయనున్నట్టు వెల్లడించారు. సీఎన్‌బీసీ టీవీ 18 చానల్ నిర్వహించిన ఒక సదస్సులో సెబీ చైర్మన్ తుహిన్ కాంత పాండే ఈ విషయం వెల్లడించారు. స్టాక్ మార్కెట్లో లిక్విడిటీ పెంచేందుకు తమ డీమ్యాట్ ఖాతాల్లో వృధాగా పడి ఉన్న షేర్లను మరొకరికి కొంత ఫీజుకు అద్దెకి ఇచ్చి అదనపు రాబడి పొందేందుకు 2007లో షార్ట్ సెల్లింగ్ విధానాన్ని, 2008లో ఎస్ఎల్‌బీ విధానాన్ని సెబీ ప్రవేశ పెట్టింది. మధ్యలో ఎస్ఎల్‌బీ విధానంలో కొన్ని మార్పులు చోటు చేసుకున్నా, షార్ట్ సెల్లింగ్ విధానంలో మాత్రం ఎలాంటి మార్పులు లేవు. ఎస్ఎల్‌బీ విధానం కూడా అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా లేదు. దీంతో ఈ రెండు విధానాలను సమగ్రంగా సమీక్షించాలని సెబీ నిర్ణయించింది.

ఎఫ్‌పీఐ పెట్టుబడులపై బేఫికర్

దేశీయ ఈక్విటీ మార్కెట్ల నుంచి విదేశీ పోర్టుఫోలియో పెట్టుబడులు (ఎఫ్‌పీఐ) తరలిపోవటంపై పెద్దగా ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పాండే అన్నారు. ఇప్పటికీ మన క్యాపిటల్ మార్కెట్లో ఈ సంస్థల పెట్టుబడులు 90,000 కోట్ల డాలర్ల (సుమారు రూ.79.78 లక్షల కోట్లు) వరకు ఉన్న విషయాన్ని గుర్తు చేశారు. ఎఫ్‌పీఐలకు భారత ఆర్థిక వృద్ధిపై పూర్తి నమ్మకం ఉందన్నారు. ప్రస్తుతం మన స్టాక్ మార్కెట్లో దేశీయ సంస్థాగత మదుపరులె (డీఐఐ), వ్యక్తిగత ఇన్వెస్టర్లు కూడా చురుగ్గా ఉన్నట్టు తెలిపారు. లిస్టెడ్ కంపెనీల మార్కెట్ క్యాప్‌లో వ్యక్తిగత మదుపరులు వాటానే 18 శాతం వరకు ఉన్న విషయాన్ని పాండే గుర్తు చేశారు. వీక్లీ ఎక్స్‌పైరీలపై నిషేధం విధించే ఆలోచన ఉందా? అనే ప్రశ్నకు ఆయన సమాధానం దాటవేశారు.

మస్క్‌కు లక్ష కోట్ల డాలర్ల ప్యాకేజీ

టెస్లా షేర్‌హోల్డర్ల ఆమోదం

టెక్సాస్: అమెరికన్ విద్యుత్ కార్ల కంపెనీ టెస్లా సీఈఓ ఎలాన్ మస్క్‌ను ప్రపంచంలో తొలి ట్రిలియనీర్ (లక్ష కోట్ల డాలర్ల సంపద కలిగిన వ్యక్తి)గా మార్చగలిగే పారితోషిక ప్యాకేజీకి కంపెనీ షేర్ హోల్డర్లు ఆమోదం తెలిపారు. టెక్సాస్ రాష్ట్రంలోని ఆస్టిన్‌లో జరిగిన టెస్లా షేర్‌హోల్డర్ల వార్షిక సమావేశంలో మస్క్ పారితోషిక ప్యాకేజీకి సుముఖంగా 75 శాతం మంది ఓటు వేశారు. ఈ సెప్టెంబరులో టెస్లా బోర్డు మస్క్‌కు భవిష్యత్‌లో ట్రిలియన్ డాలర్ల విలువ చేసే పనితీరు ఆధారిత ప్యాకేజీని ఆఫర్ చేసింది. ప్రపంచ కార్పొరేట్ రంగంలో ఇప్పటివరకిదే అతిపెద్ద ప్యాకేజీ. బీవైడీ, ఇతర చైనా కంపెనీల నుంచి పోటీ తట్టుకోలేక విక్రయాలు భారీగా తగ్గి డీలాపడిన టెస్లా ఈ ప్యాకేజీలో భాగంగా మస్క్‌కు అత్యంత భారీ లక్ష్యాలను నిర్దేశించింది. కంపెనీ మార్కెట్ విలువను (క్యాపిటలైజేషన్) ప్రస్తుత 1.5 ట్రిలియన్ డాలర్ల నుంచి 8.5 ట్రిలియన్ డాలర్ల (8.5 లక్షల కోట్ల డాలర్లు) స్థాయికి చేర్చడం, కంపెనీ కార్ల వార్షిక విక్రయాలను గత ఏడాదిలో నమోదైన 20 లక్షల లోపు యూనిట్ల నుంచి 2 కోట్ల యూనిట్లకు పెంచడం, రోబో ట్యాక్సీలు, హ్యూమనాయిడ్ రోబోల అమ్మకాలను 10 లక్షల యూనిట్లకు పెంచడం అందులో ప్రధానమైనవి. లక్ష్యాలన్నింటినీ చేరుకుంటేనే, ప్యాకేజీలో భాగంగా ఆఫర్ చేసిన 42.37 కోట్ల కంపెనీ షేర్లు మస్క్‌కు దక్కుతాయి. ప్రస్తుతం వాటి విలువ 8,780 కోట్ల డాలర్లు. పదేళ్లలో కంపెనీ మార్కెట్ విలువ 8.5 లక్షల కోట్ల డాలర్ల స్థాయికి చేరితే ఆయన వాటా షేర్ల మొత్తం విలువ ట్రిలియన్ డాలర్లు దాటనుంది. ఈ ప్యాకేజీ ప్రయోజనాలు పూర్తిగా దక్కాలంటే, మస్క్ కంపెనీలో కనీసం ఏడున్నరేళ్లు కొనసాగాలి.

చిప్‌ల తయారీలోకి టెస్లా: టెస్లా సెమీకండక్టర్ల (చిప్) తయారీలోకి ప్రవేశించాలనుకుంటున్నట్లు కంపెనీ వాటాదారుల వార్షిక సమావేశంలో మస్క్ వెల్లడించారు. స్వయం చోదక వాహనాలు, రోబోటిక్స్, కృత్రిమ మేధ (ఏఐ) రంగాల్లో భారీ లక్ష్యాలను నిర్దేశించుకున్న కంపెనీ.. ఇందుకు అవసరమైన ఏఐ ఆధారిత చిప్‌ల కోసం ఇతర సంస్థలపై ఆధారపడకుండా సొంతగా తయారు చేసుకోవాలనుకుంటున్నట్లు ఆయన చెప్పారు. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా ఐదు, ఆపై తరాల ఏఐ చిప్‌ల తయారీ కోసం టెస్లా టెరాఫ్యాబ్ యూనిట్‌ను ఏర్పాటు చేయాలనుకుంటున్నట్లు, అందులో భాగంగా ఇంటెల్‌తో కలిసి పనిచేయనున్నట్లు మస్క్ తెలిపారు.

'బనకచర్ల'లో భారీ మార్పులు!

(మొదటిపేజీ తరువాయి)

పరిమితం చేయాలని ప్రాథమికంగా నిర్ణయించింది. రూ.49,550 కోట్ల అంచనా వ్యయంతో రెండు దశల్లో చేపట్టాలని భావిస్తోంది. బనకచర్ల పథకానికి డీపీఆర్‌ను రూపొందించేందుకు ఆసక్తి కలిగిన సంస్థలను ఆహ్వానిస్తూ గత నెల 11న జలవనరుల శాఖ టెండర్లు (ఆర్‌ఎఫ్‌పీ) పిలిచింది. ఆ వెంటనే తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర నుంచి వ్యతిరేకత మొదలైంది. గోదావరికి వరద సమయంలో రోజుకు రెండు టీఎంసీల చొప్పున నీటిని ఎత్తిపోసుకుంటామని పేర్కొనడంపై ఆగ్రహం వ్యక్తంచేశాయి. ముఖ్యంగా తెలంగాణ, ఏపీ నేతల మధ్య వాగ్వాదం తీవ్రస్థాయికి చేరింది. దీంతో వరద జలాల లభ్యతపై కేంద్ర జలసంఘంతో కలిసి అధ్యయనం తేల్చాలని సాంకేతిక మదింపు కమిటీ ఏపీకి సూచించింది. వాస్తవానికి ఇంత భారీ ప్రాజెక్టు చేపట్టడం ఆచరణ సాధ్యం కాదని సాగునీటి రంగ నిపుణులు కూడా స్పష్టంచేశారు. గోదావరి జలాలను కృష్ణా పరివాహకానికి మళ్లించగానే...కృష్ణా జలాల్లో 80 టీఎంసీలను ఎగువ రాష్ట్రాలకు అప్పగించాల్సి వస్తుందని గుర్తుచేశారు. దీనికంటే.. ప్రకాశం బ్యారేజీలోకి నేరుగా గోదావరి జలాలను ఎత్తిపోయకుండా ప్రకాశం బ్యారేజీకి ఎగువన ఇబ్రహీంపట్నం సమీపంలోని దాములూరు వద్ద ఓ అక్విడెక్టును నిర్మించాలని సూచించారు. పోలవరం కుడికాలువ ద్వారా గోదావరి జలాలను తరలించి.. హరిశ్చంద్రపురం వద్ద నాగార్జున సాగర్ కుడి కాలువలోకి ఎత్తిపోయాలని ప్రతిపాదించారు. ప్రత్యామ్నాయాలపై కసరత్తు చేస్తున్న జలవనరుల శాఖ.. పోలవరం-నల్లమలసాగర్ ప్రాజెక్టును రెండు దశల్లో చేపట్టేందుకు రూ.49,550 కోట్లు వ్యయమవుతుందని అంచనా వేస్తోంది. ఇందులో 50 %.. రూ.24,775 కోట్లు విదేశీ రుణం.. కేంద్ర నిధులు 20% అంటే రూ.9,910 కోట్లు.. రాష్ట్రం వాటా పది శాతం (రూ.5,000 కోట్లు), ప్రైవేటు వాటా 20 శాతం (రూ.9,910 కోట్లు). ప్రాజెక్టు తొలిదశలో రూ13,800 కోట్లు, రెండో దశలో 35,750 కోట్లు వ్యయమవుతుందని అంచనా వేశారు. పాత పీఎఫ్‌సీని రద్దుచేసి.. నల్లమలసాగర్ వరకు డీపీఆర్ రూపొందించేందుకు ఆసక్తి కనబరిచే సంస్థల కోసం మళ్లీ కొత్తగా టెండర్లు పిలవాలని యోచిస్తున్నారు. పోలవరం-నల్లమల సాగర్ తొలి దశలో గోదావరి వరద నీటిని తాడిపూడి వరద కాలువ ద్వారా పోలవరం కుడి ప్రధాన కాలువలోకి పంపి.. ప్రకాశం బ్యారేజీకి ఎగువన దాములూరు దాకా తీసుకెళ్లి.. అక్కడి నుంచి హరిశ్చంద్రపురం వద్ద నాగార్జున సాగర్ కుడి కాలువలోకి ఎత్తిపోస్తారు. అక్కడి నుంచి నల్లమల్ల సాగర్‌కు తీసుకెళ్లేందుకు 29 కిమీ మేర 3 టన్నెళ్లను తవ్వుతారు. దీనిపై త్వరలోనే జల వనరుల శాఖ తుది నిర్ణయం తీసుకోనుంది. ముందస్తు సాధ్యాసాధ్యాల నివేదిక (పీఎఫ్ఆర్)ను తయారు చేస్తామని.. కేంద్రం ఆమోదముద్ర వేశాక సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్)ను రూపొందిస్తామని అధికారులు చెబుతున్నారు.

పోలవరం విస్తరణ చేపట్టకుండా ఏపీని అడ్డుకోండి

95వ టీఏసీకి విరుద్ధంగా ప్రతిపాదనలు.. ముంపుపై అధ్యయనం చేయాలి: తెలంగాణ

- పోలవరం ఎప్పటికి పూర్తిచేస్తారు?: సీడబ్ల్యూసీ
- 2027 డిసెంబరు నాటికి పూర్తి చేస్తాం: ఏపీ

హైదరాబాద్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టు విస్తరణ చేపట్టకుండా ఏపీని అడ్డుకోవాలని తెలంగాణ డిమాండ్ చేసింది. 95వ టెక్నికల్ అడ్వయిజరీ కమిటీ (టీఏసీ) అనుమతులను ఉల్లంఘిస్తూ ఏపీ కొత్త కొత్త ప్రతిపాదనలు చేస్తోందని, ఏపీని నిలువరించే బాధ్యత పోలవరం ప్రాజెక్టు అథారిటీ(పీపీఏ)దేనని స్పష్టం చేసింది. పీపీఏ 17వ సమావేశం శుక్రవారం హైదరాబాద్ సీడబ్ల్యూసీలోని కృష్ణా-గోదావరి బేసిన్ ఆర్గనైజేషన్(కేజీబీవో)లో సీడబ్ల్యూసీ చైర్మన్ అతుల్‌కుమార్ జైన్ అధ్యక్షతన జరిగింది. కేంద్ర జలశక్తి శాఖ సంయుక్త కార్యదర్శి గౌరవ్, ఏపీ నుంచి ఈఎన్‌సీ నర్సింహమూర్తి, తెలంగాణ నుంచి నీటి పారుదలశాఖ ముఖ్యకార్యదర్శి రాహుల్ బొజ్జా, ఈఎన్‌సీ (జనరల్) మహ్మద్ అంజద్ హుస్సేన్, చీఫ్ ఇంజనీర్(అంతరాష్ట్ర) కె.ప్రసాద్, ఇన్‌చార్జ్ ఎస్ఈ ఎస్.విజయకుమార్, గోదావరి బేసిన్ డిప్యూటీ డైరెక్టర్ సుబ్రమణ్యం ప్రసాద్ తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ అధికారులు పలు అంశాలను లేవనెత్తారు. పోలవరం ప్రాజెక్టుతో తెలంగాణలో 8 నదుల ప్రవాహాలు సజావుగా గోదావరిలో కలవలేవని, దీనివల్ల కలిగే ముంపుపై అధ్యయనం చేయాలని రాహుల్ బొజ్జా కోరారు. ఇప్పటికే రెండు ఉప నదులపై సర్వే పూర్తయిందని, మరో ఆరు ఉప నదులపై సర్వే జరగాల్సి ఉందని గుర్తు చేశారు. దీనికి అతుల్ కుమార్ జైన్.. ఈ ఏడాది జూలైలోనే సర్వే చేయాలని అనుకున్నామని, జూన్‌లో వరదలు వచ్చినందున చేయలేకపోయామని, వరదలు తగ్గగానే కేజీబీవో ఆధ్వర్యంలో సర్వే చేస్తామని స్పష్టం చేశారు. పోలవరం ప్రాజెక్టులో 45.72 మీటర్ల ఎత్తుతో నీటిని నిల్వ చేయడం వల్ల కలిగే ముంపుపై ఛత్తీస్‌గఢ్‌లో సర్వే చేస్తూ తెలంగాణలో మాత్రం ఎందుకు చేయరని రాహుల్ బొజ్జా ప్రశ్నించారు. దాంతో.. భద్రాచలంలోని 8 రెగ్యులేటరీలపై కూడా అధ్యయనానికి ఒక కమిటీ వేసేందుకు సీడబ్ల్యూసీ చైర్మన్ ఆమోదం తెలిపారు.



పోలవరం ప్రాజెక్టు అథారిటీ సమావేశానికి హాజరైన అధికారులు

2027 డిసెంబరుకు పూర్తి: ఏపీ

పోలవరం ప్రాజెక్టు నిర్మాణం ఎప్పట్లోగా పూర్తి చేస్తారని సీడబ్ల్యూసీ అధికారులు ఏపీని ఆరా తీయగా... 2027 డిసెంబరు నాటికి పోలవరం ప్రాజెక్టు తొలి దశ నిర్మాణం పూర్తిచేసి, సాగు, తాగునీటిని అందిస్తామని ఏపీ అధికారులు తెలిపారు. భూసేకరణ, డయాఫ్రం వాల్, రాక్‌ఫిల్ డ్యామ్ పనులన్నీ పూర్తి చేస్తామని, దీని కోసం రూ.20 వేల కోట్ల దాకా అవసరం ఉంటుందని వెల్లడించారు. పోలవరం ప్రాజెక్టు అథారిటీ తరలింపు అంశం చర్చకు రాగా.. రెండు దశల్లో రాజమహేంద్రవరానికి తరలించాలని నిర్ణయం తీసుకున్నట్లు పీపీఏ తెలిపింది. కానీ.. దాన్ని కేంద్ర జలశక్తి శాఖ సంయుక్త కార్యదర్శి గౌరవ్ తోసిపుచ్చారు. పీపీఏ కార్యాలయాన్ని హైదరాబాద్ నుంచి రాజమహేంద్రవరానికి ఒకేసారి తరలించడానికి ప్రతిపాదనలు పంపించాలని తేల్చిచెప్పారు. కాగా.. పీపీఏలో ఏపీ, సీడబ్ల్యూసీ అధికారులు మాత్రమే ఉన్నారని, తెలంగాణ నుంచి ఒక డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్(డీఈఈ), ఒక అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్(ఏఈఈ)ని డిప్యూటేషన్‌పై నియమించాలని తెలంగాణ ప్రతిపాదించింది. దీనికి పీపీఏ సీఈవో.. ఆన్ డిప్యూటేషన్ వద్దు, ఆన్ డైవర్షన్ కింద ఇద్దరినీ నియమించడానికి అనుమతినిస్తున్నట్లు చెప్పారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణ పనులు నిలిపివేయాలని కేంద్ర పర్యావరణ మంత్రిత్వశాఖ ఈపీసీ ఇచ్చిన ఉత్తర్వులపై అబయన్స్(ఉత్తర్వులు అమలు కాకుండా నిలుపుదల) గడువు త్వరలో పూర్తికానుందని పీపీఏ అధికారులు గుర్తు చేయగా.. ఆ ఉత్తర్వులు శాశ్వతంగా రద్దు చేసే అవకాశాలను పరిశీలిస్తున్నామని ఏపీ అధికారులు వివరించారు. 95వ టీఏసీ ఉత్తర్వులకు విరుద్ధంగా పనులు చేస్తున్నందునే పోలవరం పనుల నిలిపివేత నిర్ణయం తీసుకున్నారని తెలంగాణ గుర్తు చేసింది. ఈ సమావేశానికి వ్యాప్కోస్, సీడబ్ల్యూసీ, పీపీఏ ప్రతినిధులు కూడా హాజరయ్యారు.

నానో ఎరువులతో తైల పంటల దిగుబడి అధికం

- రోజ్‌మెరీ మొక్కలపై హెచ్‌సీయూ శాస్త్రవేత్తల పరిశోధన
- ఇండస్ట్రియల్ క్రాప్స్ అండ్ ప్రొడక్ట్స్ జర్నల్‌లో ప్రచురితం

హైదరాబాద్ సిటీ, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఔషధ గుణాలున్న నూనె పంటలకు నానో ఎరువును వినియోగిస్తే, అధిక దిగుబడితో పాటు ఉత్పత్తుల్లో మరింత నాణ్యత పెరుగుతుందని హెచ్‌సీయూ శాస్త్రవేత్తల పరిశోధనలో తేటతెల్లమైంది. ప్రస్తుతం మిడిల్ ఈస్ట్ దేశాలకు మాత్రమే పరిమితమైన ఈ పంటల సాగు భారత్‌లోనూ ముందడుగు వేయడానికి ఈ పరిశోధన కీలకం కానుంది. హైదరాబాద్ విశ్వవిద్యాలయం, సహకార సంస్థల నేతృత్వంలోని పరిశోధకులు.. నానో స్థాయిలోని స్థూల, సూక్ష్మ ఎరువును రోజ్‌మెరీ ఆకులపై పిచికారి చేయడం వల్ల ఆకుల నుంచి వచ్చిన నూనె దిగుబడిని, నాణ్యతను గణనీయంగా పెంచుతుందని నిరూపించారు. దీని ద్వారా సాగు వ్యయం తగ్గనుంది. బయోటెక్నాలజీ విభాగం ప్రాజెక్ట్ ప్రధాన ఫలితాలలో ఇదొకటి. ఈ పరిశోధనలో ప్లాంట్ సైన్సెస్ విభాగం, స్కూల్ ఆఫ్ లైఫ్ సైన్సెస్ ప్రొఫెసర్ అప్పారావు పోదిలె, స్కూల్ ఆఫ్ ఇంజినీరింగ్ సైన్సెస్ అండ్ టెక్నాలజీ ప్రొఫెసర్ డాక్టర్-ఇంజినీరింగ్ శ్రీకాంత్ తదితరులు శాస్త్రీయ సహకారం అందించారు. రోజ్‌మెరీ నూనెకు ప్రపంచవ్యాప్తంగా మంచి డిమాండ్ ఉంది. దీనిని శిరోజాల పెరుగుదలకు, సౌందర్య సాధనాలు, ఔషధ పరిశ్రమలలో విస్తృతంగా ఉపయోగిస్తారు. భవిష్యత్తులో మోకాళ్ల నొప్పులకు ఉపకరించే జెరీనియం, వంటలలో వినియోగించే థైమ్ నూనె పంటలకు సంబంధించిన పరిశోధన ఫలితాలను అంతర్జాతీయ జర్నల్‌లో ప్రచురించేందు సన్నద్ధమవుతున్నట్లు హెచ్‌సీయూ నానోటెక్నాలజీ విభాగం ప్రొఫెసర్ శ్రీకాంత్ తెలిపారు.

మరో పోరాటానికి ఆర్టీసీ ఈయూ సిద్ధం

ఆర్టీసీలో కార్మికుల సమస్యలు, ప్రభుత్వం ఇచ్చిన హామీల పరిష్కారానికి మరో పోరాటానికి సిద్ధమవుతున్నామని ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ ప్రకటించింది. అన్ని సంఘాలతో ప్రత్యేక జేఏసీ ఏర్పాటు చేసి సమస్యలు పరిష్కరించుకుంటామని యూనియన్ ప్రధాన కార్యదర్శి వెంకన్న తెలిపారు. ఆర్టీసీలోని అన్ని సంఘాలతో కలిసి శుక్రవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీల్ని ప్రభుత్వం విస్మరించిందన్నారు.

రైతుల సంక్షేమం కోసం నాబార్డు భాగస్వామ్యం అవసరం: తుమ్మల



హైదరాబాద్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం తీసుకునే నిర్ణయాల్లో నాబార్డు భాగస్వామం కొనసాగాలని.. రైతుల ప్రయోజనాలు, అభివృద్ధి కోసం నాబార్డు కలిసి పనిచేయాలని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తుమ్మల కోరారు. శుక్రవారం సచివాలయంలో నాబార్డు సీజీఎం ఉదయ్‌భాస్కర్‌తో కలిసి నాబార్డు ద్వారా ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. గ్రామీణాభివృద్ధి, ప్రభుత్వంతో భాగస్వామ్యం, సూక్ష్మ సేద్యం పథకాలకు నిధుల విడుదల, బహుళ ఉపయోగ ప్రాథమిక సహకార సంఘాల ఏర్పాటు అంశాలపై చర్చించారు. గ్రామీణ మౌలిక సదుపాయాల అభివృద్ధి నిధి (ఆర్ఐడీఎఫ్) కింద 2025-26 ఆర్థిక సంవత్సరానికి నాబార్డు రూ.300 కోట్లు రాష్ట్రానికి కేటాయించినట్లు నాబార్డు అధికారులు మంత్రికి తెలిపారు. రాష్ట్రంలో సూక్ష్మ సేద్యం ప్రాజెక్టు అమలుకు మైక్రో ఇరిగేషన్ ఫండ్-ఎంఐఎఫ్ కింద నాబార్డు రూ.144 కోట్ల నిధులను ఆమోదించిందన్నారు. 197 కొత్త ఎం-పీఏసీఎస్ ఏర్పాటుకు నాబార్డు అనుమతినిచ్చిందని, ఈ ప్రతిపాదనలను రాష్ట్ర సహకార అభివృద్ధి కమిటీ ఆమోదించాల్సి ఉందని మంత్రి దృష్టికి తెచ్చారు.

ఐఆర్‌సీ 85వ సదస్సు తెలంగాణలోనే

- భువనేశ్వర్ సదస్సులో ఆమోదం తెలిపిన కౌన్సిల్
- కేంద్రానికి మంత్రి కోమటిరెడ్డి ధన్యవాదాలు
- ముందే చెప్పిన 'ఆంధ్రజ్యోతి'



హైదరాబాద్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ రోడ్ కాంగ్రెస్ (ఐఆర్‌సీ) 85వ సదస్సు తెలంగాణలో జరగనుంది. ప్రస్తుతం భువనేశ్వర్‌లో జరుగుతున్న 84వ ఐఆర్‌సీ సదస్సులో నిర్వహించిన కౌన్సిల్ సమావేశంలో తెలంగాణ ప్రభుత్వ ప్రతిపాదనను ఆమోదించారు. 85వ సదస్సును తెలంగాణలో నిర్వహించేందుకు అవకాశం ఇవ్వాలంటూ రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి.. కేంద్రమంత్రి నితిన్ గడ్కరీకి లేఖ రాశారు. ఈ మేరకు కేంద్రం సుముఖత వ్యక్తం చేసింది. ఆ తరువాత సమావేశమైన ఐఆర్‌సీ కౌన్సిల్‌లో రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనకు ఆమోదం లభించింది. దీంతో కేంద్ర మంత్రి గడ్కరీకి కోమటిరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. అసోం, రాజస్థాన్ రాష్ట్రాల ప్రతినిధులు పోటీకి వచ్చినా.. కేంద్రం, ఐఆర్‌సీ కౌన్సిల్ తెలంగాణ వైపే మొగ్గుచూపించాయని ఆర్అండ్‌బీ అధికారుల ద్వారా తెలిసింది. కాగా, తెలంగాణలో ఐఆర్‌సీ 85వ సదస్సు కోసం రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి లేఖ రాసిందని, తెలంగాణకు అవకాశం దక్కవచ్చంటూ 'ఆంధ్రజ్యోతి' ముందే చెప్పింది. అక్టోబరు 29న ఇందుకు సంబంధించి కథనం ప్రచురించింది.

2016లోనూ హైదరాబాద్‌లో సదస్సు..

పదేళ్ల క్రితం 2016లో ఇండియన్ రోడ్ కాంగ్రెస్ 77వ సదస్సు తెలంగాణలో జరిగింది. ఆ సమయంలోనే తెలంగాణకు దాదాపు రూ.12 వేల కోట్ల విలువ చేసే పలు జాతీయ రహదారుల ప్రాజెక్టులను కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ప్రకటించారు. మళ్లీ పదేళ్ల తరువాత రాష్ట్రంలో ఐఆర్‌సీ సదస్సు జరగనుంది. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు కొత్త ప్రాజెక్టులు ప్రకటించే అవకాశం కూడా ఉందని అధికార వర్గాలు అంటున్నాయి. వచ్చే ఏడాది సదస్సుకు 4-5వేల మంది దాకా వచ్చే అవకాశం ఉంటుందని, ఖర్చు కూడా రూ.18 కోట్ల నుంచి రూ.20 కోట్ల వరకు అవుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. మరోవైపు అన్ని రాష్ట్రాల ప్రతినిధులు వస్తుండడంతో.. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిపై దేశవ్యాప్తంగా చర్చ జరుగుతుందని అధికారులు చెబుతున్నారు.

ఐఆర్‌సీ కౌన్సిల్ అధ్యక్ష పదవి తెలంగాణకు!

అత్యంత ప్రతిష్ఠాత్మకమైన ఇండియన్ రోడ్ కాంగ్రెస్ కౌన్సిల్ అధ్యక్ష పదవి ఈసారి తెలంగాణకు దక్కే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఐఆర్‌సీ కౌన్సిల్ సభ్యుడిగా, వైస్ ప్రెసిడెంట్‌గా వ్యవహరిస్తున్న రాష్ట్ర ఆర్అండ్‌బీ శాఖ ఈఎన్సీ మోహన్‌నాయక్‌కు ప్రెసిడెంట్‌గా అవకాశం లభించనున్నట్టు సమాచారం. ప్రస్తుతం భువనేశ్వర్‌లో జరుగుతున్న సదస్సు సందర్భంగా ఈ అంశంపై చర్చలు జరిగినట్లు, ఈసారి తెలంగాణకు అవకాశమివ్వాలనే ఉద్దేశంతో కౌన్సిల్ ఉన్నట్లు తెలిసింది. అవకాశం దక్కితే తెలంగాణకు ఇదే మొదటిసారి కానుంది. దీనిపై ఈ నెల 10న భువనేశ్వర్‌లో ముగియనున్న ఐఆర్‌సీ సదస్సులో ప్రకటన వెలువడనున్నట్లు తెలిసింది.

10 రోజులపాటు వైకుంఠ ద్వార దర్శనాలు

- వారంలో టోకెన్ల జారీ విధివిధానాలు ఖరారు
- 17 నుంచి తిరుచానూరు బ్రహ్మోత్సవాలు
- 27 నుంచి అమరావతి శ్రీవారి ఆలయ విస్తరణ పనులు
- టీటీడీ ఈవో అనిల్ కుమార్ సింఘాల్



తిరుమల, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): తిరుమల ఆలయంలో వైకుంఠ ద్వార దర్శనాలు డిసెంబరు 30 నుంచి జనవరి 8వ తేదీ వరకు పది రోజులపాటు ఉంటాయని టీటీడీ ఈవో అనిల్ కుమార్ సింఘాల్ తెలిపారు. తిరుమలలోని అన్నమయ్య భవనంలో శుక్రవారం డయల్ యువర్ ఈవో కార్యక్రమం అనంతరం అదనపు ఈవో వెంకయ్య చౌదరితో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. గతంలో వైకుంఠ ద్వార దర్శనాల టోకెన్ల జారీ సమయంలో కొన్ని ఇబ్బందులను ఎదుర్కొన్నందున లోటుపాట్లు లేకుండా జారీ చేయడానికి విధివిధానాలను రూపొందించేందుకు ప్రత్యేక కమిటీని వేశామని తెలిపారు. వారం రోజుల్లో ఈ కమిటీ బోర్డుకు నివేదిక సమర్పిస్తుందని.. దానికనుగుణంగా బోర్డు నిర్ణయాలు తీసుకుంటుందని చెప్పారు. కాగా భక్తులకు ఇబ్బంది లేకుండా ఆళ్వార్‌ట్యాంక్ గెస్ట్ హౌస్ నుంచి గోగర్భం డ్యాం వరకు శాశ్వత క్యూలైన్ నిర్మాణం కోసం రూ.25 కోట్లు కేటాయించామని వెల్లడించారు. డయల్ యువర్ ఈవో కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుంచి 17 మంది భక్తులు ఫిర్యాదులు, సందేహాలు, సమస్యలపై ఈవోతో నేరుగా మాట్లాడారు.

శ్రీవాణి నిధులతో నిర్మించేది ఆలయాలే

శ్రీవాణి ట్రస్టు ద్వారా రూ.750 కోట్ల నిధులతో ఐదు వేల ఆలయాలు మాత్రమే నిర్మిస్తామని ఈవో స్పష్టం చేశారు. ఇవి భజన మందిరాలనే అనుమానానికి తావులేదన్నారు. శ్రీవాణికి వచ్చిన రూ.2,300 కోట్లలో ఇప్పటికే రూ.600 కోట్లు ఖర్చు చేశామని, ఇంకా రూ.1,700 కోట్లు నిధులు ఉన్నాయని వివరించారు. గతంలో ప్రారంభించి ఆగిపోయిన ఆలయ నిర్మాణాల పూర్తి గురించి కూడా పరిశీలన చేస్తామన్నారు. కరెంట్ బుకింగ్ ద్వారా జారీ చేస్తున్న శ్రీవాణి టికెట్ల విషయంలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయని, పరిశీలన చేసి త్వరలో దీనిపై ఓ నిర్ణయం తీసుకుంటామన్నారు. తిరుచానూరు అమ్మవారి బ్రహ్మోత్సవాలు ఈనెల 17 నుంచి 25వ తేదీ వరకు అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని ఈవో తెలిపారు. అలాగే అమరావతి వెంకటపాలెంలోని శ్రీవారి ఆలయంలో ప్రాకారం, కల్యాణోత్సవ మండపం అభివృద్ధి పనులు ఈ నెల 27వ తేదీ నుంచి మొదలవుతాయని వెల్లడించారు. టీటీడీ పరిధిలోని అన్ని ఆలయాల్లో అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని ప్రారంభించడానికి విధివిధానాలను రూపొందిస్తున్నామని అనిల్ కుమార్ సింఘాల్ తెలిపారు.

జీవవ్యర్థాల నుంచి ఆరు గంటల్లోనే ఎరువుల తయారీ

- వియత్నాం సంస్థతో ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ వర్సిటీ ఒప్పందం
- హాజరైన వియత్నాం డిప్యూటీ అంబాసిడర్ ట్రాన్ తన్హా టంగ్
- యూరియాకు ప్రత్యామ్నాయం: వీసీ ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య

రాజేంద్రనగర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ, ఉద్యాన పంటల వ్యర్థాలు, జీవ వ్యర్థాల నుంచి జీవ ఎరువులను కేవలం ఆరు గంటల్లోనే తయారు చేసే పరిజ్ఞానాన్ని ఉచితంగా పొందేందుకు, యంత్ర పరికరాల సరఫరాకు బయో వియత్నాం సంస్థతో ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం శుక్రవారం అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఇప్పటికే ప్రపంచ వ్యాప్తంగా 12 దేశాలతో ఈ ఒప్పందాలు కుదుర్చుకున్నామని, భారత్‌లోని వ్యవసాయ వర్సిటీతో ఒప్పందం కుదుర్చుకోవడం ఇదే తొలిసారి అని వియత్నాం డిప్యూటీ అంబాసిడర్ ట్రాన్ తన్హా టంగ్, బయో వియత్నాం సీఈఓ లీ తీ కామ్ టెన్ తెలిపారు. ఎన్నో ఏళ్ల పరిశోధనల తర్వాత ఈ పరిజ్ఞానాన్ని ఈ సంస్థ కనుగొన్నదని వర్సిటీ ఉప కులపతి ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య చెప్పారు. జీవ వ్యర్థాల నుంచి జీవ ఎరువులు ఇప్పటికే తయారు చేస్తున్నారని, కానీ ఆ ఎరువుల తయారీకి అనేక రోజుల సమయం పడుతుందని, ఈ సంస్థ అందించే పరిజ్ఞానంతో కేవలం ఆరు గంటల్లోనే జీవ ఎరువులు తయారవుతాయని వివరించారు. యూరియాకు ఈ జీవ ఎరువులే తగిన ప్రత్యామ్నాయమన్నారు. విశ్వవిద్యాలయంలో బయోవే వియత్నాం రెండేళ్ల పాటు ఉచితంగా యంత్రాలను ఏర్పాటు చేస్తుందని, రెండేళ్ల తర్వాత ఈ ఎరువులను రైతాంగానికి పెద్ద ఎత్తున అందించడానికి కృషి చేస్తామని తెలిపారు. జీవ వ్యర్థాలను జీవ ఎరువుల తయారీకి వినియోగించడం వల్ల ప్రకృతిలో కాలుష్యం తగ్గుతుందని, రైతులు రసాయనిక ఎరువులు వాడకం తగ్గిస్తారని జానయ్య విశ్వాసం వ్యక్తం చేశారు. అంతేకాకుండ ప్రభుత్వాలపై రాయితీల భారంతో పాటు, భూసార క్షీణత కూడా తగ్గుతుందన్నారు. వ్యవసాయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ విద్యాసాగర్, ఇతర విశ్వవిద్యాలయ ఉన్నతాధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

చలితో గజగజే!

- రేపటి నుంచి తగ్గనున్న రాత్రిపూట ఉష్ణోగ్రతలు
- 9-14 డిగ్రీల మధ్య నమోదయ్యే అవకాశం

నిన్నటి దాకా వరుస వర్షాలు.. ఇక నుంచి చలితో వణుకు! ఉదయం, సాయంత్రవేళల్లో చలిమంటలు కనిపించనున్నాయి. ఎందుకంటే రాష్ట్రంలో రాత్రిపూట ఉష్ణోగ్రతలు పడిపోనున్నాయి. రాష్ట్రంలో ఆదివారం నుంచి రాత్రిపూట ఉష్ణోగ్రతలు గణనీయంగా తగ్గనున్నట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. రాష్ట్రవ్యాప్తంగా కనిష్ఠ ఉష్ణోగ్రతలు 9-14 డిగ్రీల మధ్య నమోదయ్యే అవకాశం ఉందని హెచ్చరించింది. శనివారం నుంచే రాత్రిపూట ఉష్ణోగ్రతలు తగ్గుతాయని పేర్కొంది. చలికి సంబంధించి 23 జిల్లాలకు యెల్లో అలర్ట్ జారీ చేసింది. ఆ జిల్లాల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు 12-14 డిగ్రీల మధ్య నమోదవుతాయని పేర్కొంది. ప్రధానంగా ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్ జిల్లాల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు 10 డిగ్రీల లోపు నమోదవుతాయని హెచ్చరించింది. ఆ జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. ఆదిలాబాద్ జిల్లా బేలలో అత్యల్పంగా 14.8 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదైనట్లు వాతావరణ కేంద్రం తెలిపింది.

క్షతగాత్రులకు సాయం అందేదెప్పుడు?

- చేవెళ్ల బస్సు ప్రమాద మృతులకు పరిహారం అందజేసినా గాయపడిన వారికి అందలేదు
- బాధితుల్లో హెడ్‌కానిస్టేబుల్, కండక్టర్
- బస్సు ప్రమాదంలో 34 మందికి గాయాలు

తాండూరు, నవంబరు7 (ఆంధ్రజ్యోతి): చేవెళ్ల సమీపంలోని మీర్జాగూడ వద్ద జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో మృతుల కుటుంబాలకు ముందుగా ప్రకటించిన విధంగా ఆర్థిక సహాయం అందచేసిన ప్రభుత్వం క్షతగాత్రులకు మాత్రం ఇప్పటివరకు ఎలాంటి ఆర్థిక సహాయం అందచేయలేదు. గతనెల 27న ఆర్టీసీ బస్సును కంకర లోడ్‌తో వెళుతున్న టిప్పర్ ఢీకొన్న ఘటనలో బస్సుల్లోని ప్రయాణికుల్లో 19 మంది మృతి చెందగా 34 మంది గాయపడ్డారు. క్షతగాత్రులను ప్రభుత్వం చేవెళ్లలోని పట్నం మహేందర్‌రెడ్డి ఆస్పత్రిలో, వికారాబాద్ ప్రభుత్వ ఆస్పత్రిలో, పాటు హైదరాబాద్‌లోని నిమ్స్‌లో చేర్పించి చికిత్స అందిస్తోంది. ప్రమాదంలో వికారాబాద్ జిల్లాకు చెందిన 13మంది గాయపడగా వారిలో 8 మంది చేవెళ్ల మహేందర్‌రెడ్డి మెడికల్ కళాశాల ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. గాయపడిన వారిలో మండలి చీఫ్‌విప్ మహేందర్‌రెడ్డి వద్ద ఎస్కార్ట్ పైలెట్ విధులు నిర్వహిస్తున్న హెడ్‌కానిస్టేబుల్ వెంకటయ్య, మరో కానిస్టేబుల్ కూడా ఉన్నారు. వీరికి పోలీస్ శాఖ నుంచి సాయం అందాల్సి ఉంది. ప్రమాదంలో గాయపడ్డ ఆర్టీసీ బస్సు కండక్టర్ రాధ చేవెళ్ల ఆస్పత్రిలోనే చికిత్సపొందుతున్నారు. ఆమెకు ఆర్టీసీ నుంచి కానీ ప్రభుత్వం నుంచి కానీ ఇంత వరకు ఎలాంటి సాయం అందలేదు.

ఎలాంటి పరిహారం అందలేదు

మీర్జాగూడ వద్ద జరిగిన ఆర్టీసీ బస్సు ప్రమాదంలో గాయాలతో బయటపడ్డాను. ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆర్థిక సాయం అందలేదు. గాయపడిన రోజే తాండూరు జిల్లా ఆస్పత్రిలో వైద్యులు చికిత్స పొందాను. ఇంకా గాయాల తాలూకు నొప్పులతో బాధపడుతున్నాను. నాకు మెరుగైన చికిత్స కోసం ప్రభుత్వం కార్పొరేట్ ఆస్పత్రిలో వైద్యం అందించాలి.

-వినయ్ కుమార్, గౌతాపూర్, తాండూరు మండలం

పాస్‌పోర్టు, వీసా గడువు ముగిసినా.. 13 ఏళ్లుగా అక్రమంగా తిష్టవేసి డ్రగ్స్ దందా


నైజీరియన్‌ను డిపోర్టేషన్ చేసిన హైదరాబాద్ పోలీసులు

హైదరాబాద్‌సిటీ, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): బిజినెస్ వీసాపై వచ్చి.. పాస్‌పోర్టు, వీసా గడువు ముగిసి 13 ఏళ్ల అవుతున్నా.. అక్రమంగా భారత్‌లో ఉంటూ.. డ్రగ్స్ దందాకు పాల్పడుతున్న నైజీరియాకి చెందిన డ్రగ్స్ స్మగ్లర్‌ను హెచ్ న్యూ పోలీసులు శుక్రవారం డిపోర్టేషన్ చేశారు. ఫారెనర్స్ రీజినల్ రిజిస్ట్రేషన్ (ఎఫ్ఆర్ఆర్‌వో) అధికారుల సహకారంతో హైదరాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఫ్లైట్ ఎక్కించారు. ఈ డిపోర్టేషన్ ప్రక్రియలో హైదరాబాద్ నార్కోటిక్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్ (హెచ్ న్యూ) డీసీపీ వై.వి. సుధీంద్ర, ఇన్‌స్పెక్టర్ బాలస్వామి, ఎస్సై మనోజ్‌కుమార్ బృందం కీలక పాత్ర పోషించారు. డీసీపీ తెలిపిన వివరాల ప్రకారం.. నైజీరియాకు చెందిన జాన్‌కెనడీ చుకువెమెకా ఓకోరో అలియాస్ హోపీ కప్ అలియాస్ జెక్సా. బిజినెస్ వీసాపై 2012లో ఇండియాకు వచ్చి ముంబయిలో వస్త్ర వ్యాపారం చేశాడు. కొద్దిరోజులకు డ్రగ్స్ స్మగ్లింగ్ మొదలుపెట్టాడు.. నైజీరియా దేశస్థులతో కలిసి, బెంగళూరు, హైదరాబాద్‌కు తిరుగుతూ సరఫరా చేసేవాడు. ఇటీవల నగరంలోని ఆసిఫ్‌నగర్ పరిధిలో నైజీరియన్ అనుమానాస్పదంగా తిరుగుతున్నట్లు హెచ్ న్యూ టీమ్‌కు సమాచారం అందింది. దీంతో స్థానిక పోలీసులతో కలిసి అదుపులోకి తీసుకున్నారు. అతన్ని విచారించగా 2012లోనే అతని వీసా, పాస్‌పోర్టు గడువు ముగిసినట్లు గుర్తించారు. సిటీ పోలీస్ కమిషనర్ వి.సి. సజ్జనార్ ఆదేశాలతో, డీసీపీ సుధీంద్ర పర్యవేక్షణలో.. ఎఫ్ఆర్ఆర్‌వో సహకారంతో నైజీరియన్‌ను మన దేశం నుంచి బహిష్కరించి, వారి దేశానికి డిపోర్టేషన్ చేసినట్లు డీసీపీ తెలిపారు.

నకిలీ విత్తనాలతో నిండా మునిగిన రైతులు..

- మెదక్ జిల్లా రుక్మాపూర్‌లో వంద ఎకరాల్లో వరికి నష్టం
- సీడ్ కంపెనీ మోసంపై పోలీసులకు రైతుల ఫిర్యాదు..





చేగుంట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): విత్తన ఏజెన్సీలు అంటగట్టిన ప్రయోగాత్మక విత్తన రకంతో మెదక్ జిల్లా రుక్మాపూర్ రైతులు నిండా మునిగారు. ఖరీఫ్ సీజన్‌లో అధిక దిగుబడి వస్తుందని ఆశించిన అన్నదాతలకు చివరకు కన్నీళ్లే మిగిలాయి. శుక్రవారం బాధిత రైతులు పోలీస్‌స్టేషన్, వ్యవసాయ కార్యాలయాల్లో ఫిర్యాదు చేశారు. చేగుంట మండలంలోని రుక్మాపూర్‌లో దాదాపు 40 మంది రైతులు కలిసి వందకుపైగా ఎకరాల్లో 45, 47 (మగ రకం) వరి పంటను వేశారు. ఇది ప్రయోగాత్మక, దొడ్డు రకం విత్తనమని కంపెనీ వారు చెప్పడంతో రైతులు నమ్మి సాగు చేశారు. అయితే, పంట కోత దశకు వచ్చేసరికి వారి ఆశలు అడియాశలయ్యాయి. పంట ఒకటి, రెండు గొలుసులే వేయగా.. ఆ వరి గింజలు పాలు పోసుకొని గట్టిపడాల్సింది పోయి, మెత్తగానే ఉండిపోయాయి. మరికొన్ని పొలాల్లో పైర్లు ఎండిపోయాయి. దిగుబడి మాట దేవుడెరుగు.. కనీసం పెట్టిన పెట్టుబడి కూడా చేతికి వచ్చే పరిస్థితి లేకపోవడంతో రైతులు లబోదిబోమంటున్నారు. ఈ నకిలీ విత్తనాల కారణంగా రైతులు సుమారు రూ.20 లక్షల మేర నష్టపోయారు. రైతులకు ఈ నకిలీ విత్తనాన్ని అంటగట్టిన సదరు సీడ్ కంపెనీ సూపర్‌వైజర్ పత్తా లేకుండా పోయాడు. దీంతో చేసేది లేక, మోసపోయిన రైతులు న్యాయం కోసం అధికారులను, పోలీసులను ఆశ్రయించారు.

క్యాన్సర్ బాధితుడి ఇంటికెళ్లి భూమి రిజిస్ట్రేషన్

ఔదార్యం చాటుకున్న సూర్యాపేట జిల్లా చివ్వెంల తహసీల్దార్



ప్రతాపరెడ్డి ఇంట్లో భూమి రిజిస్ట్రేషన్ చేస్తున్న తహసీల్దార్ చంద్రశేఖర్

చివ్వెంల, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): క్యాన్సర్‌తో బాధపడుతూ మంచానికే పరిమితమైన ఓ రైతు తన భూమి రిజిస్ట్రేషన్ కోసం తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లలేని పరిస్థితుల్లో.. తహసీల్దారే ఆ రైతు ఇంటికెళ్లి రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తిచేసి తన ఔదార్యాన్ని చాటుకున్నారు. సూర్యాపేట జిల్లా చివ్వెంల మండలం వల్లభాపురం గ్రామానికి చెందిన రైతు ముప్పాని ప్రతాప్‌రెడ్డి ఇటీవల తన కున్న ఎకరం భూమిని గోనెల రేణుక అనే మహిళకు విక్రయించాడు. ఆమె తన పేరిట రిజిస్ట్రేషన్ చేసేందుకు స్లాట్ బుక్ చేసుకోగా ప్రతాప్‌రెడ్డి తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లాల్సి ఉంది. రెండేళ్లుగా ప్రతాప్‌రెడ్డి క్యాన్సర్‌తో బాధపడుతూ మంచానికే పరిమితమయ్యాడని అతని కుటుంబ సభ్యులు తహసీల్దార్ చంద్రశేఖర్‌కు సమాచారం ఇవ్వడంతో ఆయన సిబ్బందితో కలిసి శుక్రవారం ప్రతాప్‌రెడ్డి ఇంటికి వెళ్లి రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తిచేశారు. ప్రభుత్వ ఉద్యోగులంటే ప్రజా సేవకులని తహసీల్దార్ చంద్రశేఖర్ నిరూపించారని ప్రతాప్‌రెడ్డి, రేణుక కుటుంబసభ్యులు కొనియాడారు. అలాంటి స్థితిలో ఉన్న వారికి సేవలు అందించేందుకు ముందుంటామని, తీవ్ర అనారోగ్య పరిస్థితుల్లో తహసీల్దార్ కార్యాలయానికి రాలేని వారు తమ కార్యాలయంలో సంప్రదించాలని తహసీల్దార్ చంద్రశేఖర్ సూచించారు.



ప్రచారంలో భాగంగా యూసుఫ్‌గూడలోని హోటల్‌లో ఇడ్లీ తింటున్న మంత్రులు

నవీన్ ను గెలిపించడం మనందరి బాధ్యత!

» డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

వెంగళరావునగర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్‌యాదవ్‌ను గెలిపించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్, మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్‌తో కలిసి ఆయన యూసుఫ్‌గూడలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం రాత్రి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా, ఉప ఎన్నికలో అందరూ కష్టపడి పని చేయాలని కార్యకర్తలకు భట్టి సూచించారు.



ఎల్లారెడ్డిగూడలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

జూబ్లీహిల్స్‌లో ఎగిరేది కాంగ్రెస్ జెండానే..

» ప్రతిపక్షాలకు ప్రజలే తగిన గుణపాఠం చెబుతారు

» కాంగ్రెస్‌తోనే హైదరాబాద్ అభివృద్ధి: శ్రీధర్ బాబు

బంజారాహిల్స్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ప్రతిపక్షాలు ఎన్ని కుట్రలు, కుతంత్రాలు చేసినా జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో ఎగిరేది కాంగ్రెస్ జెండానే అని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. ఈ ఎన్నికలో ఓటర్లు బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలకు తగిన గుణపాఠం చెబుతారని పేర్కొన్నారు. శుక్రవారం ఎల్లారెడ్డిగూడలో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌కు మద్దతుగా విస్తృత ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి ఓటర్లను ఆప్యాయంగా పలుకరించి స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ పెట్టిందని, అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు అందిస్తున్నామని వివరించారు. తొమ్మిదేళ్లలో బీఆర్ఎస్ హైదరాబాద్ మహా నగరాభివృద్ధిని గాలికొదిలేసిందని విమర్శించారు. నగరాభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తుంటే ప్రతిపక్షాలు మాత్రం తమపై దుష్ప్రచారం చేస్తున్నాయని మండిపడ్డారు. స్థానిక సమస్యలపై అవగాహన ఉండి, నియోజకవర్గ ప్రజల కోసం నిరంతరం తపించే నవీన్ యాదవ్‌ను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మక్కన్‌సింగ్ రాజ్ ఠాకూర్, రంగారెడ్డి డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ముస్లింలతో ముచ్చటిస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

ముస్లింల సంక్షేమానికి పాటుపడే ఏకైక పార్టీ కాంగ్రెస్

» జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ప్రచారంలో మంత్రి జూపల్లి

బోరబండ, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ముస్లింల సంక్షేమం కోసం పాటుపడే ఏకైక పార్టీ కాంగ్రెస్ అని పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఉప ఎన్నిక ప్రచార కార్యక్రమంలో భాగంగా ఎర్రగడ్డ డివిజన్‌లో శుక్రవారం ఆయన పర్యటించారు. సుల్తాన్‌నగర్ మస్జిద్-ఈ-మొహమ్మదీయలో ప్రార్థనల అనంతరం స్థానిక ముస్లిం సోదరులతో మాట్లాడారు. ముస్లిం మైనార్టీల సంక్షేమం కోసం అనేక పథకాలు, ఫలాలను కాంగ్రెస్ అందించిందన్నారు. షాదీ ఖానాలు, మసీదుల అభివృద్ధి, ఈద్గాల నిర్మాణం, సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా ముస్లింలకు సరైన ప్రాధాన్యం ఇచ్చిన ఘనత కాంగ్రెస్‌కే దక్కుతుందని చెప్పారు. కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌కు ఓటు వేసి గెలిపించాలని ఆయన కోరారు.



బీజేపీ, బీఆర్ఎస్‌ల నుంచి కాంగ్రెస్‌లో చేరిన వారితో మంత్రి పొన్నం

సబ్బండ వర్గాలు కాంగ్రెస్ వైపే..

» నవీన్ యాదవ్‌ను గెలిపించాలి

» నాయీబ్రాహ్మణ సంఘాల మద్దతు కాంగ్రెస్‌కే

» పార్టీలో చేరికల కార్యక్రమంలో మంత్రి పొన్నం

యూసుఫ్‌గూడ, వెంగళ్‌రావునగర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ప్రచారానికి మరో 48 గంటల సమయం మాత్రమే ఉండడంతో మంత్రి పొన్నం ప్రభాకర్ శుక్రవారం యూసుఫ్‌గూడ డివిజన్‌లో సుడిగాలి పర్యటన చేశారు. నియోజకవర్గంలోని సబ్బండ వర్గాలు కాంగ్రెస్‌కే అనుకూలంగా ఉన్నాయన్నారు. డివిజన్‌లో బూత్‌ల వారిగా ఏర్పాటు చేసిన కార్యాలయాలకు శుక్రవారం బైక్ మీద తిరుగుతూ నేతలను సమన్వయపరుస్తూ ఓటర్లను స్థానిక నేతలతో కలిసి స్వయంగా కలిశారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌కు ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. వెంగళ్‌రావు నగర్‌లో స్థానిక నాయకులు సంజయ్ గౌడ్, ఫిరోజ్ ఖాన్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్, బీజేపీకి చెందిన పలువురు నేతలు, కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరారు. వారికి కండువా కప్పి మంత్రి పొన్నం ప్రభాకర్ పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజా ప్రభుత్వంలో అమలు చేస్తున్న పథకాలు పేదప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయన్నారు. మరోవైపు.. ఉప ఎన్నిక ప్రచారంలో భాగంగా నాయీబ్రాహ్మణ సంఘాలతో మంత్రి పొన్నం సమావేశమయ్యారు. కాంగ్రెస్ అభ్యర్థికి నాయీబ్రాహ్మణ సంఘాలు ఏకగ్రీవంగా మద్దతు తెలిపాయని ఈ సందర్భంగా చెప్పారు. కాగా గాంధీభవన్‌లో మంత్రులు పొన్నం, జూపల్లి మాట్లాడుతూ.. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో బీఆర్ఎస్‌తో బీజేపీ లోపాయికారి ఒప్పందం కుదుర్చుకుందని ఆరోపించారు. బీఆర్ఎస్ వాళ్లు ఇప్పటికీ అధికారంలో ఉన్నామనే భావనతో నిరంకుశంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు.

ఓటుకు రూ. 3 వేలు!

(మొదటిపేజీ తరువాయి)

తెలుస్తోంది. ఓవైపు పోలీసుల తనిఖీలు, మరోవైపు ఎన్నికల స్క్వాడ్‌లు ఆయా పార్టీల ముఖ్యనేతల ఇళ్లలో సైతం సోదాలు చేస్తున్నాయి. దీంతో ప్రచారం సాగుతుండగానే.. డబ్బు పంపిణీ కూడా కానిచ్చేస్తున్నారు. ఇందుకోసం బూత్‌ల వారీగా ఇప్పటికే కమిటీలను ఏర్పాటు చేశారు. ఈ కమిటీల్లో స్థానిక కార్యకర్తలతోపాటు జిల్లాల నుంచి వచ్చినవారు సమన్వయం చేసేలా ఇన్‌చార్జులను నియమించారు. వీరి ద్వారా బూత్‌ల వారీగా ఆయా ప్రాంతాల్లో, అపార్ట్‌మెంట్లలో, ఇళ్లలో ఓటర్ల గుర్తింపు ప్రక్రియ చేపట్టారు. బూత్ కమిటీలతో కలిసి ఆయా ఓటర్లకు డబ్బు పంపిణీ చేస్తున్నారు. దీంతో నియోజకవర్గంలో ప్రచారం మరింత హీటెక్కింది.

ఆన్‌లైన్ పేమెంట్లు కూడా!

యూసుఫ్‌గూడలోని ఓ బస్తీలో నాలుగంతస్తుల భవనంలో నాలుగు కుటుంబాలు ఉండగా, అందులో రెండు కుటుంబాలకు మాత్రమే ఓ బూత్‌లో ఓట్లున్నాయి. రెండు రోజుల క్రితం ఓ ప్రధాన పార్టీకి చెందిన బూత్ ఇన్‌చార్జి ఆ కుటుంబాలను కలిశారు. ఓటు కు రూ.2 వేల చొప్పున పోలింగ్‌కు రెండు రోజుల ముందు ఇస్తామని మాట ఇచ్చారు. ఆన్‌లైన్‌లో యూపీఐ పేమెంట్‌కు అవకాశం కలిగిన ఫోన్ నంబర్లు సైతం తీసుకున్నారు. ఈలోపు శుక్రవారం మధ్యాహ్నం మరో ప్రధాన పార్టీకి చెందిన బూత్ ఇన్‌చార్జి ఆ కుటుంబాలను కలిశారు. ఒక్కో ఓటరుకు రూ.3 వేల చొప్పున పంపిణీ కూడా చేశారు.



ఒక కుటుంబంలో నాలుగు ఓట్లు ఉండగా రూ.12 వేలు ఇచ్చారు. మరో కుటుంబంలో రెండు ఓట్లు ఉంటే రూ.6 వేలు చెల్లించారు. తమ పార్టీకే ఓటు వేయాలని వారి నుంచి హామీ పొందారు. కాగా, అదే పార్టీకి చెందిన మరో బూత్ కమిటీ.. రహమత్ నగర్ డివిజన్‌లోని ఓ బస్తీలో ఓటుకు రూ.2500 చొప్పున చెల్లించినట్లు తెలిసింది. దీంతో పోలింగ్‌కు రెండు రోజుల ముందు ఇస్తామన్న మరో పార్టీ నేతలు.. ముందు చెప్పినట్లుగా ఓటుకు రూ.2 వేలే ఇస్తారా? వారు కూడా 'రేటు' పెంచుతారా? అన్నది ఆసక్తికరంగా మారింది. కానీ, తొలుత రూ.2 వేలు ఇస్తామన్న పార్టీవైపు మొగ్గుచూపిన ఓటర్లు.. మరో పార్టీ రూ.3 వేలు ఇస్తుండడంతో పునరాలోచనలో పడ్డట్లు తెలుస్తోంది.

రేవంత్ అట్టర్ ఫ్లాప్ సీఎం

బ్లాక్‌మెయిల్ తప్ప పాలన చేతకాదు.. ఫీజు బకాయిలు అడిగితే యాజమాన్యాలపై విజిలెన్స్ దాడులు

» జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్‌కు బుద్ధి చెబితే రాష్ట్రమంతటా ప్రజలకు మేలు

» 'మీట్ ది ప్రెస్'లో హరీశ్‌రావు

హైదరాబాద్ సిటీ, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డికి బ్లాక్‌మెయిల్ చేయడమే తప్ప పాలన ఏమాత్రం చేతకాదని, ఆయన అట్టర్‌ఫ్లాప్ సీఎం అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శించారు. కేసీఆర్ పాలనలో రాష్ట్రంలో వికాసం జరిగితే.. రేవంత్ పాలనలో విధ్వంసం జరుగుతోందని మండిపడ్డారు. రేవంత్ పాలనలో ఏ వర్గం ప్రజలు కూడా సంతోషంగా లేరని, కేవలం నలుగురు రేవంత్ బ్రదర్స్ మాత్రమే సంతోషంగా ఉన్నారన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక నేపథ్యంలో శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన మీట్‌ది ప్రెస్‌లో హరీశ్‌రావు మాట్లాడారు. బీఆర్ఎస్ హయాంలో విద్యార్థులకు రూ.19,500 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లిస్తే.. గత రెండేళ్లలో సీఎం రేవంత్ వారికి కనీసం రెండు రూపాయలు కూడా ఇవ్వలేదన్నారు. ఫీజు బకాయిలు అడిగిన కాలేజీలపై విజిలెన్స్ పోలీసులతో దాడులు చేయిస్తుండటం సిగ్గుచేటని మండిపడ్డారు. రాష్ట్రంలోని ప్రైవేటు ఆస్పత్రులకు రూ.1,900 కోట్ల ఆరోగ్యశ్రీ బకాయిలు ఉన్నాయని, వాటి గురించి అడిగినా విజిలెన్స్ దాడులు చేయిస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో చెరువుల్లో కడుతున్న 11 పెద్ద ప్రాజెక్టులను ఆపుతామని అప్పట్లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చెప్పారని.. తర్వాత ఏం సెటిల్‌మెంట్ జరిగిందోగానీ అందరూ సైలెంట్ అయ్యారన్నారు. కంటోన్మెంట్ అసెంబ్లీ ఉపఎన్నికలో సీఎం రేవంత్‌రెడ్డి అనేక హామీలు ఇచ్చి మోసం చేశారని, ఇప్పుడు జూబ్లీహిల్స్‌లో హామీలు ఇస్తున్నారని విమర్శించారు. పీజేఆర్‌కు మంత్రి పదవి ఇవ్వకుండా ఇబ్బంది పెట్టి, ఆయన మరణానికి కారణమైంది కాంగ్రెస్ కాదా అని ప్రశ్నించారు. రేవంత్‌కు జూబ్లీహిల్స్‌లో ఓటమి భయం పట్టుకుందని.. అందుకే పథకాలు ఆగిపోతాయంటూ ప్రజలను బ్లాక్‌మెయిల్ చేస్తున్నారని మండిపడ్డారు.



రాష్ట్రంలో పట్టపగలే హత్యలు

రాష్ట్రంలో శాంతిభద్రతల నిర్వహణ అధ్వానమైపోయిందని, పట్టపగలే నడిరోడ్లపై హత్యలు జరుగుతున్నాయని హరీశ్‌రావు విమర్శించారు. కేసీఆర్ రాష్ట్రంలో అగ్రికల్చర్ పెంచితే, రేవంత్‌రెడ్డి గన్‌కల్చర్ పెంచారని ఆరోపించారు. ఈ ఏడాదిలో ఇప్పటివరకు 189 హత్యలు జరిగాయని, అందులో 88 హత్యలు నడిరోడ్డుపై, అందరూ చూస్తుండగా జరిగాయని పేర్కొన్నారు. సైబరాబాద్‌లో 41%, హైదరాబాద్‌లో 60%, తెలంగాణ మొత్తంగా 22% నేరాల రేటు పెరిగిందని పోలీసుశాఖ నివేదికే చెబుతోందన్నారు. ఇది కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యం కాదా అని నిలదీశారు. రేవంత్ రాక్షస పాలన చూసి రాష్ట్రానికి రావాల్సిన పెట్టుబడులు తరలిపోతున్నాయని, రియల్ ఎస్టేట్ పడిపోయిందని ఆరోపించారు.

ఎప్పుడూ మాది ప్రజల పక్షమే..

ఆరు గ్యారెంటీలు, ఇతర హామీలపై తాము గల్లా పట్టి అడిగితేనే కాంగ్రెస్ ప్రభుత్వం స్పందిస్తోందని హరీశ్‌రావు పేర్కొన్నారు. బీఆర్ఎస్ పోరాటంతోనే రెండుసార్లు రైతులకు రైతుబంధు వచ్చిందన్నారు. గురుకులాల సమస్యలు, హైడ్రా, హెచ్‌సీయూ భూములు, టిమ్స్ ఆస్పత్రుల విషయంలో, బస్తీ ఉద్యోగుల కోసం, ప్రజల కోసం ప్రభుత్వాన్ని నిలదీసింది బీఆర్ఎస్ మాత్రమేనని చెప్పారు. అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా.. తమది ప్రజల పక్షమేనన్నారు. జూబ్లీహిల్స్ కాంగ్రెస్ అభ్యర్థి నవీన్‌న యాదవ్ సోదరుడు వెంకట్ యాదవ్‌కు మూడు ఓట్లు ఉన్నాయని, దీనిపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తే ఇప్పటివరకు ఆయనపై చర్యలు లేవని విమర్శించారు. కాంగ్రెతోనే ముస్లింలకు గౌరవమంటూ తప్పుడు వ్యాఖ్యలు చేసిన రేవంత్‌రెడ్డి వెంటనే ముస్లింలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ముస్లింలు స్వాతంత్ర్యం కోసం యుద్ధం చేసినప్పుడు కాంగ్రెస్ ఎక్కడుందని ప్రశ్నించారు. బీఆర్ఎస్ నిలదీయడంతోనే అజారుద్దీన్‌కు మంత్రి పదవి వచ్చిందని ఆయన వ్యాఖ్యానించారు.

జూబ్లీహిల్స్ ఎన్నికల్లో నిశ్శబ్ద విప్లవం

జూబ్లీహిల్స్‌లో బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీతపై సీఎం రేవంత్ దారుణంగా మాట్లాడుతున్నారని, ఆయన పిల్లల మీద కేసులు పెట్టి వేధిస్తున్నారని హరీశ్‌రావు మండిపడ్డారు. తెలంగాణలో ప్రస్తుతం రెండే టీమ్‌లు ఉన్నాయన్నారు. ఒకటి ఆరు గ్యారెంటీలు ఎగ్గొడుతున్న టీమ్.. మరొకటి వాటిని అమలు చేయాలని పోరాడుతున్న తమ టీమ్ అని చెప్పారు. ఆత్మసాక్షిగా ఓటువేసి కాంగ్రె స్‌కు బుద్ధి చెప్పాలని జూబ్లీహిల్స్ ఓటర్లకు పిలుపునిచ్చారు. అన్ని సర్వేలు బీఆర్ఎస్ గెలుస్తుందని స్పష్టం చేస్తున్నాయని, జూబ్లీహిల్స్‌లో నిశ్శబ్ద విప్లవం వస్తుందని పేర్కొన్నారు. కాగా, శుక్రవారం రాత్రి జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని కొల్లూరు డబుల్‌బెడ్రూం ఇళ్ల సముదాయంలో బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. మాగంటి సునీతకు ఓటు వేసి కేసీఆర్ రుణం తీర్చుకోవాలని స్థానికులకు హరీశ్‌రావు విజ్ఞప్తి చేశారు.



జూబ్లీహిల్స్ ఉప ఎన్నికవేళ..
రూ.3.33 కోట్ల నగదు స్వాధీనం

701.63 లీటర్ల మద్యం సీజ్

» రూ.1.37 లక్షల విలువైన కుక్కర్లు, కానుకలు కూడా

» కోడ్ ఉల్లంఘనలపై 25 కేసులు నమోదు

» జిల్లా ఎన్నికల అధికారి ఆర్‌వీ కర్ణన్ వెల్లడి

హైదరాబాద్ సిటీ, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక వేళ తనిఖీలు ముమ్మరంగా జరుగుతున్నాయి. చెక్ పోస్టులు ఏర్పాటు చేసి పోలీసులు, ఫ్లయింగ్ స్క్వాడ్ (ఎఫ్ఎస్‌టీ), స్టాటిక్ సర్వైలెన్స్ (ఎస్ఎస్‌టీ) బృందాలు నిర్వహించిన తనిఖీల్లో రూ.3.33 కోట్ల నగదును స్వాధీనం చేసుకున్నట్టు జిల్లా ఎన్నికల అధికారి ఆర్‌వీ కర్ణన్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇందులో పోలీసులు రూ.1.40 కోట్లు, ఎస్ఎస్‌టీ రూ.1.34 కోట్లు, ఎఫ్ఎస్‌టీ రూ.58.23 లక్షలు స్వాధీనం చేసుకున్నాయి. మరోవైపు ఎక్సైజ్ పోలీసులు రూ.4.74 లక్షల విలువైన 701.63 లీటర్ల మద్యం సీజ్ చేశారు. రూ.1.97 లక్షల విలువైన 2.624 కిలోల గంజాయి, 0.011 గ్రాముల మాదక ద్రవ్యాలు స్వాధీనం చేసుకున్నారు. ఉప ఎన్నిక నేపథ్యంలో ఉచితంగా పంపిణీ చేసేందుకు తీసుకెళ్తున్న రూ.1.37 లక్షల విలువైన కుక్కర్లు, ఇతర కానుకలు సీజ్ చేశారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘనలకు సంబంధించి 25 కేసులు నమోదయ్యాయి. ఇందులో అనుమతి లేకుండా సమావేశాలు నిర్వహించినందుకు ఏడు, గొడవలకు సంబంధించి నమోదైన 12 కేసులున్నాయి.

వారి వ్యూహం.. ఓట్ల కొనుగోళ్లే

(మొదటిపేజీ తరువాయి)

విమర్శించారు. ఈ విషయంలో కేటీఆర్ కూడా తక్కువేం కాదన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక నేపథ్యంలో కిషన్‌రెడ్డి, 'ఆంధ్రజ్యోతి'కి ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. ముఖ్యాంశాలు..

ఈ ఎన్నికలో సీఎం రేవంత్ విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు. దీనిపై మీ అభిప్రాయం?

రేవంత్‌రెడ్డి ఏ ఎండకు ఆ గొడుగు పట్టే వ్యక్తి. ఆయన ఇప్పటికే టీఆర్ఎస్‌లో, బీజేపీలో, టీడీపీలో పని చేశారు. ఇప్పుడు కాంగ్రెస్‌లో ఉన్నారు. ఇక ఆయన చేరాల్సిన పార్టీల్లో మజ్లిస్ మాత్రమే మిగిలి ఉంది. విచిత్రం కాకపోతే... ఆయన కాంగ్రెస్‌లో చేరడమేంటి? పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కావడమేంటి? ఇప్పుడు సీఎం కావడమేంటి?.. గడిచిన రెండేళ్లలో ఆరు గ్యారెంటీలు అమలు చేయడంతో పాటు రాష్ట్రాన్ని అభివృద్ధి చేసి ఉంటే ప్రస్తుతం ఎన్నికల ప్రచారానికి రేవంత్‌రెడ్డి రావాల్సిన అవసరమే లేదు.

బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటే అని కాంగ్రెస్.. బీజేపీ, కాంగ్రెస్ ఒక్కటే అని బీఆర్ఎస్ ఆరోపిస్తోంది..?

బీజేపీ ప్రాధాన్యతను తెలిపే అంశం ఇది. బీఆర్ఎస్, కాంగ్రెస్ గతంలో కలిసి పనిచేశాయి. కేసీఆర్ కూడా కాంగ్రెస్ నుంచి వచ్చిన వ్యక్తే. కేసీఆర్, రేవంత్‌లు ఇద్దరూ టీడీపీలో పనిచేశారు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్, బీఆర్ఎస్‌ల డీఎన్ఏ ఒక్కటే. వారి విధానం ఒకటే. అయినా, వాళ్లే ఉల్టా మాట్లాడుతున్నరు. అవినీతి కేసుల్లో రేవంత్, బీఆర్ఎస్ నేతలను కొట్టినట్లు చేస్తరు కానీ చర్యలు ఉండవు. ఇది కూడా రాహుల్ ఆదేశాల మేరకే జరుగుతోంది.



లోక్‌సభ ఎన్నికల కంటే జూబ్లీహిల్స్ ఉప ఎన్నికను మీరు ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నట్లున్నారు!

అవును.. ఈ ఉప ఎన్నిక నా పార్లమెంటు సెగ్మెంటులో జరుగుతుండడం కూడా దానికి ఒక కారణం. గత లోక్‌సభ ఎన్నికల్లో నా సెగ్మెంటు కంటే ఇతర సెగ్మెంట్లలో ఎక్కువ సమయం కేటాయించాల్సి వచ్చింది. ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్‌షా, పార్టీ జాతీయ అధ్యక్షులు జేపీ నడ్డా రాష్ట్రంలో ప్రచారానికి వచ్చినప్పుడు వారితో వెళ్లాల్సి వచ్చింది. ప్రస్తుత ఉప ఎన్నికలో ముఖ్యమంత్రి మొత్తం పరిపాలనను గాలికొదిలేసి ఇక్కడ ప్రచారం చేస్తున్నప్పుడు.. మేం కూడా పనిచేయాలి కదా!

సెంటిమెంటు తమకు కలిసొస్తుందని బీఆర్ఎస్ చెబుతోంది. మీ అభిప్రాయం

జూబ్లీహిల్స్ నియోజకవర్గం కాస్మోపాలిటన్ ప్రాంతం. ఎన్నో కులాలు, మతాలు, ప్రాంతాలకు సంబంధించినవారు ఇక్కడ ఉన్నారు. సెంటిమెంటు పనిచేయదు. ఒక అపార్టుమెంటులో ఉన్నవాళ్లే ఎవరు ఎవరికి ఓటేస్తారో తెలియదు. సెంటిమెంటు పనిచేస్తుందనుకుంటే అది పగటి కలే.

మీ ప్రధాన ప్రత్యర్థి ఎవరనుకుంటున్నారు?

ముక్కోణపు పోటీయే. కాంగ్రెస్ పార్టీ ఇజ్జతే ముస్లింలు. వారి ఓట్లనే రేవంత్ నమ్ముకున్నరు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచీ ఈ నియోజకవర్గంలో బీజేపీ గెలువలేదు. కార్పొరేటర్‌గానీ, ఎమ్మెల్యేగానీ ఇక్కడ ఎప్పుడూ మాకు లేరు. కాంగ్రెస్, బీఆర్ఎస్ ఏమీ చేయలేదని ప్రజల్లో విస్తృతంగా చర్చ జరుగుతోంది. బీజేపీకి అవకాశం ఇద్దామని అనుకుంటున్నారు. మీకు ఓటేస్తాంగానీ అధికారంలోకి ఎప్పుడొస్తారని ఓటర్లు మమ్మల్ని అడుగుతున్నరు. బీజేపీలో అందరం కలిసికట్టుగా పని చేస్తున్నాం. కాషాయజెండా ఎగరటం ఖాయం.

ఓట్లు చీలి బీజేపీకి అనుకూలం అవుతుందని మీరు చెబుతున్నారు. ఏ సమీకరణాల దృష్ట్యా ఈ అంచనాకు వచ్చారు?

గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ వర్సెస్ బీఆర్ఎస్‌గా పోటీ నడిచింది. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ వర్సెస్ కాంగ్రెస్‌గా ఉంది. ఇప్పుడు ముక్కోణపు పోటీ. ఈ పరిస్థితుల్లో వివిధ వర్గాల ఓట్ల చీలిక ఖాయం. మజ్లిస్ వైఖరి కూడా కీలకమే అవుతుంది. గత ఎన్నికల్లో మా అభ్యర్థి ఓడిపోయారన్న సానుభూతి కూడా మాకు అనుకూలంగా ఉంది. కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థుల పట్ల స్థానికుల్లో వ్యతిరేకత ఉంది.

బీఆర్ఎస్‌కు కూడా ముస్లింల ఓట్లు పెద్ద మొత్తంలో పడే అవకాశం ఉందన్న వాదనపై మీ అభిప్రాయం.

కాంగ్రెస్‌కు మద్దతు ప్రకటించిన ఎంఐఎంపై ముస్లింలలోనే చాలామందిలో వ్యతిరేకత ఉంది. గతంలో పోలింగ్ సరళి పరిశీలిస్తే ముస్లింల ఓట్లు చీలిన సందర్భం లేదు. ఈసారి ఏమవుతుందో చూద్దాం.

ఇద్దరు కేంద్రమంత్రులున్నా బీజేపీ రాష్ట్రానికి అభివృద్ధి నిధులు తీసుకురాలేదని కాంగ్రెస్ ఆరోపిస్తోంది. దీనిపై ఏమంటారు?

కాంగ్రెస్‌కు 8 మంది ఎంపీలు ఉన్నరు. వాళ్లేం చేశారు? కేంద్ర ప్రభుత్వం, తెలంగాణకు గడచిన 12 ఏళ్లలో ఎన్ని వేల కోట్ల నిధులు ఇచ్చిందో గణాంకాలతో సహా పలుమార్లు వివరించాం. అయినా, పదే పదే నిరాధార ఆరోపణలు చేసేవారి పట్ల స్పందించడం వృథా.

ఈ ఎన్నిక ఫలితం రాష్ట్ర రాజకీయాల్లో ఎలాంటి పరిణామాలకు దారితీసే అవకాశం ఉంది?

ఈ ఎన్నికకు రాష్ట్ర రాజకీయాలకు ఎలాంటి సంబంధం ఉండదు.



హైదరాబాద్‌లోని వెంగళరావునగర్ రోడ్ షోలో మాజీ మంత్రి కేటీఆర్. చిత్రంలో అభ్యర్థి సునీత

ఓటమి భయంతోనే..

(మొదటిపేజీ తరువాయి)

డిమాండ్ చేశారు. రెఫరెండం కాదని రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలతో జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ ఓటమి ఖాయమని స్పష్టమైందన్నారు. ఉప ఎన్నిక ప్రచారంలో భాగంగా కేటీఆర్ వెంగళరావు నగర్‌లో శుక్రవారం రోడ్డు షో నిర్వహించారు. రేవంత్ అధికారంలోకి వచ్చిన తర్వాత రెండు సంవత్సరాల కాలంలో అన్ని రంగాల్లో ప్రజలకు కష్టాలే కనిపిస్తున్నాయని.. సబ్బండ వర్గాలనూ ఆరు గ్యారెంటీల పేరుతో ఆయన మోసం చేశారని ధ్వజమెత్తారు. దుర్యోధనుడి స్థాయిలో డైలాగులు కొట్టిన రేవంత్ 162 మంది ఆటో డ్రైవర్ల ఆత్మహత్యకు కారణమయ్యారని ఆరోపించారు. రోజుకొకరు చొప్పున ఇప్పటి వరకు 700 మంది రైతులు ఉరి పోసుకునే దుస్థితి తలెత్తిందన్నారు. 'విద్యార్థులు, యువకులు, రైతన్నలు, పారిశ్రామికవేత్తలకు చేసిన మోసాలను చూసి రేవంత్ రెడ్డికి, కాంగ్రెస్‌కు ఓటు వేయాలా?' అని కేటీఆర్ ప్రశ్నించారు. జూబ్లీహిల్స్‌లో గెలిస్తే అభివృద్ధి చేస్తామంటూ కాంగ్రెస్ అబద్ధాలు చెబుతోందని.. గతంలో ఇవే మాటలు చెప్పి కంటోన్మెంట్ ఉప ఎన్నికలో గెలిచాక ఒక్క రూపాయి అభివృద్ధి పని కూడా చేయలేదని కేటీఆర్ మండిపడ్డారు. పదేళ్ల కాలంలో జరిగిన అభివృద్ధిని చూసి ఓటు వేయాలని తాము అడిగితే రేవంత్ తనకు సంబంధం లేని కాంగ్రెస్ పరిపాలన చూసి ఓటు వేయాలని అడగడమేంటని ఎద్దేవా చేశారు.

గాడిద నీపై అరిస్తే.. నువ్వూ అరవకు!

'ఎక్స్'లో యాక్టివ్‌గా ఉండే కేటీఆర్.. శుక్రవారం సాయంత్రం ఒక ఆసక్తికర పోస్టు పెట్టారు. తన ఎక్స్ ఖాతాలో గాడిద బొమ్మ ఉన్న ఒక ఫొటోను పోస్ట్ చేసి.. 'ఇఫ్ యూ నో యూ నో' అని నర్మగర్భ వ్యాఖ్య పెట్టారు.. ఆ చిత్రంపై.. "గాడిద నీపై అరిస్తే.. నువ్వు దానిపై అరవకు" అనే కొటేషన్ ఉంది. సీఎం రేవంత్ తనపై చేసిన తీవ్ర వ్యాఖ్యలకు కౌంటర్‌గానే ఆయన ఈ పోస్టు పెట్టారని బీఆర్ వర్గాలంటున్నాయి.

అర్హతే లేదు..

ఎన్నికల కోసం రేవంత్ ఎన్టీఆర్ జపం చేస్తున్నారని.. కానీ అసలు కాంగ్రెస్ పార్టీకి ఎన్టీఆర్ పేరు ఎత్తే నైతిక అర్హతే లేదని కేటీఆర్ మండిపడ్డారు. ప్రజాస్వామ్యబద్ధంగా భారీ మెజారిటీతో గెలిచిన ఎన్టీ రామారావును పదవి నుంచి తొలగించిన దుర్మార్గపు చరిత్ర కాంగ్రెస్ పార్టీదని దుయ్యబట్టారు. శంషాబాద్ విమానాశ్రయానికి పెట్టిన ఎన్టీఆర్ పేరును తొలగించిన ఆ పార్టీ రాజీవ్ గాంధీ పేరు పెట్టిందని గుర్తుచేశారు. ఎన్టీఆర్‌కు అహంకారం అంటూ గతంలో రేవంత్ వ్యాఖ్యలు చేశారన్నారు. ఎన్టీఆర్ పార్టీ స్థాపించిందే కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా అని, ఆ పార్టీలో ఉండి ఎన్టీఆర్ గురించి మాట్లాడితే ఆయన ఆత్మ క్షోభిస్తుందని పేర్కొన్నారు. తమ హయాంలో ఖమ్మం జిల్లాలో 70 అడుగుల ఎత్తుతో, మోతీనగర్‌లో ఒకటి, కూకట్‌పల్లిలో మూడు ఎన్టీఆర్ విగ్రహాలు ఏర్పాటు చేశామన్నారు. తమ అభ్యర్థి సునీతను గెలిపిస్తే.. ఎన్టీఆర్ కాంస్యవిగ్రహం ఏర్పాటు చేస్తామని ఆయన చెప్పారు.


ఆ ఇద్దరూ..

"2000 సంవత్సరంలో టీఆర్ఎస్ ఆవిర్భవించింది. 14 సంవత్సరాలు రాష్ట్రం కోసం ఉద్యమం చేశాం. మీ ఆశీర్వాదంతో తొమ్మిదిన్నరేళ్లు అధికారంలో ఉన్నాం. 25 ఏళ్ల కాలంలో ఆరుగురు సీఎంలను చూశాం. చంద్రబాబు హైదరాబాద్ అభివృద్ధికి గట్టిగా పని చేశారు, వైఎస్ అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యం ఇచ్చారు" అని కేటీఆర్ వ్యాఖ్యానించారు. రోశయ్య, కిరణ్‌కుమార్ రెడ్డి కూడా రాష్ట్రం కోసం పని చేశారన్నారు. కేసీఆర్ హయాంలో హైదరాబాద్, తెలంగాణ అన్ని రంగాల్లో దూసుకుపోయాయని పేర్కొన్నారు.

హైడ్రా దందాతో ఢిల్లీకి మూటలు..

"హైడ్రా అనే దందాతో రియల్ ఎస్టేట్ కంపెనీలను బ్లాక్‌మెయిల్ చేస్తున్న రేవంత్‌రెడ్డి ఢిల్లీకి మూటలు పంపుతున్నాడు" అని కేటీఆర్ ఆరోపించారు. 'నీకు సిగ్గుంటే.. నీ ప్రభుత్వానికి ఇజ్జత్ ఉంటే ముందు నీ ప్రభుత్వంలో ఉన్న మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, వివేక్, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, నీ సోదరుడి ఇళ్లు ముందు కూలగొట్టాలి' అని ఆయన డిమాండ్ చేశారు. అరెకపూడి గాంధీ 11 ఎకరాలు కబ్జా పెడితే.. అక్కడకు వెళ్లిన హైడ్రా ఎలాంటి చర్యలూ తీసుకోలేదన్నారు. "హైడ్రా అరాచకం, దుర్మార్గం ఆగాలంటే. బుల్డోజర్ మీ ఇంటి మీదకు రావొద్దంటే కాంగ్రెస్‌ను ఈ ఎన్నికల్లో పచ్చడి చేయాలి. మీరు కత్తి మాకు ఇచ్చి యుద్ధం చేయమంటే చేస్తామని, వేరే వాళ్లకు కత్తి ఇచ్చి మమ్మల్ని యుద్ధం చేయమంటే ఎలా?" అని ప్రజలను ఉద్దేశించి కేటీఆర్ ప్రశ్నించారు.

ఏఐజీ చైర్మన్ డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డికి
'అంబుజ్‌నాథ్ బోస్ ప్రైజ్'



హైదరాబాద్ సిటీ, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): రాయల్ కాలేజ్ ఆఫ్ ఫిజీషియన్స్‌కి సంబంధించి '2025 అంబుజ్ నాథ్ బోస్ ప్రైజ్' ఈసారి ఏఐజీ సంస్థల చైర్మన్, చీఫ్ గ్యాస్ట్రోఎంటరాలజిస్టు డాక్టర్ డి. నాగేశ్వర్‌రెడ్డికి దక్కింది. ఎండోస్కోపీ రంగంలో ఆయన చేసిన కృషి, ఆధునిక పరిశోధనలకు గాను ఈ పురస్కారానికి ఎంపిక చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. మొదటిసారి 1998లో డాక్టర్ సి. గోపాలన్ పొందగా, డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి దీన్ని అందుకున్న రెండో భారతీయుడు. లండన్‌లోని రాయల్ కాలేజ్ ఆఫ్ ఫిజీషియన్స్ (ఆర్‌సీపీ) శాస్త్రీయ విశిష్టత, ఆవిష్కరణలను గుర్తిస్తూ ఏటా నిర్వహించే హార్వేయన్ ఆరేషన్ ద్వారా వైద్య శాస్త్రాన్ని అభివృద్ధి చేయాలనే దీర్ఘకాలిక సంప్రదాయాన్ని కొనసాగిస్తోంది. ఈ కార్యక్రమాన్ని 1656లో విలియమ్ హార్వే స్థాపించారు. వైద్య రంగంలో అసాధారణ కృషి, విశిష్ట పరిశోధన చేసిన శాస్త్రవేత్తను సత్కరించడం దీని లక్ష్యమని ఏఐజీ తెలిపింది. వైద్య ఆవిష్కరణలలో నాయకత్వాన్ని ప్రదర్శించిన, ప్రపంచ వైద్య సమాజాన్ని నిరంతరం ప్రేరేపిస్తున్న ప్రొఫెసర్ డాక్టర్ డి. నాగేశ్వర్‌రెడ్డికి ఏఐజీ ఆస్పత్రి కుటుంబం తరఫున ఆ సంస్థ అభినందనలు తెలిపింది.

ఇక్కడ పెట్టుబడులు పెట్టండి

» 'అమెరికా - యూటా' రాష్ట్ర పారిశ్రామికవేత్తలకు మంత్రి శ్రీధర్ బాబు పిలుపు



హైదరాబాద్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ (ఈవోడీబీ)లో దేశంలోనే ఇతర రాష్ట్రాలకు రోల్ మోడల్‌గా నిలిచిన తెలంగాణలో అవకాశాలు పుష్కలమని, ఇక్కడ పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావాలని అమెరికా - యూటా పారిశ్రామికవేత్తలను ర్యా ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కోరారు. వరల్డ్ ట్రేడ్ సెంటర్ - యూటా ఎండీ, సీఈవో డేవిడ్ కార్లెబాగ్ నేతృత్వంలోని 'యూటా పారిశ్రామికవేత్తల బృందం' శుక్రవారం సచివాలయంలో మంత్రిని కలిసింది. టెక్నాలజీ, ఇన్నోవేషన్, ఏరోస్పేస్, డిఫెన్స్, అడ్వాన్స్ మాన్యుఫ్యాక్చరింగ్, లైఫ్‌సైన్సెస్, ఏఐ ఆధారిత హెల్త్ కేర్, క్లీన్ ఎనర్జీ, ఎడ్యుకేషన్, స్కిల్స్ తదితర రంగాల్లో 'యూటా-తెలంగాణ' మధ్య ద్వైపాక్షిక సహకారం, నైపుణ్య మార్పిడికి గల అవకాశాలపై ఈ సమావేశంలో చర్చించా. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. కేవలం పెట్టుబడులను ఆకర్షించడమే కాక, గ్లోబల్ ఎకానమీకి సపోర్ట్ ఇచ్చేలా, లాంగ్-టర్మ్ వాల్యూ క్రియేషన్‌కు తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తోందని చెప్పారు. తెలంగాణలో పరిశ్రమల ఏర్పాటుకు గల అనుకూలతలు, పారిశ్రామికవేత్తలకిచ్చే ప్రోత్సాహకాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఆయన వివరించారు. తెలంగాణ రాష్ట్రంతో కలిసి పని చేసేందుకు 'యూటా' సిద్ధంగా ఉందని డేవిడ్ కార్లెబాగ్ పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో ద్వైపాక్షిక సహకారం, నైపుణ్య మార్పిడి విషయంలో తెలంగాణతో కలిసి చురుగ్గా పని చేస్తామన్నారు.

22న కామన్‌వెల్త్ ఏఐ గ్లోబల్ సదస్సు

వైద్యరంగంలో కృత్రిమ మేధ వినియోగంపై జూబ్లీహిల్స్ కన్వెన్షన్ సెంటర్లో ఈనెల 22, 23 తేదీల్లో కామన్‌వెల్త్ ఏఐ గ్లోబల్ సదస్సు జరగనుంది. ఆసియాలో తొలిసారి జరగనున్న ఈ అంతర్జాతీయ సదస్సుకు 74దేశాల ప్రతినిధులు పాల్గొంటున్నారని కన్వీనర్ డాక్టర్ ప్రభు కుమార్ తెలిపారు. తెలంగాణ ఉన్నత విద్యామండలి కార్యాలయంలో చైర్మన్ ఆచార్య బాలకిస్టారెడ్డి, కాళోజీ నారాయణరావు వైద్య విశ్వవిద్యాలయం ఉపకులపతి నందకుమార్ రెడ్డి, మండలి కార్యదర్శి శ్రీరాం వెంకటేష్, ఉపాధ్యక్షుడు మహమూద్ ఈ సదస్సుపై ప్రచార పత్రం విడుదల చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించే ఈ సదస్సులో వైద్యరంగంలో వస్తున్న మార్పులు, ఏఐ పరిణామాలపై నిపుణులు ప్రసంగిస్తారని ప్రభుకుమార్ చెప్పారు.



ముగ్గురు అక్కాచెల్లెళ్ల మృతుల తండ్రి ఎల్లయ్యను పరామర్శిస్తున్న తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత

జాతీయ రహదారి విస్తరణపై బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాల అలసత్వం

» 'చేవెళ్ల' మృతుల కుటుంబాలకు కోటి ఇవ్వాలి: కవిత

చేవెళ్ల, తాండూరు, యాలాల, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): చేవెళ్ల వద్ద రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కుటుంబాలకు రూ. కోటి చొప్పున, క్షతగాత్రులకు రూ.10 లక్షలు చొప్పున పరిహారం చెల్లించాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రమాదంలో గాయపడి రంగారెడ్డి జిల్లా చేవెళ్లలోని మహేందర్‌రెడ్డి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారిని కవిత శుక్రవారం పరామర్శించారు. అనంతరం ప్రమాదం జరిగిన ఘటనాస్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. క్షతగాత్రులకు ప్రభుత్వం ఇచ్చే రూ.2 లక్షలు వారి మందులకు కూడా సరిపోవని, క్షతగాత్రులకు ఇప్పటి వరకు ఒక్క రూపాయి కూడా ఇవ్వకపోవడం దారుణమని అన్నారు. హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారిపై వందలాది ప్రాణాలు కోల్పోతున్నా రోడ్డు విస్తరణ పనులు చేపట్టడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ఈ రహదారి విస్తరణకు నిధులు మంజూరై సంవత్సరాలు గడుస్తున్నా పనులు చేయడంలో, గత బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు అలసత్వం వహించాయని ఆరోపించారు. కాగా, బస్సు ప్రమాదంలో మృతి చెందిన ముగ్గురు అక్కాచెల్లెళ్ల కుటుంబాన్ని కవిత పరామర్శించారు.

జర్నలిస్టులపై దాడుల కేసుల పరిశీలనకు హైపవర్ కమిటీ

హైదరాబాద్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో జర్నలిస్టులపై దాడులకు సంబంధించిన కేసుల పరిశీలనకు ప్రభుత్వం హై-పవర్ కమిటీని ఏర్పాటు చేసింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు ఉత్తర్వులను జారీ చేశారు. కమిటీ చైర్మన్‌గా రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి ఉంటారు. కమిటీలో హోంశాఖ ముఖ్యకార్యదర్శి/ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, జీఏడీ(పొలిటికల్) ముఖ్యకార్యదర్శి, సమాచార, పౌర సంబంధాల శాఖ ప్రత్యేక కార్యదర్శి, పోలీసు అదనపు డైరెక్టర్ జనరల్(శాంతి భద్రతలు), తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్(143/2013), తెలంగాణ స్టేట్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్(9/2014), తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్(2843/2010), తెలంగాణ అసోసియేషన్ ఆఫ్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్ట్స్(టీఏఈఎంజే), తెలంగాణ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్ట్స్ యూనియన్(టీఈఎంజేయూ-4527), స్మాల్ అండ్ మీడియం డెయిలీ న్యూస్ పేపర్స్ అసోసియేషన్(418/2014), తెలంగాణ స్మాల్ అండ్ మీడియం న్యూస్ పేపర్స్ అండ్ మ్యాగజైన్స్ అసోసియేషన్(788), తెలంగాణ ఉర్దూ వర్కింగ్ జర్నలిస్ట్స్ యూనియన్(69/2017)ల నుంచి ఒక్కో ప్రతినిధి సభ్యులుగా, సమాచార పౌర సంబంధాల శాఖ అదనపు డైరెక్టర్/డైరెక్టర్ మెంబర్ కన్వీనర్‌గా ఉంటారు. జర్నలిస్టులపై జరిగే దాడుల గురించి జర్నలిస్టులు, సంఘాలు చేసే ఫిర్యాదులు, విన్నపాలను కమిటీ పరిశీలించి, విచారిస్తుంది. వీటిపై చర్యలు తీసుకోవాలంటూ ప్రభుత్వానికి తగిన సిఫారసులు చేస్తుంది. కమిటీ తరచుగా సమావేశమవుతూ దాడుల నిరోధానికి తగిన సూచనలు చేస్తూనే ఎప్పటికప్పుడు అవసరమైన దిద్దుబాటు చర్యలను సిఫారసు చేస్తుంది.

మాగంటి ఆస్తుల పంపకాల్లో
రేవంత్, కేటీఆర్ మధ్య గొడవ!

» ఆ ఆస్తులను ఇద్దరు నేతలు పంచుకుంటున్నారు
» మృతి వెనుక మిస్టరీ ఉందని గోపీనాథ్ తల్లే చెబుతున్నా విచారణ జరపకపోవడానికి కారణం ఇదే
» మాగంటి ఆస్తుల తాలూకు పత్రాలు తమ కుటుంబసభ్యుల పేరిట బదిలీ కాలేదన్న విషయాన్ని రేవంత్ చెప్పగలరా?
» తెలంగాణలో ఇప్పుడున్నది ఇండియన్ ముస్లిం కాంగ్రెస్
» కాంగ్రెస్, బీఆర్ఎస్ కొమ్ముకాస్తున్న ఈసీ, పోలీసులు
» సభల కోసం అనుమతిని నిరాకరిస్తున్నారు: సంజయ్
» రహ్మత్‌నగర్‌లో బండి రోడ్ షోకు అనుమతి నిరాకరణ
» మరోచోట నిర్వహించుకోవాలన్న పోలీసులు



సమావేశంలో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి బండి సంజయ్

హైదరాబాద్, హైదరాబాద్ సిటీ, నవంబరు7 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ దివంగత నేత మాగంటి గోపీనాథ్ ఆస్తుల పంపకాల్లో సీఎం రేవంత్ రెడ్డి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మధ్య గొడవ జరుగుతోందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ సంచలన ఆరోపణ చేశారు. సాధారణంగా ఆస్తి పంపకాల గొడవ కుటుంబసభ్యుల మధ్య జరుగుతుందని.. మాగంటి ఆస్తి పంపకాల వ్యవహారంలో మాత్రం రేవంత్, కేటీఆర్ కొట్లాడుకుంటున్నారని వ్యాఖ్యానించారు. మాగంటి ఆస్తి పంపకాల విషయంలో ఇద్దరి నేతల మధ్య పగ, పట్టింపులు పెరిగిపోతున్నాయని, ఇది నూటికి నూరుపాళ్లు వాస్తవం అని పేర్కొన్నారు. శుక్రవారం, బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో సంజయ్, మీడియా సమావేశంలో మాట్లాడారు. మాగంటి ఆస్తుల తాలూకు పత్రాలు తమ కుటుంబసభ్యుల పేరిట బదిలీ కాలేదన్న విషయాన్ని సీఎం రేవంత్ గుండెల మీదు చేయివేసుకొని చెప్పగలరా? అని ప్రశ్నించారు. "మాగంటి ఆస్తులను మీరు, కేటీఆర్ పంచుకుంటున్నారు.. ఇది వాస్తవం కాదని చెప్పగలరా?" అని నిలదీశారు. గోపి ఆస్తులతో సంబంధం లేదని, ఆస్తి పంపకాల్లో భాగస్వామ్యం లేదని చెప్పగలరా? అని రేవంత్‌ను ప్రశ్నించారు. మాగంటి మృతి వెనుక మిస్టరీ ఉందని ఆయన తల్లి చేసిన ఆరోపణలపై విచారణకు ఆదేశించే ధైర్యం ఉందా? అని ప్రశ్నించారు. గోపి ఆస్తులెన్ని? ఎవరి పేరు మీద బదిలీ అయ్యాయి? ఎలా బదిలీ అయ్యాయి? గొడవ ఎక్కడ ప్రారంభమైంది? అన్న విషయాలను తేల్చాలని డిమాండ్ చేశారు. మాగంటి ఆస్తుల్లో రేవంత్‌కు భాగస్వామ్యం ఉండటంతోనే ఆయన విచారణకు ఆదేశించడం లేదని ఆరోపించారు. ఇంతపెద్ద ఘటనపై కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ఎందుకు స్పందించలేదని నిలదీశారు. మాగంటి మరణం తాలూకు సానుభూతితో గెలిచేందుకు కాంగ్రెస్, బీఆర్ఎస్ ప్రయత్నిస్తున్నాయని ఆరోపించారు. మాగంటి ఇద్దరు సతీమణుల్లో ఒకరికి కాంగ్రెస్, మరొకరికి బీఆర్ఎస్ మద్దతు ఇస్తున్నాయని.. ఆయన ఇద్దరు భార్యలకు వచ్చే వాటాల్లో కమిషన్లు దండుకునేందుకే ఈ రెండు పార్టీల నేతలు ఎత్తుగడ వేశారని ఆరోపించారు. తెలంగాణాలో ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ (ఐఎన్‌సీ), కాస్తా ఇండియన్ ముస్లిం కాంగ్రెస్ (ఐఎంసీ)గా మారిపోయిందని ఎద్దేవా చేశారు. జూబ్లీహిల్స్‌లో బీజేపీ, ఐఎంసీ మధ్యే పోటీ జరుగుతోందన్నారు. 'జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో ఎన్నికల కమిషన్, పోలీసులు కాంగ్రెస్, బీఆర్ఎస్‌లకు కొమ్ముకాస్తున్నారని ఆరోపించారు. ప్రచార సభలకు అనుమతి కోసం దరఖాస్తు చేస్తే జాప్యం చేస్తూ చివరి నిమిషంలో నిరాకరిస్తున్నారని విమర్శించారు.

మాగంటి తనయుడి ప్రకటనను తేలిగ్గా తీసుకోవొద్దు

"తన కుమారుడి మరణం ఒక మిస్టరీ అని గోపీనాథ్ తల్లి అన్నారు. ఆ మిస్టరీ ఏంటి? గోపి అదే రోజు చనిపోయారా? అంతకంటే ముందు రోజు కన్నుమూశారా? కొంతమంది కోసం ఆలస్యంగా ఆయన మరణ వార్తను ప్రకటించాల్సి వచ్చిందా?" అని బండి సంజయ్ ప్రశ్నించారు. దీనిపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఆస్పత్రి యాజమాన్యం, వైద్యులు, గోపీనాథ్ తల్లి, సతీమణి స్టేట్‌మెంట్ రికార్డు చేయాలని విజ్ఞప్తి చేశారు. తండ్రి అంత్యక్రియల కోసం తాను అమెరికా నుంచి వస్తే, బీఆర్ఎస్ మాజీ మంత్రి ఒకరు ఫోన్ చేసి రావొద్దని బెదిరించారంటూ గోపి తనయుడు తారక్ చేసిన ప్రకటనను తేలిగ్గా తీసుకోవద్దన్నారు. ఐసీయూలో ఉన్న తన కుమారుడిని చూపించాలని కేటీఆర్‌ను వేడుకున్నా పట్టించుకోలేదని గోపి తల్లి ఆవేదన వ్యక్తం చేశారని చెప్పారు. ఒక కన్నతల్లి ఆవేదన చూసి ప్రతి ఒక్కరు బాధపడుతున్నా సీఎం రేవంత్ గుండెమాత్రం కరగడం లేదని.. దీనికి కారణం రేవంత్, కేటీఆర్‌లు దోస్తులు కావడమేనని, వారిద్దరి మధ్య లోపాయికారి ఒప్పందం ఉందని ఆరోపించారు.

రోడ్ షోకు అనుమతి నిరాకరణ

రహ్మత్‌నగర్‌లోని మీనాక్షిపురంలో శుక్రవారం నిర్వహించ తలపెట్టిన కేంద్రమంత్రి బండి సంజయ్ రోడ్ షోకు అనుమతిని పోలీసులు నిరాకరించారు. బోరబండలో గురువారం ఇదే పరిస్థితి నెలకొంది. బోరబండలో రోడ్ షోకు అనుమతి కోరలేదంటూ పోలీసులు చెప్పడంతో వాటికి సంబంధించిన పత్రాలను బీజేపీ నేతలు విడుదల చేశారు. చివరకు సాయంత్రం అనుమతి ఇవ్వడంతో బోరబండ సైట్-3లో రోడ్ షో నిర్వహించారు. శుక్రవారం రహ్మత్‌నగర్‌లోని మినాక్షీపురంకు వస్తున్నట్లు బండి సంజయ్ గురువారం సభలో ప్రకటించారు. అయితే రహ్మత్‌నగర్‌లో సమావేశానికి అనుమతి ఇవ్వడం లేదని, ఇప్పటికే మాజీ మంత్రి కేటీఆర్‌కు అనుమతి ఇచ్చినట్లు పోలీసులు శుక్రవారం ఉదయం బండిసంజయ్‌కి సమాచారం ఇచ్చారు. మరో చోట సభను ఏర్పాటు చేసుకోవాల్సిందిగా సూచించారు. దీంతో బండి సంజయ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. 4వ తేదీన దరఖాస్తు చేసుకుంటే ఇప్పటిదాకా నాన్చడం వెనుక మతలబు ఏమిటని ప్రశ్నించారు. అన్ని ఏర్పాట్లు చేసుకున్న తర్వాత అనుమతి లేదని అదే రోజు చెప్పడం ఏమిటని ప్రశ్నించారు. సభను ఎక్కడ నిర్వహించుకోవాలో వాళ్లే నిర్ణయిస్తారా? అని మండిపడ్డారు.

ప్రైవేటు కాలేజీల సమ్మె విరమణ

హైదరాబాద్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరుతూ గత ఐదురోజులుగా రాష్ట్రవ్యాప్తంగా ప్రైవేటు విద్యాసంస్థలు కొనసాగిస్తున్న సమ్మెకు తెరపడింది. సమ్మెను విరమిస్తున్నట్లు "ఫెడరేషన్ ఆఫ్ అసోసియేషన్స్ ఆఫ్ హయ్యర్ ఇనిస్టిట్యూషన్స్" (ఎఫ్ఏటీహెచ్‌ఐ-ఫాతీ) ప్రకటించింది. గత సోమవారం నుంచి అన్ని కాలేజీలు మూతపడటంతో పలు వర్సిటీల్లో పరీక్షలు వాయిదా వేశారు. ఈ నేపథ్యంలో శుక్రవారం సచివాలయంలో ఫాతీ ప్రతినిధులతో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సమావేశమయ్యారు. ఈ విషయంపై ఇటీవలే ప్రభుత్వ ముఖ్య సలహాదారుగా బాధ్యతలు స్వీకరించిన సుదర్శన్ రెడ్డి గురువారం సాయంత్రం విద్యాశాఖ కార్యదర్శి శ్రీదేవసేనతోపాటు అన్ని సంక్షేమ శాఖల కార్యదర్శులతో సమావేశమయ్యారు. ఫీజు బకాయిలపై సుదీర్ఘంగా సమీక్షించారు. అప్పటికప్పుడే సీఎం రేవంత్ రెడ్డితో ఫోన్‌లో మాట్లాడారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో చర్చించి సమ్మె విరమించేలా ఓ నిర్ణయం తీసుకోవాలని సీఎం చెప్పినట్లు తెలిసింది. దీనిపై సుదర్శన్ రెడ్డి శుక్రవారం భట్టితో చర్చించారు. అనంతరం భట్టి, ఫాతీ ప్రతినిధులను చర్చలకు పిలిచి వారితో సమావేశమయ్యారు. చర్చలు ముగిశాక మీడియాతో భట్టి మాట్లాడారు. ఫీజు బకాయిల్లో ఇప్పటికే రూ. 600 కోట్లు విడుదలచేశామని, ఫాతీ ప్రతినిధులు కోరినట్లుగా మరో రూ. 900 కోట్లు త్వరలో విడుదలచేస్తామని అన్నారు. అలాగే ప్రతినెలా బకాయిల్లో ఎన్నోకొన్ని విడుదల చేసేలా ప్రణాళికబద్ధంగా కార్యాచరణ అమలుచేస్తామని చెప్పారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ విషయంలో భవిష్యత్తులో చేపటనున్న సంస్కరణలపై కమిటీ వేశామని, సాధ్యమైనంత త్వరలో కమిటీ నివేదిక ఇస్తుందన్నారు.

శ్రీదేవసేన వ్యాఖ్యలతో బాధపడ్డాం..: రమేశ్ బాబు

ఈనెల 3వ తేదీ నుంచి కొనసాగుతున్న సమ్మెను విరమిస్తున్నట్లు ఫాతీ అధ్యక్షుడు నిమ్మటూరి రమేశ్ బాబు ప్రకటించారు. సమ్మె కారణంగా విద్యార్థులకు జరిగిన ఇబ్బందికి చింతిస్తున్నామని చెప్పారు. వాయిదాపడ్డ పరీక్షలు త్వరలో నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తామన్నారు. సీఎం, డిప్యూటీ సీఎంతోపాటు విద్యాశాఖ కార్యదర్శి శ్రీదేవసేన, ఇతర ఐఏఎస్ అధికారులకు వ్యతిరేకంగా తాము ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదని చెప్పారు. విద్యాశాఖ కార్యదర్శి శ్రీదేవసేన వ్యాఖ్యలతో బాధపడ్డామని చెప్పారు. కీలక హోదాలో ఉంటూ ప్రైవేటు కాలేజీలను అవమానపరిచేలా మాట్లాడొద్దు అని మాత్రమే తాము చెప్పామని, అయితే తమ వ్యాఖ్యలను వక్రీకరించారని, దీనికి చింతిస్తున్నామని రమేష్ బాబు తెలిపారు. ఫాతీ సెక్రటరీ జనరల్ రవికుమార్ మాట్లాడుతూ చర్చలు విజయవంతం కావడంతో శనివారం జరగాల్సిన అధ్యాపకుల బహిరంగసభ, విద్యార్థుల లాంగ్ మార్చ్ కార్యక్రమాలను రద్దు చేస్తున్నామని ప్రకటించారు.

ఫీజు బకాయిలపై చర్చిస్తే తప్పేంటి?

» సభకు అనుమతిపై వారంలోగా నిర్ణయం తీసుకోండి: హైకోర్టు

హైదరాబాద్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): సమస్యలపై చర్చించుకునేందుకు అనుమతి ఇవ్వాలని అడిగితే తప్పేమిటని హైకోర్టు శుక్రవారం పోలీసులను ప్రశ్నించింది. ప్రభుత్వం నుంచి రావాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలపై చర్చించే నిమిత్తం ప్రైవేటు కాలేజీ యాజమాన్య సంఘాల సమాఖ్య (ఫాతి) తలపెట్టిన సభకు అనుమతి ఇచ్చే విషయంలో వారం రోజుల్లో నిర్ణయం తీసుకోవాలని ఆదేశించింది. అధ్యాపకులు, సిబ్బందితో ఎల్బీస్టేడియంలో ఫాతి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించతలపెట్టిన సభకు పోలీసులు అనుమతులు నిరాకరించారు. దీంతో 'ఫాతి' హైకోర్టులో లంచ్ మోషన్ పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై జస్టిస్ ఎన్వీ శ్రవణ్‌కుమార్ ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫున న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. ఫీజు రీయింబర్స్‌మెంట్ రూపంలో ప్రభుత్వం నుంచి దాదాపు రూ.10 వేల కోట్లు రావాల్సి ఉందని పేర్కొన్నారు. ఆ కారణంగా అధ్యాపకులు, సిబ్బందికి జీతాలు చెల్లించ లేకపోవడంతో విద్యా సంస్థలను మూసివేయాల్సిన పరిస్థితి నెలకొందని తెలిపారు. దీనిపై నిరసన తెలిపే హక్కు 'ఫాతి'కి ఉందని తెలిపారు. హోంశాఖ తరఫు ప్రభుత్వ న్యాయవాది మహేశ్ రాజే వాదిస్తూ.. పోలీసుశాఖ నుంచి తనకు ఎలాంటి సూచనలు అందలేదని, అందువల్ల తగిన సమయం ఇవ్వాలని కోరారు. వాదనలు విన్న ధర్మాసనం.. సమస్యలపై చర్చించడానికి అనుమతి కావాలని అడుగుతున్నారని, వారి పిటిషన్‌లో తప్పు ఏముందని ప్రశ్నించింది. అనుమతి ఇవ్వకపోతే వారు ఎక్కడికి వెళ్లాలి? ఏం చేయాలని అడిగింది. వారం రోజుల్లో నిర్ణయం తీసుకోవాలని హైదరాబాద్, రాచకొండ పోలీస్ కమిషనర్‌లకు ఆదేశిస్తూ విచారణను వాయిదా వేసింది.

ఓవర్‌లోడ్‌తో వెళితే డ్రైవింగ్
లైసెన్సు రద్దు

(మొదటిపేజీ తరువాయి)

కారణమని.. ప్రమాద తీవ్రత, మృతుల సంఖ్య పెరగడానికీ టిప్పర్ ఓవర్‌లోడే కారణం అన్న అభిప్రాయాలు విస్తృతంగా వ్యక్తమయ్యాయి. గతంలో జరిగిన ప్రమాదాల్లో చాలామటుకు ఓవర్‌లోడ్ కారణంగానే జరిగాయన్న ఆరోపణలున్నాయి. ఓవర్‌లోడ్ కారణంగా వాహనంపై డ్రైవర్ నియంత్రణ కోల్పోవడం వల్ల బ్రేకులు పడకపోవడంతో, మలుపుల వద్ద అదుపుతప్పడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇకపై ఈ తరహా ఘటనలు తగ్గించేందుకు రవాణా శాఖ సిద్ధమైంది. ఓవర్ లోడ్‌తో టిప్పర్లు, లారీలు వెళితే ఆ వాహనాలను సీజ్ చేసి, డ్రైవర్ల లైసెన్సులు రద్దు చేయాలని అధికారులు నిర్ణయించారు. అదే పనిగా ఉల్లంఘనలకు పాల్పడితే వాహన పర్మిట్‌ను కూడా రద్దు చేయాలని అధికారులు నిర్ణయించారు. ఓవర్‌లోడ్ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే డ్రైవర్‌తో పాటు వాహన యజమానిపైనా చట్ట ప్రకారం కేసులు నమోదు చేయాలనే అంశాన్ని కూడా రవాణా శాఖ అధికారులు పరిశీలిస్తున్నారు. భారీ వాహనాల యాజమాన్యాలతో జిల్లాల వారీగా సమావేశాలు ఏర్పాటు చేసి అవగాహనా కార్యక్రమాలు చేపట్టనున్నారు. త్వరలో మైనింగ్ శాఖ అధికారులతో సమావేశమై వాహనాలకు లోడ్ వేసే రీచ్‌లు, క్వారీల్లోనే ఓవర్ లోడ్ అరికట్టే విధంగా చర్యలు తీసుకుంటున్నారు. తెలంగాణలో మొత్తం 1.75 కోట్లకు పైగా వాహనాలు ఉన్నాయి. వీటిలో నిర్మాణ సామగ్రి, సరుకులు తరలించే వాహనాలు 6.65 లక్షలకుపైగా ఉన్నాయి. ప్రమాదాలకు అవకాశం ఉన్న రోడ్లపై భారీ వాహనాలు పరిమిత వేగాన్ని పాటిస్తే, అవి నిర్ణీత లోడుతో ప్రయాణించేలా చర్యలు చేపడితే ప్రమాదాలను కట్టడి చేసేందుకు అవకాశం ఉంటుందని రవాణా శాఖ అధికారులు భావిస్తున్నారు. ఒకవేళ అనుకోని ప్రమాదం జరిగినా ప్రమాద తీవ్రత తక్కువగా ఉంటుందనేది రవాణా శాఖ అధికారుల ఆలోచన.

రవాణా శాఖ అధికారుల అప్రమత్తం

చేవెళ్ల సమీపంలో ఘోర ప్రమాదం తర్వాత రవాణా శాఖ అన్ని జిల్లాల్లో ప్రత్యేక బృందాలతో తనిఖీలు ముమ్మరం చేసింది. అందులో భాగంగానే శుక్రవారం ఒక్కరోజే రాష్ట్ర వ్యాప్తంగా 245 వాహనాలపై రవాణా శాఖ అధికారులు కేసులు నమోదు చేశారు. 180 వాహనాలను సీజ్ చేశారు. సీజ్ చేసిన వాహనాల్లో 40 ఓవర్ లోడ్‌తో కూడినవి అయితే మిగతావి ఫిట్‌నెస్ రహిత, టాక్స్, పర్మిట్, తదితర పత్రాలు సరిగా లేని వాహనాలు ఉన్నాయి. "నిబంధనలు అతిక్రమించే వాహనాలపై నిరంతర దాడులు కొనసాగుతున్నాయి. పగటి సమయంతోపాటు రాత్రివేళ తనిఖీలు ముమ్మరం చేస్తున్నాం. సరైన పత్రాలు లేని, ఓవర్‌లోడ్ వాహనాలు రోడ్లపైకి వస్తే చట్టప్రకారం చర్యలు తప్పవు" అని రవాణా శాఖ ప్రధాన కార్యాలయానికి చెందిన ఓ అధికారి తెలిపారు.

ఆ మెడికోలకు ఊరట!



148, 149 జీవోల సంకెళ్ల నుంచి వారంతా బయటకు

» వీటి ప్రకారం రాష్ట్రంలో ఎంబీబీఎస్ చదివితేనే లోకల్
» ఆల్ ఇండియా కోటాలో బయట ఎంబీబీఎస్ చేసిన రాష్ట్ర విద్యార్థులకు పీజీ వైద్య విద్య ప్రవేశాల్లో నో చాన్స్
» తమకు న్యాయం చేయాలంటూ ప్రభుత్వానికి బాధితుల వినతి
» సానుకూల నిర్ణయం దిశగా ప్రభుత్వం

హైదరాబాద్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): పీజీ వైద్యవిద్య ప్రవేశాల్లో స్థానికత అంశాన్ని తేల్చేందుకు శాపంగా మారిన 148, 149 జీవోల నుంచి 'ఆ ఎంబీబీఎస్' విద్యార్థులకు ఊరట దక్కనుంది. వాస్తవానికి ఈ జీవోల ప్రకారం రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు వైద్య కళాశాలల్లో ఎంబీబీఎస్ పూర్తిచేసిన వారినే స్థానికులుగా పరిగణిస్తారు. ఈ జీవోల ప్రకారం. అల్ ఇండియా కోటా కింద ఇతర రాష్ట్రాల్లో ఎంబీబీఎస్ పూర్తిచేసిన విద్యార్థులంతా నాన్‌లోకల్ అవుతారు. ఆ మేరకు నీట్‌లో చక్కని ర్యాంకు సాధించి రాష్ట్రం ఆవల ఎయిమ్స్ తదితర ప్రతిష్ఠాత్మక వైద్య సంస్థల్లో ఎంబీబీఎస్ పూర్తిచేసిన రాష్ట్ర విద్యార్థులంతా ఈ వివాదాస్పద జీవోల ప్రకారం స్థానికేతరులైపోయారు. ఇలాంటి విద్యార్థులకు త్వరలో ప్రారంభం కానున్న పీజీ వైద్య విద్య ప్రవేశాల్లో అన్యాయం జరగనుందన్న అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. నీట్ పీజీలో ఆల్ ఇండియా స్థాయిలో సీటు లభించని, బయట రాష్ట్రాల్లో ఎంబీబీఎస్ పూర్తిచేసిన వారంతా ఈ జీవోల కారణంగా ఆందోళన చెందుతున్నారు. విచిత్రం ఏమిటంటే.. ఆల్ ఇండియా కోటాలో భాగంగా తెలంగాణ ప్రభుత్వ వైద్య కళాశాలల్లో ఎంబీబీఎస్ పూర్తిచేసిన వారంతా ఈ జీవోల ప్రకారం స్థానికులైపోయారు. ఇలాంటి వారంతా పీజీ వైద్య విద్యా ప్రవేశాల్లో స్థానిక కోటా కింద దరఖాస్తు చేసుకోవచ్చు. నిరుటి నుంచి పీజీ వైద్య ప్రవేశాల్లో ఈ పరిస్థితి నెలకొంది. రాష్ట్రంలో ప్రభుత్వ, ప్రైవేటులో కలిపి మొత్తం 3,179 పీజీ సీట్లున్నాయి. ఇందులో 1370 సీట్లు ప్రభుత్వ కాలేజీల్లో ఉన్నాయి. ప్రభుత్వ కళాశాలల్లో ఉన్న పీజీ సీట్లలో 50 శాతం ఆల్ ఇండియా కోటాకు వెళ్తాయి. అంటే రాష్ట్ర విద్యార్థులకు మిగిలేది 685 సీట్లే. వీటిలోనే రాష్ట్ర విద్యార్థులతో పాటు ఆల్ ఇండియా కోటా కింద ఇక్కడ చదివిన రాష్ట్రేతర విద్యార్థులు కూడా పోటీపడుతుంటారు. కాగా ఆల్ ఇండియా కోటా కింద రాష్ట్రానికి చెందిన ఇతర రాష్ట్రాల్లో వైద్యవిద్యను పూర్తి చేసిన విద్యార్థులు తమకు జరుగుతున్న అన్యాయంపై ఇటీవల వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ దృష్టికి తీసుకొచ్చారు. పీజీ ప్రవేశాల్లో తమను స్థానికులుగా పరిగణించి, అడ్మిషన్స్‌లో అవకాశమివ్వాలని విజ్ఞప్తి చేశారు. దీనికి సర్కారు సానుకూలంగా స్పందించింది. కసరత్తు చేసి, సానుకూల నిర్ణయం తీసుకోవాలని శాఖ ఉన్నతాధికారులను మంత్రి దామోదర ఆదేశించారు. పీజీ వైద్యవిద్య ప్రవేశాల్లో ఇటువంటి విద్యార్థులనూ స్థానికులుగా పరిగణించనున్నారు. ఇక ఇప్పటి దాకా కన్వీనర్ కోటాలో సీటు పొందాలంటే స్థానికులై ఉండాలన్న నిబంధన ఉంది. ఈ నిబంధనను ఆల్ ఇండియా కోటా విద్యార్థుల విషయంలో సడలించే అవకాశం ఉందని వైద్యవర్గాలు పేర్కొన్నాయి. దీనిపై నేడు, రేపో అధికారిక ప్రకటన విడుదలవచ్చని మంత్రిత్వ శాఖ వర్గాలు వెల్లడించాయి.

బీఆర్ఎస్ ఎమ్మెల్సీ రవీందర్‌రావు ఇంట్లో
ఎన్నికల అధికారుల సోదాలు

» అక్రమ కేసులు పెట్టాలనే ఉద్దేశంతోనే: రవీందర్‌రావు
» సోదాల్లో ఎలాంటి నగదు లభించలేదు: అధికారులు



తమ ఇంట్లో దుస్తులు తప్ప ఏమీ లేవంటూ దుస్తులు చూపిస్తున్న మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి

కూకట్‌పల్లి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ప్రచారం నేపథ్యంలో ఎన్నికల ఫ్లయింగ్‌స్క్వాడ్, సీఐఎస్ఎఫ్, పోలీసు సిబ్బంది బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తక్కినపల్లి రవీందర్‌రావు ఇంట్లో సోదాలు నిర్వహించారు. ఆయన అద్దెకు ఉంటున్న హైదరాబాద్ మూసాపేట్‌లోని మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి ఇంట్లో శుక్రవారం ఈ తనిఖీలు జరిగాయి. సోదాలు జరిగే సమయంలో బీఆర్ఎస్ శ్రేణులను ఇంట్లోకి అనుమతించకపోవడంతో కొంత ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక దృష్ట్యా భారీగా నగదు నిల్వ ఉంచారనే ఫిర్యాదుతోనే ఈ సోదాలు నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. ఎలాంటి నగదు లభించలేదని సర్చ్ మెమో రిపోర్టులో పేర్కొన్నారు. కాగా జూబ్లీహిల్స్‌లో ఎన్నికల కోడ్ అమలులో ఉంటే కూకట్‌పల్లిలో సోదాలు ఎలా నిర్వహిస్తారని ఎమ్మెల్సీ తక్కినపల్లి రవీందర్‌రావు కాంగ్రెస్ ప్రభుత్వంపై మండిపడ్డారు. తనపై అక్రమ కేసులు బనాయించాలనే దురుద్దేశంతోనే సోదాల పేరుతో తనపై కుట్రలు పన్నుతున్నారని విమర్శించారు. ఎన్నికల సంఘం వెంటనే స్పందించి నిబంధనలకు విరుద్ధంగా వ్యవహిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఎవరూ లేని సమయంలో తమ ఇంట్లోకి ఎలా వెళ్తారని మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి పోలీసులను ప్రశ్నించారు. సోదాలు నిర్వహిస్తున్న సమయంలో ఇంట్లోకి తమను కూడా వెళ్లకుండా అడ్డుకోవడం అప్రజాస్వామికమని ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. తమ ఇంట్లో దుస్తులు తప్ప ఏమీ లేవన్నారు.

రూ.240 కోట్ల లాటరీ విజేతది ఖమ్మం జిల్లానే..

» వేంసూరు మండల యువకుడిని వరించిన అదృష్టం



అనిల్‌కుమార్ బోల్లా

వేంసూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): యూఏఈలో ఇటీవల నిర్వహించిన లాటరీలో రూ.240కోట్లు గెలుచుకున్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగి బోల్లా అనిల్ కుమార్ ఖమ్మం జిల్లా యువకుడేనని తెలిసింది. జిల్లాలోని వేంసూరు మండలం భీమవరం గ్రామానికి చెందిన సాధారణ రైతు దంపతులు మాధవరావు, భూలక్ష్మిల కుమారుడైన అనిల్ బొల్లా.. ప్రాథమిక విద్యను అక్కడే పూర్తి చేశారు. హైదరాబాద్‌లో ఉన్నతవిద్య పూర్తి చేసి తొలుత నగరంలో.. తరువాత చెన్నైలో ఉద్యోగం చేశారు. యూఏఈలో ఉద్యోగ అవకాశం రావడంతో ఏడాదిన్నర క్రితం అక్కడకు వెళ్లారు. కొంత కాలంగా పలు లాటరీల్లో పాల్గొంటున్న ఆయన.. ఇటీవల కొనుగోలు చేసిన పది టికెట్లలో, తన తల్లి పుట్టిన రోజుతో కూడిన నెంబరుకు జాక్‌పాట్ తగిలి రాత్రికి రాత్రే కోటీశ్వరుడయ్యారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84, RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.